ఈనాడు

విజయవాడ 5-8-2025 మంగళవారం సిటీ సంపుటి 51 . సంచిక 357
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఓవల్‌లో ఓ అద్భుతం

- ఉత్కంఠ పోరులో భారత్ విజయం
- ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ 2-2తో సమం
- విజృంభించిన సిరాజ్



ఓవల్‌లో ఓ అద్భుతం. అద్వితీయ పోరాటపటిమకు అపురూప బహుమానం. ఉత్కంఠకు నిలిచి ఒత్తిడిని జయించిన టీమ్‌ఇండియా చిరస్మరణీయ విజయాన్నందుకుంది. రసవత్తర క్లైమాక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన గిల్ బృందం.. ఆఖరి టెస్టులో ఆరు పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. హైదరాబాద్ స్పీడ్ గన్ మహ్మద్ సిరాజ్ భారత్ హీరో! నిర్ణయాత్మక పోరులో పడిలేచిన టీమ్‌ఇండియా పట్టుదలను ఎంత మెచ్చుకున్నా తక్కువే. జట్టు అంతకుముందు పోరాటమంతా ఒక ఎత్తు.. సోమవారం తీవ్ర ఒత్తిడిలో చేసిన పోరాటం మరో ఎత్తు. చేతిలో నాలుగు వికెట్లున్న ఇంగ్లాండ్.. ఆఖరి రోజు చేయాల్సింది 35 పరుగులే. కానీ అక్కడ సిరాజ్ ఉన్నాడు. భారాన్నంతా భుజాన వేసుకుని, కసిగా బౌలింగ్ చేసిన అతడు.. బుల్లెట్ బంతులతో ఇంగ్లిష్ జట్టు పతనాన్ని శాసించాడు. చరిత్రాత్మక గెలుపును అందించాడు.

754 ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్ గిల్ చేసిన పరుగులు. అతడికి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు లభించింది.



టీమ్‌ఇండియాకు విజయం అంత తేలికగా ఏమీ దక్కలేదు. ఎంతో కఠిన పరీక్షను ఎదుర్కొంది. ఆశనిరాశల మధ్య ఊగిసలాడింది. ఒత్తిడిని తట్టుకుంది. సిరాజ్ ఎంతో గొప్పగా బౌలింగ్ చేసినా ఇంగ్లాండ్ కూడా విజయానికి చేరువైంది. ఒక్క వికెట్ చేతిలో ఉండగా.. ఇంకో ఏడు పరుగులు చేస్తే సిరీస్‌ను చేజిక్కించుకునే స్థితికి చేరుకుంది. భారత అభిమానులందరిలో ఏదో గుబులు.. ఇంత పోరాటమూ వృథా అయిపోతుందేమోనన్న ఆందోళన. మరో ఎండ్‌లో వోక్స్ బ్యాటింగ్ చేయలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో అట్కిన్సన్ బంతిని బలంగా బాదడానికి సిద్ధమవుతున్నాడు. ఓవల్ వేడెక్కింది. అయితే తనపై నమ్మకం నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో బంతిని అందుకున్న సిరాజ్.. ఓ కళ్లు చెదిరే యార్కర్‌తో అట్కిన్సన్‌ను బౌల్డ్ చేసేశాడు. అంతే.. భారత ఆటగాళ్లు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 224 పరుగులకే ఆలౌటైనప్పుడు ఈ విజయం ఏమాత్రం ఊహించనిదే. రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లతో ఇంగ్లాండ్ నుంచి విజయాన్ని లాగేసిన సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

వివరాలు ఛాంపియన్ లో..

అత్యధిక తలసరి ఆదాయం సాధించాలి



వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించాలి

అప్పుడే అధిక జీఎస్‌డీపీ సాధ్యం

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ప్రజలకు నాణ్యమైన జీవనం రెండూ ముఖ్యమే

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా... రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 'మైనింగ్, వ్యవసాయ ఉత్పత్తుల్లో జీవీఏ కీలకం. అలా చేస్తేనే జీఎస్‌డీపీలో వృద్ధి నమోదై ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించ గలుగుతాం' అని పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)పై సీఎం సోమవారం సచివాలయంలో సమీక్షించారు. '2025-26లో రూ. 3,47,871 తలసరి ఆదాయం సాధించాలి. 2029 నాటికి దీన్ని రూ.5.42 లక్షలకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు అందించడమూ ముఖ్యమే. అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలి. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా ఏపీని తయారు చేయాలి. ప్రతి కుటుంబ ఆర్థిక, ప్రజారోగ్య వివరాలు నమోదు చేయాలి. కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా ఇచ్చే నిధుల్ని క్రోడీకరించాలి' అని చంద్రబాబు నిర్దేశించారు. 'సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి. పర్యావరణం దెబ్బతినకుండా చూడాలి. అత్యుత్తమ టెక్నాలజీని పాలనకు అనుసంధానించాలి. పీపుల్, విజన్, నేచర్, టెక్నాలజీ అంశాలకు పాలనలో ప్రాధాన్యమివ్వాలి' అని సూచించారు. ఈ ఏడాది ఉద్యాన పంటల ద్వారా రూ.1,26,098 కోట్లు, ఆక్వా అనుబంధ పరిశ్రమల ద్వారా రూ.1.12 లక్షల కోట్లు జీవీఏ జోడించినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

15 నుంచి 700 సేవలు ఆన్‌లైన్‌లో

ఈ నెల 15 నుంచి ప్రభుత్వం అందించే 700 సేవలను ఆన్‌లైన్‌లో ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 'ఆర్టీజీఎస్ ఆధ్వర్యంలోని ఎవేర్ ద్వారా 42 అంశాలను కొలుస్తున్నాం. వివిధ ప్రభుత్వ శాఖలూ ఇలాగే ప్రమాణాలు రూపొందించుకుని సూచికలు ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్తు, రవాణా, జలవనరులు, పరిశ్రమలు, స్వర్ణాంధ్ర తదితర రంగాలకు ఇండికేటర్లు నిర్దేశించుకోవాలి. ఆర్టీజీఎస్ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరిస్తే అది పెద్ద సంపద అవుతుంది.

(మిగతా 3లో)

అమరావతిలో 250 ఎకరాల్లో కల్చర్ డిస్ట్రిక్ట్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నదీ అభిముఖ ప్రాంత (రివర్ ఫ్రంట్) అభివృద్ధిలో భాగంగా 250 ఎకరాల్లో 'కల్చర్ డిస్ట్రిక్ట్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతిలో హరిత వనాలు, కాలువలు, తటాకాల అభివృద్ధిపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ ప్రతిపాదనపై ప్రాథమికంగా చర్చించారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా-జురాంగ్ రూపొందించిన రాజధాని అమరావతి బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)లో కృష్ణానదీ తీరంలో కల్చర్ డిస్ట్రిక్ట్‌ను ప్రతిపాదించారు. దానికి మరింత విస్తృత రూపం ఇస్తూ రూపొందించిన ప్రణాళికలను అమరావతి అభివృద్ధి

(మిగతా 3లో)

5 రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లే వెసులుబాటు
- ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల్లో ఏది చూపించినా చాలు
- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడి



ఈనాడు - అమరావతి

రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్ని గుర్తింపు కార్డులుగా పరిగణించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఈ నెల 6న జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించనుంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆయా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు. ఎలాంటి వయోపరిమితీ లేదు. రాష్ట్ర సరిహద్దుల వరకూ ఉచిత ప్రయాణం వర్తిస్తుంది. దీని వల్ల ప్రభుత్వంపై ఏడాదికి రూ.1,950 కోట్ల భారంపడనుంది. మొత్తం బస్సుల్లో 74 శాతం అంటే 6,700 బస్సులు దీని కోసం కేటాయించాం. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు త్వరలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తాం" అని మంత్రి వివరించారు. ఆర్టీసీకి కార్గో సేవల ద్వారా ఏటా రూ.220 కోట్ల ఆదాయం వస్తుందని, విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని బాలాజీ క్యాంటీన్ నుంచి నెలకు రూ.44 లక్షల ఆదాయం వస్తోందని తెలిపారు.

లోపలి పేజీల్లో

సీఐడీని సింగపూర్ పంపి అక్కడి సంస్థలను వేధించారు
గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ మండిపాటు

అధికార భాషా సంఘానికి 'మండలి' పేరు
మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో చంద్రబాబు

శ్రీవారి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

3లో



శ్రీవారి సేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారు

ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు వాయిదా


ఈనాడు, అమరావతి: పదో తరగతి వరకు ఏపీలో చదివి.. ఇంటర్ తెలంగాణలో చదివిన ముగ్గురు విద్యార్థులను స్థానికులుగా పరిగణించేలా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపును వాయిదా వేశారు.



ఆ ముగ్గురు విద్యార్థులను స్థానికులుగా పరిగణించి కౌన్సెలింగ్ నిర్వహిస్తే అనేక ఇబ్బందులు వస్తాయని పేర్కొంటూ సాంకేతిక విద్యాశాఖ సీట్ల కేటాయింపును వాయిదా వేసింది. అదే సమయంలో స్థానిక, స్థానికేతర

(మిగతా 3లో)

హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ ప్రమాణం



తుహిన్ కుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

2లో

భారత్‌పై సుంకాలు మరింత పెంచుతా

ట్రంప్ బెదిరింపు




వాషింగ్టన్: భారత్‌పై మరోసారి తన అక్కసును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెళ్లగక్కారు. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకాల వడ్డింపుతో తాను ఆగబోవడం లేదని ముమ్ముందు వీటిని ఇంకా పెంచబోతున్నట్లు తాజాగా బెదిరించారు. రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తూ విపణిలో భారీ లాభాలకు విక్రయిస్తున్న భారత్‌పై గణనీయ స్థాయిలోనే సుంకాలు పెంచబోతున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ట్రంప్ సోమవారం హెచ్చరించారు. 'రష్యా యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారో భారత్ పట్టించుకోవడం లేదు. అందువల్ల ఆ దేశంపై గణనీయంగా సుంకాలు పెంచుతాను' అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా వలస వ్యవహారాల్లోనూ అమెరికాను భారత్ మోసం చేస్తోందనీ వైట్‌హౌస్ ఉన్నతాధికారి

(మిగతా 3లో)

మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై క్రిమినల్ కేసు కొట్టివేత


ఈనాడు, హైదరాబాద్: మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. క్రిమినల్ కేసును కొట్టివేయాలంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన పిటిషన్‌లను హైకోర్టు అనుమతించింది. డిపాజిటర్లందరికీ సొమ్ము చెల్లించడంతోపాటు హిందూ అవిభాజ్య కుటుంబ(హెచ్‌యూఎఫ్) మాజీ కర్త మరణించారని, హెచ్‌యూఎఫ్‌లో మిగిలిన సభ్యులను నిందితులుగా చేర్చడానికి వీల్లేదంటూ 2025 జనవరిలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ మధ్యంతర దరఖాస్తు దాఖలు చేసింది. ఆర్‌బీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజల నుంచి డిపాజిట్‌లను సేకరించిందన్న ఫిర్యాదు ఆధారంగా ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2008లో కేసు నమోదు చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు వ్యతిరేకంగా నమోదైన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ 2018లో హైకోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై ఫిర్యాదుదారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా పిటిషన్‌లను తిరిగి 2024 ఏప్రిల్‌లో హైకోర్టుకే పంపుతూ వాస్తవ పెట్టుబడిదారులు, డిపాజిటర్ల నుంచి అభ్యంతరాలను ఆహ్వానించి మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాల్సిన అవసరం ఉందా? లేక నిరర్థకమా? అన్నది తేల్చాలని ఆదేశించింది. ఈ పిటిషన్‌లపై హైకోర్టు విచారణ చేపట్టింది. హైకోర్టు ఆదేశాల మేరకు పెట్టుబడిదారులు, డిపాజిటర్ల నుంచి క్లెయింలను ఆహ్వానిస్తూ 2024 సెప్టెంబరు 26న హైకోర్టు రిజిస్ట్రీ పత్రికల్లో పబ్లిక్ నోటీసు జారీ చేసింది. పత్రికల్లో ప్రకటన ఇవ్వగా, డిపాజిట్లన్నీ గతంలోనే చెల్లించినందున ఒక్క డిపాజిటరు కూడా ముందుకు రాకపోవడంతోపాటు, హెచ్‌యూఎఫ్ మాజీ కర్త మరణించడంతో కేసు కొనసాగించాల్సిన అవసరం లేదని హైకోర్టు తీర్పు వెలువరిస్తూ మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉన్న క్రిమినల్ కేసు రద్దవుతుందని పేర్కొంది.



ముందే క్యాన్సర్‌ను గుర్తించే క్వాంటమ్


ఈనాడు, బెంగళూరు: ఎంఆర్ఐ, పీఈటీ వంటి సంప్రదాయ పరీక్షలతో శరీరంలో క్యాన్సర్‌తో దెబ్బతిన్న కణాలను మాత్రమే గుర్తించగలం. ఇలా గుర్తించిన వాటికి రేడియో థెరపీ ద్వారానే చికిత్స సాధ్యం. చికిత్స తర్వాత క్యాన్సర్ ప్రభావిత కణాలతో పాటు బాగున్న కణాలూ దెబ్బతిని, రోగి జీవితకాలం తగ్గే ప్రమాదాలూ అధికంగా

(మిగతా 3లో)



ఎంఆర్ఎఫ్‌తో తీసిన క్యాన్సర్ ప్రభావిత కణాల చిత్రాలు

మూగవోయిన గిరిజనుల గళం



జేఎంఎం అగ్రనేత శిబూ సోరెన్ కన్నుమూత

ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నేత

రాంచీ: ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అగ్రనేత, ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటు కోసం అలుపెరగని పోరాటం చేసిన గిరిజన నాయకుడు శిబూ సోరెన్ (81) సోమవారం కన్నుమూశారు. మూత్రపిండ సమస్యలతో బాధపడుతున్న ఆయన గడచిన నెల రోజులుగా దిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోరెన్ మరణవార్తను ఆయన కుమారుడు, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. శిబూ సోరెన్ మరణంపై

(మిగతా 3లో)

ఇదీ సంగతి!



అన్ని కేసులూ ఇంత తొందరగా ఎందుకు తేమలవు సార్? ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ ఎందుకు తిప్పించుకొంటారు?

హాయ్ ఫ్రెండ్స్.. వై దిస్ కొలవరీ!

అనవసరపు ఆందోళనలను ఆహ్వానిస్తున్న యువత

'హాయ్ ఫ్రెండ్స్ మా ఫ్రిజ్‌లో చూశారా ఏమేం కూరగాయలు పెట్టామో..' హోం టూర్‌లో ఓ గృహిణి

'ఫలానా వ్యక్తి నన్ను బ్యాడ్‌గా కామెంట్ చేస్తున్నారు గయ్స్.. మీరే నాకు అండగా ఉండాలి..' ఓ యూట్యూబర్ ఆవేదన



ఇవీ తన ఇంట్లో మంచంపై పడుకుని రమేశ్.. యూట్యూబ్‌లో స్క్రోల్ చేస్తూ చూస్తున్న వీడియోలు. డైలీ వ్లాగింగ్‌లుగా పిలిచే ఈ వీడియోల్లో.. తనకు తెలియని, ముఖ పరిచయం కూడా లేని వారి దినచర్యను చూడటమే తన దినచర్యగా మార్చుకున్నాడు.

ఉదయం 7 గంటలకు..
ఫలానా అక్క పొద్దున్నే టిఫిన్ ఏం వండిందనే వీడియోను ఓపెన్ చేస్తాడు. దాని కింద సూపర్ అక్కా అని ఓ కామెంటూ విసురుతాడు.



మధ్యాహ్నం 1 గంటకు..
ఓ కపుల్ వంటింట్లో ఏమేం వండుకున్నారో.. చూపించే వీడియోను ఓపెన్ చేస్తాడు. భలే వండుతావ్ బేబీ అనో.. ఈసారి ఇంకేదో చేయండనో కామెంట్ చేస్తాడు.

సాయంత్రం 4 గంటలకు..
పచ్చళ్ల అమ్మాయి లైవ్‌లో పచ్చడి పెడుతూ.. తను ఎంత కష్టపడి ఈ స్థాయికి వచ్చిందో చెబుతుంటే మనవాడు కన్నీళ్ల ఎమోజీలు పెడుతూ ఓదారుస్తాడు. ఎవరైనా ఆ యూట్యూబర్‌కి వ్యతిరేకంగా మాట్లాడితే.. 'ఆ కత్తి అందుకో జానకీ..' రేంజ్‌లో టైపింగ్ యుద్ధం చేస్తాడు.

అర్ధరాత్రి 12 గంటలకు...
కొత్తగా పెళ్లి చేసుకున్న ఓ జంట తమ హనీమూన్ ముచ్చట్లు చెబుతుంటే వింటూ నిద్రలోకి జారిపోతాడు. తర్వాతి రోజు లేవగానే మళ్లీ మామూలే..!

రమేశ్‌లా మనలో డైలీ వ్లాగింగ్స్‌కు అలవాటు పడ్డవాళ్లు ఎంత మందో! జనాల్లో ఉండాలని సెలబ్రిటీలు, సెలబ్రిటీలు కావాలనుకునే జనాలు.. ఓ యూట్యూబ్ ఛానల్ క్రియేట్ చేసి, అందులో తమ దినచర్యను డైలీ వ్లాగింగ్ పేరుతో అప్‌లోడ్ చేస్తున్నారు. వీరు చేస్తే చేశారు కానీ

(మిగతా 3లో)

నిజమైన భారతీయులు అలాంటి మాటలు అనరు

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు మందలింపు



దిల్లీ: భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సరిహద్దుల భద్రతపై వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు మందలించింది. 'నిజమైన భారతీయులు అలాంటి మాటలు అనరు' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం సోమవారం పేర్కొంది. అయితే, రాహుల్‌పై లఖ్‌నవూ ట్రయల్‌కోర్టు చేపట్టిన విచారణను నిలిపివేస్తూ(స్టే) ఆదేశాలు జారీచేసింది. 'మీరు లోక్‌సభలో విపక్ష నేత. దేశరక్షణతో ముడిపడిన విషయాలను పార్లమెంటులో ఎందుకు మాట్లాడరు? సామాజిక మాధ్యమాల్లో ఎందుకు చెబుతున్నారు?' అని రాహుల్ గాంధీని ధర్మాసనం ప్రశ్నించింది. 'భారత్‌కు చెందిన 2వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించిందని మీకు ఎలా తెలుసు? మీరు అక్కడ ఉన్నారా? విశ్వసనీయమైన సమాచారం మీ వద్ద ఉందా? ఆధారాలు లేకుండా అలాంటి ప్రకటనను ఎందుకు చేశారు. నిజమైన భారతీయులు అలా మాట్లాడరు' అని ధర్మాసనం పేర్కొంది. రాహుల్ గాంధీ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ...'ప్రతిపక్ష నేత సమస్యలను లేవనెత్తకపోతే దురదృష్టకరమైన పరిస్థితికి దారి తీస్తుంది. ఈ అంశాలను మాట్లాడకపోతే ఆయన విపక్ష నేతే కాదు. దాడిలో 20 మంది భారత

(మిగతా 3లో)

హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ ప్రమాణం

ప్రమాణం చేయించిన సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ గేదెల ప్రమాణం చేశారు. హైకోర్టులో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం జస్టిస్ ఎన్.జయసూర్య నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ తుహిన్ కుమార్ కేసులను విచారించారు. తాజా నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీ) వైవీఎస్‌బీజీ పార్థసారథి, అదనపు ఏజీ సాంబశివప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, జస్టిస్ తుహిన్ కుమార్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

మన్యం జిల్లా నుంచి..: జస్టిస్ తుహిన్ కుమార్ పార్వతీపురం మన్యం జిల్లా కత్తులకవిటి గ్రామానికి చెందినవారు. తల్లిదండ్రులు సరోజినినాయుడు, కృష్ణమూర్తినాయుడు. విశాఖపట్నం ఎన్‌బీఎం న్యాయ కళాశాల నుంచి ఆయన ఎల్ఎల్‌బీ పట్టా అందుకున్నారు.

అవసరం ఉంటే క్రియాశీలక రాజకీయాల్లోకి తిరిగొస్తా

మాజీ ఎంపీ గల్లా జయదేవ్

కాణిపాకం, న్యూస్‌టుడే: పార్టీ పెద్దలతో చర్చిస్తున్నానని, నా అవసరం ఉంటే క్రియాశీలక రాజకీయాల్లోకి తిరిగి వస్తానని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు. హరియాణా మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్ సింగ్ చౌతాలాతో కలిసి సోమవారం ఆయన చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. వారికి స్వామివారి తీర్థప్రసాదాలను ఆలయ ఏఈవో రవీంద్రబాబు అందించారు. అనంతరం ఆలయం వెలుపల క్రియాశీలక రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు గల్లా జయదేవ్ పైవిధంగా సమాధానం ఇచ్చారు.

18 పట్టణాభివృద్ధి సంస్థల్లో జీఐఎస్ ఆధారిత బృహత్తర ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 18 పట్టణాభివృద్ధి సంస్థల్లో జీఐఎస్ ఆధారిత బృహత్తర ప్రణాళికలు (మాస్టర్ ప్లాన్) రూపొందించనున్నారు. వీటి ద్వారా 92,323 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో స్థిరమైన అభివృద్ధికి వీలుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మాస్టర్ ప్లాన్ల తయారీకి కన్సల్టెంట్లను నియమించడానికి రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుడికి అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ, విశాఖ-కాకినాడ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ మినహా మిగతా పట్టణాభివృద్ధి సంస్థల్లో బృహత్తర ప్రణాళికలు తయారు చేయనున్నారు.

బనకచర్ల ప్రాజెక్టుపై రాద్ధాంతం తగదు

మంత్రి ఎన్ఎండీ ఫరూక్

ఈనాడు, అమరావతి: బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేయడం సబబు కాదని రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'గోదావరి నీటి విషయంలో తెలంగాణకు ఒక న్యాయం? ఏపీకి మరో న్యాయమా?. కేంద్రం నుంచి ఎలాంటి అనుమతి లేకున్నా కాళేశ్వరం, సీతారామ సాగర్, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా 296 టీఎంసీలను తెలంగాణ తరలించుకుంటోంది. గోదావరి నుంచి ఏటా సగటున 3 వేల టీఎంసీల వరద సముద్రంలో కలుస్తోంది. 2025 సీజన్ ఆరంభంలోనే ఇప్పటివరకూ 813 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోయింది. వృథాగా పోతున్న జలాలనే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో రాయలసీమకు తరలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది. గోదావరి నదికి దిగువ రాష్ట్రంగా సముద్రంలో కలిసే నీటిని వినియోగించుకునేందుకు ఏపీకి సర్వహక్కులూ ఉన్నాయి. రాయలసీమ లాంటి కరువు ప్రాంతాల దాహార్తి, సాగునీటి అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించిన బనకచర్ల ప్రాజెక్టుపై అనవసర రాద్ధాంతం తగదు' అని మంత్రి స్పష్టం చేశారు.

మద్యం ముడుపులు భారీగా విదేశాలకు తరలించారు

- ఆధారాలు ఉన్నాయి..సిట్ అడిగితే సహకరిస్తా
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అత్యంత కీలకమైన పాత్ర పోషించారని.. అక్రమ సంపాదనను ఆయన హవాలా రూపంలో విదేశాలకు తరలించారని.. ఇందుకు ఆధారాలు ఉన్నాయని తెదేపాకు చెందిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. దుబాయ్, సింగపూర్, శ్రీలంకకు భారీఎత్తున హవాలా రూపంలో నగదు తరలించినట్లు తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. సిట్ అధికారులు అడిగితే సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు సోమవారం తిరుపతిలో ఆయన చెప్పారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వెంకటేశ్ నాయుడితోపాటు మరికొంతమందితో కలిసి చెవిరెడ్డి ఎందుకు విదేశీ పర్యటనలు చేయాల్సి వచ్చిందో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు తనతోపాటు కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. తుడాలో చెవిరెడ్డి కుటుంబ పాలనలో జరిగిన అవినీతిపై త్వరలో విజిలెన్స్ నివేదికలు బయటకు రానున్నాయన్నారు.

'ప్రవేశాలు లేవు' బోర్డు చూసి ఆనందించాను: లోకేశ్

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 'ప్రవేశాలు లేవు' అనే బోర్డు చూసి చాలా ఆనందించానని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. "ఈ పాఠశాలలో మొత్తం 1,725 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది కొత్తగా 400 మందికి పైగా చేరారు. ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనం. 'నో అడ్మిషన్ బోర్డు పెట్టిన కానీ మా పిల్లవాణ్ని ఒక్కడిని చేర్చుకోండి' అని తల్లిదండ్రులు అడుగుతుంటే కాదనలేకపోతున్నామని చెబుతున్న ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, టీచర్లు, సిబ్బందికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ప్రతి పాఠశాలలో ఇలాంటి బోర్డులు కనిపించాలి. తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై విశ్వాసం కలిగించే ఉపాధ్యాయులే రాష్ట్ర మోడల్ ఎడ్యుకేషన్‌ను తీర్చిదిద్దే రథసారథులు" అని పేర్కొన్నారు.

లాటరీ ద్వారా బార్ లైసెన్సులు

- గీత కార్మిక కులాలకు 10 శాతం రిజర్వు
- ఎక్సైజ్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం

ఈనాడు, అమరావతి: కొత్త బార్ పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం సిద్ధం చేసిన ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపారు. సెప్టెంబరు 1 నుంచి నూతన విధానం అమల్లోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 840 బార్‌లను నోటిఫై చేస్తారు. అందులో 10 శాతం బార్‌లను గీతకార్మిక కులాలకు రిజర్వు చేయాలని నిర్ణయించారు. దరఖాస్తులను లాటరీ తీసి లైసెన్సుదారును ఎంపిక చేస్తారు. ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఎక్సైజ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న బార్ పాలసీ ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో ఆ స్థానంలో తీసుకొచ్చే కొత్త విధానంపై చర్చించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాల్ని పరిశీలించారు. గతంలో వేలం ద్వారా లైసెన్సుదారులను ఎంపిక చేసేవారు. ఈసారి లాటరీ పద్ధతి అనుసరించాలని నిర్ణయించారు. 50 వేలు అంతకంటే తక్కువ జనాభా కలిగి ఉన్న నగర పంచాయతీల్లో రూ.35 లక్షలు, 50 వేలు-5 లక్షల మధ్య జనాభా ఉండే నగరాల్లో రూ.55 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల్లో రూ.75 లక్షల చొప్పున లైసెన్సు రుసుముగా(ఏడాదికి) నిర్ణయించారు. దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు. దరఖాస్తు, లైసెన్సు రుసుముల ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. ఈ సమీక్ష సందర్భంగా చంద్రబాబు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన అంశాలివీ..

- మద్యం విధానమనేది ఆదాయం కోసమే కాదు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఆల్కహాల్ పరిమాణం తక్కువగా ఉన్న మద్యం ద్వారా వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడాలి. వైకాపా ప్రభుత్వ హయాంలో నాసిరకమైన మద్యం వల్ల లక్షల కుటుంబాలు నష్టపోయాయి. పేదల ఇళ్లు, ఒళ్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరముంది.
- ఏపీలో మద్యం ధరలు తగ్గటం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండటం, నాణ్యమైన మద్యం లభించటం వల్ల విక్రయాలు పెరిగాయి. గతంలో నాసిరకమైన మద్యం విక్రయించటం వల్ల ఎక్కువ మంది పొరుగు రాష్ట్రాలకు వెళ్లి తాగేవారు.
- సెప్టెంబరు నాటికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను నాటుసారారహిత జిల్లాలుగా ప్రకటించాలి.

పచ్చని పల్లెలో మైనింగ్ చిచ్చు

- ఖనిజం తవ్వకాలను వ్యతిరేకిస్తున్న గ్రామస్థులు
- తెదేపా నాయకుడిని స్టేషన్‌కు పిలిచిన పోలీసులు
- అక్కడే కుప్పకూలిన పీరయ్య, చికిత్సకు తరలింపు





గుండెపోటుతో కుప్పకూలిన పీరయ్య

పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఈనాడు, నెల్లూరు, వరికుంటపాడు, న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడులో మైనింగ్ వద్దంటూ స్థానికులు చేస్తున్న ఆందోళన ఉద్ధృతమైంది. నాయకులు పట్టించుకోకపోవడం.. పోలీసులు వేధిస్తుండడంతో గ్రామస్థులంతా ఏకమయ్యారు. ఈ క్రమంలో సోమవారం తెదేపా నాయకుడు షేక్ పీరయ్యను పోలీసులు స్టేషన్‌కు తీసుకురాగా.. కాసేపటికే ఆయన గుండెపోటుతో పడిపోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వరికుంటపాడు, భాస్కరాపురం పంచాయతీల్లోని 16.92 హెక్టార్లలో ఖనిజాల తవ్వకాలకు గత ప్రభుత్వంలో వేలం నిర్వహించగా పోచ వెంకట్‌రెడ్డి దక్కించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మైకా, క్వార్ట్జ్ తవ్వకాలకు సిద్ధం కాగా స్థానికులు అడ్డుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామసభలో నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులంతా ఐకాసగా ఏర్పడి ఆందోళన చేస్తున్నారు. ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్న తెదేపా నాయకుడు షేక్ పీరయ్యను పోలీసులు మూడురోజులుగా స్టేషన్‌కు రమ్మని పిలుస్తున్నారు. చివరకు సోమవారం ఆయనను తీసుకువెళ్లారు. బహిరంగ విచారణ చేయాలని ఈ సందర్భంగా పీరయ్య కోరగా నిరాకరించారు. ఎస్‌ఐ రఘునాథ్ ప్రశ్నిస్తుండగా గుండెనొప్పి రావడంతో పీరయ్య కింద పడిపోయారు. వెంటనే పోలీసులు 108లో పామూరు ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తీసుకెళ్లారు.

స్టేషన్ ఎదుట ఆందోళన

ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు పోలీసుస్టేషన్ దగ్గరకు చేరుకున్నారు. టీ తాగేందుకు రోడ్డుపైకి వచ్చిన పీరయ్యను బలవంతంగా తీసుకెళ్లి వేధింపులకు గురిచేశారని ఆరోపిస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఆయనకు ఏమైనా జరిగితే సహించేదిలేదని హెచ్చరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. మధ్యాహ్నం వర్షం పడుతున్నా తగ్గలేదు. ఈ వివాదంపై ఎస్‌ఐ రఘునాథ్‌ను వివరణ కోరగా, నోటీసు ఇచ్చేందుకే పీరయ్యను పిలిచామని తెలిపారు. కేసు నమోదు చేయలేదన్నారు. తహసీల్దార్ హేమంత్ మాట్లాడుతూ.. మైనింగ్‌కు ఎన్‌వోసీ ఇవ్వలేదని తెలిపారు.

ప్రజాభిప్రాయం మేరకే ప్రభుత్వ నిర్ణయం: ఎమ్మెల్యే

కొండాపురం, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయం మేరకే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. వరికుంటపాడు మండలంలోని భాస్కరాపురం పరిధిలో గనుల తవ్వకాలపై మండలంలోని పొట్టిపల్లిలో ఆయన సోమవారం మాట్లాడారు.

ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తాం

- అన్ని రాజకీయపక్షాల అభిప్రాయాలను స్వీకరిస్తాం
- కమిషన్ సూచనలను ప్రభుత్వం తప్పకుండా పాటిస్తుంది
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం కమిషన్ నివేదికను ఆమోదించిన మంత్రిమండలి

ఈనాడు, హైదరాబాద్: "ఊరు, పేరు, అంచనాలు మార్చి.. అవినీతికి పాల్పడి.. అక్రమాలకు పునాదులు వేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈ రోజు కూలిపోయింది. కమిషన్ స్పష్టంగా ఈ వివరాలన్నింటినీ పొందుపర్చింది. ఈ నివేదికను రాబోయే రోజుల్లో శాసనసభ, మండలిలోనూ ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పక్షాలకూ వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే అవకాశం కల్పించనున్నాం. ఈ మేరకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత.. భవిష్యత్ కార్యాచరణకు.. కమిషన్ సూచనలను అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఇందులో ఎలాంటి శషభిషలకు తావు లేదు" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "మేము రాజకీయ కక్షపూరిత చర్యలు చేపట్టినట్లో.. ఎవరి మీదనో వ్యక్తిగతంగా ద్వేషంతో నిర్ణయాలు తీసుకున్నట్లో.. చర్చలకు తావివ్వకుండా.. ఈ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేయాలనుకుంటుంది. కాబట్టే ఈ రోజు కమిషన్ నివేదికలోని అన్ని వివరాలను మీ ముందు పెట్టాం" అని సీఎం వెల్లడించారు. సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో 665 పేజీల జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రవేశపెట్టారు. దీనిపై ముగ్గురు అధికారుల కమిటీ రూపొందించిన సంక్షిప్త నివేదికను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గ సహచరులకు వివరించారు. అనంతరం జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను మంత్రిమండలి ఆమోదించింది. తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "గతంలో పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న నేను, మా నాయకుడు రాహుల్‌గాంధీ మేడిగడ్డను సందర్శించాం. ఇందులో అవినీతి, ఆశ్రితపక్షపాతం, నిర్లక్ష్య వైఖరి, ఎన్నో లోపాలతో కూడుకున్న నిర్ణయాలున్నాయని, అందువల్లే రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం పూర్తిగా కూలిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. న్యాయ విచారణకు ఆదేశిస్తామని ఆనాడు తెలంగాణ ప్రజలకు మాట ఇచ్చాం. ఆ మాట ప్రకారం.. 14.03.2024న జస్టిస్ పీసీ ఘోష్ ఛైర్మన్‌గా జ్యుడిషియల్ కమిషన్‌ను విచారణకు నియమించాం. దాదాపు 16 నెలలు ఘోష్ కమిషన్.. నాటి ముఖ్యమంత్రి, అప్పటి సాగునీటి, ఆర్థిక మంత్రులను.. ఐఏఎస్, ఇంజినీరింగ్ అధికారులను, నిర్మాణ సంస్థలు, ప్రజాసంఘాలు, పాత్రికేయులను, ముందుకొచ్చిన ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించింది. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటలను ప్రశ్నించి... వారి వివరణను విశ్లేషించింది. గత నెల 31వ తేదీన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

ఆ మూడు బ్యారేజీల దుస్థితికి కారణం కేసీఆర్: భట్టి

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీల దుస్థితికి అప్పటి సీఎం కేసీఆర్ కారణమని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. "ఈ మూడు బ్యారేజీల నిర్మాణం కేసీఆర్, హరీశ్‌రావు వ్యక్తిగత నిర్ణయమే తప్ప... ప్రభుత్వం అధికారిక నిర్ణయం కాదు. బ్యారేజీల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో అక్రమాలు, అవకతవకలకు జవాబుదారీ కేసీఆర్ అని కమిషన్ తేల్చింది" అని వెల్లడించారు.

చెవిరెడ్డికి సన్నిహితుడు కాకపోతే డమ్మీ నామినేషన్ ఎందుకు వేశారు?

- సాక్ష్యాధారాలు ఉండబట్టే వెంకటేశ్ నాయుణ్ని సిట్ అరెస్టు చేసింది
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అత్యంత సన్నిహితుడు కాకపోతే మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడైన వెంకటేశ్‌నాయుడు ఆయన కోసం ఒంగోలు లోక్‌సభ స్థానానికి డమ్మీ అభ్యర్థిగా ఎందుకు నామినేషన్ వేశారని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో వెంకటేశ్‌నాయుడి పాత్రను సిట్ సాక్ష్యాధారాలతో బయటపెట్టిందని, అరెస్టు చేసిందని గుర్తుచేశారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'చెవిరెడ్డి భాస్కరరెడ్డికి వెంకటేశ్‌నాయుడు బినామీ. తనది నంద్యాలని వెంకటేశ్‌నాయుడు చెబుతున్నారు. కానీ 15 ఏళ్లుగా అక్కడి రాజకీయాల్లో ఉన్న నాకే అతనెవరో తెలియదు. అతడితో నా ఫొటో ఉన్నా ఆశ్చర్యపోయేది లేదు. నోట్ల కట్టలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడికి వెళ్లాయి, ఎవరి బినామీల ఖాతాల్లో చేరాయి, ఎక్కడ దాచారు.. వీడియోలతో సహా సిట్ వెలుగులోకి తెచ్చింది. దీంతో వైకాపా నేతలు ఉలిక్కిపడుతున్నారు. త్వరలోనే ఈ కేసులో కీలకంగా ఉన్న మిగతా నిందితులు కూడా బయటకొస్తారు' అని పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలను బెదిరిస్తున్న వైకాపా

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్న పారిశ్రామికవేత్తల్ని వైకాపా వారు బెదిరిస్తున్నారని బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. పెట్టుబడిదారుల మీద కోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నారని, రాష్ట్రానికి రావద్దంటూ వారికి మెయిల్స్ పెడుతున్నారని చెప్పారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు చేసిన జాతీయ రహదారి ప్రాజెక్టులు, గతంలో పెండింగ్‌లో ఉన్నవి కలిపి రూ.లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టుల్ని రెండేళ్లలో పూర్తి చేయనున్నట్టు వివరించారు.

5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

ఈనాడు, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద విద్యార్థుల ఆవాసాలకు 3-5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మూడు కిలోమీటర్లలోపు ఉన్న ప్రైవేటు పాఠశాలల్లోనే సీట్లు కేటాయిస్తుండగా.. ఇక నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు బడుల్లోనూ సీట్లు కేటాయించనున్నారు. కొత్తగా ప్రకటన విడుదల చేసి, దరఖాస్తులు స్వీకరించి, సీట్లు కేటాయించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉచిత ప్రవేశాలకు అర్హత పొందిన విద్యార్థుల తల్లులు ఇప్పటికే తల్లికి వందనం మొత్తాన్ని పొంది ఉంటే ప్రభుత్వ ఉత్తర్వు-32 ప్రకారం పాఠశాలల ఫీజులను తామే చెల్లిస్తామని సమ్మతి ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. తాజా మార్గదర్శకాలను అమలు చేసే బాధ్యతను సమగ్ర శిక్షా అభియాన్ పీడీకి అప్పగించింది.

గ్రహం అనుగ్రహం

5-8-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
ఏకాదశి: మ. 11-24 తదుపరి ద్వాదశి
జ్యేష్ఠ: ఉ. 10-47 తదుపరి మూల
వర్జ్యం: రా. 7-25 నుంచి 9-08 వరకు
అమృత ఘడియలు: లేవు
దుర్ముహూర్తం: ఉ. 8-16 నుంచి 9-07 వరకు తిరిగి రా. 10-58 నుంచి 11-43 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.5.43; సూర్యాస్తమయం: సా.6.29
మతత్రయ ఏకాదశి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	40.0	28.0
నెల్లూరు	38.2	28.4
ఒంగోలు	37.9	26.8
తాడేపల్లిగూడెం	36.4	28.1
తిరుపతి	36.2	26.3
విజయవాడ	36.0	26.4
విజయనగరం	36.0	26.0
నరసాపురం	35.4	28.0
విశాఖపట్నం	35.2	28.4
కర్నూలు	34.6	24.2
గుంటూరు	34.0	27.0
అనంతపురం	34.0	23.3
శ్రీకాకుళం	33.0	28.0
కడప	33.0	25.0
హైదరాబాద్	33.0	23.9
మహబూబ్‌నగర్	32.1	25.1



ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాలకు హాజరవుతా..

- టీచర్ల సమస్యలకు చర్చల ద్వారా పరిష్కారం
- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: జిల్లాల్లో జరిగే ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ప్రభుత్వ విద్య విషయంలో దేశంలోనే ఏపీని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ చర్చల ద్వారా పరిష్కారం చూపుతాం. ఎవరూ ఆందోళన పడాల్సిన పని లేదు. ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురావాలి. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతోపాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలి. అంకిత భావంతో పని చేసి, ఉత్తమ ఫలితాలు సాధించాలి' అని సూచించారు. మండల విద్యాధికారుల పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని, డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రాజకీయ జోక్యం లేకుండా ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, రాష్ట్రంలో ప్రాథమిక ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని మంత్రి లోకేశ్ దృష్టికి వారు తీసుకొచ్చారు. మంత్రిని కలిసిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగెల హైమారావు తదితరులు ఉన్నారు.

జైళ్ల శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు

హోంమంత్రి వంగలపూడి అనిత



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

ఈనాడు, అమరావతి: జైళ్ల శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. 40 శాతానికి పైగా ఖాళీలున్నాయంటూ అధికారులు ఆమె దృష్టికి తీసుకురాగా.. 300-400 వార్డర్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జైళ్లలోని పరిశ్రమలు, యూనిట్లకు సాంకేతికతను జోడించి మరింత అభివృద్ధి చేయాలని, దీని కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధుల్ని వినియోగించుకోవాలని సూచించారు. మంగళగిరిలోని జైళ్ల శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొంతమంది అధికారులు సహచర సిబ్బందిపై అభ్యంతరకర భాష మాట్లాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. వారు తీరు మార్చుకోవాలని సూచించారు. కనిగిరి సహా పలు చోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయిన జైళ్ల భవనాల నిర్మాణాల పనులు వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన నిధులు కేటాయించేలా తాను చూస్తానని చెప్పారు. సమీక్షలో హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్, జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్, ఐజీ శ్రీనివాసరావు, డీఐజీలు వరప్రసాద్, రవికిరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు ప్రతిభా పాయింట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు ప్రతిభా పాయింట్లను పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. వంద పాయింట్లకు 17 ముఖ్య ప్రతిభా అంశాలను లెక్కిస్తారు. దీంట్లో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని మాత్రమే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపిక చేస్తారు. ఉన్నత విద్యార్హతలకు 2, ఉపాధ్యాయుడి సర్వీస్‌కు 6, స్వీయ సబ్జెక్టు ఉత్తీర్ణత శాతానికి 10, తల్లిదండ్రులు-ఉపాధ్యాయ సంఘాల కార్యకలాపాల్లో టీచర్ భాగస్వామ్యానికి 2, విద్యా ప్రమాణాలు పెంచేందుకు చేసిన కృషికి 5, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి చేపట్టిన చర్యల క్రియాశీలతకు 6, విద్యార్థుల్లో పాఠ్యాంశాలు-పాఠ్యేతర కార్యకలాపాలపై ఆసక్తిని పెంపొందించినందుకు 20 చొప్పున పాయింట్లు కేటాయిస్తారు. ఆయా విభాగాల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉత్తమ అవార్డుకు ఎంపిక చేస్తారు.



మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన ప్రవచనకర్త గరికపాటి, మంత్రి కొల్లు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అధికార భాషా సంఘానికి 'మండలి' పేరు

చరిత్ర మరువని మహనీయుడు కృష్ణారావు

ఆయనతో కలిసి పనిచేయడం నా అదృష్టం

మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'మండలి వెంకట కృష్ణారావు చరిత్ర మరువని మహనీయుడు. సేవాభావం నిండిన నాయకత్వం ఆయనది. విలువలతో కూడిన రాజకీయం చేశారు. రాజకీయాల్లో, స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా ఆయన తెలుగు భాషాభిమానాన్ని వీడలేదు. హైదరాబాద్‌లో, కౌలాలంపూర్‌లో ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహించి భాషాభిమానం చాటుకున్నారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలు గుర్తుగా అధికార భాషా సంఘానికి 'మండలి' పేరు పెడుతున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో సీఎం మాట్లాడారు. 'కృష్ణా జిల్లా దివిసీమను ఉప్పెన ముంచెత్తిన సమయంలో ఆయన చేసిన సేవలు ఎనలేనివి. అప్పట్లో 12 వేల మంది చనిపోగా.. లక్షలాది నిరాశ్రయులయ్యారు. ఎమ్మెల్యేగా రేయింబవళ్లు ఆయన చూపిన చొరవ చరిత్రలో నిలిచిపోయింది. మండలి ఇచ్చిన పిలుపుతో ఎంతోమంది ప్రముఖులతోపాటు ఎన్నో విదేశీ స్వచ్ఛంద సంస్థలవారు తరలివచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారితో కలిసి బాధితులకు అన్నీ సమకూర్చి అందించారు. శవదహనాలు చేశారు. ఎన్టీఆర్ సైతం కదిలి వచ్చి బాధితుల కోసం జోలె పట్టి విరాళాలు సేకరించి కృష్ణారావుకు అందించారు. దివిసీమకు మళ్లీ పాత రూపు తేవడానికి కృష్ణారావు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆయన స్ఫూర్తితోనే సూపర్ సైక్లోన్, హుద్‌హుద్ తుపాన్లలో అతలాకుతలమైన ప్రాంతాలను పునరుద్ధరించగలిగాం' అని సీఎం తెలిపారు.

ప్రభుత్వం ఇచ్చిన పొలాన్నీ పంచేశారు..

'కృష్ణారావు చిన్న వయసులోనే పేదపిల్లల కోసం పుస్తకాలు, దీపాలు వెలిగించేందుకు కిరోసిన్ సేకరించారు. విద్యార్థి దశ నుంచే ఖద్దరు ధరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సమరయోధుడిగా తనకు దక్కిన ఐదెకరాలను కూడా పేదలకు పంచేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఏ సౌకర్యాలూ వాడుకోకుండా అత్యంత సాధారణ జీవితం గడిపారు. ఎమ్మెల్యేగా ఉండగా తీర ప్రాంతంలోని 15 వేల ఎకరాలను సాగులోకి తెచ్చారు. 50 వేల ఎకరాల బంజరు భూములకు పట్టాలు ఇప్పించి పేదలకు అండగా నిలిచారు. విద్యాశాఖ మంత్రిగా అనేక సంస్కరణలు తెచ్చారు. నాగార్జున, కాకతీయ విశ్వవిద్యాలయాల ఆవిర్భావంలో విశేష కృషి చేశారు. అధికార భాషా సంఘం ఏర్పాటులో ఆయన చొరవ అభినందనీయం. రాయలసీమలో కరవు వస్తే విరాళాలు సేకరించి సేవకు సరిహద్దులు లేవని నిరూపించారు' అని కృష్ణారావు సేవలను చంద్రబాబు కొనియాడారు. 'గతంలో నేను హైటెక్ సిటీని అభివృద్ధి చేసినప్పుడు హైదరాబాద్ ప్రగతికి కేంద్రం అవుతుందని ఎవరూ ఊహించలేదు. భవిష్యత్తు గురించి ఆలోచించి అభివృద్ధి చేశాను. ప్రస్తుతం నేను మాట్లాడుతున్న ఏఐ, క్వాంటమ్ వ్యాలీ కూడా అలాగే భవిష్యత్తును నిర్దేశించనున్నాయి. ట్రంప్ మనవాళ్లపై అక్కసు పెట్టినా అది తాత్కాలికమే.. వారికి మన అవసరం ఉంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

కృష్ణారావు వంటి నాయకులు కావాలి..

'కొందరు నాయకులు అడ్డదారుల్లో డబ్బు సంపాదిస్తారు. అసెంబ్లీలోనూ బూతులు మాట్లాడతారు. మా ప్రభుత్వంలో అసెంబ్లీ నిర్వహణ తీరును మార్చేశాం. వ్యక్తిగత జీవితంలో నేనెప్పుడూ అసభ్యంగా మాట్లాడలేదు. నాకు వ్యక్తిగత రాజకీయాలు చేయడం రాదు. వ్యవస్థ ప్రగతి కోసమే రాజకీయాలు చేస్తాను. కృష్ణా జిల్లా.. సాహిత్య, సాంస్కృతిక, సినీ, రాజకీయ రంగాల్లో ఎంతోమంది ప్రముఖులకు పుట్టినిల్లు. ప్రస్తుత రాజకీయాల్లో కృష్ణారావు వంటి నాయకుల అవసరం ఉంది. నిజమైన గాంధేయవాదాన్ని పాటించిన వ్యక్తితో నేను కలిసి పని చేయడం నా అదృష్టం. విలువలు, సంపద రెండు కళ్లగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త విశ్వయోగి విశ్వంజీ తదితరులు ప్రసంగించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, శ్రీరామ్ తాతయ్య, యార్లగడ్డ వెంకట్రావు, సీనియర్ నేత నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.


వెంకట కృష్ణారావు చిరస్మరణీయుడు

ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఉప్పెన అనంతరం దివిసీమను పునర్నిర్మించిన దివంగత మంత్రి మండలి వెంకట కృష్ణారావు చిరస్మరణీయుడని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు కొనియాడారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో కృష్ణారావు శత జయంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా ప్రపంచంలోని తెలుగు వారందరినీ ఏకం చేసిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అని కీర్తించారు. తెలుగు భాష పరిరక్షణ కోసం బుద్ధప్రసాద్ చేస్తున్న కృషికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో 'అల్లూరి సత్యనారాయణరాజు జీవిత చరిత్ర', 'ఏకాంత స్పర్శ' పుస్తకాలను ఆవిష్కరించారు.



మండలి వెంకట కృష్ణారావు శత జయంతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, విశ్వయోగి విశ్వంజీ, నాయకులు సామినేని ఉదయభాను, బూరగడ్డ వేదవ్యాస్, వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు, ఎమ్మెల్యేలు బొండా ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, రైతు నేస్తం వెంకటేశ్వరరావు, మంత్రి కొల్లు రవీంద్ర



ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వచ్ఛాంధ్ర సంస్థ ఎండీ అనిల్ కుమార్, సంస్థ ఛైర్మన్ పట్టాభిరాం, మంత్రి నారాయణ, ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ సంపత్ కుమార్

డిసెంబరు నాటికి చెత్తకుప్పలు ఉండవు

- అక్టోబరు 2కి యార్డుల్లోని వ్యర్థాల తొలగింపు
- పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడి

ఈనాడు అమరావతి: ఈ ఏడాది డిసెంబరు నాటికి నగరాలు, పట్టణాలను డంపింగ్ యార్డుల రహితంగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రణాళిక వేస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వైకాపా ప్రభుత్వం డంపింగ్ యార్డుల్లో వదిలిపెట్టిన 80 లక్షల టన్నుల వ్యర్థాలలో 67 లక్షల టన్నుల మేరకు తొలగించామని, మిగతాది అక్టోబరు 2 నాటికి పూర్తి చేస్తామని అన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో సామర్థ్యాల పెంపుపై స్వచ్ఛాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యశాలలో మంత్రి ప్రసంగించారు. 'రాష్ట్రంలో రోజూ సేకరించే వ్యర్థాలు అదేరోజు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పుడున్న రెండు ప్లాంట్లతో పాటు కొత్తగా కడప, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతిలో కూడా ఏర్పాటు చేయిస్తున్నాం. మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్లు రెండేళ్లలో ఏర్పాటు చేస్తాం. అమృత్ పథకంలో తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. పట్టణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో లేఅవుట్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూములు కేటాయిస్తున్నాం. అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చే పరిస్థితి లేనందున.. పట్టణ స్థానిక సంస్థలు ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి. బకాయిలు చెల్లించని పెద్దల ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు తొలగించేలా విద్యుత్తు పంపిణీ సంస్థలతో కలిసి పని చేయాలి' అని కమిషనర్లకు మంత్రి నారాయణ సూచించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో భాగంగా ప్రభుత్వం త్వరలో సర్క్యులర్ ఎకానమీ విధానం ప్రకటించనుంది. స్వచ్ఛ అవార్డుల సాధనకు పట్టణ స్థానిక సంస్థలు మరింత కృషి చేయాలి' అని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కె.పట్టాభిరాం సూచించారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, పురపాలకశాఖ సంచాలకులు సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర సంస్థ ఎండీ అనిల్‌కుమార్ ప్రసంగించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించే ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్, వాష్, సాహస్ సంస్థల ప్రతినిధులు మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల జీవిత బీమాకు సంబంధించి పురపాలక శాఖ, యాక్సిస్ బ్యాంకుల మధ్య ఒప్పందం జరిగింది. సహజ మరణాలకు కూడా సువిధ కార్యక్రమం కింద యాక్సిస్ బ్యాంకు బీమా అందిస్తుందని అధికారులు వెల్లడించారు.

హాయ్ ఫ్రెండ్స్.. వై దిస్ కొలవెర్రీ!

(మొదటి పేజీ తరువాయి)

ఆ వీడియోలకు చాలా మంది తెలియకుండానే బానిసలుగా మారుతున్నారు. వారి బాధలు తమవిగా భావించి అనవసర ఆందోళనకు గురవుతున్నారు.

వీక్షకుల భావోద్వేగాలే పెట్టుబడి..

- కొవిడ్ కాలంలోనే డైలీ వ్లాగింగ్ ఛానళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. అందరూ ఇళ్లలోనే ఉండిపోవడంతో మొబైళ్ల వినియోగం బాగా పెరిగి వ్యూస్ కూడా అదే స్థాయిలో పెరిగాయి.
- వ్యక్తిగత విషయాలను అప్‌లోడ్ చేస్తూ వ్లాగింగ్ ఛానల్స్ నిర్వహించే వారికి వీక్షకుల భావోద్వేగాలే పెట్టుబడి.
- ఈ భావోద్వేగాలను ఉపయోగించుకుని వారికి వ్యూస్, తద్వారా వ్యాపార ప్రకటనలు, యూట్యూబ్ నుంచి డబ్బు వస్తుంది కానీ వీక్షకులు మాత్రం తమ సమయాన్ని కోల్పోతారు.
- మానసికంగా, శారీరకంగా అలసిపోయి ప్రొడక్టివిటీకి దూరమవుతారు.
- కొన్ని సార్లు యూట్యూబర్‌ల మధ్య ఏదైనా అంశంపై గొడవ జరిగినప్పుడు తమ వ్యూయర్స్‌ను అవతలి పక్షం వారిపైకి ఉసిగొల్పడమూ జరుగుతోంది.
- ఆఖరికి తమదైన లక్ష్యాలు, సంతోషం కోసం కాకుండా మరొకరి జీవనభృతికి, ఫేమ్‌కు మన సమయాన్ని యువత ధారబోస్తోంది.
- అంతేకాకుండా వ్లాగింగ్ వీడియోలు చాలా మందికి డిప్రెషన్ కూడా కలిగిస్తాయని మానసిక నిపుణులు చెబుతున్నారు.
- వ్లాగింగ్ చేసే వ్యక్తికి ఉన్న ఉద్యోగం మనకు లేదనో.. ఫలానా జంట ఉన్నంత సంతోషంగా తాము లేము అనో నిరాశలో మునిగిపోయేవారూ ఎక్కువే.
- ఏ పనీ లేనివారు లేదా తమ జీవితంపై విరక్తి చెందినవారు మాత్రమే ఇలాంటి వీడియోలు చూస్తారని ఓ బ్లాగర్ పేర్కొన్నారు. 'బ్లాగ్‌కు వీడియో రూపమే వ్లాగ్. బ్లాగ్‌ను చదివేవారికి బ్లాగర్‌తో అంత అనుబంధం ఏర్పడదు. కాబట్టి కంటెంట్‌ను మాత్రమే చదువుకుని వెళ్లిపోతారు. కానీ వ్లాగర్‌తో వీక్షకుడికి కాలక్రమేణా మానసిక బంధం ఏర్పడుతుంది. అది చాలాసార్లు అతడికి చెడే చేస్తుంది' అని వివరించారు.



వారి బాధకు.. వీరికి కన్నీళ్లు..
వారి అవార్డుకు..
వీరికి ఆనందం..
వాళ్లకు లైక్‌లు రాకుంటే
వీరికి వేదన..
బ్యాడ్ కామెంట్లు వస్తే..
వీరిది వర్ణించలేని రోదన!
ముక్కూ మొహం తెలియని
యూట్యూబర్‌లకోసం..
అనేక మంది రక్తాలు
చిందిస్తున్నారిప్పుడు..!



ఎలా బయటపడాలి?

ముందుగా రోజూ అలవాటు పడిన దినచర్యను మార్చాలి. ఉదాహరణకు రోజూ ఉదయం 11 గంటలకు వ్లాగింగ్ వీడియో చూసే అలవాటు ఉందనుకుందాం. సరిగ్గా ఆ సమయానికి మన మెదడు ఆ తరహా వీడియో చూడాలని ప్రేరేపిస్తుంది. అప్పుడు మనం వీడియో చూడటానికి తీరిక లేని పనిలో ఉండాలి. చరిత్రకు సంబంధించిన డాక్యుమెంటరీలు, కొరుకుడు పడని సైన్స్ అంశాలు, వర్తమాన వ్యవహారాలను సులువుగా చెప్పే ఛానళ్లు చాలానే ఉంటాయి. వాటిని చూడటం ప్రారంభిస్తే యూట్యూబ్ అల్గారిథం కూడా మారి, మనకు ఆ తరహా వీడియోలనే సూచిస్తుంది. క్రమంగా వ్లాగింగ్ వీడియోలకు, వారికి సంబంధించిన గొడవలకు దూరం అవుతాం. ఆ తర్వాత మనకు ఎంత సమయం మిగిలిందో చూసి ఆశ్చర్యపోతాం.

-ఈనాడు ప్రత్యేక విభాగం

శ్రీవారి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి పవిత్రోత్సవాలకు సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సేనాధిపతి విష్వక్సేనులవారిని సాయంత్రం ఆలయ మాడ వీధుల మీదుగా వసంత మండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఆలయంలోని పవిత్ర మండపంలో అంకురార్పణ, వైదిక కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం నుంచి ఈ నెల 7వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీపెద్దజీయర్, శ్రీచిన్నజీయర్, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లలో వచ్చే ఇబ్బందులను పేర్కొంటూ మంగళవారం హైకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించింది. ఆ పిటిషన్‌పై న్యాయస్థానం వెలువరించే ఆదేశాలతో కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. వాస్తవానికి రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపును సోమవారం పూర్తి చేయాల్సి ఉంది.

నిజమైన భారతీయులు అలాంటి మాటలు అనరు

(మొదటి పేజీ తరువాయి)

సైనికులు మృతి చెందారు. ఇది ఆందోళనకర విషయం' అని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ...'సరిహద్దుల్లో ఘర్షణ తలెత్తినప్పుడు ఇరువైపులా మరణాలు సంభవించడం అసాధారణమేమీ కాదు' అని పేర్కొంది. సరిహద్దుల్లో జరిగేవాటిని తెలియనీయకుండా చేస్తున్నారనే ఆవేదనను రాహుల్ గాంధీ వ్యక్తం చేశారని సింఘ్వీ తెలిపారు. విపక్ష నేతగా ఆ అంశాలను సరైన వేదికపై ప్రస్తావించి ఉండాల్సిందని జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ఇంకా మెరుగైన విధానంలో తన అభిప్రాయాలను వెల్లడించాల్సిందని న్యాయవాది సింఘ్వీ అంగీకరించారు. నిందితుడి వాదనలను వినకుండానే లఖ్‌నవూ ట్రయల్ కోర్టు రాహుల్‌పై వచ్చిన ఫిర్యాదును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేసిందని, ఇది న్యాయ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. దీంతో ట్రయల్ కోర్టులో విచారణపై స్టే విధిస్తూ ధర్మాసనం నోటీసు జారీ చేసింది.

భారత్‌ను బలహీనపరచేందుకు చైనాగురు ప్రతిన: భాజపా

కాంగ్రెస్ అగ్రనేతను సుప్రీంకోర్టు మందలించిన నేపథ్యంలో భాజపా స్పందిస్తూ...'రాహుల్‌ను చైనాగురు'గా అభివర్ణించింది. రాహుల్ విదేశీ శక్తుల చేతుల్లో రిమోట్ కంట్రోల్‌గా మారారని, భారత్‌ను బలహీనపరిచేందుకు ప్రతినబూనారంటూ భాజపా జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతపై సుప్రీం కోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు: జైరాం రమేశ్

భాజపా విమర్శలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తిప్పికొట్టారు. 2020 జూన్ 15న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధాని. . మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చారని ప్రశ్నించారు.



బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి

అంతర్‌రాష్ట్ర సర్వీసుల్లో ఉచిత ప్రయాణంపై మంత్రిమండలిదే తుది నిర్ణయం

మహిళల ఉచిత ప్రయాణంపై మంత్రివర్గ ఉప సంఘం నివేదిక

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయనున్నందున.. రద్దీ పెరుగుతుందని, మహిళల భద్రత దృష్ట్యా అన్ని బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సూచించింది. ఈ పథకంపై రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హోం మంత్రి అనిత, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణిలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘం సోమవారం రాష్ట్ర సచివాలయంలో భేటీ అయి చర్చించింది. రవాణాశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఉప సంఘం గతంలో కర్ణాటక రాష్ట్రంలో పథకం అమలుతీరుని పరిశీలించింది. అక్కడ గమనించిన అంశాలు, ఇక్కడ పథకం ఎలా అమలు చేయవచ్చనేది సూచిస్తూ నివేదిక రూపొందించింది. రవాణా శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండేకు సోమవారం ఈ నివేదికను మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు అందజేశారు. ఈ నివేదికను బుధవారం జరిగే మంత్రిమండలి సమావేశం ముందు ఉంచనున్నారు.

- పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో తిరిగే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో.. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ప్రయాణించేలా ఈ పథకం అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సు చేసింది.
- అయితే అంతర్‌రాష్ట్ర సర్వీసులుగా (తిరుపతి-చెన్నై, అనంతపురం-బెంగళూరు వంటివి) తిరిగే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకం వర్తింపజేయాలా? వద్దా? అనే నిర్ణయాన్ని మంత్రిమండలికి విడిచిపెట్టారు.
- తిరుపతి-తిరుమల మధ్య తిరిగే సప్తగిరి ఘాట్ సర్వీసుల్లో ఈ పథకం వర్తించదు.

ముందే క్యాన్సర్‌ను గుర్తించే క్వాంటమ్

(మొదటి పేజీ తరువాయి)

ఉండొచ్చు. ఇలాంటి సమస్యను నివారించేందుకు బెంగళూరుకు చెందిన డీప్‌టెక్ స్టార్టప్ 'క్వాంటమ్ బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్'.. 'ప్రెడిక్టివ్ టెక్' అనే సాంకేతికతను రూపొందించింది. ఇది క్వాంటమ్ బయోసెన్సార్ల సాయంతో క్యాన్సర్ కణాలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తుందని తెలిపింది. ఈ సెన్సార్లు మ్యాగ్నటిక్ రెజోనెన్స్ ఫింగర్ ప్రింటింగ్ (ఎంఆర్‌ఎఫ్)ను చిత్రీకరించి క్యాన్సర్‌కు ప్రభావితం అవుతున్న కణాలను తొలిదశలోనే గుర్తిస్తాయని పేర్కొంది. తన భార్య క్యాన్సర్ బారిన పడి రేడియో థెరపీ చికిత్స తీసుకుంటున్న సమయంలో ఆటోమోటివ్ పరిశ్రమల కోసం రూపొందించిన ఈ సెన్సార్లను ఆరోగ్య రంగానికి ఉపయోగపడేలా అభివృద్ధి చేసినట్లు ఈ సంస్థ ఎండీ రవి పువ్వల వెల్లడించారు. నెదర్లాండ్‌కు చెందిన క్వాంటమ్ టెక్నాలజీ సైన్స్ సంస్థతో కలిసి 15 ఏళ్లుగా ఈ క్వాంటమ్ సెన్సార్లపై అధ్యయనం చేశామని వివరించారు. ప్రస్తుతం ఈ సెన్సార్లు క్యాన్సర్ ప్రభావిత కణాలను మరింత స్పష్టంగా గుర్తించే చిత్రాలను సిద్ధం చేస్తున్నాయని వెల్లడించారు. ఇలా ముందుగా గుర్తించే క్యాన్సర్‌ను రేడియో థెరపీ వరకు వెళ్లకుండానే నియంత్రించే అవకాశం ఉందని చెప్పారు. ఆంకాలజీలోనే కాకుండా మూత్రనాళాలు, గుండె, నరాల సంబంధిత వ్యాధుల గుర్తింపులోనూ ఈ క్వాంటమ్ సెన్సార్లు కీలకంగా వ్యవహరించి రోగి జీవిత కాలాన్ని పెంచేందుకు ఉపయోగపడతాయని వివరించారు.

మూగవోయిన గిరిజనుల గళం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు మంత్రులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

మూడుసార్లు సీఎం, మూడుసార్లు కేంద్ర మంత్రి: అవిభాజ్య బిహార్ రాష్ట్రంలోని రామ్‌గఢ్ జిల్లా నెమ్రా గ్రామంలో 1944, జనవరి 11న జన్మించిన శిబూ సోరెన్ గిరిజనోద్యమానికి జాతీయ గుర్తింపు తెచ్చిన నాయకుడు. దేశ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించారు. శిబూ సోరెన్ 15 సంవత్సరాల వయసులో ఉండగా ఆయన తండ్రి శోబరన్ సోరెన్ వడ్డీ వ్యాపారుల చేతిలో హతమయ్యారు. ఈ ఘటన ఆయనపై తీవ్ర ప్రభావం చూపింది. అక్కడి నుంచి గిరిజన హక్కుల కోసం గళం విప్పడం ప్రారంభించారు. 1973లో జేఎంఎం స్థాపించారు. ఆ సంస్థ చేపట్టిన ఉద్యమం కారణంగా 2000 సంవత్సరం నవంబరు 15న ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్రం ఆవిర్భవించింది. శిబూ సోరెన్ యూపీఏ హయాంలో మూడుసార్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా పనిచేశారు. మూడు పర్యాయాలు ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా కూడా విధులు నిర్వహించారు. ఈ గిరిజన నేత..తన జీవితకాలంలో 8 సార్లు లోక్‌సభకు, ఒకసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

జేఎంఎం ముడుపుల కేసులో.. 1991లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ లోక్‌సభలో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది కానీ మెజారిటీ సాధించలేకపోయింది. పీవీ నరసింహారావు నేతృత్వంలో ఏర్పాటైన నాటి మైనారిటీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1993లో ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. జేఎంఎంకు చెందిన ఎంపీలు ఈ అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసి పీవీ ప్రభుత్వాన్ని కాపాడారు. పీవీకి అనుకూలంగా ఓటేసినందుకు శిబూ సోరెన్‌కు ముడుపులు ముట్టాయని సీబీఐ ఆరోపించింది. ఇది జేఎంఎం ముడుపుల వ్యవహారంగా చాలాకాలం పత్రికల్లో పతాక శీర్షికల్లో నిలిచింది. ఈ ముడుపుల గుట్టు తెలిసినవానిగా భావిస్తున్న తన వ్యక్తిగత సలహాదారు శశినాథ్ ఝా హత్య కేసులో శిబూ సోరెన్ నిందితుడు. ఈ కేసులోఆయన నిర్దోషి అని కింది కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు 2018లో సమర్థించింది.

ప్రముఖుల సంతాపం: గిరిజనులకు గుర్తింపు తెచ్చేందుకు, ఝార్ఖండ్ రాష్ట్ర ఆవిర్భావానికి సోరెన్ ఎనలేని కృషి చేశారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. గిరిజన జాతుల సాధికారికతకు సోరెన్ అవిరళ కృషి చేశారని ప్రధాని మోదీ అన్నారు. శిబూ సోరెన్ గిరిజనుల గళమై నినదించారని, ఝార్ఖండ్ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. పలు రాష్ట్రాల సీఎంలు, జాతీయ, రాష్ట్ర నాయకులు నివాళులర్పించారు.



దిల్లీలో శిబూ సోరెన్ పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్



శిబూ సోరెన్ భౌతికకాయం వద్ద అంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే. చిత్రంలో కేసీ వేణుగోపాల్, కల్పనా సోరెన్

సీఐడీని సింగపూర్ పంపి అక్కడి సంస్థలను వేధించారు

గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ మండిపాటు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం సీఐడీ అధికారులను సింగపూర్ పంపించి, అమరావతి నిర్మాణ ప్రాజెక్టులపై ఒప్పందాలు చేసుకున్న సంస్థలను విచారణ పేరుతో వేధించిందని రాష్ట్రమంత్రి నారాయణ మండిపడ్డారు. రాజధాని నిర్మాణంపై 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను గత ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా సీఐడీతో ఇంటరాగేషన్ చేయించడంతో సింగపూర్ ప్రభుత్వం తీవ్ర వేదనకు గురైందని వివరించారు. విజయవాడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సింగపూర్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఉన్న స్నేహపూర్వక బంధం దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దేశ పర్యటనకు వెళ్లి అధ్యక్షుడిని, సీనియర్ మంత్రిని కలిసి చర్చించారు. చంద్రబాబుపై గౌరవంతో వారు ఎంతో సానుకూలంగా స్పందించారు. రాష్ట్రానికి కావలసిన మద్దతు అందిస్తామని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది' అని మంత్రి నారాయణ వివరించారు. 'అమరావతిలో స్విస్ ఛాలెంజ్ విధానంలో స్టార్టప్ ప్రాజెక్టు విషయంలో ముందుకు రాలేమని సింగపూర్ సంస్థల కన్సార్షియం స్పష్టం చేసింది. సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించింది. ఇతర ప్రాజెక్టుల్లో భాగం పంచుకుంటామని హామీ ఇచ్చింది. సింగపూర్‌లో వ్యర్థాల నిర్వహణకు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించాం' అని మంత్రి నారాయణ వివరించారు.

అమరావతిలో 250 ఎకరాల్లో కల్చర్ డిస్ట్రిక్ట్

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ (ఏడీసీ) అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కల్చర్ డిస్ట్రిక్ట్ ప్రతిపాదనకు సీఎం ఆమోదముద్ర వేసినట్లు సమాచారం. పూర్తిస్థాయి ప్రణాళికలను త్వరలో సిద్ధం చేస్తారు. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, కళలకు అద్దం పట్టేలా దీన్ని తీర్చిదిద్దాలన్నది ఆలోచన.

ఏమేమి ఉంటాయి

కల్చర్ డిస్ట్రిక్ట్‌లో భాగంగా రివర్ ఘాట్, కల్చర్ ప్రొమెనేడ్, లాన్ టెర్రస్, హై స్ట్రీట్, రివర్ మార్కెట్, క్రాఫ్ట్ విలేజ్, సాంస్కృతిక కేంద్రం, కమ్యూనిటీ ప్లాజా, యాంఫీ థియేటర్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదిక, మల్టీపర్పస్ ప్లేగ్రౌండ్, పిల్లల ఆటపాటల కోసం కిడ్స్ ప్లే ఏరియా, రిబ్బన్ వాక్ సెల్ఫీ కార్నర్స్, వ్యూయింగ్ డెక్‌లు వంటివి ఏర్పాటు చేయబోతున్నారు.

అత్యధిక తలసరి ఆదాయం సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమ మేధ ద్వారా దాన్ని విశ్లేషించి వినియోగించుకుని.. ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ప్రతి త్రైమాసిక పురోగతిపైన ప్రభుత్వ శాఖలు సమీక్షించుకోవాలి' అని చంద్రబాబు సూచించారు. 'బయటి ప్రపంచం చూడకుండా మనమే తెలివైనవాళ్లమని అనుకోవడం సరికాదు. 60 లక్షల జనాభా ఉన్న సింగపూర్ పరిమిత వనరులతోనే అంతర్జాతీయంగా విజయాలు సాధిస్తోంది. 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన వనరులతో ఉన్న భారత్ కూడా చాలా విజయాలు సాధించే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు.

భారత్‌పై సుంకాలు మరింత పెంచుతా

(మొదటి పేజీ తరువాయి)

స్టీఫెన్ మిల్లర్ విమర్శించారు. దీనివల్ల తమ దేశ కార్మికులకు ఎంతో నష్టం జరుగుతోందని చెప్పారు.

రష్యా సరకులను మీరెందుకు కొంటున్నారు?: భారత్

దిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా, ఐరోపా దేశాల అభ్యంతరాలను భారత్ సోమవారం గట్టిగా తిప్పికొట్టింది. అణు పరిశ్రమకు అవసరమైన యురేనియం హెక్సాఫ్లోరైడ్; విద్యుత్ వాహనాలు, ఎరువుల తయారీకి అవసరమైన పలేడియంను రష్యా నుంచి అమెరికా దిగుమతి చేసుకోవడాన్ని ప్రశ్నించింది. ఉక్రెయిన్ ఘర్షణ అనంతరం- అంతర్జాతీయ విపణిలో తలెత్తిన పరిస్థితుల వల్లే.. దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నట్లు భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. తమ దేశ ప్రయోజనాల రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని, అమెరికా సుంకాల అమలు తీరును పరిశీలిస్తామని తెలిపింది.



నేర రాజకీయాల నుంచి విముక్తికోసం...

ఆస్తిపాస్తులను, లక్షల్లో ఆదాయాన్ని ఆర్జించిపెట్టే వృత్తులను వదులుకుని ప్రజాసేవకు అంకితమైన త్యాగధనులే మన దేశానికి స్వాతంత్య్రం సాధించిపెట్టారు. ఆకలి, అవిద్య, నిరుద్యోగం వంటి వాటిని నిర్మూలించి జనజీవితాలను మెరుగుపరచడానికి ఆనాటి నాయకులు తమ సర్వస్వం ధారపోశారు. చీమలు పెట్టిన పుట్టల్లోకి పాములు దూరినట్లు ఆ తరవాతి కాలంలో రాజకీయాల్లోకి నేరగాళ్లు చొరబడ్డారు. నేతలే నానా రకాల హేయ నేరాలకు పాల్పడటం ప్రారంభించారు. ఆ మహాపాపాలు దాటికి జాతి వనరులు పప్పు బెల్లాలైపోతున్నాయి. సామాన్యుల ధనమాన ప్రాణాలకు కనీసపాటి రక్షణ లేని పరిస్థితులు దాపురించాయి. మన సమాజాన్ని ఇంతగా చెదలుతింటున్న నేరగ్రస్త రాజకీయాలకు వికృత ప్రతిరూపం ప్రజ్వల్ రేవణ్ణ. ఎంపీగా ఉంటూనే అభాగ్య మహిళలపై ఎన్నో అకృత్యాలకు పాల్పడిన అతగాడికి న్యాయస్థానం తాజాగా ఓ కేసులో జీవితఖైదు విధించింది. ప్రజ్వల్‌పై అత్యాచార నేరాభియోగాలు నమోదైన నెలల వ్యవధిలోనే విచారణ పూర్తయ్యి తీర్పు వెలువడటం- న్యాయవితరణ సత్వరం జరగాలన్న రాజ్యాంగ ప్రమాణాలకు పట్టంకట్టేదే. దేశవ్యాప్తంగా తాజా, మాజీ ప్రజాప్రతినిధులపై నమోదైన అన్ని కేసుల్లోనూ విచారణలు వేగవంతమై, అపరాధులుగా తేలిన నేతలకు త్వరగా శిక్షలు పడితేనే- నేర రాజకీయాల ధృతరాష్ట్ర కౌగిలి నుంచి దేశానికి విముక్తి లభిస్తుంది!

మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబ వారసుడైన ప్రజ్వల్- ధనబలంతో, అధికార మదంతో మాటల్లో వర్ణించలేని దారుణాలకు ఒడిగట్టాడు. అలాంటి ప్రబుద్ధ నేతావతారం ఇప్పుడేమంటున్నాడు? రాజకీయాల్లో వేగంగా ఎదుగుతున్నాననే అక్కసుతోనే తనను కేసుల్లో ఇరికించారని మొసలికన్నీరు కారుస్తున్నాడు. అక్రమాస్తులు పోగేసుకోవడం మొదలు హత్యలూ అత్యాచారాలకు తెగబడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులందరూ ఇలాగే తమకే పాపమూ తెలియదంటూ తెగ నటించేస్తుంటారు. ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం(ఏడీఆర్) నిరుటి నివేదిక ప్రకారం- దేశవ్యాప్తంగా 16 మంది ఎంపీలు, 135 మంది ఎమ్మెల్యేలు మహిళలపై దాష్టీకాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఏడీఆర్ క్రోడీకరించిన సమాచారం మేరకు 28 రాష్ట్రాలకు చెందిన 1861 మంది శాసనసభ్యులు, 251 మంది లోక్‌సభ ఎంపీలు వివిధ నేరాభియోగాలను నెత్తినమోస్తున్నారు. ఈ ఏడాది ఆరంభం నాటికి తాజా, మాజీ ప్రజాప్రతినిధులపై ఆసేతుహిమాచలం 4732 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అనర్హులను అందలాలు ఎక్కిస్తున్న నేరమయ రాజకీయాలు- మన ప్రజాస్వామ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిహాసాల పాల్జేస్తున్నాయి!

సమాజానికి ఆదర్శప్రాయులుగా ఉండాల్సిన నాయకులే నేరగాళ్లు అయితే ఆరాచకత్వం రాజ్యమేలుతుంది. వ్యక్తిత్వ హీనులు చట్టసభల్లోకి అడుగుపెడితే- ప్రజాప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంది. దాన్ని నివారించాలంటే- కేంద్ర ప్రభుత్వం గతంలో సూచించినట్లు, ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు కాలపరిమితి విధించాలి. నిర్దేశిత గడువులోగా ఆ కేసులన్నీ కొలిక్కి వచ్చేలా వ్యవస్థాగత సంస్కరణలు తీసుకురావాలి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దర్యాప్తులను ప్రభావితం చేస్తూ, వాయిదాలతో వ్యాజ్యాలను దశాబ్దాల పాటు నడిపించే కళంకిత నేతలను కట్టడి చేయకపోతే- ప్రజాధన దోపిడీపర్వాలు ఆగవు. అయిదేళ్లు, అంతకు మించి శిక్షార్హమైన కేసుల్లో నిందితులైన నాయకులపై సునిశిత న్యాయసమీక్ష అనంతరం నేరాభియోగాల నమోదు దశలోనే అనర్హత వేటు వేయాలని లా కమిషన్ లోగడ సిఫార్సుచేసింది. అది ఆచరణ రూపం దాలిస్తేనే- గెలుపు గుర్రాల పేరిట నేరచరిత నేతలకు ఎన్నికల్లో అభ్యర్థిత్వాలు కట్టబెడుతున్న పార్టీలకు పగ్గాలు పడతాయి!



నా కామిక్స్‌లో పాత్రలు సూపర్‌హీరోల్లా గాల్లో ఎగరడం, కళ్లు మూసి తెరిచేలోపు మాయమైపోవడం లాంటి అసాధ్యమైన పనులు చేయవు. నా పాత్రల బలం కామన్‌సెన్స్. సమస్యలను తెలివిగా పరిష్కరించుకోవడం ఎలాగో చెబుతాయి.

– ప్రాణ్ కుమార్ శర్మ, ప్రసిద్ధ కార్టూనిస్ట్

అనిశ్చిత వాతావరణంలో కొత్త పొద్దు

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈలోగానే ఇండియాపై ట్రంప్ సుంకాలు విధించడంతో పాటు దురుసు వ్యాఖ్యలెన్నో చేశారు. అయితే, అంతకు కొన్ని రోజుల ముందే భారత్, బ్రిటన్‌ల మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇది రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించడమే కాకుండా, వ్యూహపరమైన బంధాన్నీ పటిష్ఠం చేయనుంది.



కొవిడ్ తరవాత ప్రపంచార్థికం నెమ్మదిగా కోలుకుంటున్న తరుణంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్-ఇరాన్ యుద్ధం, ట్రంప్ సుంకాల సమరం వచ్చిపడి పరిస్థితిని అనిశ్చితం చేస్తున్నాయి. ఇలాంటి సందర్భంలో బ్రిటన్ వంటి ప్రధాన పాశ్చాత్య దేశంతో భారత్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం(సెటా) కుదుర్చుకోవడం సరైన సమయంలో వేసిన సరైన అడుగు అని చెప్పాలి. బ్రిటన్ మార్కెట్‌లోకి ప్రాధాన్యతా ప్రాతిపదికపై భారతీయ వస్తుసేవల ప్రవేశించడానికి వీలు కల్పించే ఒప్పందమిది. ఇది భారత విదేశాంగ విధానానికి బలిమి చేకూరుస్తుంది. ఈ ఒప్పందం బ్రిటన్‌కూ ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. మన దేశం నుంచి అక్కడికి ఎగుమతి అయ్యే వస్త్రాలు, పాదరక్షలు, తివాచీలు, మత్స్య ఉత్పత్తులు, పండ్ల వంటి మినహాయింపులపై 99శాతం సుంకాల మినహాయింపు లభిస్తుంది. ఏవో కొన్ని సరకులు మినహా దాదాపు భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులన్నీ సుంకాలు లేకుండానే బ్రిటన్ మార్కెట్‌లోకి ప్రవేశించగలుగుతాయి. బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చే స్కాచ్ విస్కీ, లగ్జరీ కార్ల వంటి ఖరీదైన వస్తువులపై సుంకాలను తొలగించడం వల్ల అవి నానాటికి విస్తరిస్తున్న భారతీయ మధ్యతరగతికి ఆకర్షణీయమవుతాయి.

స్టార్మర్ ప్రణాళికకు ఊతం

భారత్, బ్రిటన్‌ల మధ్య కస్టమ్స్ విధానాలను 'సెటా' సరళీకరించి, నియంత్రణపరమైన అడ్డంకులను తొలగిస్తుంది. దాంతో ఉభయ దేశాల ఎగుమతిదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. బ్రిటన్‌లోని పలు ప్రాంతాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాలు వృద్ధి చెందుతాయి. భారతీయ ఎగుమతి చేయడానికి ఉద్దేశించిన బ్రిటిష్ వస్తుసేవల తయారీ యూనిట్లకిక 60లక్షల పౌండ్ల కొత్త పెట్టుబడులు ప్రవహిస్తాయని అంచనా. బ్రిటన్‌లో అంతర్భాగమైన ఉత్తర ఐర్లాండ్‌లో ఇంజినీరింగ్, విస్కీ ఉత్పత్తి, టెక్నాలజీ, సర్వీసు రంగాలకు అయిదు కోట్ల పౌండ్ల అదనపు వ్యాపార లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం 150వరకు ఉత్తర ఐరిష్ కంపెనీలు భారత్‌కు ఎగుమతులు చేపడుతున్నాయి. వాణిజ్య ఒప్పందం వల్ల మరిన్ని కొత్త కంపెనీలు రావచ్చు. వేల్స్ ప్రాంతం కూడా ఇండియా, పారిశ్రామిక రంగాల్లో ఎనిమిది కోట్ల పౌండ్ల ఆర్థిక ప్రయోజనాలను పొందనుంది. బ్రిటన్ లేబర్ ప్రభుత్వ సారథి, ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ చేపట్టిన 'మార్పు కోసం ప్రణాళిక'లో భారత్‌తో సెటా ఒప్పందం ప్రధానమైంది. మిత్ర దేశాలతో ప్రగతిశీల ఆర్థిక భాగస్వామ్యాలను కుదుర్చుకోవాలన్న స్టార్మర్ ప్రణాళికను ఇది ముందుకు తీసుకెళ్తుంది. ముఖ్యంగా ఐరోపా సమాఖ్య నుంచి వైదొలగిన బ్రిటన్ ఆర్థిక పునరుజ్జీవానికి కీలక సాధనమవుతుంది.

భద్రత, వలసలు, టెక్నాలజీ...

ఒప్పందంలో ఆర్థిక సంబంధాల తరవాత అత్యంత ముఖ్యమైన అంశం- సంఘటిత నేరగాళ్ల ముఠాలను, అక్రమ వలసలను అరికట్టడం. మానవ అక్రమ రవాణాతో పాటు పాస్‌పోర్ట్, వీసా, ఇతర ధ్రువీకరణ పత్రాల్లో గోల్‌మాల్‌ను నిరోధించాలనీ... అక్రమ వలసదారులను, సంఘటిత నేరగాళ్లను తిప్పిపంపే విధివిధానాలను క్రమబద్ధీకరించాలని రెండు దేశాలు నిశ్చయించాయి. దేశాల సరిహద్దులను దాటుతున్న ఈ తరహా నేరాలను ఉమ్మడిగా ఎదుర్కోవాలని లక్షిస్తున్నాయి. 'సెటా' ఆర్థిక కోణానికి పరిమితమైతే, 2021లో ప్రకటితమైన భారత్-బ్రిటన్ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం రక్షణ, విద్య, వాతావరణ మార్పుల నిరోధం, అధునాతన సాంకేతికతల్లో పరస్పర సహకార వృద్ధికి పాటుపడుతోంది.

2023లో కుదిరిన భారత్-బ్రిటన్ సాంకేతిక సహకార ఒప్పందం భావి కమ్యూనికేషన్ పరిజ్ఞానాలపై రెండు దేశాలూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రతిపాదించింది. ఈ రంగంలో సంయుక్త పరిశోధనకు 70లక్షల పౌండ్లు కేటాయించారు. ఈ పరిశోధన ఫలంగా ఉభయ దేశాలు ఓపెన్ రాన్, 5జీ, 6జీ టెస్ట్ బెడ్‌లను రూపొందించాయి. క్వాడ్ భాగస్వాములుగా ఇండో-పసిఫిక్‌లో భద్రమైన, పారదర్శకమైన, ప్రజాతంత్ర డిజిటల్ యంత్రాంగాన్ని నిర్మించడానికి కట్టుబడి ఉన్నాయి. కృత్రిమ మేధ, కీలక ఖనిజ వనరుల సరఫరా గొలుసులు, మహిళా కేంద్రిత(ఫెమ్‌టెక్) ఆరోగ్య సాంకేతికతల అభివృద్ధిలోనూ పాలుపంచుకుంటున్నాయి. ఉమ్మడిగా నవీకరణ పథంలో పురోగమిస్తున్నాయి.

ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వాహనాలు, హరిత ఇంధనాలు, హైటెక్ పారిశ్రామికోత్పత్తి రంగంలోనూ భారత్-బ్రిటన్ చేతులు కలిపాయి. బ్రిటన్ నుంచి ఇండియా దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై సుంకాలు తగ్గించడం ఎంతో సానుకూల పరిణామం. ప్రస్తుతం వైద్య పరికరాలు, బల్క్‌డ్రగ్స్ కోసం చైనాపై ఇండియా అతిగా ఆధారపడుతోంది. దీన్ని తగ్గించుకోవడానికి బ్రిటన్‌తో ఒప్పందం తోడ్పడుతుంది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫార్మా దిగుమతులపై వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తున్నారు. దీనివల్ల అమెరికాకు మన ఫార్మా ఎగుమతులు తగ్గే ప్రమాదమున్నా, బ్రిటన్‌తో వైద్య రంగంలో సహకార వృద్ధి భారత్‌కు ప్రయోజనకరం కానుంది.

భౌగోళిక రాజకీయాల ప్రభావం...

అమెరికాలో ట్రంప్ సర్కారు ఏర్పడినప్పటి నుంచి సంపన్న పారిశ్రామిక దేశాల సంఘమైన జీ7లో పరిస్థితి సజావుగా లేదు. దాంతో అమెరికాపై అతిగా ఆధారపడటం మంచిది కాదని పాశ్చాత్య సంపన్న దేశాలు గ్రహిస్తున్నాయి. చైనాతో బంధాన్ని పెంచుకోవడానికి సైద్ధాంతిక భేదం అడ్డువస్తోంది. కనుక ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు సన్నిహితం కావడం మేలనే నిర్ణయానికి వస్తున్నాయి. అదీ కాకుండా ఐరోపా, అమెరికా పరిశ్రమలు చైనా నుంచి ఉత్పత్తి కార్యకలాపాలను తరలిస్తున్నాయి. భారతదేశ సువిశాల మార్కెట్ వాటికి ఆకర్షణీయంగా కనిపిస్తోంది. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలతో స్వయంగా అగ్ర పారిశ్రామిక శక్తిగా అవతరించాలని భారత్ లక్షిస్తోంది. ఇక్కడ తమకు వ్యాపార అవకాశాలు పుష్కలమని బ్రిటన్ గ్రహించినందునే ఉభయ దేశాల మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదిరింది.



డాక్టర్ వివేక్ మిశ్రా
డిప్యూటీ డైరెక్టర్,
అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్



ఫోకస్... ఉండాలి బాస్!

ఈ మధ్య కొడుకు ఎందుకో మూడీగా ఉండటం గమనించాడు తండ్రి. ఓరోజు భోజనం తరవాత టీవీ చూస్తూ కూర్చున్న కొడుకు పక్కకు వెళ్లి టీవీ కట్టేసి కబుర్లు చెబుతూ అసలు విషయం అడిగాడు. ఇంకేముంది... ఒక్కసారిగా బరస్ట్ అయ్యాడు కొడుకు.

'పాతికేళ్లు దాటాయి.. నా క్లాస్‌మేట్లూ, జూనియర్లు ఏడాదికి పన్నెండు లక్షలు, పద్నాలుగు లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు చేస్తున్నారు. కార్లలో తిరుగుతూ వీకెండ్స్‌లో మాల్స్‌లో షాపింగులూ పబ్బుల్లో పార్టీలు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. నాకేమైంది నాన్నా.. టెంత్‌లో క్లాస్ టాపర్‌ని. ఎంసెట్‌లో స్టేట్ ర్యాంకర్‌ని. ఇంజినీరింగ్‌లో 80 పర్సెంట్ తెచ్చుకున్నా. పొలం పనులు చేస్తా, డ్రైవింగ్ వచ్చు. ఇన్ని పనులొచ్చినా నా సంపాదన ఇంతని చెప్పుకోవడానికి లేదు. నాదో ఫెయిల్యూర్ స్టోరీలాగా ఉంది' అని బోరుమన్నాడు అబ్బాయి.

కొడుకు భుజం తట్టి సముదాయిస్తూ 'నేను మల్టీ టాలెంటెడ్‌ని అని మురిసిపోతున్నావు కానీ అదే నీకు శాపం' అన్నాడు తండ్రి. 'అదేంటి నాన్నా.. ఎక్కువ పనులొస్తే మంచిదని, ఏదో ఒకటి చేసుకుని బతకొచ్చని అందరూ అంటుంటారు కదా?' అడిగాడు కొడుకు. 'నిజమే. నీకు ఎన్ని నైపుణ్యాలున్నా.. లక్ష్యం ఒకటే ఉండాలి. అన్నీ వచ్చినా లక్ష్యసాధనకు ఏదీ ఉపయోగపడకపోతే ఏంటి లాభం? నీ ఫ్రెండ్స్ నీ అంత బాగా చదవకపోవచ్చు. కానీ వాళ్లందరికి మంచి ఉద్యోగమే లక్ష్యం. దానికనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగం సాధించారు. నువ్వు అలా కాదు కదా. వస్తే జాబ్ చేస్తా. లేకపోతే వ్యవసాయం చేస్తా. అదీ కుదరకపోతే డ్రైవర్‌గా అయినా బతకగలను అని నీకు ధీమా. అందుకే దేనిమీదా దృష్టి పెట్టలేదు. అన్ని పనులు నేర్చుకోవడం తప్పు కాదు కానీ ప్రధానంగా ఒకదాని మీద ఫోకస్ అవసరం. చాలా ఆప్షన్లు ఉండటం వల్ల అన్నిటి మీదా సమయాన్ని వృథా చేసుకుంటున్నావు. ఏ ఊరైనా వెళ్లాలంటే దగ్గరి దారి వెతుక్కుని నేరుగా వెళ్తామా? డ్రైవింగ్ వచ్చని, అన్ని రోడ్లూ తెలుసని కాసేపు తూర్పు, కాసేపు పడమరా... తిరుగుతామా? 'జాక్ ఆఫ్ ఆల్ ట్రేడ్స్ మాస్టర్ ఆఫ్ నన్' అంటారు నీలాంటి వాళ్లనే. దాన్ని మాస్టర్ ఆఫ్ వన్ అని మార్చుకో. నీకేం కావాలో, దానికి నీకున్న సామర్థ్యాల్లో ఏది ఉపయోగపడుతుందో తెలుసుకుని దానిమీద ఫోకస్ చెయ్యి. అప్పుడు నీదీ ఒక గెలుపు కథ అవుతుంది. అంతేకానీ ఇతరులతో పోల్చుకుని బాధపడకు' అనునయంగా చెప్పాడు తండ్రి.

'అర్థమైంది నాన్నా. నాకు ఉద్యోగం కన్నా వ్యవసాయమే ఇష్టం. కానీ అందులో రాణించలేనేమోనని భయపడేవాణ్ని. ఇప్పుడు నా ఆలోచనల్లో స్పష్టత వచ్చింది. వ్యవసాయానికి టెక్నాలజీని జత చేసి నన్ను నేను నిరూపించుకుంటాను...' ఆత్మవిశ్వాసంతో చెబుతున్న కొడుకుని గుండెలకు హత్తుకున్నాడు తండ్రి.

– పంగా సాంబశివారెడ్డి

క్షమిస్తే... పోయేదేముంది!

క్షమాగుణం అనేది భగవంతుడు మనిషికి ప్రసాదించిన అత్యుత్తమ వరం. అత్యున్నత ఆధ్యాత్మిక గుణం. సంప్రదాయ, ధార్మిక, మానసిక, సామాజిక కోణాలలో చూడాల్సిన గొప్ప శక్తి. క్షమ మనిషి హృదయ ఔన్నత్యానికి ప్రతీక. మనకు ఎవరైనా బాధ కలిగించినా, అవమానించినా, అన్యాయం చేసినా అవేవీ మనసులో పెట్టుకోకుండా మనస్ఫూర్తిగా మన్నించడమే క్షమాగుణం. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ దైవీగుణాలలో ఒకటిగా చెబుతూ క్షమాగుణం భక్తుడి లక్షణం అంటాడు.

రాముడు ఎంతటి శత్రువునైనా తన ధర్మానికి భంగం కలుగకుండా క్షమించాడు. ఏడు రోజులు భీకరంగా యుద్ధం చేసి రావణుడు పడిపోయాడు. అతడికి అంతిమ సంస్కారం చేయమని విభీషణుణ్ని ఆదేశించాడు శ్రీరాముడు. రావణుడి లాంటి దుర్మార్గుడికి అంత్యక్రియలు చేయడానికి తనకు మనసు రావడం లేదన్నాడు విభీషణుడు. వెంటనే రాముడు స్నేహితుడి సోదరుడు తనకూ సోదరుడితో సమానమని విభీషణుడు కాకపోతే తానే ఆ పనిచేస్తానని చెబుతాడు. అదీ శ్రీరాముడు మనకు బోధించిన ధర్మం. ఒక వ్యక్తి జీవించి ఉండగా ఎన్ని దుర్మార్గపు పనులు చేసినా ప్రాణం పోగానే ఆ వైరం కూడా సమసిపోతుందన్న రాముడి ప్రబోధం క్షమాగుణం విశిష్టతను తెలుపుతుంది.



అంతర్యామి

బుద్ధుడు క్షమని అహింసకు మార్గంగా చూశాడు. జైనులు ఏటా 'క్షమాపణ పర్వం' జరుపుకొంటారు. ఆ సందర్భంగా ప్రతి ఒక్కరు తనవల్ల ఎవర్నికైనా కలిగిన బాధకు క్షమాపణ చెబుతారు. క్షమ మనసుకు శాంతినిస్తుంది. మదిలో ద్వేషాన్ని నింపుకోవడం అంటే చేతిలో నిప్పును పట్టుకున్నట్లే. మన్నించడంవల్ల మనసు తేలికపడి ప్రశాంతత వస్తుంది. ప్రతీకారం రక్తపాతానికి దారితీస్తే, క్షమాగుణం సమాజాన్ని శాంతి దిశగా నడిపిస్తుంది. 'క్షమ అనేది బలహీనత కాదు. బలమైన వాడి లక్షణం' అన్నారు మహాత్మాగాంధీ. తప్పు చేసినవారిని శిక్షించేకన్నా, మన్నించి ప్రేమిస్తేనే వారి మనసులు మారతాయన్నారు స్వామి వివేకానంద. క్షమ, తపస్సులతోనే భగవంతుణ్ని సులభంగా పొందగలం అని యజుర్వేదం చెబుతోంది.

సాధన ద్వారా క్షమాగుణాన్ని మనం సాధించాలి. మన్నించగలగడం మన ఆధ్యాత్మిక ప్రగతికి మార్గం. దానివల్ల మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గి మనసుకు ప్రశాంతత లభిస్తుంది. నిద్ర మెరుగుపడి, మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. క్షమాగుణం ఒక్కసారిగా వచ్చేది కాదు. ప్రవచనాలు వినడం, ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడం, ధ్యానం తదితరాల ద్వారా సాధన చెయ్యాలి. శివపురాణంలో చెప్పినట్లుగా క్షమయే పరమధర్మం. అదే అంతిమ శాంతి మార్గం. క్షమాగుణం కలవారిని భగవంతుడు అనుగ్రహిస్తాడని శివపురాణం విశదీకరించింది. క్రోధాన్ని వదిలి క్షమాగుణాన్ని భూషణంగా ధరించిన భక్తుడు భగవంతుడికి ప్రీతిపాత్రుడు అవుతాడు.

– తల్లాప్రగడ గోపాలకృష్ణ



విస్తరిస్తున్న సూక్ష్మసేద్యం

వాతావరణ మార్పుల వల్ల కొన్నిచోట్ల వానలు ఎక్కువగా కురుస్తుంటే, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకుంటూ అధిక దిగుబడి సాధించడానికి సూక్ష్మసేద్యం (మైక్రో ఇరిగేషన్) ఎంతో తోడ్పడుతుంది. బిందు(డ్రిప్), తుంపర(స్ప్రింక్లర్) సేద్యాలు ఇందులో భాగమే. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై)లో భాగంగా 'పర్ డ్రాప్ మోర్ క్రాప్-పీడీఎంసీ' (ప్రతి నీటిబొట్టుకు అధిక ఫలసాయం) నినాదంతో మైక్రో ఇరిగేషన్‌ను కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో గడిచిన అయిదేళ్లలో దేశీయంగా 53 లక్షల హెక్టార్ల సాగునేల సూక్ష్మసేద్యం కిందకు వచ్చింది. కర్ణాటకలో అత్యధికంగా అది 13.52 లక్షల హెక్టార్ల మేర ఉంటే, తరవాతి స్థానాల్లో రాజస్థాన్ (6.90 లక్షల హెక్టార్లు), తమిళనాడు (6.20), గుజరాత్ (5.37) ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 3.05, తెలంగాణలో 1.24 లక్షల హెక్టార్ల సాగునేల సూక్ష్మసేద్యం కింద ఉంది. పీడీఎంపీ కింద గత అయిదు ఆర్థిక సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా మైక్రో ఇరిగేషన్ కిందకు వచ్చిన సాగుభూమి... (లక్షల హెక్టార్లలో)

2020–21	9.37
2021–22	10.15
2022–23	11.02
2023–24	11.41
2024–25	11.19

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

క్రీడా రంగానికి నవ జవసత్వాలు

'భారత్‌లో క్రీడా ప్రతిభకు కొదవలేదు కానీ... ఆ ప్రతిభను వెలికితీసి సానబట్టి ప్రపంచానికి పరిచయం చేసే వ్యవస్థే బలంగా లేదు'- ఎప్పటి నుంచో వింటున్న మాట ఇది. ఇప్పుడా వ్యవస్థను పటిష్ఠం చేయడానికి కేంద్రం సంకల్పించింది. క్రీడాకారులకు వెన్నుదన్నుగా నిలవడం ద్వారా ఆటల్లో దూసుకెళ్లే సమున్నత లక్ష్యంతో ఇటీవలే జాతీయ క్రీడా విధానానికి పచ్చజెండా ఊపింది. ఇది అవినీతికీ, రాజకీయాలకూ తావులేకుండా సక్రమంగా సాగితే- భారతీయ క్రీడా రంగం మరెన్నో విజయాలను సాధించగలుగుతుంది.

రానున్న పదేళ్లలో ఆటల్లో భారత్‌ను టాప్-5 దేశాల్లో ఒకటిగా నిలపాలని కేంద్రం సంకల్పించింది. అందుకోసమని నీతి ఆయోగ్, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ క్రీడా సంఘాలు, అథ్లెట్లు, నిపుణుల సలహాలతో కొత్త జాతీయ క్రీడా విధానాన్ని రూపొందించింది. అంతర్జాతీయ స్థాయిలో మెరుగుపడమే ప్రధాన లక్ష్యంగా 'ఖేలో భారత్ నీతి-2025' పేరుతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇటీవలే దీనికి క్యాబినెట్ ఆమోదం కూడా లభించింది. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి పోడియంపై నిలబెట్టడం ఈ విధానం వెనకున్న బృహత్ సంకల్పం. క్రీడా విధానాన్ని ఇలా వ్యూహాత్మక, నిర్మాణాత్మక, ఆచరణాత్మక పద్ధతిలో రూపొందించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

గురి 2036 ఒలింపిక్స్‌పైనే...

నూతన జాతీయ క్రీడా విధానం ద్వారా ఒలింపిక్స్, కామన్వెల్త్ లాంటి పెద్ద క్రీడల్లో సత్తా చాటడం, హై పెర్ఫార్మెన్స్ సెంటర్లను నెలకొల్పడంతో పాటు అంతర్జాతీయ పోటీకి తగ్గట్లు క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. క్రీడోత్పత్తుల తయారీ, ఉపాధి కల్పన, పర్యాటకం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నదీ ఇందులో భాగమే. మహిళలు, గిరిజన, దివ్యాంగ క్రీడాకారులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. దేశవ్యాప్తంగా ఫిట్‌నెస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమూ నిర్దేశించుకున్న లక్ష్యాల్లో ఒకటి. అయితే, ఈ కొత్త విధానం పకడ్బందీ అమలుకు పెద్దయెత్తున నిధులు అవసరమవుతాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో క్రీడలకు రూ.3794 కోట్లు ప్రత్యేకించారు. గతేడాది కంటే ఇది రూ.350కోట్లు అదనం. కానీ, ఈ నిధుల నుంచి ఒక్క ఖేలో ఇండియా పథకానికే వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ముఖ్యంగా 'ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్' కార్యక్రమం కింద 174 ప్రతిభ గణన కేంద్రాల ద్వారా 9-18 వయసున్న పిల్లల్లో నైపుణ్యాల స్థాయిని పరీక్షిస్తారు. భారత్ 2036లో ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యమివ్వాలన్న సంకల్పంతో ఉంది. ఆ దిశగా వేసిన తొలి అడుగే ఈ కొత్త క్రీడా విధానం. 2036 ఒలింపిక్స్ నిర్వహణకు తాము సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి భారత్ తెలియజేసింది.





విశ్వ క్రీడలను నిర్వహించాలంటే ఎంపిక చేసిన నగరాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. ఇప్పటి నుంచే స్టేడియాలు నిర్మించాలి. క్రీడా ప్రాంగణాలను అధునాతనంగా తీర్చిదిద్దడం మరీ ముఖ్యం. మరోవైపు, అప్పటికల్లా ప్రపంచస్థాయి క్రీడల్లో భారత్‌ను ఓ బలమైన శక్తిగా నిలపాలి. అందుకు నాణ్యమైన కోచింగ్ వ్యవస్థ కావాలి. పల్లెల నుంచి పట్టణాల వరకు క్రీడల సంస్కృతి బలంగా నాటుకుపోవాలి. చిన్న గ్రామాల నుంచీ ఛాంపియన్లు పుట్టేలా ఈ రంగాన్ని తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఇది ఒక్కరోజులో వచ్చే మార్పు కాదు. దేశీయంగానే కాకుండా విదేశాల్లోనూ శిక్షణ పొందుతున్నా భారత క్రీడాకారులు ఒలింపిక్స్‌లో ఇప్పటికీ తడబడుతున్నారు. మన దేశం పదిలోపు పతకాలకే పరిమితమవుతోంది. పోటీపడే క్రీడాకారులు, పతకాల సంఖ్య పెరగాలంటే అట్టడుగు స్థాయి నుంచీ ప్రక్షాళన జరగాలి. ఆ దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా రాష్ట్ర క్రీడా పాలసీని ప్రకటించడం హర్షించదగ్గ పరిణామం. రాజకీయ జోక్యం లేకుండా క్రీడలను అభివృద్ధి చేయడం, మౌలిక వసతులు కల్పించడం వంటి చర్యల ద్వారా ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గే క్రీడాకారులను తయారు చేసుకోవాలన్నది ఇందులో భాగం.


మాజీ ఆటగాళ్ల చొరవ కీలకం

నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించి సానబట్టడమే కాకుండా, ఆర్థిక ఆసరా కల్పించి వారిని ముందుకు తీసుకెళ్లాలి. ఏదో ఒక దశలో వారిని వదిలేస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. అందుకే ఇలాంటి క్రీడాకారులను 'ఒలింపిక్ పతక లక్ష్య కార్యక్రమం(టాప్స్)' లాంటి పథకాల్లో చేర్చాలి. మాజీ ఆటగాళ్లు యువ క్రీడాకారులను తీర్చిదిద్దడానికి చొరవ తీసుకోవాలి. అమెరికా, చైనాలో మాదిరిగా ప్రతి క్రీడాకారుడికీ ప్రాథమికంగా ఒకటి కంటే ఎక్కువ ఆటల్లో శిక్షణ ఇచ్చి, వారు ఎందులో బలంగా ఉన్నారో గుర్తించాలి. తరవాత వారిని ఆ ఆటలోనే కొనసాగించాలి. ఐరోపా దేశాల్లోలా పార్కుల్లోనే స్కేటింగ్ రింక్ లాంటి సౌకర్యాలు కల్పించి శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించవచ్చు. ఖేలో ఇండియా, జాతీయ క్రీడలను మరింత పకడ్బందీగా నిర్వహించాలి. ఇందుకు రాష్ట్ర క్రీడా సంఘాలకు ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటు అందివ్వాలి. ఆటల్లో రాజకీయ జోక్యం తగ్గితేనే మన దేశం ముందుకెళ్లే అవకాశం ఉంటుంది. లేకపోతే రెజ్లింగ్ మాదిరిగా పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయ్యే ప్రమాదముంది.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

తేలు బుద్ధి!

సుందరవనం పక్కన నదికి పెద్ద వరద వస్తోంది. అక్కడ అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు వేచి చూస్తోంది ఒక తేలు. అప్పుడే తాబేలు నదిలోకి వెళ్లబోతోంది. అది చూసిన తేలు.. 'తాబేలు మామా! మా వాళ్లంతా అవతలి ఒడ్డున ఉన్నారు. నదిని ఒక్కదాన్నే దాటలేను. నన్ను నీతోపాటు తీసుకెళ్లి అక్కడ వదిలిపెడతావా?' అని అడిగింది. కాసేపు ఆలోచించిన తాబేలు సరేనంటూ వీపు మీద ఎక్కించుకుని బయల్దేరింది. కొద్ది దూరం వెళ్లగానే మెల్లగా తాబేలును కుట్టింది తేలు. అది ఏమీ అనకపోయేసరికి మళ్లీ మళ్లీ కుడుతూనే ఉంది. దాంతో తాబేలు.. 'మిత్రమా! నువ్వు చేస్తుంది సరైన పని కాదు. అడిగావు కదా అని సాయం చేస్తున్నాను. అదేమీ పట్టనట్టు కుడుతున్నావేంటి?' అంది. 'నీకు ఎంతశక్తి ఉందో చూద్దామని కుట్టాను. ఎన్నిసార్లు కుట్టినా కాస్త కూడా ఇబ్బంది లేకుండా ఉన్నావు.



హాయ్! బుజ్జీ!!

అయినా ఎవరినైనా కుట్టడం నా సహజ లక్షణం' అంటూ మళ్లీ కుట్టిందా తేలు. ఆ మాటలు విన్న తాబేలుకు చాలా కోపం వచ్చింది. దాంతో.. 'అవునా! నీ అలవాటు ప్రకారం నువ్వు కుడితే.. అలసిపోయినప్పుడు నీళ్లలో మునిగి ఈదడం నా అలవాటు' అంటూ ఒక్కసారిగా నీళ్ల లోపలికి వెళ్లింది తాబేలు. అలాగే వెళ్లి కాసేపటికి ఒడ్డుకు చేరుకుంది. పొందిన సాయానికి కృతజ్ఞత లేకుండా ప్రవర్తించిన తేలు.. ఆ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. మన మాటలు, పనులతో ఇతరులను ఇబ్బంది పెడితే తేలు లాంటి పరిస్థితే వస్తుంది.

– డా॥ బెల్లంకొండ నాగేశ్వరరావు

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని జత చేయండి చూద్దాం.

పాత్ర	మతి	ప్రసాదం	చిలుక
తోట	గాలి	విద్యా	కాయ
శాఖ	అను	నీళ్లు	రామ
తీర్థ	వెండి	కారు	బంతి
చల్ల	రంగు	అరటి	మబ్బులు

మహోన్నతుడు.. మండలి వెంకట కృష్ణారావు

తుమ్మలపల్లిలో శత జయంతి వేడుకలు

ఈనాడు, అమరావతి: 'ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప త్యాగమూర్తి... మండలి వెంకట కృష్ణారావు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు, వక్తలు కొనియాడారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా చంద్రబాబు హాజరై.. కృష్ణారావు జీవిత విశేషాల ఛాయాచిత్ర మాలికను వీక్షించారు. కృష్ణారావు జీవిత విశేషాలతో కూడిన 'లైట్ హౌస్ ఇన్ ద స్టార్' స్మృతి సంచికను, 'ఆదర్శ నేత.. అజాతశత్రువు' పుస్తకాన్ని, మండలి జీవిత విశేషాలను ప్రతిబింబిస్తూ గీసిన ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొండా ఉమా, శ్రీరాం రాజగోపాల్, యార్లగడ్డ వెంకట్రావు, ఆధ్యాత్మికవేత్త విశ్వయోగి విశ్వంజీ, సీనియర్ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.



మండలి కృష్ణారావు జీవిత విశేషాల ఛాయా చిత్రమాలికను వీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, బుద్ధప్రసాద్

అపూర్వ సత్కారం: పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గరికపాటి నరసింహారావు, అన్నవరపు రామస్వామి, సుమతీ రామ్మోహన్‌రావు, యడ్లపల్లి వెంకటేశ్వరరావులను సత్కరించారు. తర్వాత మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సంచికను ఆవిష్కరించారు.



పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గరికపాటి నరసింహారావు, అన్నవరపు రామస్వామి, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, సుమతీరామ్మోహన్‌లను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గాంధేయవాదానికి నిలువెత్తు నిదర్శనం

ఇది కృష్ణారావుకు మాత్రమే జరుగుతున్న శత జయంతి ఉత్సవం కాదు.. గాంధేయవాదానికి, ఆదర్శాలకు, నిలువెత్తు నిరాడంబరతకు జరుగుతున్న శత జయంతి. ఆయనలో మంచితనం గడ్డ కట్టడం వల్ల ఆయన అవనిగడ్డలో పుట్టారు. ఆయన గాంధీ ఆశయాలను, ఆదర్శాలను ఆచరించారు. ఎప్పుడూ వేళ పదవి అడ్డం కట్టి ప్రజాసేవకు దూరం కాలేదు. త్యాగం చేసి అమృతత్వాన్ని పొందారు. ఆచరించారు.

- గరికపాటి నరసింహారావు, ప్రవచనకర్త

ప్రాజెక్టుకు కృష్ణారావు పేరు పెట్టాలి

ఇది విశ్వజనీన సువాసనలు వెదజల్లే సభ. మండలి నాస్తికుడని అందరూ అనుకుంటారు. ఆయన నిజమైన.. ఆస్తికుడు. మనిషి, భర్త, బాధ్య, నాయకుడు ఎలా ఉండాలో చెప్పే సనాతన ధర్మాన్ని ఆచరించిన వాడే.. కృష్ణారావు. ప్రజలకు, ప్రకృతికి సేవ చేస్తే కోటి దేవుళ్లకు పూజ చేసినట్టే.. ఈ రెండూ చేసిన కృష్ణారావు కీర్తి అజరామరం. రాష్ట్రంలో ఏదో ఒక ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలి.

- విశ్వంజీ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త

నాన్న జీవితం... జాతికే అంకితం - మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే

మా నాన్న వెంకట కృష్ణారావు చనిపోయే ముందు కూడా ప్రజాసేవ, తెలుగు భాషాభివృద్ధి గురించే ఆలోచించారు. తన జీవితమంతా జాతికే అంకితం చేశారు. ఆయనకు ఉన్నదంతా పేదలకు పంచేశారు. ఏరోజూ డబ్బు గురించి ఆలోచించలేదు. పింఛను కూడా తీసుకోలేదు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ప్రమిలించిన వద్దన్నారు. మంత్రి హోదాలోనూ బస్సులోనే ప్రయాణించారు. ఆదర్శంతోనే జీవించారు. చనిపోయే ముందు కూడా తాను పుట్టిపెరిగిన ఊరు... పులిగడ్డ-పెనుమూడి వంతెన నిర్మాణం జరగాలి. విశాఖలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాలని కోరుకున్నారు. వాటిలో వంతెన కలను చంద్రబాబు సాకారం చేశారు.



సభకు హాజరైన అభిమానులు, ప్రజలు

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు



కానుకల లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. మొత్తం 19 రోజులకు రూ. 3,34,70,370 ఆదాయం వచ్చింది. వీటితో పాటు 265 గ్రాముల బంగారం, 7.110 కిలోల వెండి వస్తువులు, 707 అమెరికా, 130 ఇంగ్లాండ్, 255 ఆస్ట్రేలియా, 60 సింగపూర్, 100 కెనడా డాలర్స్, 13 కువైట్ దీనార్లు, 11 సౌదీ రియల్స్ లభించాయి. కానుకల లెక్కింపును ఆలయ ఈవో శీనానాయక్, సహాయ కమిషనర్ రంగారావు పర్యవేక్షించారు.

గతి తప్పిన.. రాజమార్గం

కనకదుర్గానగర్‌ను ఇరుకుగా మార్చేశారు

దసరాల్లో భక్తుల రాకపోకలకు ఇబ్బందే

ఈనాడు, అమరావతి



ప్రస్తుతం ఒకవైపు ఎలివేటెడ్ క్యూలైన్, మరోవైపు దుకాణాలు, మధ్యలో కిక్కిరిసిన భక్తులు

"దుర్గగుడిలో భక్తులు దర్శనాలకు వచ్చి తిరిగి వెళ్లేందుకు.. ఒక్క ఘాట్ రోడ్డే ఉండడంతో ఇక్కట్లు తప్పడం లేదని.. 2016లో కొండ దిగువన కనకదుర్గానగర్‌ను భక్తుల రాకపోకల కోసమే పూర్తిగా విస్తరించారు. అక్కడ నిర్మాణాలన్నీ తొలగించి మరీ విశాలంగా మార్చారు. కొన్ని ప్రైవేటు నిర్మాణాలకు పరిహారం చెల్లించి.. విశాల మార్గం సమకూర్చారు. దానికి రాజమార్గం అని నామకరణం చేశారు. అటూఇటూ రెండు రాతి పెర్గోలాలను రూ.5 కోట్లతో తీర్చిదిద్ది ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా చేశారు. కనకదుర్గానగర్ మొత్తం.. విశాలంగా, ఖాళీగా ఉండడంతో దసరా, భవానీదీక్షలకు లక్షలాది భక్తులు వచ్చినా.. సాఫీగా రాకపోకలు సాగించారు."

మళ్లీ పదేళ్ల వెనక్కి...

వైకాపా ఏలుబడిలో.. కనకదుర్గానగర్‌ను అస్తవ్యస్తంగా మార్చేశారు. రాత్రికిరాత్రి పెర్గోలాలను పొక్లెయిన్లతో పెకలించి మరీ.. రూ.5 కోట్ల విలువైన రాళ్లను తీసుకెళ్లి మూలన పడేశారు. ఆ ప్రదేశమే కాక.. సగం రాజమార్గాన్ని పూర్తిగా మూసేసేలా.. ఎలివేటెడ్ క్యూలైన్ నిర్మాణం ఆరంభించారు. మరోవైపు అడ్డంగా దుకాణాలు పెట్టేశారు. ఈ రెండింటి మధ్యలో మిగిలిన ప్రాంతం నుంచే భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే.. సరిగ్గా వెయ్యి మంది భక్తులొస్తే.. అర్జునవీధిలో ఎటూ కదల్లేనంతగా కిక్కిరిసిపోతోంది. దసరా ఉత్సవాలు సమీపిస్తున్న వేళ లక్షల మంది తరలిరానున్నారు. రద్దీ నియంత్రణ.. కత్తి మీద సాములా మారనుంది.



నిర్మాణంలో ఉన్న అన్నదాన భవనం

ఎందుకూ పనికిరాదని తెలిసి కూడా...

ఎలివేటెడ్ క్యూలైన్ ఎందుకూ పనికిరాదనే విషయం దేవాదాయశాఖ సిబ్బంది మొత్తానికి తెలుసు. గతంలోనూ ఇలా ఎందుకూ పనికిరాని నిర్మాణాలను చాలానే కట్టడం.. తిరిగి వాటిని కూల్చడం.. మళ్లీ కట్టడం.. అనేకసార్లు చేశారు. ఇప్పటికీ దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం తీరు ఏమాత్రం మారలేదు. ఏకంగా రూ. 13 కోట్లు పైగా వెచ్చించి.. ఎలివేటెడ్ క్యూలైన్ ఎందుకు కడుతున్నారో ఉన్నతాధికారులకే స్పష్టత లేదు.



భక్తులు గతంలో దిగి వచ్చే మార్గంలో ప్రసాదాల తయారీ భవనం నిర్మాణం

ప్రస్తుతం నేలపై నుంచి వెళుతున్న భక్తులు.. ఇదికట్టాక దీని మీదుగా నడిచి వెళ్తారు. ఇంతకుమించి ఏ ఉపయోగం లేదు. వైకాపా హయాంలో.. నిధులను పక్కదారి పట్టించేందుకు.. అప్పటి దేవాదాయ శాఖ మంత్రి సిఫార్సులతో ఆదరాబాదరాగా.. ఎన్నికల ముందు ఈ ఎలివేటెడ్ క్యూలైన్ మంజూరు చేసి.. పునాదుల గోతుల వరకూ తవ్వారు. కూటమి సర్కారు వచ్చాక కూడా దీనిని ఎందుకు కొనసాగిస్తున్నారో అధికారులకే తెలియాలి. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా.. తెరవెనుక భారీ లాబీయింగ్ చేసి మరీ ఆపకుండా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.



నా కన్నా.. నేనున్నా..

విజయవాడలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్య విన్నవించుకోవడానికి వచ్చిన ఓ తల్లి తన బిడ్డ కాళ్లు కాలకుండా తన చెప్పులను ఆమెకు తొడిగి తాను మాత్రం కాళ్లు కాలుతున్నా భరించుకుంటూ వెళ్లింది. అమ్మ చెప్పులతో ఎండలో బుడిబుడి అగుడులు వేసుకుంటూ ముందుకు సాగిందా చిన్నారి.

- ఈనాడు, అమరావతి

ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకం రెపరెప

జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు



ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ భక్తిని పెంపొందించేలా జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా-2025 ప్రచార పత్రాలను నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8 వరకు పాఠశాలలు, అన్ని విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భవనాలను అలంకరించడం, విద్యార్థులకు తిరంగా రంగోలి, మేకింగ్ వర్క్‌షాప్‌లు, తిరంగా వేవ్స్ అండ్ ట్రెడ్స్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 9 నుంచి 12 వరకు తిరంగా మహోత్సవ్ పేరిట ప్రజాప్రతినిధులు, వీఐపీలు పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందులో డ్వాక్రా మహిళలతో తిరంగా కలర్ థీమ్‌తో ప్రత్యేక తిరంగా మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరంగా సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయడం, ఫొటోలను వెబ్‌సైట్ www.harghartiranga.com లో నమోదు చేయడం వంటివి ఉంటాయన్నారు. తిరంగా బైక్ ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. 13 నుంచి 15 వరకు ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, వంతెనలు, డ్యామ్‌లను అలంకరించి, విద్యుదీకరించి జాతీయ జెండాలను ఎగురవేయడానికి సిద్ధం చేయాలని చెప్పారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా యువజన సంక్షేమాధికారి కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ మిగులు సీట్లకు స్పాట్ ప్రవేశాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పలు ట్రేడ్లలో మిగిలిన సీట్లకు ఈనెల 5వ తేదీ మంగళవారం స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. ఆటోమొబైల్, సివిల్, మెకానికల్, మెటలర్జీ ట్రేడుల్లో డిప్లమా సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభ్యర్థులు తమ పదో తరగతి మార్కుల జాబితా, బదిలీ ధ్రువపత్రం, నాలుగు నుంచి పదో తరగతి వరకు విద్యార్హతలు, కుల, ఈడబ్ల్యూఎస్/ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌తోపాటు మూడు సెట్ల జెరాక్స్‌లు, 6 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకొని ఉదయం 9.30 గంటలకు కళాశాలకు రావాలని తెలిపారు. ప్రవేశం పొందిన అభ్యర్థులు వార్షిక ఫీజు రూ.4700, ఓసీ/బీసీలు కౌన్సెలింగ్ ఫీజు రూ. 1100, ఎస్సీ/ఎస్టీలు రూ.350 వెంటనే చెల్లించాలని అన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఎటువంటి ఉపకార వేతనాలు వర్తించవని తెలిపారు. పాలిసెట్ రాసినా/రాయకపోయినా, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బదలాయింపు లేదు.. సతాయింపే!

* ట్రాన్స్‌ఫర్ డ్యూటీకి రిజిస్ట్రేషన్ శాఖ ఎగనామం
* ఉమ్మడి కృష్ణాలో రూ.192.3 కోట్ల బకాయిలు..

ఈనాడు, అమరావతి

విజయవాడ సమీపంలోని గొల్లపూడి, నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, గూడవల్లి, ఎనికేపాడు, అంబాపురం, పోరంకి, తాడిగడప, కానూరు, పెనమలూరులలో... ఒక్కో పంచాయతీకి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రూ.కోటికి పైగా బకాయిలు రావాలి. ఒక్క గొల్లపూడిలోనే రూ.2.5 కోట్లకు పైగా బకాయిలున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి పంచాయతీలకు రావాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. సగటున ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.5-10 కోట్లు చెల్లించాలి. అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రూ.56 కోట్లు, గాంధీనగర్‌లో రూ.45 కోట్లు బకాయిలు ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ శాఖ.. ఆస్తుల క్రయవిక్రయాలపై పంచాయతీలకు చెల్లించాల్సిన ట్రాన్స్‌ఫర్ డ్యూటీకి ఎగనామం పెట్టింది. కొన్ని నెలలుగా చెల్లింపులు నిలిచి భారీగా బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా పంచాయతీల్లో ప్రగతి ప్రశ్నార్థకమైంది. ఎన్నికలు నిర్వహించని పంచాయతీలు కనీస నిధుల్లేక కునారిల్లుతున్నాయి.

చెల్లించడమే మానేశారు...

పంచాయతీల్లో భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ వేళ కొనుగోలుదారు స్టాంప్‌డ్యూటీ చెల్లిస్తారు. ఇందులో ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కింద సదరు పంచాయతీకి 50 శాతం చెల్లించాలి. ఈ సొమ్ము... గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, డ్రెయిన్ల నిర్వహణ, సిబ్బంది జీతాలు, ఇతర సాధారణ ఖర్చులకు వినియోగిస్తారు. ఈ సొమ్ము కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్ శాఖ చెల్లించడం లేదు. ఉమ్మడి జిల్లాలో రూ. 192.3 కోట్ల బకాయిలు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది.



గొల్లపూడి: శ్రీనివాస్‌నగర్‌లో రహదారి దుస్థితి

రెంటికీ చెడ్డ రేవడి...

ఎన్నికలు జరిగిన పంచాయతీలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఆలస్యమైనా ఆ నిధులతో పనులు చేస్తారు. విజయవాడ గ్రామీణ, జగ్గయ్యపేట, మచిలీపట్నం, గుడ్లవల్లేరు, గుడివాడ, పెదపారుపూడి మండలాల్లో కోర్టు, విలీన వివాదాలతో 25 పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. కొన్ని పంచాయతీలకు అసలు ప్రత్యేక అధికారులే లేరు. వీటికి అటు నిధులు, ఇటు ట్రాన్స్‌ఫర్ డ్యూటీ సొమ్ము రాక.. రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఆయా పంచాయతీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు అల్లాడుతున్నారు.

అంత బాధ్యతారాహిత్యమా?

ట్రాన్స్‌ఫర్ డ్యూటీ సొమ్ము ప్రతి నెలా పంచాయతీల ఖాతాలో జమ చేయాలి. ఉమ్మడి జిల్లాలో నెలలుగా అధికారులు పట్టించుకోలేదు. దాదాపు 90 శాతం పంచాయతీలకు 18 నెలలుగా పైసా చెల్లించలేదు. సర్పంచులు.. ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్నికలు నిర్వహించని పంచాయతీలకైనా చెల్లించాలని లేఖలు ఇచ్చినా స్పందన లేదు.

ఉపాధి హామీ.. మగువలే మేటి!

❖ 60 శాతం దాటిన వేతనదారులు ❖ రికార్డు స్థాయిలో పెరిగిన హాజరు



ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహిళా శ్రామికుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. పురుషుల కంటే 10 శాతానికి మించి మహిళలు పనులకు హాజరవుతున్నారు. వలసల నివారణ, స్థానికంగానే ఉపాధి కల్పించాలని ప్రవేశపెట్టిన ఈ పథకం సద్వినియోగం చేసుకుంటున్నారు.

గత మూడేళ్లలో హాజరు సరళి వివరాలు ఇలా..


ఏడాది	శ్రామికులు (లక్షల్లో)	మహిళలు	పురుషులు	మహిళల శాతం
2023-24	2.56	1,48,480	1,07,520	58
2024-25	2.51	1,46,182	1,04,818	58.24
2025-26 (జూన్ 30 వరకు)	1.98	1,20,780	77,220	61

61 శాతం నారీమణులే...: ఉపాధి హామీలో అనేక మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించడంతో మహిళల హాజరు పెరిగింది. ఉద్యాన శాఖలో అనేక పథకాలను ఉపాధి హామీతో అనుసంధానం చేసింది. కాలువలు, చెరువుల్లో తవ్వకాలు, పూడికతీత వంటివే కాక.. మొక్కలు నాటడం, నీరు పట్టడం, కాపలా పనులు, రహదారికి ఇరువైపులా మొక్కలు నాటడం, వాటి పరిరక్షణ, గ్రామాల్లో నిర్మించే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా ఉపాధి శ్రామికులే చేస్తున్నారు. 2022-23లో రోజువారీ వేతనం రూ.216 మాత్రమే ఉండగా ప్రస్తుతం దాదాపు రూ.300కి చేరింది. . పురుషులతో సమాన వేతనాలు ఇస్తున్నారు. ఇలా అనేక పరిణామాలతో మహిళల హాజరు పెరిగింది. గత మూడేళ్లలో 3 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 61 శాతానికి చేరుకుంది. కేటాయించిన నిధుల్లో 61 శాతం వేతనాల రూపంలో మగువల ఖాతాల్లోకే వెళుతున్నాయి. అతివల ఆర్థికాభివృద్ధికి ఉపాధి హామీ ఎంతో దోహదం అవుతుందని డ్వామా పీడీ రాము తెలిపారు.

మేల్కొనేలోపే.. మళ్లించేస్తున్నారు!

పార్సిళ్ల పేరుతో ఖాతాలు ఖాళీ

ఈనాడు, అమరావతి



కొరియర్ కంపెనీలు, పోస్టల్ శాఖ ల ముసుగులో పార్సిల్ మోసాలు వెలుగు చూస్తున్నాయి. ఇది నిజమేనని నమ్మితే.. రకరకాలుగా బురిడీ కొట్టించి వచ్చినకాడికి డబ్బులు లాగేస్తున్నారు. రోజుకో కొత్త ఎత్తుగడతో ఊహించని విధంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. బాధితులు తెలుసుకునేలోపే వారి కష్టార్జితాన్ని కొల్లగొట్టేస్తున్నారు. బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. ప్రజల అవగాహనలేమితో.. కేటుగాళ్ల పని సులువు అవుతోంది.

మోసగాళ్ల గాలానికి చిక్కి..

పటమటలో ఓ చిరుద్యోగికి కొరియర్ పేరుతో ఎస్ఎంఎస్ వచ్చింది. మీకు హైదరాబాద్ నుంచి ఓ పార్సిల్ వచ్చింది.. చిరునామా సరిగాలేక.. డెలివరీ చేయలేకపోతున్నామనేది సారాంశం. ఇందుకు మీ చిరునామా అప్‌డేట్ చేసుకోవాలి. ఈ లింక్‌పై క్లిక్ చేసి అడ్రస్ నమోదు చేయాలని పేర్కొన్నారు. అతడు నిజమేనని దానిపై క్లిక్ చేసి.. చిరునామా ఎంటర్ చేశాడు. కార్డుతో రూ.25 చెల్లించాలనడంతో.. డెబిట్ కార్డు వివరాలు నమోదు చేసి చెల్లించాడు. నిమిషాల్లో రూ.2.48 లక్షలు డ్రా అయినట్లు ఎస్ఎంఎస్‌లు వచ్చాయి. వెంటనే బ్యాంకుకెళ్లి ఆరా తీసి మోసం తెలిసి నిర్ఘాంతపోయాడు.

ఉచ్చులో పడొద్దు...

* మోసగాళ్లు పంపే ఎస్ఎంఎస్‌లు, చేసే ఫోన్లకు స్పందించొద్దు. అత్యవసరం లేదా ఒత్తిడికి గురిచేసేలా మాట్లాడతారు. దానిని అసలు పట్టించుకోవద్దు. * అనుమానాస్పద, అనధికారిక లింక్‌లను క్లిక్ చేయొద్దు. ఇలాంటి లింక్‌లను ఒకటికి రెండుసార్లు ధ్రువీకరించుకోవాలి. * కొరియర్ కంపెనీలు లేదా పోస్టల్ శాఖ కానీ పార్సిళ్లు పంపేందుకు చిరునామాలను అప్‌డేట్ చేసుకోమని ఎస్ఎంఎస్‌లు పంపవు. * వీటిపై క్లిక్ చేసి బ్యాంకు ఖాతాలు, కార్డుల వివరాలు నమోదు చేయకూడదు.
* ఇలాంటి సందేశాలు వస్తే.. ఆ కంపెనీ అధికారిక కస్టమర్ కేర్ బృందానికి ఫోన్ చేసి నిర్ధారణ చేసుకోవాలి.

ఫిషింగ్ లింక్ ఎరవేసి...

నేరగాళ్లు మోసం చేసేందుకు ఫిషింగ్ లింక్స్‌ను ఎంచుకుంటున్నారు. సంక్షిప్త సందేశాలతో వీటిని పంపి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. మీ ఫోన్‌కు పోస్టల్ శాఖ లేదా కొరియర్ కంపెనీ నుంచి అని ఎస్ఎంఎస్ పంపిస్తారు. అసంపూర్తి వివరాల వల్ల మీకు పంపలేకపోతున్నామని నమ్మిస్తారు. సరైన వివరాలు నమోదు చేయాలని ఎస్ఎంఎస్‌లో ఫిషింగ్ లింక్ కూడా పంపుతారు. దానిపై క్లిక్ చేసి వివరాలు ఎంటర్ చేయకపోతే.. పార్సిల్ వెనక్కి వెళ్తుందని గాబరా పెడతారు. వివరాల ధ్రువీకరణకు నామమాత్రంగా కొంత మొత్తం పంపాలని అడుగుతారు. లావాదేవీలు కార్డు ద్వారానే చేయాలంటారు. మోసగాళ్లు పంపిన లింక్‌లో కార్డు నెంబరు, గడువు తేదీ, సీవీవీ సమాచారాన్ని నమోదు చేశాక.. ఖాతాను వారి నియంత్రణలోకి తీసుకుని.. ఖాతాలో డబ్బు మళ్లిస్తున్నారు.

బ్యారేజీ 65 గేట్ల మూసివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువున వరద ప్రవాహం బాగా తగ్గడంతో నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద సోమవారం సాయంత్రం 65 గేట్లను మూసివేశారు. మిగతా 5 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 3,625 క్యూసెక్కులు విడుదల చేశారు.

కాలువలకు నీటి విడుదల పెంపు: వర్షాలు తగ్గడంతో సాగునీటి అవసరాలు పెరిగాయి. కాలువలకు నీటి విడుదల పెంచారు. కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు 18,475 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 10,271, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 8,004, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 5,017, బందరు 1,911, కేఈబీ 1,832, ఏలూరు కాలువలకు 1,511 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

రైతు క్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

నందిగామ గ్రామీణం, జగ్గయ్యపేట, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. సోమవారం ఎన్నెస్పీ 16వ బ్రాంచి కాలువ గౌరవరం హెడ్ రెగ్యులేటర్ వద్ద జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాంతో కలిసి దిగువకు సాగర్ నీటిని విడుదల చేశారు. ఎన్నెస్పీ కాలువకు జల హారతి ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం సీఎం ట్యాంకు నుంచి బ్రాంచి కాలువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, ఈ నీరు నందిగామ, చందర్లపాడు మండలాల పరిధిలోని కంచల, ఏటూరు, బండిపాలెం మేజరు కాలువల ద్వారా ఆయకట్టుకు సరఫరా చేయాలని చెప్పారు. ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందేలా నీటి సంఘాల అధ్యక్షులు, ఎన్నెస్పీ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ.. ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రెండు నియోజకవర్గాల రైతులకు సాగర్ నీరు సక్రమంగా అందేలా చూస్తామని చెప్పారు. ఎన్నెస్పీ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, ఎన్నెస్పీ డీసీ ఛైర్మన్లు రాటకొండ చంద్రశేఖర్, గోపాలరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షులు మన్నెం శ్రీనివాసరావు, వడ్లమూడి శ్రీను, తెదేపా నాయకులు కట్టా నరసింహారావు, ఉన్నం అప్పారావు, భాజపా నాయకుడు కొత్త సాంబశివరావు, ఎన్నెస్పీ జగ్గయ్యపేట ఈఈ కిశోర్, నందిగామ, జగ్గయ్యపేట డీఈఈలు శశికుమారి, రాంబాబు, ఎన్నెస్పీ ఏఈలు పాల్గొన్నారు.



గౌరవరం హెడ్ రెగ్యులేటర్ వద్ద సాగర్ నీటిని విడుదల చేస్తున్న సౌమ్య, రఘురాం, తాతయ్య

దుర్గమ్మ భక్తులకు ఏదీ భద్రత?

ఏడాదిగా కొనసాగుతున్న మెష్ ఏర్పాటు పనులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దుర్గగుడిలో భక్తుల భద్రతను అధికారులు పూర్తిగా విస్మరించారు. రూ. కోట్లు ఖర్చు పెడుతున్నా కొండరాళ్లు జారిపడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు జరిగిన ఆయా ఘటనల్లో భక్తులు, సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొండరాళ్లు జారిపడకుండా దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు రూ.4.26 కోట్లతో గతేడాది పనులు ప్రారంభించారు. అవి ఇంకా కొనసాగుతుండటంతో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు భక్తుల భద్రత విషయంలో ఆందోళన నెలకొంటోంది. మూడేళ్ల కిందట దసరా ఉత్సవాల ప్రారంభానికి ముందు కేశఖండన శాల సమీపంలో కొండరాళ్లు జారిపడి అక్కడ నిలిపి ఉంచిన వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘాట్ రోడ్డులో డోనర్ సెల్, సమాచార కేంద్రంపై కూడా రాళ్లు పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘాట్ రోడ్డు తొలి మలుపు నుంచి ఓంకారం వరకు 3800 చదరపు మీటర్ల పనులు పూర్తి చేయాల్సి ఉండగా 1800 చదరపు మీటర్ల మాత్రమే పూర్తయ్యాయి. మరో ఆరు వారాల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సమయంలో వర్షాలు కురిస్తే భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.


కేశఖండన శాల వద్ద ప్రమాదకరంగా కొండ భాగం

ఉత్సవాల నాటికి పూర్తి చేస్తాం

దసరా ఉత్సవాల నాటికి ఘాట్ రోడ్డులో చేపట్టిన మెష్ పనులు పూర్తి చేస్తాం. వర్షాలు, ఉత్సవాల కారణంగా పనులు పూర్తి చేయడంలో కొంత జాప్యం జరిగింది. డోనర్ సెల్ వద్ద కొండరాళ్లు జారిపడిన ప్రాంతంతో పాటు ఘాట్ రోడ్డు మొదటి మలుపు నుంచి ఓంకారం వరకు పనులు తుది దశకు చేరాయి. - కోటేశ్వరరావు, ఆలయ ఈఈ


బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌పై


తేలప్రోలు సమీపంలో...

రహదారిపై శకటం.. ఆదమరిస్తే సంకటం

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పార్కింగ్ ప్రాంతాల్లో కాకుండా ఎక్కడపడితే అక్కడ లారీలు, కంటైనర్లు నిలిపేస్తున్నారు. అతివేగంగా ప్రయాణించే వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం చోటుచేసుకుంటుంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఇప్పటికే వివిధ కారణాలతో ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితిలో వాహనాలు ఆపినా కనీసం పార్కింగ్ దీపాలు కూడా వేయడం లేదు. ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు స్పందించి రహదారిపై వాహనాలు ఆపిన వారిపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో నైనా నివారించే అవకాశం ఉంటుంది. - ఈనాడు, అమరావతి

12న నులి పురుగుల నివారణ దినోత్సవం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ప్రతి చిన్నారికి అల్బెండజోల్ నులి పురుగు నివారణ మాత్రలు అందించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఈ నెల 12వ తేదీన జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని నగరంలోని కలెక్టరేట్‌లో ప్రచార పత్రాలు సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వరకు ప్రతి చిన్నారికి మాత్రలు వేసేలా చూడాలన్నారు. పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఎంహెచ్‌ఓ ఎం.సుహాసిని పాల్గొన్నారు.


వెలుగుచూస్తున్న 'సృష్టి' మోసాలు

ఈనాడు, హైదరాబాద్, రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ను కేంద్రంగా చేసుకొని డాక్టర్ నమ్రత బృందం చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. గత రెండు రోజుల్లో గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఉత్తరమండలం డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు వేగంగా జరుగుతోంది. ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్న డాక్టర్ నమ్రత, కల్యాణి, ధనశ్రీ సంతోషి నుంచి కీలక సమాచారం సేకరించారు. దీని ఆధారంగా మరికొందరిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ★ నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు వివాహమై ఆరేళ్లయినా సంతానం లేకపోవడంతో 2013లో గుజరాత్‌లో ఐవీఎఫ్ ప్రయత్నించి విఫలం కావడంతో 2024లో 'సృష్టి'ని సంప్రదించారు. అక్కడి వైద్యులు సరోగసీతో బిడ్డను పొందే అవకాశం ఉందని రూ.23లక్షలు ఖర్చవుతుందని రూ.11 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. తర్వాత కాలయాపన చేస్తుండటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ★ హైదరాబాద్‌కు చెందిన మహిళకు ఐవీఎఫ్ ద్వారా బిడ్డ కలిగే వీలుందంటూ తొలుత చికిత్స చేశారు. అనంతరం సరోగసీ పద్ధతి అంటూ రూ.16.5లక్షలు వసూలు చేశారు. గతేడాది సెప్టెంబరులో విశాఖ ఆసుపత్రికి దంపతులను తీసుకెళ్లి వీర్యకణాలు, అండం సేకరించారు. మహిళకు 14 హార్మోన్ ఇంజక్షన్లు చేశారు. సరోగసీ విజయవంతమైందని, జూన్ 26న ఆడపిల్ల పుట్టిందని సమాచారమిచ్చారు. పాపను చూసిన దంపతులు తమ పోలికలు లేకపోవటంతో డీఎన్ఏ పరీక్ష చేయించి డా.నమ్రతను నిలదీశారు. దీంతో ఆ బిడ్డను దత్తత ఇచ్చి మరో బిడ్డ కోసం సరోగసీ చేస్తామంటూ మభ్యపెట్టారు. వారు పోలీసులను ఆశ్రయించారు. ★ అమెరికాలో స్థిరపడిన హైదరాబాద్‌కు చెందిన దంపతుల నుంచి 2019లో డా.నమ్రత బృందం రూ.7లక్షలు తీసుకొని ఐవీఎఫ్ చేసింది. అది విఫలమైందని 2020లో సరోగసీ అంటూ రూ.25లక్షలు అవుతుందని చెప్పి రూ.12 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. కొవిడ్ కారణంగా అమెరికా వెళ్లిపోయిన దంపతులు తాజాగా సృష్టి మోసాలు గురించి తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ★ నగరంలో నివాసం ఉంటున్న దిల్లీకి చెందిన భార్యాభర్తల నుంచి సరోగసీ పేరిట రూ.20లక్షలు వసూలు చేసిన వైద్యులు.. బిడ్డ పెరుగుదలను బట్టి 10వ వారం నుంచి 35వ వారం వరకూ రూ.2.50లక్షల చొప్పున చెల్లించాలని ఒప్పందం చేసుకున్నారు. భార్యభర్తల నుంచి అండం, వీర్యకణాలు సేకరించారు. జూన్ 26న అద్దె గర్భంలో బిడ్డ సిద్ధమయ్యాడని రిపోర్టులు పంపారు. సరోగసీకి సిద్ధమైన మహిళ గురించి వివరాలు కోరితే వాయిదా వేస్తూ వచ్చారు. సామాజిక మాధ్యమాల్లో మోసాల గురించి తెలిసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదు మేరకు డా.నమ్రతతో పాటు వైద్యులు చెన్నారావు, సురేఖ, అర్చన, సదానందం, విద్యులత, కల్యాణి, శేషగిరి, శ్రీనివాసరెడ్డిపై కేసులు నమోదు చేశారు.

డా.నమ్రతపై మరో నాలుగు కేసుల నమోదు

అనుశీలనతోనే సమస్యల పరిష్కారం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా స్వీకరించిన అర్జీల సమస్యలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. అధికారులు ప్రతి రోజు పీజీఆర్ఎస్ పోర్టల్ లాగిన్ అయి.. ఆయా వినతులను చూడాలని, అనుశీలన చేయాలని ఆదేశించారు. రీ ఓపెన్ వినతులను విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన సమీక్షించారు.


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు

147 వినతుల స్వీకరణ.. మొత్తం 147 వినతి పత్రాలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు అధికంగా 32 అర్జీలు, పోలీస్ 23, విద్య 21, మున్సిపల్ 14, పంచాయతీరాజ్ 11, వైద్య ఆరోగ్య శాఖ 9, ఏపీ ఎస్‌డబ్ల్యూ ఆర్ఎస్ 4, ఏపీ సీపీడీసీఎల్, ఇరిగేషన్ శాఖలకు మూడేసి, పౌరసరఫరాలు, ఖజానా, జలవనరులు, మార్కెటింగ్, సాంఘిక సంక్షేమ శాఖలకు రెండేసి అందాయి. వ్యవసాయ, ఆర్టీసీ, డీఆర్డీఏ, మైనార్టీ, ఆర్‌డబ్ల్యూఎస్, కాలుష్య నియంత్రణ మండలి, పులిచింతల ఎస్‌ఈ, సర్వే తదితర శాఖలకు ఒక్కోటి చొప్పున వచ్చాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నన్స్ అక్రమ అరెస్ట్‌పై క్రైస్తవ సంఘాల నిరసన



బిషప్ అజరయ్య పాఠశాల మైదానంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : స్వాతంత్ర్యం రాక ముందు నుంచే దేశంలో క్రైస్తవ మిషనరీలు సేవా దృక్పథంతో పని చేస్తున్నాయని, అలాంటి వాటిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం తగదని విజయవాడ కేథలిక్ డయోసిస్ మోన్సిన్యోర్ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి ఫాదర్ మువ్వల ప్రసాద్ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కేరళకు చెందిన ఇద్దరు నన్స్ (సిస్టర్స్)ని అక్రమ అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఫెడరేషన్ ఆఫ్ చర్చస్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని బిషప్ అజరయ్య పాఠశాల మైదానం నుంచి స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ స్మృతివనం వరకు సోమవారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ... ఛత్తీస్‌గఢ్‌లో కొంత మంది మతోన్మాదులు కుట్ర పన్ని నన్స్‌ని అక్రమంగా అరెస్ట్ చేయించారని, ఆ చర్యను దేశంలోని అన్ని సంఘాలు, సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. వారిని జైలులో నిర్బంధించడంతో యావత్ క్రైస్తవ లోకం ఆందోళనలో ఉందని, వారిపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బేతులు మినిస్ట్రీస్ ఛైర్మన్ పాస్టర్ జయకుమార్ బాబు మాట్లాడుతూ.. పేదలకు సేవ చేస్తున్న నన్స్‌ని అరెస్ట్ చేయడం తగదని అన్నారు. క్రైస్తవ సంస్థలు పేదలకు సేవ చేయడం నేరమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్లు తోట సునీల్, పసల తోమస్, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి తిరుపతి శాంతినగర్‌కు చెందిన సీఎంఆర్ ఇన్‌ఫ్రాటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సి.నాగేశ్వరరావు రూ.5లక్షల విరాళం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


దాత నాగేశ్వరరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

నూతన ప్రసాదాల కౌంటర్ ప్రారంభం

విద్యాధరపురం: దుర్గగుడి టోల్‌గేటు సమీపంలో నూతన ప్రసాదాల కౌంటర్‌ను ఈవో శీనానాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటర్‌లో ప్రసాదాలతో పాటు కొబ్బరికాయలు, వాహన సేవ, పూజ టికెట్లు విక్రయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాదశర్మ, వైదిక కమిటీ సభ్యుడు శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

పోలంపల్లి డ్యాం మరమ్మతులకు సీఎం సుముఖత

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పోలంపల్లి డ్యాం మరమ్మతులకు నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, ఆయకట్టు రైతు నాయకులతో కలిసి శ్రీరాం తాతయ్య చంద్రబాబునాయుడిని సోమవారం కలిశారు. గత ఏడాది వరదలకు డ్యాంలోని అడ్డుకట్టలు ధ్వంసం కావడంతో ఆయకట్టులోని 30 వేల ఎకరాలకు సాగునీరందక పంటలు ఎండిపోతున్న విషయాన్ని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డ్యాం మరమ్మతుల కోసం ప్రతిపాదించిన రూ.19 కోట్లు, ప్రాజెక్టు పరిధిలోని తువ్వకాలువ గండ్ల మరమ్మతులకు రూ.3 కోట్లు వెంటనే మంజూరు చేయాలని అభ్యర్థించారు. నిధులు మంజూరుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పోలంపల్లి డ్యాం కమిటీ ఛైర్మన్ పొన్నం బాలాజీ, నాయకులు నాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ విశ్వనాథం, మౌళేశ్వరరావు, పొన్నం నరసింహారావు, గింజుపల్లి గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబుకు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, టీడీ జనార్దన్

పెట్టుబడి.. దగాపడి..!

రూ.15.16 లక్షలకు సైబర్ నేరగాళ్ల టోకరా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పార్ట్ టైం ఉద్యోగం, పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్లు చేసే మోసాలపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నా.. అమాయకులు మోసపోతూనే ఉన్నారు. తాజాగా నున్నకు చెందిన ఓ యువకుడు రూ.15.16 లక్షల మేర మోసపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. నున్న గ్రామానికి చెందిన ఓ యువకుడికి జూన్ 1న 'కరిష్మా బాటిల్' అనే టెలిగ్రామ్ ఖాతా నుంచి పార్ట్‌టైం జాబ్‌ల గురించి మెసేజ్ వచ్చింది. అదే రోజు 'ఎన్‌జెడ్ గోల్డ్ మర్చంట్ కంపెనీ' పేరుతో వాట్సాప్ మెసేజ్ వచ్చింది. బంగారం కంపెనీలో జరిగే వేలంలో పాల్గొనడమే పని అని చెప్పడంతో ఆసక్తి చూపారు. వారు పంపిన లింక్ క్లిక్ చేసి రిజిస్టర్ అయ్యారు. తర్వాత పలుమార్లు వేలంలో పాల్గొని పాట పెంచారు. ఇలా చేసినందుకు చిన్న చిన్న మొత్తాల్లో డబ్బులు అతని ఖాతాలో జమయ్యాయి. తర్వాత సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగారు. పెట్టుబడులు పెట్టి వేలంలో పాల్గొంటే.. ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపారు. వారు మాటలు నమ్మిన యువకుడు.. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టారు. ఆదాయం వస్తుండడంతో మరింతగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. ఇలా జులై 28 వరకు పలు దఫాలుగా మొత్తం 17 బ్యాంకు ఖాతాలకు రూ.15,16,513లు పంపారు. తర్వాత ఒక్కసారిగా కంపెనీ యాప్ పని చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. దీనిపై సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు.

స్నేహితుడిని దింపేందుకు వెళుతుండగా ప్రమాదం

టిప్పర్ ఢీ.. ఒకరి మృతి..

భవానీపురం, న్యూస్‌టుడే: స్నేహితుడిని ఇంటి వద్ద దింపేందుకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ దర్శిపేటకు చెందిన సిరివెల్ల దేవరాజ్(19).. తండ్రి రెండేళ్ల కిందట చనిపోయాడు. పదో తరగతి వరకు చదువుకున్న అతడు మినరల్ వాటర్ బాటిళ్లు సరఫరా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న రాత్రి అతడి స్నేహితుడు వినేష్‌రెడ్డితో కలిసి బందరు రోడ్డులోని ఫుడ్‌కోర్టుకు వెళ్లాడు. అనంతరం వినేష్‌రెడ్డిని విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని అతడి ఇంటి వద్ద దింపేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వినేష్‌రెడ్డి వాహనం నడుపుతుండగా, దేవరాజ్ వెనుక కూర్చున్నాడు. కుమ్మరిపాలెం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవరాజ్ రోడ్డుపై పడిపోయి.. సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానికులు గమనించి భవానీపురం పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వినేష్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. దేవరాజ్ తల్లి వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల చేతిలో ప్రభుత్వం

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్)పై ప్రతి నెలా 5వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో అవగాహనా ర్యాలీలు నిర్వహించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్-ప్రజల చేతిలో ప్రభుత్వం అనే పోస్టర్లను నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ సేవల్లో భాగంగా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రభుత్వం తీసుకువచ్చినట్లు తెలిపారు. 26 శాఖలకు చెందిన 530కు పైగా సేవలను ప్రతి పౌరుడికి అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

వాట్సాప్ నంబరు 95523 00009

వాట్సాప్ గవర్నెన్స్ నంబరుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ మంగళవారం నుంచి ప్రతి నెలా 5వ తేదీన ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఆ రోజు సెలవు అయితే మరుసటి రోజు నిర్వహించాలని సూచించారు. వీఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డు రెవెన్యూ కార్యదర్శులు తదితరులు పాల్గొనాలని పేర్కొన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి. నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

కారుతో బాలుడి బీభత్సం!

త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్న పలువురు

భవానీపురం, న్యూస్‌టుడే: బైపాస్ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల్లోని బైపాస్ రహదారిపై సోమవారం ఉదయం ఓ బాలుడు కారు నడుపుతుండగా, మరో ఇద్దరు అందులో కూర్చున్నారు. వేగంగా పోనిస్తూ.. మార్గం మధ్యలో మూడు చోట్ల కారుతో ఢీకొట్టే ప్రయత్నం చేశారు. కొందరు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. చివరికి వారిని పట్టుకుని భవానీపురం స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరసనలు ఉద్ధృతం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తమ సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలను ఉద్ధృతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ తీర్మానించింది. దీనికి కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళతామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్.పి.శాస్త్రి తెలిపారు. సోమవారం నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు పీఆర్సీ కమిషన్ వేయలేదని, డీఏ/డీఆర్‌లు ప్రకటించలేదని, బకాయిల చెల్లింపులు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. తమతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యలపై చర్చలకు అవకాశం కల్పించడం లేదని, విశ్రాంత ఉద్యోగులు నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ ఐకాస అమరావతి కార్యక్రమాల్లో పాల్గొంటామని చెప్పారు. ఏఐఎస్‌పీఎఫ్ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక చర్యలపై నిర్వహించే ఆందోళనలకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. సంఘ నాయకులు బి.లోవకుమార్, ఎన్.నారాయణరావు, డి.సుబ్బారావు, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్లు అర్జున్, ఆనంద్

ఏంటో ఈ నిర్లక్ష్యం..

గంజాయి నిందితుడు పరారైనా గ్రహించని వైనం

విజయవాడ, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం రాయనపాడులో గంజాయి సేవిస్తూ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి దొరికిన నిందితుడిని స్థానిక పోలీసుల నిర్లక్ష్యంతో వదిలేసి ఆ తర్వాత నానా తిప్పలు పడి పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం స్టేషన్ పరిధిలోని రాయనపాడులో నలుగురు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. అయితే అప్పటి నుంచి విచారణ పేరుతో రెండ్రోజులు గడిపేశారు. ఇదిలా ఉంటే ఆదివారం ఉదయం నిందితుల్లో ఒకడైన వసంత్ భార్య అతడిని కలవడానికి స్టేషన్‌కు రాగా.. ఆ సమయంలో పోలీసులు వసంత్‌ను నిర్లక్ష్యంగా వదిలేయగా అతడు నెమ్మదిగా బయటకు వెళ్లిపోయాడు. కాసేపటికి అతను కనిపించకపోవడంతో భార్యను నిలదీశారు. ఆమె సరైన సమాచారం ఇవ్వకపోవడంతో కంగారు పడ్డారు. ఇదంతా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఉన్నతాధికారులు ఈ విషయం తెలుసుకొని ఆరా తీయగా..సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇది జరిగిందని గ్రహించి హెచ్చరించారు. దీంతో వెంటనే కొందరు పోలీసులు బృందాలుగా ఏర్పడి వసంత్‌ను ఓ మద్యం దుకాణం వద్ద పట్టుకొని తీసుకువచ్చారు. ఇదిలా ఉంటే గంజాయి నిందితులైన వసంత్‌తో పాటు తన స్నేహితులైన రాహుల్, రేవంత్, కల్యాణ్‌లను తుమ్మలపాలెం బస్టాప్ వద్ద అదుపులోకి తీసుకొన్నట్లు, వారి వద్ద 1,200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని సోమవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్ తెలిపారు.


బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -99 రిటైల్ ధర 121 చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

ధర వరలు



వంకాయలు-20, టమాటా-42, బెండ-28, పచ్చిమిర్చి-60, కాకర-30, బీర-40/38, క్యాబేజి-22, క్యారెట్-32/45, దొండ-36, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-34, దోస-20, సొర-15/14, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-30, అల్లం-85, మునగ-5/6, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-46, బీట్ రూట్-30, కీరదోస-44, బీన్స్-76, క్యాప్సికమ్-75, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-8/15, పుదీనా-5/14, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

నూతన హంగులతో ఎన్ఏసీ జ్యుయలరీ షోరూమ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: పదేళ్లుగా విజయవాడ వినియోగదారుల మన్ననలు పొందుతూ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నామని ఎన్ఏసీ జ్యుయలరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అర్జున్ వరదరాజన్, ఆనంద్ రామానుజన్ అన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని లబ్బీపేటలో ఎన్ఏసీ జ్యుయలరీ 10 వసంతాల వేడుకను సోమవారం షోరూమ్‌లో వినియోగదారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్షికోత్సవం సందర్భంగా షోరూమ్‌ని ఆధునికీకరించామని తెలిపారు. వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నామని, బంగారు, వెండి, డైమండ్ ఆభరణాలకు సున్నా శాతం వాల్యూ ఎడిషన్ అందిస్తున్నామని చెప్పారు. వినియోగదారుల ప్రోత్సాహమే తమ సంస్థ పురోభివృద్ధికి ప్రధాన కారణమని తెలిపారు. తొలుత వేడుకలను మరిడి ప్రభావతి, సిబ్బినేని వినయసాగర్, కె.రామచంద్రశేఖర్, తిప్పనపోయిన కరుణశ్రీ, బాడిగ లక్ష్మీబాయి ప్రారంభించారు.



మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్లు అర్జున్, ఆనంద్

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



? చెవుటూరు గ్రామంలోని బాపూజీ కాలనీలో మురుగు సీసీ రోడ్డుపై చేరి రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. తక్షణమే పరిష్కర్త చర్యలు చేపట్టాలి. -సుబ్బారావు, స్థానికుడు

✓ సిబ్బందితో కాలువల్లో పూడిక తీయిస్తాం. స్థానికుల సమస్య పరిష్కరిస్తాం. - మురళి, పంచాయతీ కార్యదర్శి

★ స్థానిక ఉన్నత పాఠశాల పక్కనే సీసీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుపై కృష్ణా జలాల పైపులైన్ లీకై నిరంతరం వృథాగా పోతోందని స్థానికులు ఆ సమస్యను న్యూస్‌టుడే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై గత నెల 29వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ సహాయక ఇంజినీర్ తమ సిబ్బందితో పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు. -న్యూస్‌టుడే, ఎ.కొండూరు



★ స్థానిక పంచాయతీ 7వ వార్డులోని డ్రైనేజీల్లో పూడిక పేరుకు పోయి మురుగు పారుదల సక్రమంగా జరగడంలేదని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగా కు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి రామారావు స్పందించారు. సిబ్బందిని పంపి సోమవారం కాలువలను శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

స్పందనకు వందనం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను, ఊటుకూరు విద్యుత్తు ఉపకేంద్రాలలోని గ్రామాలు, గంపలగూడెం, గుళ్లపూడి ఫీడర్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నూతన విద్యుత్తు లైన్ల నిర్మాణం నిమిత్తం సరఫరా ఆపేస్తున్నట్లు ఏఈ కె.వాసు తెలిపారు.

ఎ.కొండూరులో 22 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఉదయం నమోదైన వివరాల ప్రకారం.. ఎ.కొండూరులో 22 మిల్లీ మీటర్ల వర్షం పడింది. మిగతా ప్రాంతాల్లో వర్ష చాయలు లేవు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం (గ్రామీణ): తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం వల్ల అనేక వ్యాధులను నిరోధించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారని మైలవరం సీడీపీవో పుష్పలత తల్లులకు వివరించారు. తుమ్మలపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పిల్లలకు పాలు ఇవ్వకపోతే తల్లులు కూడా అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వారోత్సవాలలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకట రమణ, వైద్యఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం (గ్రామీణం)), న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్ (గ్రామీణ్) కేంద్ర బృందం సభ్యులు సోమవారం గుంటుపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. గ్రామానికి సరఫరా అవుతున్న రక్షిత తాగునీటి ట్యాంకులలో క్లోరినేషన్ విధానం, చెత్త సేకరణ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రతపై వివరాలు సేకరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ.. ప్రతి రోజు ఇంటింటి నుంచి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సూచించారు. చెత్త నుంచి వర్మికంపోస్టు ఎరువులను తయారు చేసి వాటి విక్రయాల ద్వారా అదనపు ఆదాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి, విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఎంపీడీవో సునీత శర్మ, డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, గ్రామ కార్యదర్శి మురళీ మోహన్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాకు చెప్తారు.. సాగదీస్తారు..!

పుర ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

ప్రాంతాలు	నివాసాలు వేలల్లో	నీటి సరఫరా (రోజుకు) (లక్షల లీటర్లలో)
కొండపల్లి	5	40
ఇబ్రహీంపట్నం	4	45
నాలుగు మండలాలు	12	125

కొండపల్లి, న్యూస్‌టుడే

కొండపల్లి పురపాలికతో పాటు నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఏదో సమస్య ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. ఎన్టీటీపీఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని రోజులు పంపింగ్ స్కీంలోకి బూడిద రావడం, మరి కొన్ని రోజులు మోటార్లు మొరాయించడం పరిపాటిగా మారింది. ఈ సమస్యలతో పాటు నాలుగు నెలల వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు సైతం విధులు బహిష్కరించి న్యాయం చేయాలని కోరడంతో సోమవారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అయితే సమస్య తలెత్తిన ప్రతిసారి చోద్యం చూడడం అధికారుల వంతుగా మారింది.



కార్మికులు విధులు బహిష్కరించడంతో ఆపేసిన మోటార్లు

నియోజకవర్గం మొత్తం

ఇబ్రహీంపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ పంపింగ్ స్కీం ద్వారా పురపాలికతో పాటు నియోజకవర్గంలోని జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండల శివారు కూనపరాజుపర్వ వరకూ నీటి సరఫరా జరుగుతుంది. 65 మంది సిబ్బంది గుత్తేదారుని వద్ద విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్‌గా రూ.13, రూ.15, రూ.18 వేలు వేతనాలు పొందుతున్నారు.

వారంలో సమస్యకు పరిష్కారం

కార్మికులు తమ సమస్యను ఎస్‌ఈ వద్ద సోమవారం ప్రస్తావించారు. వారం రోజుల లోగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు.

- రమ్యకీర్తన, కమిషనర్

ఒక్క రోజైనా సక్రమంగా లేదు: పంపింగ్ స్కీం దగ్గరే ఉందన్న మాటే గానీ ఒక్క రోజు కూడా నీటి సరఫరా సక్రమంగా ఉండదు. ఎప్పుడు చూసినా మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, ప్రధాన పైపులు లీకేజీలు జరుగుతున్నాయని చెబుతున్నారు. దీనిపై పుర అధికారులను ప్రశ్నించినా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లను అడిగినా ఒకరిపై మరొకరు సాకులు చెప్పుకోవడం సమస్యకు పరిష్కారం ఉండదు. - మైలా సైదులు, ఇబ్రహీంపట్నం

బూడిద లేదా బురద: తాగునీటిలో కొన్ని రోజులు బూడిద, మరి కొన్ని రోజులు బురద వస్తుంది. దీనిపై ఎన్నో సార్లు ప్రశ్నించాం. గత మూడు రోజులు పురపాలికలో నీటి సరఫరా లేదు. మోటార్లు చెడిపోయాయని సిబ్బంది తెలిపారు. ఆదివారం మరమ్మతులు నిర్వహించామని చెప్పారు. సోమవారం కూడా నీటి సరఫరా జరగలేదు. ఎన్టీటీపీఎస్ బూడిదతో కలసి అనేక సార్లు నీటి సరఫరా జరిగింది. ఇప్పటికే కొత్తగేటు ప్రాంతంలో కొంత మంది శ్వాసకోస, పేగుపూత, క్యాన్సర్ వంటి వ్యాధులతో అల్లాడుతున్నారు. - గుంజా శ్రీను, కౌన్సిలర్

పవిత్రోత్సవాలు ప్రారంభం

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాలను సోమవారం సాయంత్రం ఆలయ అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. సాయంత్రం అఖండ దీపారాధన, అంకురార్పణ, పవిత్రశుద్ధితో వేడుకలకు శ్రీకారం చుట్టారు. వివిధ గ్రామాలకు చెందిన దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నిలిపేసిన పింఛన్ల పంపిణీ

గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నిలిచిన దివ్యాంగుల పింఛన్లు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దివ్యాంగుల అర్హత పత్రాలు పరిశీలన చేయించలేదన్న సాకుతో నాలుగు మండలాల్లో ఈ నెలలో 527 మందికి పింఛన్లు ఇవ్వలేదు. దీంతో బాధితులంతా తమ ఆవేదన కలెక్టర్ జి.లక్ష్మీశ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అందజేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం సచివాలయాల ఉద్యోగులు పంపిణీ ప్రారంభించారు. మండలాల వారీగా గంపలగూడెంలో 199, విస్సన్నపేటలో 66, తిరువూరు గ్రామీణం 22, పట్టణం 9, ఎ.కొండూరులో 231 మంది దివ్యాంగులకు పింఛన్లు అందజేస్తున్నారు. ప్రభుత్వం తమ పింఛన్లు ఆపేయడంతో ఆందోళన చెందిన సదరు లబ్ధిదారులు తిరిగి పంపిణీ ప్రారంభించడంతో ఊరట చెందారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

రెడ్డిగూడెం: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవాలని జిల్లా రిసోర్స్ కేంద్రం(డీఆర్‌సీ) ఏడీఏ పి.మునీషా సూచించారు. సోమవారం రంగాపురం రైతు సేవా కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేప సంబంధిత మందులను పైరు తొలిదశలో పిచికారీ చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేయవచ్చని వివరించారు. ఏవో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ..ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో ఎ.పవన్ కుమార్, మాస్టర్ ట్రైనర్ సిహెచ్.రాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట ఎంఈవో-1 గా శంకరరావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారి-1గా కుమ్మరి శంకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన్ను విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి ఎంఈవో-1గా నియమించారు.

22న మెగా జాబ్‌మేళా

గంపలగూడెం: నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 22న తిరువూరు శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పది నుంచి పీజీ, ఐటీఐ వరకు చదివిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఏడాది పాటు నెలకు రూ.12వేలు ఉపకార వేతనంతో చిత్తూరు జిల్లాలోని అమర రాజా కంపెనీలో శిక్షణ, ఆపైన వారికి నెలకు రూ.22 వేలు వేతనం ఉద్యోగంలో నియమిస్తారన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ..వేర్వేరుగా కేసులు

ఉమ్మడిదేవరపల్లి(గంపలగూడెం): ఉమ్మడిదేవరపల్లిలో ఆర్థిక లావాదేవీల విషయమై జరిగిన ఘర్షణపై పదిలం నరసింహారావు, వట్టికొండ వెంకట్రావు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై వేర్వేరుగా సోమవారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీను తెలిపారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మొర్సుమిల్లి సొసైటీ త్రీ మెన్ కమిటీ ఛైర్మన్‌గా కిలారు సత్యనారాయణ, సభ్యులుగా నీలపాల వెంకటేశ్వరరావు, సగ్గుర్తి శ్యాంబాబు పదవీ ప్రమాణ స్వీకారం సోమవారం సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని, అన్నదాత సుఖీభవతో పెద్ద ఎత్తున మేలు జరుగుతుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా సంఘం అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అందలేదని ఆందోళన



పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే: తమ పిల్లలకు తల్లికి వందనం పథకం అందడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ స్థానిక నారాయణ పాఠశాల వద్ద తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగారు. గత నెలలోనే ఆందోళన చేయగా చర్యలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు హామీ ఇచ్చినా అమలు కాకపోవడంతో మరోసారి బడి బయట నిరసన తెలిపారు. దీంతో జీఎం, ఏజీఎం, ప్రిన్సిపల్ వారితో చర్చలు జరిపారు. ఒకానొక దశలో పాఠశాల గేటు బయట బైఠాయించారు. అయితే ఈ నెల 12లోగా గ్రామ సచివాలయాల నుంచి అర్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకువచ్చిన విద్యార్థులకు పథకం అమలు అయ్యేలా చూస్తామని, లేకుంటే వారం అనంతరం వారు చెల్లించాల్సిన ఫీజు నుంచి 13 వేలు మినహాయించుకుని చెల్లించవచ్చని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

రామచంద్రాపురం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురంలో ప్రవాసాంధ్రుడు గుంటక సుదర్శన రెడ్డి(అంబులు) కుటుంబ సభ్యులు రూ.కోటి వ్యయంతో గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం ఉదయం 8.10 గంటలకు శిర్డీసాయిబాబా, శివలింగం, నంది, వినాయకుడు, దత్తాత్రేయుడి విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పూజల్లో పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గుడి నిర్మాణ దాత సుదర్శనరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



ఆలయంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన గుడి నిర్మాణ దాతలు, తెదేపా నాయకులు


విస్సన్నపేట: ద్వారకానగర్‌లో నిర్మించిన గుడిలో సోమవారం గణపతి, కుమారస్వామి, నాగేంద్రస్వామి, అంకమ్మతల్లి, దేవతా శిఖర ప్రతిష్ఠోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.07 గంటలకు యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

వసతులు శూన్యం.. అవస్థలే నిత్యం



గత వైకాపా ప్రభుత్వంలో పేదలందరికీ పక్కా ఇళ్ల పేరుతో నాయకులు భారీ అవినీతికి పాల్పడ్డారు. మండల వ్యాప్తంగా కుంటముక్కల, వెల్లటూరు, జి.కొండూరు, కవులూరు, గడ్డమణుగు తదితర గ్రామాల్లో నివేశన స్థలాలను ఏర్పాటు చేసి రూ. కోట్లలో అవినీతి కి పాల్పడ్డారని స్థానికులు మండిపడున్నారు. కనీస మౌలిక వసతులు లేక ఇళ్లు కట్టుకోవాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. చిన్నపాటి వానకు సైతం రహదారులు బురదకయ్యగా మారడం, గడ్డమణుగులో ప్రధాన రహదారికి అనుసంధాన రహదారిలేక చుట్టు పక్కల అడవి తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు

పూర్తి నిర్మాణం ఎప్పుడు సారు..?



రుద్రవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్) భవనం పిల్లర్ల నిర్మాణం దశలోనే ఆగిపోయింది. ఈ సొసైటీ భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో 2023 డిసెంబరులో అధికారులు రూ.20.75 లక్షల నిధులు మంజూరు చేయించి 2024 మార్చిలో పనులు ప్రారంభించి పిల్లర్లు నిర్మించి పనులు ఆపేశారు. ప్రస్తుతం కార్యాలయ నిర్వహణ గ్రామ సచివాలయంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. సొంత భవనం లేక పోవడంతో రికార్డులు భద్రపరచడానికి, ఎరువులు నిల్వకు, సిబ్బంది విధుల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం లోనైనా పనులు పూర్తిచేస్తారని అంతా ఎదురుచూస్తున్నారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

ఎన్నిసార్లు చెప్పినా.. వినిపించుకోరు



మండలంలోని పల్లెర్లమూడిలో మారేపల్లి వెళ్లే రహదారి పక్కన మురుగు కాల్వలు బాగుజేయకపోవడంతో నీరంతా రోడ్డుపైకే చేరుతోంది. దీంతో స్థానికులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమ గోడు వినిపించుకోవడంలేదని గ్రామస్థుడు లక్కిరెడ్డి కృష్ణారెడ్డి వాపోయారు. దీనికితోడు అక్కడ దోమలు వృద్ధి చెందడం, దుర్వాసన రావడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పల్లెర్లమూడి (తిరువూరు)

నీడనిచ్చే చెట్టు నరికేస్తే ఎలా..?



గంగినేని ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చెట్టు నరికివేతను గ్రామస్థులు అడ్డుకున్నారు. నీడ ఇస్తున్న చెట్టును తొలగించడమేమిటని కేంద్రానికి పిల్లలను పంపించే తల్లిదండ్రులు నిలదీశారు. కేంద్రం సిబ్బందే చెట్టు తొలగించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచిస్తుంటే సిబ్బంది ఇలా చేయడం సబబు కాదని హెచ్చరించారు. దీనిపై మైలవరం సీడీపీవోను న్యూస్‌టుడే వివరణ కోరగా ఆ కేంద్రాన్ని సందర్శించి, పరిశీలించిన తదుపరి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు

స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ



తిరువూరు: సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకుల ఆందోళన

తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని జంట థియేటర్ల కూడలిలో ఆందోళన చేశారు. సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని నినాదాలు చేశారు. నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, పి.శ్రీనివాసరావు, ఎం.ఉదయ్, ఎ.రవి, జీవన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. ★ ఎ.కొండూరు మండలం చీమలపాడులో సీపీఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ★ విస్సన్నపేట మండల పరిధిలోని విద్యుత్తు ఉపకేంద్రాల వద్ద స్మార్ట్ మీటర్లు, ఛార్జీల పెంపుదలకు నిరసనగా మంగళవారం నిర్వహించే ధర్నాలు విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు కోరారు. సోమవారం విస్సన్నపేటలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

డీపీఆర్టీయూ సభ్యత్వాల నమోదు

గంపలగూడెం: మండలంలో డీపీఆర్టీయూ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను తెలిపారు. తొలిరోజు 44 పాఠశాలల నుంచి 90 మంది ఉపాధ్యాయులు నుంచి సభ్యత్వాలు స్వీకరించినట్లు వివరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుందరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి.జమలయ్య, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.నరసింహారావు, ఏవీ.నరసింహారావు పాల్గొన్నారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో తమ కళాశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ ప్రసాద రెడ్డి తల్లి సరస్వతి పేరిట కళాశాల టాపర్‌గా నిలిచిన అనుమోలు అమృతకు రూ.25 వేల నగదు బహుమతిని అందించారు. మొదటి ఏడాది ప్రతి విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.అప్పారావు, ట్రస్టీ సాంబశివారెడ్డి, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



టాపర్‌కు నగదు బహుమతి అందజేస్తున్న కళాశాల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు తదితరులు

సీమంతాలకు సామగ్రి అందజేత

ఊటుకూరు(గంపలగూడెం): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు కోరారు. మండలంలోని ఊటుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో 22 మంది గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. వారికి అవసరమైన సామగ్రిని రాజేశ్వరరావు వితరణగా అందించారు. ప్రభుత్వం మేలైన పోషకాహారం అందిస్తోందని, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారని ఆయన పేర్కొన్నారు.



ఊటుకూరులో గర్భిణులకు చీరలు అందజేస్తున్న రాజేశ్వరావు, ఐసీడీఎస్ అధికారులు

నూతన చరవాణులు ఇవ్వాలి

తిరువూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు నూతన చరవాణులు ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గంలోని ఉద్యోగులు సోమవారం తిరువూరులో స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న ఫోనులు పనిచేయడం లేదని, మంగళవారం నుంచి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా సేవలు చేయడం సాధ్యపడదన్నారు. కొత్త ఫోన్లు సరఫరా చేసే వరకు పూర్వ పద్ధతిలోనే వివరాలు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల నుంచి 230 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వద్ద ఉన్న ఫోన్లను తిరువూరు సీడీపీవో కార్యాలయంలో అప్పగించారు. సీఐటీయూ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు పద్మ, నాగమణి, నజీమాసుల్తానా, సుష్మ, నిర్మల, లక్ష్మీకుమారి, శ్రీలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: సమ్మె కాలంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద కరపత్రాలను ప్రదర్శించి, ప్రభుత్వ సెల్‌ఫోన్‌లను కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో ట్యాబులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిభారంతో అంగన్‌వాడీ కార్యకర్తలు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు పుష్పకుమారి, శారద, బుల్లెమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు సీడీపీవో కార్యాలయం నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



మైలవరం: కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

గుర్తు తెలియని వాహనం ఢీ.. మహిళ దుర్మరణం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జూపూడి శివారు కిలేశపురం వద్ద సోమవారం జాతీయ రహదారిపై ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామంలో బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సదరు మహిళ తెల్లవారుజామున రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న వాహనం ఢీ కొంది. చీకటిలో రోడ్డుపై ఉన్న మృతదేహం కనిపించక పోవడంతో పలు వాహనాలు వెళ్లడంతో ఛిద్రమైంది. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని రహదారిపై చెల్లాచెదురుగా ఉన్న మృతదేహ భాగాలను సేకరించి శవపరీక్ష నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కొండపల్లిలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా 12వ మహాసభల జయప్రదానికి అందరి సహాయసహకారాలు అందించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు కోసం కొండపల్లిలో సోమవారం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ..ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిత్యం పోరాటాలు చేస్తుందన్నారు.

రహదారుల అభివృద్ధికి తీర్మానం ఇవ్వడం లేదు

అనుముల్లంక(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని అనుముల్లంకలో పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరవగా పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ అధికారులు తీర్మానం ఇవ్వడంలేదని గ్రామస్థుడు జి.శ్రీనివాసరెడ్డి సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో బాబూరావుకు ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ నుంచి నిధులు మంజూరై నెలలు గడుస్తోందని, పంచాయతీ నుంచి తీర్మానాలు ఇప్పించాలని గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు జి.కమల మండల పరిషత్ సమావేశంలో కూడా అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామ తెదేపా నాయకులు కూడా ఎమ్మెల్యే శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినా గ్రామ పంచాయతీ నుంచి పనులు నిర్వహణకు అవసరమైన తీర్మానం ఇవ్వడం లేదని అర్జీలో పేర్కొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

బూర్గంపాడు, న్యూస్‌టుడే: గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణానికి చెందిన ఖాజావలీ(55) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సారపాకలోని కర్మాగారంలో సరకు లోడింగ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అక్కడి సిబ్బంది భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాషా - ఆంటోనీలా..
దేవా - సైమన్


నాగార్జున, శ్రుతిహాసన్

"సినిమా సెట్స్‌కు వెళ్లినప్పుడు బోర్ కొట్టకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు వైవిధ్యభరితమైన పాత్రలు చేయాల"ని అన్నారు నటుడు నాగార్జున. తాను 'కూలీ'లో ప్రతినాయక పాత్ర పోషించడానికి కారణమిదేనని తెలిపారు. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ఈ 'కూలీ' చిత్రాన్ని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. నాగార్జున, ఆమిర్ ఖాన్, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ ప్రత్యేక వీడియోను తెలుగు ప్రేక్షకులతో పంచుకున్నారు. ఈ చిత్ర కథ విన్నప్పుడు నాగార్జున పోషించిన సైమన్ పాత్రను తానే చేయాలన్నంత ఆసక్తి కలిగిందన్నారు. ఎందుకంటే ఆ పాత్ర స్టైలిష్‌గా, శక్తిమంతంగా ఉంటుందని తెలిపారు. "నాగ్‌తో కలిసి థాయ్‌లాండ్‌లో చేసిన 17రోజుల షెడ్యూల్‌ని నా జీవితంలో మర్చిపోలేను. సైమన్ పాత్రలో ఆయన నటన చూస్తుంటే ఆశ్చర్యమేసింది. బాషా - ఆంటోని లాగా కూలీ దేవా - సైమన్ పాత్రలు గుర్తుండిపోతాయి" అని రజనీ ఆ వీడియోలో చెప్పారు.

అప్పుడంతా నన్ను వెనక్కి లాగాలనుకున్నారు!

'ఖైదీ' చూశాక లోకేశ్ దర్శకత్వంలో చేయాలని బలంగా అనుకున్నానని.. ఆ కోరికే 'కూలీ'తో అతన్ని నాకు దగ్గర చేసిందని అన్నారు నాగార్జున. "నిన్నే పెళ్లాడతా' చేశాక 'అన్నమయ్య' చేస్తుంటే 'ఇప్పుడిలాంటి ప్రయోగం ఎందుకని అందరూ తనని వెనక్కి లాగే ప్రయత్నం చేసినట్లు చెప్పారు. "నా కెరీర్‌లో చాలా ప్రయోగాలు చేశా. చాలా దెబ్బలు తిన్నా. మంచి విజయాలూ అందుకున్నా. రజనీ చెప్పినట్లు ఎప్పుడూ మంచి వాళ్లలాగే నటిస్తే బాగుండదు కదా. లోకేశ్ నన్ను కలిసినప్పుడు 'మీరు విలన్‌గా చేస్తానంటే మీకొక కథ చెప్తా' అన్నప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపించింది" అన్నారు నాగార్జున. లోకేశ్ కనగరాజ్ మాట్లాడుతూ.. సైమన్ పాత్ర కోసం నాగార్జునకు ఏడు నరేషన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రుతిహాసన్, సత్యరాజ్, దిల్‌రాజు, సురేశ్ బాబు, సునీల్ నారంగ్, జాన్వీ నారంగ్ తదితరులు పాల్గొన్నారు.

"యాక్షన్, థ్రిల్లర్.. ఇలా ఏ చిత్రానికైనా భావోద్వేగాలే బలం. దాన్ని నేను బాగా చెప్పగలుగుతున్నానని ప్రేక్షకులు నమ్మడం నా అదృష్టం. ఇకపై దాన్ని మరింత గొప్పగా చెప్పే ప్రయత్నం చేస్తా" అన్నారు గౌతమ్ తిన్ననూరి. 'మళ్లీ రావా', 'జెర్సీ' లాంటి విజయాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడాయన. ఇప్పుడు విజయ్ దేవరకొండ హీరోగా 'కింగ్‌డమ్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఇది ఇటీవల విడుదలైన నేపథ్యంలో సోమవారం 'ఈనాడు సినిమా'తో ప్రత్యేకంగా ముచ్చటించారు గౌతమ్.

కథల్లో హీరోల జోక్యం మంచిదే!


గౌతమ్

మీ సినిమాల విషయంలో రచనా ప్రయాణాన్ని ఎక్కువ ఆస్వాదిస్తారా? మేకింగ్ ప్రాసెస్‌ని ఎక్కువ ఇష్టపడతారా?

"మళ్లీ రావా', 'జెర్సీ' చిత్రాల సమయంలో రచనా ప్రయాణాన్ని ఎక్కువ ఆస్వాదించేవాణ్ని. కానీ, 'కింగ్‌డమ్' చిత్రానికి వచ్చే సరికి రైటింగ్ కన్నా మేకింగ్ ప్రాసెస్ నాలో మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఎందుకంటే దర్శకత్వ విషయంలో టెక్నికల్‌గా మనల్ని మనం మరింత మెరుగు పరుచుకునే ప్రాసెస్ ఏదైతే ఉందో దాన్ని బాగా ఎంజాయ్ చేస్తున్నా".

మీ కథల వెనక మీ వ్యక్తిగత అనుభవాలు, చదివిన పుస్తకాల్లో వేటి ప్రభావం ఎక్కువ ఉంది?

"నా కథల్ని ప్రేక్షకులు రిలేట్ చేసుకోగలిగేలా ఉండటానికి నేను చూసిన వ్యక్తిగత అనుభవాలే కారణమనుకుంటా. నేను పుట్టింది ఓ మధ్యతరగతి కుటుంబంలో. ఆ సామాజిక, ఆర్థిక పరిస్థితులకు తగ్గట్లుగానే మన చుట్టూ ఉండే ఫ్రెండ్స్, చుట్టాలు ఉంటారు. నాకు బాగా తెలిసిన ప్రపంచం అదే. కాబట్టి నా కథలు.. పాత్రలు కూడా ఆ ప్రపంచం నుంచే బయటకొస్తుంటాయి".

కథలపై హీరోల జోక్యం ఏమైనా ప్రభావం చూపిస్తుందా?

"చాలా మంది దర్శకులు తాము అనుకున్నట్లుగానే కథలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. నా వరకు నా కథలపై ఎవరి ప్రభావం ఉండకుండా చూసుకుంటా. అయితే ఒక్కోసారి మన కథాలోచనలకు తగ్గట్లుగా హీరోల ఐడియాలు కూడా జతకలిసినప్పుడు ఆ కలయిక మన కథని గొప్ప స్థాయికి తీసుకెళ్లిపోతుంది. అది చాలా మంచి పరిణామం. కొన్నిసార్లు ఆ కలయిక కుదరనప్పుడు చిన్న సలహా కూడా మన కథని వెనక్కి లాగే అవకాశముంటుంది. నేనెప్పుడూ హీరో యాక్టివ్‌గా కథలో పాలుపంచుకుంటేనే మంచిదని నమ్ముతా".

రామ్‌చరణ్ లాంటి స్టార్‌తో సినిమా వదులుకోవడానికి కారణం?

"మేము తనతో అనుకున్న యాక్షన్ కథను సరిగ్గా ముందుకు తీసుకు వెళ్లలేకపోతున్నాం అనిపించినప్పుడు.. మరో రెండు మూడు నెలల టైమ్ తీసుకుని దాన్ని బలవంతంగా పుష్ చేయడం సరికాదనిపించింది. నాలుగైదు నెలలు బాగా ఆలోచించి.. నా సహచరులతో చర్చించే ఆ ప్రాజెక్ట్ ఆపేయాలని నిర్ణయం తీసుకున్నా. కానీ, కచ్చితంగా భవిష్యత్తులో చరణ్‌తో కలిసి పని చేస్తా".

ఈనాడు సినిమా

6 దేశాలు.. 23 సెట్లు..
150 రోజుల షూట్


వామికా గబ్బి, అడివి శేష్

'గూఢచారి'గా వెండితెరపై అడివి శేష్ చేసిన యాక్షన్ హంగామా సినీప్రియుల్ని అలరించింది. ఇప్పుడీ చిత్రానికి కొనసాగింపుగా 'జీ 2'ని సిద్ధం చేస్తున్నారు శేష్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వినయ్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. వామికా గబ్బి కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మే 1న థియేటర్లలోకి రానున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో 6 దేశాలు, 23 సెట్లు, దాదాపు 150 రోజులకు పైగా చిత్రీకరణ అంటూ షూట్ వివరాల్ని వెల్లడించారు శేష్.

మరిన్ని విశేషాలు https://eenadu.netలో

తాజా కబురు
కథ కుదిరింది


గోపీచంద్

కథానాయకుడు గోపీచంద్ ప్రస్తుతం సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ పీరియాడిక్ యాక్షన్ చిత్రం చేస్తున్నారు. ఇది ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఈలోగానే ఇప్పుడాయన మరో సినిమాకి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. ఈ చిత్రంతో ఫైట్ మాస్టర్ వెంకట్ దర్శకుడిగా పరిచయం కానున్నట్లు సమాచారం. ఇది గోపీచంద్ శైలికి తగ్గట్లుగా సాగే శక్తిమంతమైన యాక్షన్ కథతోనే ముస్తాబు కానున్నట్లు తెలుస్తోంది.

కళ్లకు కట్టినట్టు ఎర్రచందనం కూలీల జీవితం

సినిమా : 'రెడ్ శాండల్ వుడ్'
ప్లాట్‌ఫామ్ : ఈటీవీ విన్ (తెలుగులో), అమెజాన్ ప్రైమ్ వీడియో



డబ్బులకు ఆశపడి అక్రమంగా ఎర్రచందనం చెట్లు కొట్టే కూలీలు, వారి జీవితాల్లోని వెతలకు తెర రూపమే 'రెడ్ శాండల్ వుడ్' చిత్రం. కుటుంబాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించడానికి ఈ ఊబిలోకి దిగుతున్న ఆ కూలీల ప్రపంచంలోకి ఓ బాక్సర్ వెళ్తే ఏమవుతుంది? అనేదే ఆసక్తికరం.

కథాంశం: ఉద్యోగ ప్రయత్నాలన్నీ ఫలించకపోవడంతో ఇంట్లో వాళ్లకు తెలియకుండా ఎర్ర చందనం చెట్లు కొట్టే పనిలో చేరతాడు కర్ణ (విశ్వంత్). కొడుకు ఎక్కడ ఉన్నాడో తెలియక మదనపడుతూ ఆటో నడిపిన కర్ణ తండ్రికి యాక్సిడెంట్ అవుతుంది. దీంతో ఎలాగైనా కర్ణను ఇంటికి తీసుకురమ్మని అతని చెల్లెలు వినుత(దియా).. బాక్సింగ్‌లో ఆరితేరిన తన ప్రియుడు ప్రభ (వెట్రి)తో చెబుతుంది. కర్ణను వెతుక్కుంటూ వెళ్లిన ప్రభకు కనిపించకుండా పోయిన ఆ వ్యక్తితో పాటు ఓ భయంకరమైన నిజం తెలుస్తుంది. అదే ఎర్ర చందనం అక్రమ రవాణా. మరి ఆ తర్వాత ఏం జరిగింది? కర్ణను క్షేమంగా ఇంటికి తీసుకొచ్చాడా? లాంటి ఆసక్తికర ప్రశ్నలకు సమాధానమే 'రెడ్ శాండల్ వుడ్'. గురు రామానుజమ్ దర్శకుడు. వెట్రి, దియా మయూరి, గణేశ్ వెంకట్రామన్, విశ్వంత్, రామచంద్ర రాజు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

◆ ఎర్రచందనం స్మగ్లింగ్, అక్రమ రవాణా నేపథ్యంలో ఇప్పటికే ఎన్నో సినిమాలొచ్చినా 'రెడ్ శాండల్ వుడ్' వాటన్నింటికీ పూర్తి భిన్నం. ఇందులో ఎర్రచందనం చెట్లు కొట్టే కూలీల జీవితాల్ని కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. ఎక్కువ డబ్బులు వస్తాయని వయసుతో సంబంధం లేకుండా ఈ ఊబిలోకి దిగుతున్న కూలీల రోజువారీ జీవితాన్ని సహజత్వానికి దగ్గరగా, భావోద్వేగభరితంగా చూపించారు. సినిమా నిడివి తక్కువే ఉన్నా.. చెప్పాలనుకున్న కథను స్పష్టంగా తెరపైకి తీసుకొచ్చారు దర్శకుడు.

బ్రో.. ఓ లుక్కేయమ్మా!

దుల్కర్ కొత్త చిత్రం


దుల్కర్ సల్మాన్, నాని

కథానాయకుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాతో రవి నేలకుదిటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టగా.. బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్ఛాన్ చేశారు. గుణ్ణం సందీప్, నాని, రమ్య గుణ్ణం స్క్రిప్ట్ అందించారు. రవి గౌరవ దర్శకత్వం వహించారు. "ఇది బలమైన భావోద్వేగాలతో నిండిన ప్రేమకథతో రూపొందుతున్న సినిమా. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

నవ్వులు పంచే చిదంబరం


వంశీ

'క' లాంటి విజయవంతమైన చిత్రంతో ప్రేక్షకుల్ని మెప్పించిన శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు 'శ్రీ చిదంబరం' అనే మరో కొత్త సినిమాతో అలరించేందుకు సిద్ధమైంది. వంశీ తుమ్మల, సంధ్య వశిష్ఠ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వినయ్ రత్నం తెరకెక్కిస్తున్నారు. చింతా వినీషా రెడ్డి, చింతా గోపాల కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను హీరో కార్తికేయ సోమవారం విడుదల చేశారు. మెల్లకన్ను ఉందని ఆత్మన్యూనతతో కళ్లద్దాలు పెట్టుకుని జీవితాన్ని మేనేజ్ చేసే కుర్రాడు ప్రేమలో పడితే ఏం జరిగిందన్నది వినోదాత్మకంగా చూపించనున్నారు.

వేతనాల పెంపును వ్యతిరేకిస్తున్నాం : టీఎఫ్‌సీసీ

సినీ కార్మికులకు 30శాతం పెంపుతో వేతనాలు చెల్లించాలంటూ ఫిల్మ్ ఫెడరేషన్ చేసిన డిమాండ్‌ను నిర్మాతలంతా వ్యతిరేకించారని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగు చిత్ర పరిశ్రమ చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందని.. ఇలాంటి సమయంలో వేతనాల పెంపుదలను సమర్థించలేమని.. ఈ సమస్య పరిష్కారం కోసం కార్మిక శాఖ కమిషనర్ మార్గదర్శకత్వంలో చర్చలు జరుగుతున్నాయని.. లేబర్ కమిషనర్ మాటను ధిక్కరిస్తూ వేతనాల పెంపును అంగీకరించిన నిర్మాతలతోనే షూటింగ్‌లు చేస్తామని ఫెడరేషన్ నిర్ణయించడం బాధాకరమన్నారు. నిర్మాతలు ఇవ్వగలిగే వేతనాలకు పని చేయాలనుకున్న ఔత్సాహిక నిపుణులు, కార్మికులు యూనియన్‌లో లేకపోయినా వాళ్లతో షూటింగ్స్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నిర్మాత లేనిదే సినిమా పరిశ్రమ లేదన్న విషయాన్ని కార్మిక సంఘాలు గుర్తించుకోవాలని హితవు పలికారు.

మానవుడు.. దైవత్వం


సోనాక్షి సిన్హా

సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో వెంకట్ కల్యాణ్ - అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'జటాధర'. ఉమేశ్ కుమార్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. "మానవుడు - దైవత్వం, శాపం - శక్తి లాంటి అంశాలతో ముడిపడి ఉన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ కథతో ఈ సినిమా ముస్తాబవుతోంది. ఈ చిత్ర టీజర్‌ను ఈ నెల 8న విడుదల చేయనున్నాం" అని చిత్ర బృందం తెలిపింది.

ఆరోగ్యం.. ఆదాయం

రైతేరాజు

ప్రకృతి సాగు చేస్తున్న గృహిణి అనూరాధ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే


బొప్పాయిలను చూపుతున్న అనూరాధ

బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన గృహిణి చలమలశెట్టి అనూరాధ ప్రకృతి సాగు విధానంలో మిద్దె తోట పెంచుతున్నారు. పెరటి తోట పెంపకంపై ఆసక్తితో తొలి అడుగు వేసిన ఆమె.. ఇప్పుడు ఎందరో సాగుదార్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. అయిదేళ్ల కిందట తమ ఇంటిపైన మిద్దె తోట ఏర్పాటు చేసుకున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సాధారణ పద్ధతిలో రకరకాల కూరగాయలు, ఆకుకూరలు పెంచుతూ వచ్చారు. అవి కేవలం తమ ఇంటి అవసరాలకే సరిపోతున్నాయి. ప్రస్తుతం సాగుదారులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్న నేపథ్యంలో కూరగాయలు విషతుల్యంగా మారుతున్నాయి. ప్రకృతి సాగు చేసి తనవంతుగా కొందరికైనా రసాయన రహిత కూరగాయలు, ఆకుకూరలు అందించాలనుకున్నారు. 25 సెంట్ల భూమిని సిద్ధం చేసుకుని 365 రోజుల పెరటి తోట ఏర్పాటు చేశారు. జిల్లా ప్రకృతి సాగు విభాగం సిబ్బంది సూచనలతో అవగాహన పెంచుకుని నాలుగేళ్ల కిందట అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మొక్కలు నాటారు. ప్రస్తుతం అవన్నీ కాపునకు వచ్చాయి. ఉత్పత్తులను చుట్టుపక్కల వారికి తక్కువ ధరకే అందిస్తూ... వారికి ఆరోగ్యం, తనకు ఆదాయం అనే రీతిలో ముందుకు సాగుతున్నారు.

ప్రముఖుల సందర్శన

☛ జిల్లాలో ప్రకృతి సాగుని ప్రోత్సహించేందుకు అధికార యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోంది. ఆ క్రమంలో ఔత్సాహిక రైతులకు అనూరాధ ఆదర్శ క్షేత్రాన్ని నమూనాగా చూపుతున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, నీతి ఆయోగ్ సభ్యులు, విదేశీ బృందాలు సైతం ఆమె సాగు తీరుని పరిశీలించి మెచ్చుకోవడం గమనార్హం.

☛ ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ.. 'ఇంట్లో ఖాళీగా ఉండడం ఎందుకని మొదట సరదా వ్యాపకంగా మిద్దె తోట ఆరంభించాను. ప్రకృతి సాగు గురించి తెలుసుకున్న తర్వాత, అధికారుల ప్రోత్సాహంతో ఖాళీ స్థలంలో సాగుకు శ్రీకారం చుట్టాను. పెరటి తోట వలన కొంతమందికైనా నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తున్నాననే తృప్తితో పాటు నెలకు రూ.5 వేలకుపైగా ఆదాయం కూడా లభిస్తున్నందున మరింత శ్రద్ధ పెట్టాను.' అని ఆమె వివరించారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త జవాబు

ప్రశ్న: మిరప పంటకు నేలలు, విత్తే కాలం, ఎరువుల గురించి వివరించండి?
- పి.రాజేష్, రైతు, కొడాలి

సమాధానం: మిరప పంటకు నల్ల నేలలు, లంక భూములు, ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు అనుకూలం. ఆగస్టులో విత్తవచ్చు. 3-4 సార్లు దుక్కి దున్ని 2 సార్లు గుంటక తోలాలి. నారు పెంచేందుకు సెంటుకు 650 గ్రా. (ఒక ఎకరానికి సరిపడా నారు) విత్తనాలు అవసరం. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వాడాలి. లేదా పచ్చిరొట్ట పైరును పెంచి భూమిలో కలియ దున్నాలి. ఎకరానికి 120 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 48 కిలోల పొటాషియం అందించే ఎరువులు వేయాలి. **- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం - ఘంటసాల, న్యూస్‌టుడే**

ఉద్యాన పంటల్లో చెద పురుగుల సస్యరక్షణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఉద్యాన పంటల్లో చెదల నివారణ చర్యల గురించి శాస్త్రవేత్తలు సుధారాణి, రేవతి వివరించారు. ☛ చెట్ల పాదుల చుట్టూ చెద పురుగులను ఆకర్షించే సేంద్రియ పదార్థాన్ని గమనిస్తే తొలగించాలి. నర్సరీలో మొలకెత్తే గింజలను నది ఇసుకతో కప్పుకోవాలి. నర్సరీలో చెద పురుగుల దాడిని నివారించడానికి నర్సరీని 20 - 25 రోజుల వ్యవధిలో రెండుసార్లు క్లోర్‌పైరిఫోస్(0.05 శాతం)తో తడపాలి. ☛ చెద పురుగులకు వ్యతిరేకంగా పనిచేయడానికి చెట్ల అడుగు భాగాల చుట్టూ లేదా నర్సరీ పడకల్లో యుఫోర్బియా జాతులను (యుఫోర్బియా తిరుకల్లి లాంటివి) నాటాలి. వేప ఉత్పత్తులను పిచికారీ చేయాలి. ☛ జీడి పప్పు షెల్ ఆయిల్ స్ప్రే చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. ఒక శాతం కాపర్ సల్ఫేట్ ద్రావణాన్ని స్ప్రే చేసి నివారించవచ్చు. చెట్ల అడుగు భాగం చుట్టూ సున్నం వేయడం వల్ల కూడా చెదను నివారించవచ్చు. చెట్ల అడుగు భాగం చుట్టూ కలప బూడిద పూయడం వల్ల కూడా ఆశించిన ఫలితాలు పొందవచ్చు. పురుగు మందులైన క్లోరిపైరిఫోస్, ఇమిడాక్లోప్రిడ్ 17.8 8 ఎస్ఎల్ మందును లీటరు నీటికి 0.25 మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

నారుమడి యాజమాన్యం.. ఎలుకల నివారణ

ఘంటసాల, పామర్రు గ్రామీణం-న్యూస్‌టుడే


ఊడ్పునకు సిద్ధమైన నారుమడి

వరి నారు మడి యాజమాన్య పద్ధతులు, ఎలుకల నివారణ గురించి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త కె.రేవతి వివరించారు. నారుమడిలో పోషకాలు బయటకు పోకుండా గట్టు వేసుకోవాలి. చెత్త ఉండకూడదు. కాలువలో మట్టి తీసి మడిలో వేసి ఎత్తు చేసుకోవాలి. బురద పదును ఉంచి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు తీయాలి. నారు తీసే 15 రోజుల ముందు లేదా విత్తిన 15 రోజుల తరువాత 2.2 కిలోల యూరియా వేయాలి. నారు పురి విచ్చుకునే వరకు ఆరుతడిగా నీరు పెట్టి తరువాత పలుచగా నిల్వ చేయాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. ఇనుము ధాతు లోప నివారణకు లీటరు నీటికి 20 గ్రా. అన్నభేది, 2 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి వారం వ్యవధిలో 2 మార్లు పిచికారీ చేయాలి. నారు తీయడానికి 7 రోజులు ముందు సెంటు మడికి 160 గ్రా. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి తక్కువ నీరు ఉంచి వేయాలి. నారు తీసే ముందు యూరియాను పైపాటుగా వేయకూడదు. ☛ సామూహికంగా ఎలుకల నివారణతో మేలు. ముందుగా బొరియలు గుర్తించి తేమ మట్టితో మూసివేయాలి. గట్ల సంఖ్య, వాటి పరిమాణాన్ని కుదించుకుంటే బొరియలను తగ్గించుకోవచ్చు. నారుమడి పోసిన దగ్గర నుంచి దమ్ము వరకు ఎకరానికి 200 బుట్టలు పెడితే వలస వచ్చిపోయే ఎలుకలను నివారించుకోవచ్చు.


ఎలుక బొరియ

బర్రో ఫ్యూమిగేటర్: పంట ఏ దశలో ఉన్నా.. కన్నాల్లోకి బర్రో ఫ్యూమిగేటర్ ద్వారా పొగ వదిలి చంపవచ్చు. కన్నం చుట్టూ ఉన్న పగుళ్లను మట్టితో మూసి వేసి పొగను కనీసం 3 నిమిషాలు వదలాలి.

జింకు ఫాస్ఫైడ్ ఎర: విషపు ఎరలను చిరు పొట్ట దశ ఏర్పడక ముందే వాడాలి. ఉద్ధృతి మరీ ఎక్కువగా ఉంటే పంట కాలంలో ఒక్కోసారి మాత్రమే జింకు ఫాస్ఫైడ్ ఎర వినియోగించాలి. ముందుగా 98 పాళ్ల నూకల్లో.. 2 పాళ్ల నూనె కలిపి విషం లేని మందు తయారు చేసి కన్నాల వద్ద పెట్టి రెండు రోజులు వాటిని మచ్చిక చేసుకోవాలి. మూడో రోజు 96 పాళ్ల నూకల్లో 2 పాళ్ల నూనె, 2 పాళ్ల జింకు ఫాస్ఫైడ్ కలిపిన ఎర పొట్లాలు కన్నాల వద్ద పెట్టాలి

బ్రోమాడయోలిన్ విషపు ఎర: 96 పాళ్ల నూకల్లో 2 పాళ్ల నూనె, 2 పాళ్ల బ్రోమాడయోలిన్ కలిపి పొట్లాలుగా కట్టి కన్నాల వద్ద పెట్టాలి. చేతికి తొడుగులు వేసుకుని ఎర తయారు చేసుకోవాలి.

సహకార వ్యవస్థను మరింత శక్తిమంతం చేయడమే లక్ష్యం


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. వేదికపై వీరాంజనేయులు, గోపాల్, రాజశేఖర్ తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : రాష్ట్రంలో సహకార రంగాన్ని మరింత శక్తిమంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. దీనికి మంత్రి హాజరై మాట్లాడారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, సకాలంలో రుణాలు అందిస్తున్న ఆప్కాబ్. వ్యవసాయ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతిక ప్రగతితో సహకార బ్యాంకుల సేవలను మరింత విస్తృతం చేస్తామని, ప్రజలతో మమేకం చేస్తామని చెప్పారు. డీసీసీబీ, పీఏసీఎస్, ఆప్కాబ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘకాలం నుంచి సేవలు అందిస్తున్నాయని కొనియాడారు. గతంలో ఈ వ్యవస్థకు కేంద్రంలో మంత్రిత్వ శాఖ లేదని, 2014లో ప్రధాని మోదీ ప్రత్యేకమైన శాఖను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ వ్యవస్థలో జవాబుదారీతనం లోపించడం, రికార్డులు లేకపోవడంతో గతంలో పలు అవినీతి కార్యకలాపాలు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుగా ఏపీలోనే పీఏసీఎస్‌లను కంప్యూటీకరించారని వెల్లడించారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు డ్వాక్రా వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. సుమారు కోటి మంది మహిళలు ఇందులో భాగస్వాములై.. రూ.42వేల కోట్ల లావాదేవీలు చేస్తున్నారని వివరించారు. ఈ లావాదేవీలు అధికంగా ప్రైవేటు బ్యాంకుల్లో జరుగుతున్నందున.. ఆప్కాబ్ బ్యాంకుల్లో డ్వాక్రా లావాదేవీలు జరిగేలా చర్యలు చేపట్టేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. ఆప్కాబ్ ఛైర్మన్ జి.వీరాంజనేయులు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, నాబార్డ్ సీజీఎం ఎమ్మార్ గోపాల్, జిల్లాల డీసీసీబీ ఛైర్మన్లు, పీఏసీఎస్ ఛైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ అకాడమీ సేవలు ప్రశంసనీయం


డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో ఆరోగ్య అవగాహన ప్రదర్శన ప్రారంభం


ప్రదర్శన ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు


బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థులు

చిన్నఅవుటపల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లో సిద్ధార్థ అకాడమీ అందిస్తున్న విద్య, వైద్య సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లి డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన 'ఆరోగ్య అవగాహన ప్రదర్శన' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అకాడమీ అధ్యక్షుడు మల్లినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ లలితాప్రసాద్, వైద్య కళాశాల డీజీ డా.చదలవాడ నాగేశ్వరరావుతో కలిసి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పరికరాలు, ఆధునిక వైద్య శాస్త్రం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఎంతో ఉపయుక్తమన్నారు. అకాడమీ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సంస్థ 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య అవగాహన ప్రదర్శన ఈ నెల 10 వరకు కొనసాగుతుందని కళాశాల డీజీ డా.చదలవాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అనంతరం డా.సుధా, నాగేశ్వరరావు దంత వైద్య కళాశాలలో ఏర్పాటుచేసిన దంత వైద్య ప్రదర్శనను ప్రిన్సిపల్ డా.రామోజీరావు, ఏవో మధుసూదనరావు, అకాడమీ ప్రతినిధులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వ విప్ వెంకట్రావు.. అకాడమీ పెద్దలైన ఏవో మధుసూదనరావును ఘనంగా సత్కరించారు. తొలిరోజు విజయవాడ చిగురుపాటి కృష్ణవేణి, గుణదల సెయింట్ జాన్, వివేకవర్ధిని, రామకృష్ణమిషన్ పాఠశాల, ప్రజ్ఞ పాఠశాలల నుంచి సుమారు 650 మంది విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డా.సీవీ.రావు, ప్రిన్సిపల్ డా.మేజర్ ఎమ్వీ భీమేశ్వర్, సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, కె.కల్యాణి, సూరపనేని రాజగోపాల్ ఇతర విభాగాధిపతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'అర్హులనే పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా నియమించాలి'


మాట్లాడుతున్న కృష్ణారావు. పక్కన గణేశ్వరరావు, సతీష్‌కుమార్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా నియమించడానికి అర్హత గల అధికారులు ఉన్నప్పటికీ పదవీ విరమణ చేసిన టి.దామోదరనాయుడిని ఒప్పంద పద్ధతిలో తిరిగి నియమించాలని చూడడం సరికాదని ఆ శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.ఎస్.కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సీనియారిటీ నియమాలు, ప్రమోషన్ల నిబంధనలు, స్పష్టమైన నియామక ప్రక్రియ ఉన్నప్పటికీ.. వాటిని పాటించకుండా ఆయనకే పదవి అప్పజెప్పాలని చూడడం సమంజసం కాదన్నారు. డిపార్టుమెంటులోని అన్ని ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని వివరించారు. వెటర్నరీ డాక్టర్ నుంచి డైరెక్టర్ వరకు ఒక పద్ధతి ప్రకారం నడుస్తున్న ప్రమోషన్ ఛానల్ దెబ్బతిని, అందరూ నష్టపోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా తిరిగి దామోదరనాయుడినే నియమించడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. డైరెక్టర్ పదవికి శాఖలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అధికారితో పాటు మరో ఇద్దరు మహిళా అధికారులు ముందు వరుసలో ఉన్నారని వివరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎల్.గణేశ్వరరావు, కోశాధికారి ఎన్.సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు జి.రవిబాబు, సహాయ కార్యదర్శి ఇ.రాజేష్, ఎల్.రమేష్, బి.భువన, జె.కృష్ణకుమార్, సురేష్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో పిల్లల అసభ్య చిత్రాలు

కేసు నమోదు చేసిన పోలీసులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : పిల్లల అసభ్యకరమైన చిత్రాలు, మార్ఫింగ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం తీవ్రమైన నేరం. అలాగే వెబ్‌సైట్లలో వెతికినా నేరంగా పరిగణిస్తారు. కానీ కొందరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, ట్విట్టర్, స్నాప్‌చాట్, గూగుల్ వంటి సామాజిక మాధ్యమాల్లో పిల్లల అసభ్యకరమైన చిత్రాలను అప్‌లోడ్ చేస్తున్నారు. 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్.సి.ఎం.ఇ.సి.) ఇలాంటి దుశ్చర్యలపై నిఘా ఉంచి సమాచారం సేకరిస్తుంది. అంతర్జాల ఐపీ చిరునామాల ప్రకారం.. అప్‌లోడ్ అయిన ప్రాంతాలను గుర్తించి ఆ వివరాలను సంబంధిత ప్రాంత సైబర్ క్రైం పోలీసులకు అందిస్తుంది. ఇలా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో చిన్నారుల అసభ్యకరమైన చిత్రాలను అప్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా సామాజిక మాధ్యమ వినియోగదారుల సమాచారాన్ని సైబర్ క్రైం పోలీసులకు పంపించారు. దీనిపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

గణితం అంటే భయపడేవారే ఎక్కువ. ఈ భయంతోనే స్టెమ్ రంగాలవైపు వెళ్లడానికీ సంకోచిస్తుంటారు. అమ్మాయిల్ని గణితం, స్టెమ్ రంగాలవైపు ఆకర్షించడానికి ఇండియన్ విమెన్ అండ్ మ్యాథ్స్ (ఐడబ్ల్యూఎం) ఆధ్వర్యంలోని నేషనల్ బోర్డ్ ఫర్ హయ్యర్ మేథమేటిక్స్ (ఎన్‌బీహెచ్ఎం) కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఏటా దేశవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో గణితం చదువుతున్న యువతులకు పరీక్ష నిర్వహిస్తోంది. వారిని ఓ వేదిక మీదకి చేర్చి మెలకువల్నీ నేర్పిస్తోంది. దానికి ఎంపికైంది బి.మౌనిక!



5 వేలమందిలో ఈమె ఒక్కరే!

మౌనికది నల్గొండ జిల్లాలోని జక్కులవారి గూడెం. అమ్మానాన్నలిద్దరూ వ్యవసాయ పనులు చేస్తారు. చిన్నప్పటి నుంచీ గణితంలో మంచి మార్కులు సాధించేది. నాగార్జున డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం బీఎస్సీ చదువుతోందీ అమ్మాయి. గణితంపై తనకున్న పట్టును గమనించిన కళాశాల ప్రిన్సిపల్, మేథ్స్ ప్రొఫెసర్ ఆమెను ప్రోత్సహించారు. శిక్షణనిచ్చి ఐడబ్ల్యూఎం నిర్వహించే ప్రవేశపరీక్ష రాయించారు. దానిలో మౌనిక ఎంపికవ్వడమే కాదు, బెంగళూరులోని క్రైస్ట్ డీమ్డ్ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ గణితశాస్త్ర సమ్మేళనానికీ హాజరైంది. 'ఐడబ్ల్యూఎం ఏటా ఈ మేథ్స్ వర్క్‌షాప్‌నకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. గణిత సంబంధిత కోర్సులు చదువుతున్న ప్రభుత్వ కళాశాలల యువతులే ప్రవేశపరీక్ష రాయడానికి అర్హులు. రాష్ట్రానికి ఒకరినే ఎంపిక చేసి, పదిరోజులు శిక్షణనిస్తారు. ఆ సమయంలో అయ్యే ఖర్చులన్నీ సంస్థే భరిస్తుంది. ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనం, ప్రశంస పత్రాలనూ అందిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారే కాదు, బోధించేవారూ మహిళలే. అమ్మాయిలను మేథ్స్ వైపుగా ఆకర్షించడం, క్రిటికల్ మేథమేటికల్ థింకింగ్ దిశగా ప్రోత్సహించడం, భిన్న రంగాల్లో గణిత అంశాల ఆధారంగా సమస్యను పరిష్కరించేలా చూడటం ఈ ప్రోగ్రామ్ లక్ష్యాలు. రాష్ట్రం నుంచి అయిదు వేలమందిలో నేను ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. దేశవ్యాప్తంగా ప్రఖ్యాత విద్యాసంస్థల ప్రతినిధులు రియల్ అనాలిసిస్, లీనియర్ ఆల్జీబ్రా, గ్రూప్ థియరీ వంటి గణిత శాస్త్రంలోని వివిధ అంశాల్లో మెలకువలు నేర్పారు. గణితశాస్త్రంలో జరగనున్న నూతన సంస్కరణల గురించీ అవగాహన కల్పించారు. గణితం ద్వారా ఎన్నెన్ని మార్గాల్లో భవిష్యత్తు నిర్మించుకోవచ్చో అర్థమయ్యాక ఈ సబ్జెక్టు మీద మరింత ఆసక్తి కలిగింది' అంటోంది మౌనిక. భవిష్యత్తులో గణితశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తుందట ఈ అమ్మాయి. ప్రొఫెసర్‌గా మారి విద్యార్థుల్లో లెక్కలమీద భయం పోగొట్టాలనే లక్ష్యాన్నీ నిర్దేశించుకున్నానని చెబుతోంది.

– మిరియాల గణేష్‌కుమార్, నల్గొండ



ఏంటా చూపు?

'చూడు నీకోసం ఏం తెచ్చానో... కొత్త షర్ట్ నచ్చిందా?' మురిపెంగా చెబుతూ కొడుకు వైపు చూసింది తల్లి. అతని ముఖంలో మాత్రం రియాక్షన్ ఉండదు.

ఆఫీసులో... సీరియస్‌గా ఏదో చెబుతున్నారు మేనేజర్. అందరిలోనూ టెన్షన్. ఒక్కమ్మాయి మాత్రం అలా చూస్తూ ఉంది.


ఈ రెండు సందర్భాల్లోనూ అవతలి వాళ్ల మదిలో ఒకటే ప్రశ్న! 'ఆ చూపుకి అర్థమేంటి' అనే! దీన్నే 'జెన్ జీ స్టేర్' అంటున్నారు. ఇది సీరియస్ విషయమే అంటున్నాయి అధ్యయనాలు. ఈ తరం పూర్తిగా ఇంటర్నెట్ లోకంలో పెరిగింది. వీళ్లు కాస్త ఎదిగే సమయానికి కొవిడ్. దీంతో సామాజికంగా దూరమయ్యారు. దేనికీ భయపడరు, ఏ సందర్భంలోనైనా కూల్‌గా ఉంటారని అంతా అనుకుంటున్నా... నిపుణులు మాత్రం దీన్ని సోషల్ యాంగ్జయిటీగానే చెబుతున్నారు. ఒకరకంగా తమ భావాలను ఎలా చెప్పాలో తెలియక అలా ప్రవర్తిస్తున్నారట. కాబట్టి, ఇంట్లోవాళ్లే నెమ్మదిగా మార్చాలంటున్నారు. చాలావరకూ వీళ్ల సమస్య... ఎలా స్పందించాలో తెలియకపోవడమే. కాబట్టి, నేరుగా అడగండి. 'నువ్విలా బ్లాంక్‌గా చూస్తోంటే పొగరు అనుకుంటారు. లెక్కలేనితనంగా భావిస్తారు లేదా నీకు ఆసక్తి లేదు అనుకుంటారు' అంటూ వీటి అవసరాన్ని గుర్తుచేస్తుండండి. కోపం, నవ్వు, బాధ... ఇలా అన్ని రకాల భావోద్వేగాలనూ ప్రదర్శించేలా చూడాలి. ఎందుకంటే ఇవీ వారి భవిష్యత్‌కి అవసరమే!



'డ్రాగన్ టీ' తాగారా..!

డయాబెటీస్ పెరిగినా, దగ్గు ఎక్కువైనా, బరువు పెరుగుతున్నా... కారణమేదైనా టీ, కాఫీలను మానేయాలి అనుకునే వారే ఎక్కువ. కానీ అలవాటు పడిన ప్రాణాల్ని... ఒక్కసారిగా ఆపేయమంటే కుదురుతుందా. అందుకే మనం ఎంత అనుకున్నా వీటిని కొనసాగిస్తాం. తాగిన తరవాత బాధపడుతుంటాం. గ్రీన్, బ్లాక్ టీలు ఎన్ని వచ్చినా... రుచించక వాటి జోలికి వెళ్లరు మనలో కొంతమంది. మరి సమస్య తగ్గేదెలా? అందుకే పింక్ డ్రాగన్ టీను తాగి చూడండి. ఉపశమనం కలుగుతుంది అంటున్నారు నిపుణులు. డ్రాగన్ ఫ్రూట్‌ను ఎండబెట్టి, పొడిగా చేసి తయారుచేస్తారు. ఇందులో ఉండే పీచు జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి తోడ్పడుతుంది. గట్ హెల్త్‌ను కాపాడుతుంది. అలానే విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లూ పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రోగనిరోధక శక్తినీ పెంచుతాయి. రోజూ ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల కొలాజెన్ ఉత్పత్తి పెరిగి కేశాలు మృదువుగా, బలంగా తయారయ్యేందుకు ఉపయోగపడతాయి. దీన్ని తయారుచేసుకోవడం సులభమే... వేడి నీటిలో కాస్త పింక్ డ్రాగన్ టీ పొడిని వేసుకుంటే చాలు. అన్నట్లు ఇది నేచురల్ స్వీటెనర్ కూడా. తేనె, బెల్లం, చక్కెర లాంటివి వాడాల్సిన అవసరమూ లేదు.

అమ్మా... దానం చేద్దామా!



'అమ్మా ఆకలి...' ఈ మాట రావడం ఆలస్యం బిడ్డ కడుపు నింపడానికి పరుగు తీస్తుంది తల్లి! నిజానికి ఏ సంబంధం లేనివారైనా, వయసుతో సంబంధం లేకుండా కూడా సాయానికి ముందుకొస్తాం. మరి... మాటలురాని పసివాళ్ల సంగతేంటి? కడుపున పుట్టినవారైతే ఏడుపు విని స్తన్యమిస్తాం. ఆ అవకాశం లేని శిశువుల మాటేంటి? అమృతతుల్యమైన అమ్మపాలకు దూరమవ్వాల్సిందేనా?

పూర్వం రాణులకు పాలు పడకపోతే రాజులు తమ పిల్లలకు పాలివ్వడానికి ప్రత్యేకంగా దాదీలను ఏర్పాటు చేసేవారట. నిజానికి తల్లులూ ముందుకొచ్చి అమ్మ పాలు లేని చిన్నారులకు తమ పిల్లలతోపాటుగా స్తన్యమిచ్చేవారట. అప్పుడు గేదెలు, ఆవులు లేకనా? కానీ తల్లిపాలల్లోని పోషకాలను మరిపించలేవవి. ఆ సంగతి తెలుసు కాబట్టే, వాటికే ప్రాధాన్యమిచ్చారు. కాలం మారింది. టెక్నాలజీ పెరిగింది. అయితేనేం, శిశువులకు ఆ 'లిక్విడ్ గోల్డ్'ని మించిన పోషకాహారాన్ని సృష్టించలేమన్నది వాస్తవం. కాబట్టి, పాపాయి ఆరోగ్యంగా ఎదగాలంటే అమ్మపాలకు మించిన అమృతం మరొకటి లేదు.

ప్రెగ్నెన్సీలో సమస్యలు, అమ్మ దూరమవడం, ప్రిమెచ్యూర్ డెలివరీ... కారణమేదైతేనేం, ఇప్పటికీ తల్లిపాలకు దూరమవుతున్న శిశువులు లక్షల్లోనే. కానీ ఆధునిక అమ్మలు అప్పటి తరాల్లా స్తన్యం పంచుకోవడానికి ఇష్టపడటం లేదు. సాయపడాలనే మనసే ఉండాలి కానీ నేరుగా స్తన్యమే ఇవ్వాలా? కాసిన్ని పాలు దానం చేసినా చాలు. అలాంటి పిల్లలు ఎక్కడున్నారా అంటూ వెతకాల్సిన పనీ లేదు. 'హ్యూమన్ మిల్క్ బ్యాంకు'లకు అందిస్తే అవే కావాల్సిన వారికి అందిస్తాయి.

వాళ్లకిస్తే మా పిల్లల సంగతో?

చాలామంది సందేహమిదే! ప్రసవమైన తొలినాళ్లలో పిల్లలకు అవసరమయ్యేదేమో తక్కువ. స్తన్యాలేమో పాలతో నిండి నొప్పి పుడుతుంటే పిండి పారబోస్తుంటారు చాలామంది. అవెంత అమూల్యం? వృథాగా పారబోసే వాటినే దానమిచ్చినా ఎంతోమంది చిన్నారుల ప్రాణాలు కాపాడొచ్చు అంటారు వైద్యులు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)ల్లో రోజూ ఎంతో మంది శిశువులు ప్రాణాలతో పోరాడుతూ ఉంటారు. అలాంటివారికి ఫార్ములా పాలు జీర్ణం చేసుకోవడం కష్టం. తల్లి పాలు వాళ్లని కాపాడతాయి. ఒక చిన్నారిని కాపాడామన్న సంతృప్తీ మీకు దక్కుతుంది. పైగా పాలు తీసేకొద్దీ క్షీరగ్రంథులు ఉత్తేజితమవుతాయి. పాల ఉత్పత్తిని పెంచుతాయి. కాబట్టి, మీ పిల్లలకు ఉండవన్న సమస్యే ఉండదు. పైగా ఇలా దానం చేయడం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు త్వరగా దరిచేరవు, మానసిక సమస్యలూ దూరమవుతాయి అంటున్నాయి అధ్యయనాలు.

మేమే తెచ్చుకోవాలంటే...


'తొలి వ్యాక్సిన్' తల్లిపాలకు ఉన్న పేరే ఇది! కానీ పాలు పడని కారణంగా కొందరు తల్లులు వాటిని అందించలేరు. అప్పుడు ఆ రక్షను పిల్లలకు అందించలేకపోతున్నామనుకున్న తల్లులూ 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంకు'ల నుంచి పాలను తెచ్చుకోవచ్చు. పాలు దానం చేసే తల్లి ఆరోగ్యాన్ని పరీక్షించాకే సేకరిస్తారు. వాటిని పాశ్చరైజేషన్ చేస్తారు. కాబట్టి, అసురక్షితమన్న భయమే అక్కర్లేదు.

తల్లిపాల దానం కొత్తేమీ కాదు. ఇదీ రక్తదానం లాంటిదే. ఆసియాలోనే తొలి హ్యూమన్ మిల్క్ బ్యాంకు ముంబయిలో ప్రారంభమైంది. తరవాత ఎన్‌జీఓలు, ప్రభుత్వ సంస్థల కారణంగా ఈ మిల్క్ బ్యాంకులు దేశవ్యాప్తమయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రులూ వీటిని నిర్వహిస్తున్నాయి. కానీ ఇప్పటికీ తల్లిపాల దానంపై ఎన్నో సందేహాలు, సంకోచాలు. 'ఒక్క ప్రాణం కాపాడొచ్చని ఊహించుకోండి. అప్పుడు వాటి విలువ తెలుస్తుంది...' దానం చేస్తున్న ఓ తల్లి మాట ఇది. దీనికి కష్టపడాల్సిన పనీ లేదు. సమీపంలోని మిల్క్ బ్యాంకును సంప్రదిస్తే వాళ్లే సేకరించుకుని వెళతారు. జాగ్రత్తలూ, సూచనలూ వివరిస్తారు. మీరు చేయాల్సిందల్లా పాలు అందించడమే! ఒక నవజాత శిశువుకు ఒకసారికి 8-15 ఎంఎల్ పాలు పడతారట. 100ఎంఎల్ అందించినా ఎన్ని జీవితాల్ని కాపాడొచ్చో ఆలోచించండి. అమ్మగా మరో బిడ్డకి ఆరోగ్యాన్ని ఇవ్వండి.

తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1–7)

మీకు తెలుసా?

ఒక మహిళ తన జీవితంలో దాదాపు 3500 రోజులు నెలసరిలో గడిపేస్తుందట. అది దాదాపు 9.8 సంవత్సరాలకు సమానం.



చేసే పని మీద ప్యాషన్, లక్ష్యాన్ని సాధించాలనే తపన ఉంటే... మహిళలకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. నా వరకూ ఎవరైనా నువ్వు అమ్మాయివి... ఈ పని చేయడం నీవల్ల కాదు అంటే మాత్రం... దాన్ని సాధించడానికి రేయింబవళ్లు కష్టపడేదాన్ని. ఈ శ్రమే నన్ను విమెన్ అంత్రప్రెన్యూర్‌గా తీర్చిదిద్దింది.

– అదితి చౌరాసియా,
సహ వ్యవస్థాపకురాలు, ఇంజినీర్‌బాబు

ఆనందం... మెరిపిస్తుంది!



అందమైన మెరిసే చర్మం కోసం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తుంటాం కదా! ఆ చెక్‌లిస్ట్‌లో ఆనందం ఉందా? చర్మ ఆరోగ్యంపై దాని ప్రభావమూ ఎక్కువే అంటున్నారు నిపుణులు.

పాత ఫొటోలను తిరిగేయండి. చాలా ఆనందంగా ఉన్నవాటిని గమనించారా? దుస్తులు, మేకప్‌తో సంబంధం లేకుండా అందంగా కనిపిస్తారు. ఆ మాయ ఆనందానిదే అంటారు స్కిన్ స్పెషలిస్టులు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు సెరటోనిన్, ఆక్సిటోసిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. వీటిలో ఆక్సిటోసిన్ చర్మంపై చూపే సానుకూల ప్రభావం చాలానే. ఇది ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి, చర్మం మెరవడంలోనూ సాయపడుతుందట. అదే ఇందుకు భిన్నంగా ఒత్తిడితో సతమవుతున్నారనుకోండి. ఈ హ్యాపీ హార్మోన్లు తగ్గి, ఒత్తిడి కలిగించే కార్టిసాల్ విడుదలవుతుంది. దీంతో మొటిమలు, ఎగ్జిమా... అంటూ బోలెడు సమస్యలు.

ఇంతకీ రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? ఇది చేసే మాయా తక్కువ కాదు. ఎరుపెక్కిన అమ్మాయి బుగ్గలు అని చాలాసార్లే వింటాం. నచ్చినవాళ్ల పక్కన ఉన్నప్పుడు, బాగా ఆనందంగా ఉన్నప్పుడు బుగ్గల్లో రక్త ప్రసరణ పెరుగుతుంది ఆ మాయే ఇలా కెంపు రంగు అద్దుకుంటుంది. పెళ్లి, ప్రేమ... తొలిరోజుల్లో కొత్త అనుభూతులను పంచడమే కాదు, కాస్త ఒత్తిడికీ గురిచేస్తుంది కదూ! అవునుమరి... నచ్చేలా కనిపించడానికీ, మెప్పించడానికీ ఎన్నెన్ని తిప్పలు పడాలో. ఆ ప్రభావమూ యాక్నే రూపంలో ముఖాన్ని పలకరిస్తుంది. కంగారొద్దు లెండి... కాస్త ఒకరికొకరు అర్థమై సాన్నిహిత్యం పెరిగాక ఇవన్నీ దూరమవుతాయి. అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమే కాదు... కుటుంబ సభ్యుల ఆత్మీయత కూడా చర్మంపై ప్రభావం చూపగలదు. అందుకే చుట్టూ ఆనందకర వాతావరణం ఉండాలంటారు. వాళ్లిచ్చే ఆత్మీయ కౌగిలీ ఒత్తిడిని దూరం చేసేదే.

అన్నట్టూ... ఆత్మీయులతో గడిపేస్తోంటే సమయమే తెలియదు కదూ! నచ్చినవన్నీ లాగించేస్తాం. కబుర్లలో పడి ఏ అర్ధరాత్రో నిద్రలోకి జారతాం. ముఖ్యంగా అలిసిపోతాం... దీంతో మేకప్ తీయడం మర్చిపోతాం. కానీ ఇవన్నీ చర్మానికి హాని చేసేవే. ఏదో ఒకసారి అంటే పర్లేదు. కానీ తరచూ జరుగుతోంటే మాత్రం చర్మం పద్దు రాసుకుంటుంది. ఆ అసంతృప్తిని పొడి, నిర్జీవమైన చర్మం, మొటిమల రూపంలో ప్రదర్శిస్తుంది. కాబట్టి, జాగ్రత్త!

క్రీములు, ఆహారం అంటూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం కానీ... ఆనందమూ అందానికి ముఖ్యమే! ఎంత ఆనందం, సంతృప్తితో ఉంటే చర్మం అంత హైడ్రేటెడ్‌గా కనిపిస్తుంది. అంతే కళగానూ కనిపిస్తారు. కాబట్టి, ప్రశాంత వాతావరణం, ఎక్కువ నవ్వులు, ఆత్మీయ కౌగిలింతలు... మీ దినచర్యలో ఉండేలా చూసుకోండి మరి.

ఎవరీ మధుర?



'ఎక్కడ పెరిగినా ఏ స్థాయికి ఎదిగినా తమ సంస్కృతీ సంప్రదాయాల్ని మరిచిపోకూడద'నే ఎవరైనా చెబుతారు. కానీ ఆ కారణంతోనే మధుర శ్రీధరన్ ట్రోలింగ్‌కి గురయ్యారు.

మధుర... భారత సంతతికి చెందిన అమెరికన్ లాయర్. ఇటీవలే ఒహాయో 12వ సొలిసిటర్ జనరల్(ఎస్‌జీ)గా ఎంపికయ్యారు. అంటే- అత్యున్నత న్యాయవాదిగా వ్యవహరిస్తారు. అమెరికా సుప్రీంకోర్టుతో సహా రాష్ట్ర, సమాఖ్య కోర్టుల్లో అప్పీళ్లకు ఒహాయో తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

మధుర అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఎంఐటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలతోపాటు ఆర్థిక శాస్త్రంలోనూ డిగ్రీ చేశారు. ఆ తరవాత న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి జ్యూరిస్ డాక్టర్ పట్టా పొందారు. ఈ నియామకానికి ముందు ఒహాయోలో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. ఇన్ని అర్హతలున్న మధురను 'భారతీయురాలు, బొట్టు పెట్టుకున్నార'న్న కామెంట్లతో ట్రోల్ చేశారు. అయితే వీటిని తిప్పికొడుతూ- 'మధుర చాలా తెలివైనది. ఒహాయో వాసుల నిరంతర రక్షకురాలు, సమాఖ్యవాద ఛాంపియన్. గతంలో ఈ రాష్ట్రానికి ఎస్‌జీలుగా చేసిన వాళ్లే ఆమెను సిఫారసు చేశారు. తన సేవల్ని సమర్థంగా అందించగలదు. పైగా యూఎస్ పౌరుల బిడ్డ. అమెరికా పౌరుడిని వివాహం చేసుకుంది. ఈ పోస్టుకి పూర్తిస్థాయి అర్హురాలు...' అని ఒహాయో అటార్నీ జనరల్ డేవ్ యోస్ట్... ఎక్స్‌లో రాయడంతో అది కాస్తా వైరలైంది. ఈ సంగతలా ఉంచితే, మధురకు ప్రయాణాలన్నా వంట చేయడమన్నా ఎంతో ఇష్టమట. ఆ వంటకాల ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేస్తుంటారు. అమెరికాలో పెరిగినా చీరల్నీ ఇష్టంగా ధరిస్తారు. కర్ణాటక సంగీతంలోనూ శిక్షణ పొందారు.

ఇప్పుడు పేరు మార్చుకోవచ్చా?

నాకు 40 ఏళ్లు... ఇప్పుడు నేను నా పేరు మార్చుకోవాలి అనుకుంటున్నా. సర్టిఫికెట్లలోనూ అది మారాలంటే నేనేం చేయాలి?

– ఓ సోదరి

మీరు పేరు మార్చుకోవడానికి ఒక పద్ధతి ఉంది. ఒక నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపరు మీద మీరు ఎందుకు పేరు మార్చుకోవాలనుకుంటున్నారో తెలుపుతూ ఒక అఫిడవిట్ తయారుచేయాలి. దాన్ని నోటరీ చేయించాలి. లేదా గెజిటెడ్ ఆఫీసరుతో సంతకమూ పెట్టించొచ్చు. తర్వాత స్థానిక వార్తా పత్రికలో మీ పాతపేరు, కొత్త పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారో తెలుపుతూ పబ్లికేషన్ ఇవ్వాలి. మీరు రాసిన అఫిడవిట్, పేపర్ పబ్లికేషన్, మీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఫొటోలు, నివాస ధ్రువపత్రం, వైవాహిక స్థితిని తెలిపే ఆధారాలతోపాటు తగిన చలానా జత చేయాలి. దీన్ని సెక్రటేరియట్‌లోని సంబంధిత విభాగంలో ఇస్తే వాళ్లు పరిశీలించి... మీ పేరు మార్పుని గెజిట్ పబ్లికేషన్ ద్వారా తెలియజేస్తారు. ఈ కాపీలను, దరఖాస్తుతో సహా సంబంధిత అధికారులకు ఇచ్చి మీ పేరు మార్పుని తెలియజేయాలి. వీటికి మీ సర్టిఫికెట్లను జత చేస్తే రికార్డుల్లో పేరుని మారుస్తారు. ఈ ప్రక్రియకు సుమారు 6 నెలల సమయం పట్టొచ్చు.

నా భర్తకి అమెరికాలో విడాకులు ఇవ్వొచ్చా?

నేనూ, నా భర్త... చదువుకోవడానికి అమెరికా వచ్చి... ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. స్నేహితుల మధ్య హిందూ సంప్రదాయ పద్ధతిలో ఇంట్లోనే ఈ వేడుక జరిగింది. అయితే, తర్వాత తను తరచూ అనుమానిస్తూ వేధిస్తున్నాడు. ఇక, తనతో ఉండలేక విడిపోవాలనుకుంటున్నా. కానీ, అందుకు అతడు ఒప్పుకోవడం లేదు. నీకు ఎలా విడాకులు వస్తాయో చూస్తానంటున్నాడు. ఇక్కడే తీసుకోవచ్చా? ఇండియాలోనే దరఖాస్తు చేయాలా?

– ఓ సోదరి

మీరు అమెరికాలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నా... భారతీయ చట్టాల ప్రకారం అది చట్టబద్ధమైనదే. అయితే, మీరు రిజిస్ట్రేషన్ హిందూ మ్యారేజ్ యాక్ట్ ప్రకారమే చేసుకున్నారా? ఆ విషయం తెలియాల్సి ఉంది. మీరు విడాకుల కోసం యూఎస్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ, మళ్లీ భారత్‌లో కూడా విడాకుల డిక్రీని వ్యాలిడేట్ చేసుకోవాలి. మీ పెళ్లి రిజిస్ట్రేషన్ హిందూ చట్టాల ప్రకారం ఇండియాలో జరిగి ఉంటే మీరు హిందూ వివాహచట్టంలోని సెక్షన్-13 ప్రకారం విడాకులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకవేళ మీకు అమెరికా పౌరసత్వం, గ్రీన్ కార్డ్ ఉంటే మాత్రం అక్కడే విడాకులు తీసుకోవాలి. ముందు మీరు అక్కడి లాయర్‌తో ఓసారి మాట్లాడి సలహా తీసుకోండి. ఆ తర్వాతే డివోర్స్‌కి అప్లై చేయండి. గృహహింస కేసు అక్కడ కూడా వేయవచ్చు. ఒకవేళ మీకు లాయర్‌ని పెట్టుకునే స్థోమత లేకపోతే భారత విదేశీ వ్యవహారాల శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక విభాగంలో సంప్రదించండి. వారు మీకు సాయం చేస్తారు.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

శ్రావణంలో లక్ష్మీకాసుల కళ!





శ్రావణమాసంలో శుక్రవారానికీ, అందులోనూ వరలక్ష్మీ వ్రతానికి ఉండే విశిష్టతే వేరు. ఆ రోజు అమ్మవారి ముందు పెట్టే లక్ష్మీ కాసుల గురించి మరింత ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సౌభాగ్యానికి సూచికగా పూజించే వీటిని తర్వాత మంగళసూత్రాల గొలుసుకో, నల్లపూసల చైన్‌కో జత చేసుకోవడం చాలామంది చేసేదే. వాటికి ఇంకొన్ని చేర్చి కాసుల పేరుగా మార్చుకునే వాళ్లూ ఉంటారు. కానీ, ఇవన్నీ బామ్మల ఫ్యాషన్... మాకు కొత్తదనం కావాలంటున్నారు ఈతరం. అందుకే, వారికోసం ఎప్పటికప్పుడు నయా డిజైన్లెన్నో తెస్తున్నారు తయారీదారులు. సన్నని తీగలకు వేలాడేలా, ముత్యాలు, కుందన్లు, పోల్కీలు, పగడాలు, పచ్చలు వంటివాటితో కలగలిసిపోయేలా ఇటు సింపుల్ డిజైన్లతోపాటు అలనాటి రాచరికపు గుర్తులు ప్రతిబింబించేలా టెంపుల్ స్టైల్‌లోనూ తీర్చిదిద్దుతున్నారు. దగ్గరున్న కాసుల్ని బట్టి నచ్చిన రకాల్ని ఎంచుకోవచ్చు. పట్టు దుస్తులపై ధరించి... లక్ష్మీశోభతో కళకళలాడిపోవచ్చు. బాగున్నాయి కదూ!













బాగుంది అనుకుంటేనే..!



ఫోన్ తెరిచామంటే చాలు... షాపింగ్‌కి సంబంధించి ఎన్ని నోటిఫికేషన్లో. నిత్యావసరాల దగ్గర్నుంచీ ఫోన్లు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు అన్నింటికీ ఆఫర్లే... స్క్రోల్ బార్‌లో ఆ రోజంతా అదే వస్తుంది. విని యోగదార్ల దృష్టిని ఆకర్షిస్తుంది. దాంతో డబ్బులున్నా లేకున్నా, ముందూ వెనకా ఆలోచించకుండా కొంటుంటారు. ఇదో వ్యాపార టెక్నిక్... దీని బుట్టలో పడి అవసరమైనా, కాకపోయినా వస్తువుల్ని కొంటున్నాం. కానీ జెన్‌జీ అమ్మాయిలు అలా కాదు... ఏదైనా ఉత్పత్తి కొనడానికి పక్కాగా లెక్కలూ, అంచనాలూ తయారుచేసుకుంటున్నారట. ఆన్‌లైన్ ఉత్పత్తులు కొనాలంటే ఆచితూచి అడుగులు వేస్తున్నారట. దానికి సంబంధించి వేరే సైట్లలో ధర ఎలా ఉంది? ప్రస్తుతం ఫాలో అవుతున్న సైట్ బ్రాండెడా కాదా? నాణ్యమైన ఉత్పత్తిని ఇస్తుందా? ఆఫ్‌లైన్‌లో తక్కువకు వస్తుందా... అన్న విషయాల్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. కొంతకాలం ఆగితే ధర తగ్గే అవకాశం ఉందా అన్నదీ తెలుసుకుంటున్నారట. ఇందుకు ఏఐ టూల్స్‌నూ వాడుతున్నారట. అన్ని విధాలా బాగుంది అనుకుంటేనే కొంటున్నారట. చూశారా జెన్‌జీ అమ్మాయిల తెలివి... చేతిలో ఫోన్, ఓ నోటిఫికేషన్, ఏదో చిన్న ఆఫర్ ఉందని కొనేయకుండా షాపింగ్‌లోనూ ఏఐని వాడుకుంటోన్న జెన్‌జీలను మెచ్చుకోకుండా ఉండగలమా..!

బంగారం - వెండి



4న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,800	93,350	1,15,764
విజయవాడ	99,765	92,950	1,14,900
ప్రొద్దుటూరు	1,00,200	92,180	1,14,800
రాజమహేంద్రవరం	1,01,400	92,950	1,23,000
విశాఖపట్నం	1,01,030	92,950	1,18,000
తమిళనాడు	-----	92,950	1,23,000

ఖుల్ జా ఈ-సిమ్

● ఒక్కఫోన్‌లో నాలుగైదు నంబర్లు ● ఈ-సిమ్‌తో మొబైల్‌కు రక్షణ ఎక్కువే

● ప్రీమియం ఫోన్లలో అందుబాటులో సేవలు

వేసుడు తీసుడు బాధలేదు.. సిమ్ పోతుందనే భయం లేదు..! యాక్టివేషన్ అవస్థలు అంతకన్నా లేవు! ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఒకే ఫోన్‌లో నాలుగైదు బహుళ నెట్‌వర్క్ సేవలు పొందొచ్చు! కారణం... 'ఈ-సిమ్'!



గతంలో సిమ్‌కార్డు స్లాట్‌లో వేసి యాక్టివేట్ చేస్తేనే మొబైల్ సేవలు లభించేవి. కొత్తగా వస్తున్న స్మార్ట్‌ఫోన్లలో ఫిజికల్ సిమ్ అవసరం లేదు. ఈ-సిమ్ ఆప్షన్‌తో ఒకేసారి నాలుగైదు నెట్‌వర్క్‌ల సేవలు పొందవచ్చు. అంటే ఒక్కఫోన్లో అన్ని సిమ్‌కార్డులు వేసినట్లు లెక్క. ప్రస్తుతానికి ప్రీమియం బ్రాండ్ల ఫోన్లలో ఈ-సిమ్ సేవలు లభిస్తున్నాయి.

యాక్టివేషన్ ఎలా...?

- ఈ-సిమ్‌ను సిమ్‌కార్డు అవసరం లేకుండా కేవలం క్యూఆర్ కోడ్ ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. నెట్‌వర్క్ యాక్టివేషన్ వేగంగా ఉంటుంది.
- ప్రస్తుతం ఫిజికల్ సిమ్‌లు ఉపయోగిస్తున్న వినియోగదారులు...తమ ఫోన్లలో ఈ-సిమ్ ఆప్షన్ ఉంటే మార్చుకోవచ్చు. సంబంధిత నెట్‌వర్క్‌లు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నాయి.

ఈ-సిమ్..

ఈ-సిమ్ కోసం మొబైల్‌లో ప్రత్యేక సిమ్‌స్లాట్ ఏమీ ఉండదు. అంతర్గతంగా చిప్ ఉంటుంది.

- యాపిల్, సామ్‌సంగ్, గూగుల్ పిక్సల్ తదితర ప్రీమియం ఫోన్లలో ఈ-సిమ్ సేవలు ఉన్నాయి.
- ఒకటి కన్నా ఎక్కువ సిమ్‌లు ఉపయోగించే వ్యక్తులు, తరచూ ప్రయాణాలు చేసేవారు ఈ-సిమ్‌సేవలపై ఆసక్తి చూపుతున్నారు.
- మొబైల్ తయారీ సంస్థలు ఈ-సిమ్ సదుపాయం ఉంటే.. ఒక ఫిజికల్ సిమ్ స్లాట్‌ను అందిస్తున్నాయి.
- ఈ-సిమ్ సదుపాయం ఉంటే.. అందులో వేర్వేరు మొబైల్ నంబర్ల నెట్‌వర్క్‌లు 3-5 వరకు వినియోగించవచ్చు. అయితే ఒకేసారి రెండు కన్నా ఎక్కువ మొబైల్ నంబర్లను వాడే అవకాశం లేదు.

స్మార్ట్‌ఫోన్లు కొంత భద్రమే...

- ఈ-సిమ్‌ను తొలగించడం చాలా కష్టం. తొలగించాలన్నా, మార్చాలన్నా వినియోగదారు ధ్రువీకరణ తప్పనిసరి.
- దీంతో ఈ-సిమ్ ఉన్న ఫోన్లు తిరిగి అమ్మే ప్రయత్నాలు సాధ్యం కావు. ఈ-సిమ్ ప్రొఫైల్ యాక్టివేషన్‌లో ఉంటే ఫైండ్‌మై ఫోన్ ఆప్షన్ ద్వారా ట్రాక్ చేయవచ్చు.

లాభనష్టాలివీ...

- ఫిజికల్ సిమ్ నెట్‌వర్క్ ఇబ్బంది తలెత్తితే మరోఫోన్‌లో సిమ్‌కార్డు వేసుకుని ఉపయోగించవచ్చు. ఈ-సిమ్‌లో తప్పనిసరి వినియోగసేవా కేంద్రాన్ని సంప్రదించాల్సి ఉంటుంది.
- సంప్రదాయ సిమ్‌కార్డులతో పోల్చితే ఈ-సిమ్‌లకు హ్యాకర్ల నుంచి రక్షణ కొంత ఎక్కువే. సంప్రదాయ సిమ్‌కార్డులను స్వాపింగ్ చేయవచ్చు. ఈ-సిమ్‌కార్డు నెట్‌వర్క్ సెట్టింగ్ స్వాపింగ్ కష్టమే. ఫిజికల్ సిమ్‌మాదిరి తీసివేయలేం.
- ఫిజికల్ సిమ్‌కార్డును వేర్వేరు ఫోన్లలో ఎలాంటి ఆటంకాలు లేకుండా వినియోగించవచ్చు. అయితే ఈ-సిమ్ నెట్‌వర్క్‌ను సంబంధిత సదుపాయాలున్న ఫోన్ల మధ్యనే మార్చుకోవాలి. లేదా వినియోగదారు సేవాకేంద్రంలో ఆధార్ ధ్రువీకరణతో కొత్త ఫిజికల్ సిమ్‌కార్డు తీసుకోవాలి. మరో ఫోన్‌లో సెట్టింగ్స్ పొందాలి.
- ఫిజికల్ సిమ్ ద్వారా ఒక నెట్‌వర్క్ సేవలు మాత్రమే పొందవచ్చు. ఈ-సిమ్‌లో బహుళ నెట్‌వర్క్ సేవలు లభిస్తాయి. ఈ-సిమ్ నెట్‌వర్క్ సెట్టింగ్స్‌ను వినియోగదారు తొలగిస్తే తప్ప.. వీటికి డామేజ్ ఉండదు.
- సిమ్‌కార్డు మార్చినపుడు కొత్తకార్డు కోసం డబ్బు చెల్లించాలి. కానీ ఈ-సిమ్‌కు డబ్బు అవసరం లేదు.

- ఈనాడు, హైదరాబాద్

వర్షంలోనూ గుంతలు పూడ్చేయొచ్చు..



'రహదారి గుంతలతో ఇబ్బంది పడుతున్నాం. ఒళ్లు హూనం అవుతుంది. మరమ్మతులు చేయించండి' ఇదీ ప్రజల విజ్ఞప్తి. 'వర్షాలు జోరుగా కురుస్తున్నాయి.. తగ్గే వరకు ఆగాల్సిందే' అని అధికారుల సమాధానం. సెంట్రల్ రోడ్డు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఆర్ఆర్ఐ) అభివృద్ధి చేసిన 'ఎకోఫిక్స్' మిశ్రమంతో ఇకపై ఆ మాటలు వినిపించవు. దీని తయారీకి ఉక్కు పరిశ్రమల నుంచి స్టీల్‌స్లాగ్ అనే వ్యర్థాన్ని సేకరిస్తారు. దానిని కొన్ని కెమికల్స్‌తో ప్రాసెస్ చేస్తారు. తర్వాత 12 ఎంఎం సైజ్ కంటే చిన్నగా ఉండే కంకర, తారుతో కలిపి మోడిఫైడ్ బిటుమిన్‌గా మారుస్తారు. ఈ మిశ్రమాన్ని 30 కేజీల చొప్పున బ్యాగుల్లో నింపి సరఫరా చేస్తారు. రహదారి దెబ్బతిన్న చోట అప్పటికప్పుడు దీన్ని వేసి మరమ్మతులు చేయడానికి వీలవుతుంది. వర్షం నీరు గుంతల్లో నిండి ఉన్నా వాటిని బయటకు తోడకుండానే ఆ గుంతను పూడ్చే అవకాశం ఉంటుంది. దీంతో వర్షాకాలంలోనూ పనులు కొనసాగించవచ్చు. సాధారణ విధానంలో బాగుచేసిన రోడ్లతో పోలిస్తే ఇది ఎక్కువ నాణ్యతగా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకోఫిక్స్‌ను సూరత్, దిల్లీ వంటి నగరాల్లో విజయవంతంగా వినియోగిస్తున్నారు. సోమవారం అమరావతి ప్రాంతంలోని మందడం వద్ద, విజయవాడలోని చిట్టినగర్‌లో సొరంగం రోడ్డు వద్ద ప్రయోగాత్మకంగా ఎకోఫిక్స్ మిశ్రమంతో గుంతలు పూడ్చారు. మందడం వద్ద చేసిన పనులను ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు.

– ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, తుళ్లూరు

నేలతల్లి గడుల చీరకట్టింది.. నారుమడి పచ్చబొట్టు పెట్టింది..



ఇటీవల వర్షాలు జోరందుకోవడంతో వరంగల్ జిల్లా రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. పాకాల సరస్సు తీరంలో వేల ఎకరాల్లో మడులు సిద్ధం చేశారు. కొందరు రైతులు నాట్లు కూడా వేశారు. దూరం నుంచి చూస్తే నేలతల్లి గడుల చీర కట్టుకున్నట్టు, మధ్యలో నాట్లు వేసిన ప్రాంతం పచ్చబొట్టు పెట్టినట్లుగా కన్పిస్తోంది. – న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం

పుస్తకాలు చదివే వయసులో.. రాసేస్తున్నారు..

ఈ పుస్తకాలన్నీ రాసింది.. పెద్ద రచయితలు కాదు. 15 ఏళ్లు కూడా లేని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. ఎలా సాధ్యమని అడిగితే.. తెలుగు మాస్టారి ప్రోత్సాహమని ఆ విద్యార్థులు చెబుతున్నారు. మాతృభాష అంతరించి పోకుండా, పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలా ప్రోత్సహిస్తున్నట్లు ఆ మాస్టారు చెబుతున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు.. కవితలు, శతకాలు, చందోబద్ధంగా పద్యాలు రాస్తున్నారు. వారి రాతలకు దేశవిదేశాల్లో శ్రోతలూ ఉన్నారు. కెనడా కేంద్రంగా వివిధ దేశాల్లో ఉన్న తెలుగు భాషాభిమానుల పర్యవేక్షణలో ప్రతి నెల మొదటి ఆదివారం.. జూమ్ ద్వారా నిర్వహిస్తున్న 'ఈ కొడుతారా.. బుజ్జాయిలు' కార్యక్రమంలో తాము రాసిన కథలను ఈ విద్యార్థులు వినిపిస్తున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ ప్రోత్సాహంతో ఈ పాఠశాల విద్యార్థులు రాసిన 12 పుస్తకాలు అచ్చయ్యాయి. పల్లె పరిమళాలు, నిజమైన స్నేహితులు కథల సంకలనాలు, ఆడపిల్ల, తెలుసుకో మిత్రమా.., ప్రకృతి ఒడిలో... (మణిపూసలు) పేరిట అచ్చయిన శతకాలు ప్రశంసలందుకున్నాయి. 19 మంది విద్యార్థులు రాసిన కథల సంకలనం 'పల్లెటూరి పిల్లగాండ్లు' ఈ ఏడాది ఫిబ్రవరి 21న ఆవిష్కరించారు. కెనడా కేంద్రంగా నిర్వహించే 'గడుగ్గాయి' ఆన్‌లైన్ మాసపత్రిక అందించే పురస్కారాలను ఈ బడి విద్యార్థులు అలిశెట్టి రాహుల్, దారవేని అశ్విత అందుకున్నారు.





బాలకవులు శ్రుతి, రిచిత, రాహుల్, శశాంక్, అశ్విత

ఆడపిల్ల పుస్తకంలోని పద్యాలివి...

మన ఇంటికి దీపమై	కడుపులోని పాపలను
మన ప్రేమకు రూపమై	పుట్టకముందె జంపును
నిలుస్తుంది ఆడపిల్ల	ఎందుకింత ఆడపిల్ల
మన వంశంపు మూలమై!	మీదను కోపముండును!

– న్యూస్‌టుడే, ధర్మారం

సంకల్ప బలం



ఆశయాన్ని సాధించేందుకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు ఝార్ఖండ్ రాష్ట్రంలోని హజారీబాగ్‌కు చెందిన సజుల్ టుడు. చిన్న పనికి కూడా ద్విచక్ర వాహనాన్ని ఉపయోగిస్తున్న ఈ రోజుల్లో సైకిల్‌పై దేశం చుట్టి వచ్చేందుకు బయలుదేరిన టుడు ఇప్పటికే సుమారు 6 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించాడు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని 163వ నంబరు జాతీయరహదారిలో ఛత్తీస్‌గఢ్‌కు సైకిల్‌పై వెళ్తున్న ఇతడిని సోమవారం 'న్యూస్‌టుడే' పలకరించింది. 'కొన్నేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో ఎడమ చేయి పోయింది. ఎడమ కాలు కూడా వైకల్యానికి గురైంది. లక్ష్యం గొప్పదైతే అంగవైకల్యం అడ్డు కాదని వాటి చెప్పేందుకే సైకిల్‌పై దేశ పర్యటన చేస్తున్నా. ఇప్పటికే ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో పర్యటించా..ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళుతున్నా. ప్రతి రోజూ 20 నుంచి 40 కి.మీ.లకుపైగా ప్రయాణిస్తా' అని టుడు తెలిపారు. ఒంటి చేయి, ఒంటికాలితో సైకిల్‌పై పర్యటన సాగిస్తున్న ఈ యువకుడిని పలువురు అభినందిస్తున్నారు. –న్యూస్‌టుడే, వాజేడు

గాల్లో నుంచే గస్తీ!



చెట్ల మధ్య జూదం ఆడుతున్నా.. ఖాళీ ప్రదేశాల్లో కోడి పందేలు కాస్తున్నా.. ఎక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా సరే.. అన్నింటినీ ఆకాశం నుంచే గమనిస్తుంది.. 'డీజేఐ మ్యాట్రిస్ 4టి' డ్రోన్. చీకట్లోనూ వీడియోలు తీస్తోంది. ఏలూరు జిల్లా పోలీసుల చేతిలో ఉన్న ఈ బుల్లి లోహవిహంగం ఇప్పటికే ఎన్నో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసింది. దానికున్న రంగు దృష్ట్యా సమీపంలోకి వచ్చేవరకూ ఎవరూ గుర్తించలేరు. ఎక్కడ ఎగురుతుందో ఆపరేటర్‌కు తప్ప మూడో కంటికి తెలియదు. 120 మీటర్ల దూరంలో ఉన్న వారినీ స్పష్టంగా చిత్రీకరిస్తుంది. ఈ డ్రోన్‌ను వారం నుంచి వాడుతున్నామని, ఏ ఒక్క నిందితుడూ దీన్నుంచి తప్పించుకోలేదని ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్ వివరించారు.



ఏలూరు బీడీ కాలనీ వద్ద కొందరు యువకులు గంజాయి తాగుతున్నట్లు డ్రోన్ చిత్రాలతో తెలుసుకొని.. పోలీసులు వెళ్లి పట్టుకున్నారు.

ఏలూరు అమీనాపేట ప్రాంతంలో అక్రమంగా నిలిపిన ఈ కారు డ్రోన్ కంటపడింది. అంతే.. 'ప్లీజ్ వెకెట్ ది వెహికల్' అని పలుమార్లు ప్రకటించింది. ఎంతకూ వాహనాన్ని తొలగించకపోవడంతో అది తీసిన చిత్రం ఆధారంగా పోలీసులు కారు యజమానికి అపరాధ రుసుం విధించారు.



- ఈనాడు, ఏలూరు

ఈ డ్రోన్ ప్రత్యేకతలెన్నో..

150 మీటర్ల ఎత్తు ఎగరగలదు.	ఏఐ టెక్నాలజీతో లొకేషన్, మనుషులను గుర్తిస్తుంది.	స్మార్ట్ ట్రాకర్‌తో 4 కి.మీ. వరకు ఎవరినైనా లైవ్ ట్రాక్ చేస్తుంది.	స్పీకర్‌తో పబ్లిక్ అనౌన్స్‌మెంట్లు ఇస్తుంది.	ట్రాఫిక్ స్తంభిస్తే సైరన్ ఇచ్చి అప్రమత్తం చేస్తుంది.	నైట్ విజన్ కెమెరాలు, త్రీడీ మ్యాపింగ్ దీని సొంతం.

డ్రైవర్లపై నిఘాకు 'ఏఐ'

బస్సు నడుపుతున్నప్పుడు డ్రైవర్ల కదలికలను పర్యవేక్షించేందుకు చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయ విద్యార్థులు కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన సాంకేతికతను అభివృద్ధి చేశారు. చెన్నై నందంబాక్కంలో అన్ని ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం తరఫున ప్రయాణికుల వాహనాల ప్రదర్శన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అన్నా వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు జాన్ మోసెస్, కపిల్ ప్రీతమ్, హరీష్, కిశోర్‌లతో కూడిన బృందం రూపొందించిన సాంకేతికతను ప్రదర్శించారు. జాన్ మోసెస్ మాట్లాడుతూ.. 'ఈ సాంకేతికతను వినియోగిస్తే బస్సు నడుపుతున్నప్పుడు డ్రైవర్‌కు కళ్లు తిరుగుతున్నట్లు అనిపించినా బస్సు వేగం తగ్గి రోడ్డు పక్కన ఆగిపోతుంది. దాంతో పాటు బస్సు యజమానికి సమాచారం అందిస్తుంది. గేర్, బ్రేక్, క్లచ్, యాక్సిలరేటర్‌పై డ్రైవర్ కలిగించే ఒత్తిడి ఆధారంగా వారి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తుంది. బ్రేకులు ఎప్పుడు విఫలమవుతాయో ఏడాది ముందుగానే తెలిపే విధంగా బస్సు మొత్తం వ్యవస్థను పర్యవేక్షిస్తుంది. ఈ అధునాతన సాంకేతికతను పాత బస్సుల్లో అమర్చాలంటే రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అదే కొత్త బస్సుల్లో అయితే ఖర్చు కాస్త తగ్గుతుంది. అధునాతన కెమెరాతో కూడిన రోవర్ బస్సు కిందకు వెళ్లి లోపాలేమైనా ఉంటే గుర్తిస్తుంది. దాన్ని సరిచేయడానికి సమీపంలో ఉన్న గ్యారేజ్‌కు మార్గం చూపుతుంద'ని పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, చెన్నై (ఆర్కేనగర్)



వారిని నియంత్రించడం సాధ్యం కాకపోయినా..

అన్ని రోజులూ ఒకేలా ఉండవు.
జీవితంలో ఏ రోజుకారోజు కొత్త కొత్త సమస్యలు ఎదురవుతుంటాయి.
కొత్త మూర్ఖులు తారసపడుతుంటారు.
ఆ సమస్యలను, మూర్ఖులను నియంత్రించడం మీకు సాధ్యం కాకపోవచ్చు!
కానీ మీ ఆలోచనలను, చర్యలను మీరు నియంత్రించుకోగలరు. మీ నియంత్రణలో ఉన్నవాటిపై దృష్టి పెడితే చాలు..
జీవితం చాలా మెరుగ్గా సాగుతుంది.

– మిచల్ మార్టిన్సన్, కంటెంట్ క్రియేటర్

జీవాలకూ.. నేలకూ బలమే

ఇక్కడ నీటిలో నాచు పేరుకుపోయిందా.. పాకురు పట్టిందా అనే అనుమానాలు కలుగుతున్నాయా? కానీ ఇది అజొల్లాగా పిలిచే త్రిభుజాకార చిన్నమొక్కల సమూహం. కోళ్లు పశువులు, జీవాలకు అత్యుత్తమ పౌష్టికాహారం. వరి పంటలో అధిక దిగుబడికి సేంద్రియ ఎరువుగా, కలుపు మొక్కల నివారిణి గానూ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం దీనికి భారీగా డిమాండు ఉంది. ఎక్కువగా చైనా నుంచి దిగుమతయ్యే అజొల్లాను స్థానికంగా పెంచడంపై రైతుల్లో ఇప్పుడిప్పుడే ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో దీని కొనుగోలు, పెంపకం అధికంగా ఉందని వెటర్నరీ విశ్వవిద్యాలయ పశు ఉత్పత్తి, యాజమాన్య విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆర్ఎంవీ ప్రసాద్ తెలిపారు. ఇందులో 25 నుంచి 30 శాతం వరకు ప్రొటీన్, బీటా కెరోటిన్, విటమిన్ బీ12, కాల్షియం, పొటాషియం, ఫాస్పరస్, మెగ్నీషియం తదితర ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని వెల్లడించారు.

-ఈనాడు, హైదరాబాద్




ఆయిల్‌పామ్‌కు సెలైన్ చికిత్స



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురానికి చెందిన రైతు పాషా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. తోటలో చెట్లకు గానోడెర్మా తెగులు సోకి వేరు, కాండం దెబ్బతింటోంది. దాని నివారణకు ఆయిల్‌పామ్ చెట్టుకు రంధ్రం చేసి.. 200 ఎంఎల్ నీటిలో హెక్సాకోనజోల్‌ను 20 ఎంఎల్ కలిపి సెలైన్ ద్వారా కాండానికి అందిస్తున్నారు. ఈ చికిత్సతో మొక్క చనిపోకుండా సాధారణ స్థితికి తీసుకురావచ్చని ఉద్యానశాఖ అధికారి వేణు తెలిపారు.

– న్యూస్‌టుడే, కొణిజర్ల



30 ఏళ్లలో.. వేల మొక్కలు

చిత్రంలోని వ్యక్తి పేరు ఎల్. శ్రీనివాసులు. వయసు 64 ఏళ్లు. తిరుపతి కపిల తీర్థం రోడ్డులోని రామచంద్రపురంలో నివాసం ఉంటున్నారు. జాతీయస్థాయిలో సంప్రదాయ వైద్యుల సంఘం కార్యదర్శిగా ఉన్నారు. సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు యోగా, ఆయుర్వేదంలో శిక్షణ తీసుకున్నారు. చిన్నప్పటి నుంచి మొక్కలు నాటే అలవాటు ఉండటంతో 30 సంవత్సరాలుగా ఏటా సుమారు వెయ్యి మొక్కలు చొప్పున ఇప్పటివరకు 30వేలకుపైగా మొక్కలు నాటారు. నగరంలోని ఉద్యానవనాలు, అలిపిరి కాలినడక మార్గం, తిరుపతి పరిసరాల్లో వాటిని నాటుతున్నారు. సీజన్‌లో దొరికే మామిడి పండ్ల నుంచి సేకరించిన టెంకలు, విత్తనాలను శేషాచల కొండల్లో చల్లుతున్నట్లు పేర్కొన్నారు. నిత్యం మనుషులు ఉన్న మొక్కలు గురించి తెలుసుకుని వినియోగిస్తే వైద్యుల అవసరం ఉండదని చెబుతున్నారు. సోమవారం ఉదయం కపిల తీర్థం వద్ద డివైడర్లలో మామిడి టెంకలు, వివిధ ఔషధ మొక్కలు నాటుతూ కనిపించారు.

–ఈనాడు, తిరుపతి

కొత్త రూపంలో అంబులెన్సులు

త్వరలోనే సాధారణ తెలుపు రంగుతో పాటు ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు రంగులతో, రిఫ్లెక్టివ్ టేపులతో కూడిన అంబులెన్స్‌లు రయ్ రయ్‌మని దూసుకుపోనున్నాయి. వైకాపా సర్కార్ వేసిన నీలం రంగును తొలగించి, అత్యాధునిక సాంకేతిక పరికరాలు అమర్చిన సరికొత్త అంబులెన్స్‌లను వీలైనంత త్వరలో కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామికవాడలోని కుశలవ కోచ్‌లో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. సంజీవని పేరుతో తీసుకొస్తున్న 104 వాహనంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఫొటోలను ముద్రిస్తున్నారు.

–ఈనాడు, కృష్ణా, న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం






గోండి 'నన్నయ'.. ఎట్ హోంకు రావయ్య



ఆయన సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. గిరిజనుడు. వారిది గోండి భాష. దానికి లిపిలేదు. మహాభారత ఇతిహాసాన్ని కుటుంబాల్లో పెద్దల నుంచి వినడం ద్వారా దానిపై ఆసక్తి పెంచుకున్నారు. ఆ గ్రంథాన్ని గోండి భాషలోకి తెలుగు లిపితో అనువదించడం ద్వారా.. గిరిజనుల్లో చదువుకున్న వారికి, నేటి తరానికి అందుబాటులోకి తేవాలని కంకణం కట్టుకున్నారు. పండోక్న మహాభారత్ కథ పేరుతో అందుబాటులోకి తెచ్చారు. ఈ గ్రంథం ఆయనను ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం అందేలా చేసింది. ఆ ఉపాధ్యాయుడే ఆదిలాబాద్ జిల్లా మావల మండలం వాఘాపూర్‌కు చెందిన తొడసం కైలాస్. స్వాతంత్ర్య దినోత్సవం రోజున దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే 'ఎట్ హోమ్' కార్యక్రమంలో పాల్గొనాలని ద్రౌపదీముర్ము నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. ఈ ఆహ్వాన లేఖను సోమవారం తపాలాశాఖ అధికారులు సందీప్‌కుమార్, మునీర్, మహేశ్‌రెడ్డి, ప్రణయ్, సాయికుమార్‌లు ఆయన ఇంటికి వెళ్లి అందజేసి అభినందనలు తెలిపారు. – న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్



నైపుణ్యం 'ముఖం' చాటేసింది

- ముఖ గుర్తింపు హాజరు ట్యాంపర్ చేసిన నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగులు
- ముగ్గురి తొలగింపు, 10మందికి నోటీసులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)లో ముఖ గుర్తింపు హాజరు(ఎఫ్ఆర్ఏ) సాంకేతికతను ట్యాంపరింగ్ చేసి, విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు చూపిన ముగ్గురు ఉద్యోగులను తొలగించారు. మరో 10మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు. పిల్లలకు నైపుణ్యాలు నేర్పించాల్సిన సిబ్బంది విధులకు గైర్హాజరై, బోగస్ హాజరు నమోదు చేసేందుకు సాంకేతికతను వినియోగించారు. ఏపీఎస్ఎస్‌డీసీలో జనవరి నుంచి ఈ తతంగం జరుగుతూ దగా.. తాజాగా బయటపడింది. విధులకు వెళ్లకుండా క్షేత్రస్థాయిలో వేరే ఉద్యోగితో హాజరు వేయించారు. పరిశీలనలో ఈ విషయం బహిర్గతమైంది. యాప్ ద్వారా ఎఫ్ఆర్ఏ వేస్తున్నారు. ఈ ఉద్యోగులు విధులకు వెళ్లని సమయంలో ఆ యాప్‌లో ముఖం చిత్రం తొలగించి, అక్కడ పని చేసే ఉద్యోగి ముఖాన్నే వాస్తవ ఉద్యోగిగా నమోదు చేయించారు. వాస్తవ ఉద్యోగి వెళ్లిన సమయంలో బోగస్ ఉద్యోగి చిత్రాన్ని తొలగించి, ఆయన ముఖంతోనే హాజరు వేశారు. ఇలా పలు ముఖాలతో హాజరు నమోదు చేశారు. కొందరు ఉద్యోగులు విధులకు వెళ్లకుండా బయట తిరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఏపీఎస్ఎస్‌డీసీ సాంకేతిక సిబ్బంది పరిశీలించడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఇలా ఒక్క విభాగంలోనే 40మంది వరకు తప్పుడు హాజరు నమోదు చేసినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో విధులకు వెళ్లకుండానే వెళ్లినట్లు హాజరు నమోదు చేశారు.

అన్ని విభాగాల్లోనూ ఎఫ్ఆర్ఏ

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వశాఖల్లోనూ ప్రస్తుతం ఎఫ్ఆర్ఏ విధానాన్నే అనుసరిస్తున్నారు. కొన్ని విభాగాల్లో ఆయా ప్రదేశాల్లోనే హాజరు వేసేలా జియోఫెన్సింగ్ వినియోగిస్తుండగా.. చాలా విభాగాల్లో ముఖ హాజరును మాత్రమే అమలు చేస్తున్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఎఫ్ఆర్ఏను ట్యాంపరింగ్ చేయడంతో ఇతర విభాగాల్లో ఏం జరుగుతోందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నైపుణ్యాభివృద్ధి సంస్థలో జరిగిన ట్యాంపరింగ్ కారణంగా ఇతర విభాగాల్లోని ఎఫ్ఆర్ఏ అమలుపైనా ఉన్నతాధికారులు దృష్టిసారించారు. హాజరు నమోదు ఎలా జరుగుతోందనేది సర్వర్‌లో పరిశీలిస్తున్నారు. కొన్ని విభాగాల్లో ముఖ చిత్రాలను మార్చకుండా లాకింగ్ చేశారు. ఇలాంటి చోట డీడీఓల పాస్‌వర్డ్ తెలిస్తే ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఏపీఎస్ఎస్‌డీసీలో ట్యాంపరింగ్‌ను ఎలా చేశారు? దీనికి ప్రధాన కార్యాలయంలో ఎవరైనా సహకరించారా అన్న కోణంలో పరిశీలిస్తున్నారు. ఈ విషయంలో గత నెలలోనే వెలుగులోకి వచ్చి, చర్యలు తీసుకున్నా ఏపీఎస్ఎస్‌డీసీ దీన్ని రహస్యంగా ఉంచింది.




అర్జీదారులకు మందులు ఇవ్వడానికి వైద్యారోగ్యశాఖ స్టాల్ ◆ దాతల సాయంతో భోజనాల ఏర్పాట్లు

అర్జీదారులే అతిథులు!

ప్రతి సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వచ్చే అర్జీదారులను అధికారులు అతిథులుగా భావించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటున్నారు. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే వారికి రిసెప్షన్ కౌంటర్, అర్జీలు రాయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అర్జీదారులు విశ్రాంతి తీసుకోవడానికి విశాలమైన హాలుతో పాటు మధ్యాహ్నం స్వచ్ఛంద సంస్థ సహకారంతో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఆరోగ్యం బాగోలేని వారికి ఉచితంగా మందులు ఇచ్చి సలహాలు ఇవ్వడానికి వైద్యారోగ్యశాఖ సిబ్బందీ ఉన్నారు. – ఈనాడు అమరావతి

భూ నిర్వాసితుల కోసం పోరాట కమిటీ ఏర్పాటు

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు వెల్లడి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్రంలో భూ నిర్వాసితులకు అండగా ఉండేందుకు 'భూ నిర్వాసితుల పోరాట కమిటీ'ని ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు వెల్లడించారు. ఈ నెల 3న విజయవాడలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఆయన సోమవారం పత్రికలకు విడుదల చేశారు. 'భూ నిర్వాసితులకు న్యాయ సలహాలు అందించేందుకు, న్యాయ పోరాటం చేసేందుకు సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన న్యాయ సలహా కమిటీని ఏర్పాటు చేశాం. నా నేతృత్వంలోని భూ నిర్వాసితుల పోరాట కమిటీలో రైతు సంఘాల నాయకులు ఎం.వి.కృష్ణయ్య, వి.జమలయ్య, పౌర సంఘాల నేతలు వి.లక్ష్మణరెడ్డి, సింహాద్రి ఝాన్సీ, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, డి.హరినాథ్, డాక్టర్ కొల్లా రాజమోహన్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కొరివి వినయ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. పంటలు పండే భూములను పరిశ్రమలకు సేకరించవద్దు. నిరుపయోగంగా ఉన్న భూములను మాత్రమే సేకరించాలి. ఇప్పటికే సేకరించిన భూముల్లో కంపెనీలు పెట్టకుండా ఐదేళ్లు దాటితే వాటిని రైతులకు తిరిగి ఇవ్వాలి' అని పేర్కొన్నారు.

42 ఏపీపీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి పోలీసు నియామక మండలి సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11 నుంచి సెప్టెంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 5న రాత పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ 'పేపర్ -1 (ఆబ్జెక్టివ్)', మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ 'పేపర్-2 (డిస్క్రిప్టివ్)' పరీక్ష ఉంటుంది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్

డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఆగస్టు నెలంతా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ డ్రంకెన్ డ్రైవ్, ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకూ అధిక వేగం, 18 నుంచి 24 వరకూ హెల్మెట్ లేని ప్రయాణానికి సంబంధించిన ఉల్లంఘనలపై డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 31 వరకూ. . బ్లాక్‌స్పాట్‌ల ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

అమ్మ.. కన్నీటి చెమ్మ!

మృత శిశువుతో 90 కిలోమీటర్ల ప్రయాణం



జీకేవీధి నుంచి ద్విచక్రవాహనంపై మృతశిశువుతో వెళుతున్న బాలింత లక్ష్మి



తల్లి ఒడిలో మృతశిశువు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: బిడ్డ పుట్టిందన్న ఆనందం కొద్దిగంటల్లోనే ఆవిరైంది ఆ జంటకు. మృతశిశువును తరలించేందుకు అంతులేని కష్టం ఎదురైంది. కన్నుమూసిన బిడ్డను ఎత్తుకుని, రక్తస్రావం అవుతున్న భార్యను తీసుకుని మూడు వాహనాలు మారి 90 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చింది. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లాలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గూడెంకొత్తవీధి మండలం చిన్న అగ్రహారం గ్రామానికి చెందిన వంతల లక్ష్మి శనివారం రాత్రి గూడెంకొత్తవీధి ఆసుపత్రిలో పాపకు జన్మనిచ్చింది. బిడ్డ క్రమంగా నలుపు రంగులోకి మారుతుండటంతో అత్యవసర వైద్యం నిమిత్తం చింతపల్లి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి అంబులెన్సులో తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి శిశువు మృతి చెందింది. సోమవారం ఉదయం మృతశిశువును తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వాలని అడగ్గా.. తల్లికి రక్తస్రావం అవుతుండటంతో ఆసుపత్రిలోనే ఉంచాలని, చనిపోయిన బిడ్డను మాత్రం తీసుకువెళ్లాలని సిబ్బంది చెప్పారని బాధితురాలి భర్త బుజ్జిబాబు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇద్దరినీ తీసుకుని చింతపల్లి వరకు 50 కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులో, అక్కడి నుంచి జీకేవీధికి 20 కిలోమీటర్లు ఆటోలో, ఆపై స్వగ్రామం వరకు మరో 20 కిలోమీటర్లు ద్విచక్రవాహనంపై వారిని తరలించాల్సి వచ్చిందని వాపోయారు.

గడువులోగా చేసిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకే అనుమతి

- పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: లేఔట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) నోటిఫికేషన్ జారీ అయిన జులై 26వ తేదీ నుంచి నిర్దేశించిన 90 రోజుల గడువులోగా దరఖాస్తులు చేసుకోనట్లయితే.. ఆ తర్వాత అనుమతించేది లేదని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన పోర్టల్ (https://rsdtcp.ap.gov.in) ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. '2025 జూన్ 30కి ముందు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లే క్రమబద్ధీకరించుకునే వీలుంది. వ్యక్తిగతంగా ప్లాట్ యజమానులు, కాలనీ సంక్షేమ సంఘాలు, డెవలపర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్క ప్లాట్ అయినా నిర్దేశించిన కటాఫ్ తేదీకి ముందు విక్రయించినా.. లేఔట్ మొత్తం క్రమబద్ధీకరణకు అర్హత సాధిస్తుంది. అమరావతి రాజధాని ప్రాంతం మినహా మిగిలిన మున్సిపాల్టీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, మాస్టర్‌ప్లాన్ గల గ్రామ పంచాయతీల్లో నిబంధనలకు లోబడి లేఔట్‌లు క్రమబద్ధీకరించుకోవచ్చు' అని సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

ఫీజుల్లోనూ రాయితీ..: 'క్రమబద్ధీకరణకు నిర్ణయించిన రుసుములు(ఫీజులు) దరఖాస్తు చేసిన 45 రోజుల్లోగా చెల్లిస్తే ఫీజు మొత్తంలో 10% రాయితీ, 90 రోజుల్లోగా చెల్లిస్తే 5% రాయితీ వర్తిస్తుంది. ప్రభుత్వ భూములు, చెరువులు, రహదారులకు కేటాయించిన భూములు, వివాదాస్పద స్థలాలు, వరద ముప్పు ప్రాంతాలు, గ్రీన్ బఫర్ జోన్లు, తీరప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) పరిధిలో ప్లాట్లు, లేఔట్లలో ఎల్‌ఆర్‌ఎస్ అనుమతించరు. క్రమబద్ధీకరణ కింద వసూలు చేసిన ఫీజు మొత్తాలు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకే ప్రభుత్వం ఖర్చు చేస్తుంది' అని సురేశ్‌కుమార్ వివరించారు.

నాలుగు వరుసలుగా హైదరాబాద్-అమరావతి

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే!

- త్వరలోనే కన్సల్టెన్సీ డీపీఆర్‌కు టెండర్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం కన్సల్టెన్సీ డీపీఆర్ రూపకల్పనకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే కేంద్రం నుంచి ఆ దిశగా ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ఈ రోడ్డు మార్గంపై జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)లోని ఏదో ఒక ఎగ్జిట్ నెంబరు నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను ఏర్పాటుచేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఓఆర్ఆర్ నుంచి ఫ్యూచర్ సిటీకి అనుసంధానం ఉండేలా, తెలంగాణలోని మునుగోడు, మిర్యాలగూడ సమీప ప్రాంతాల మీదుగా మొత్తం నాలుగు వరుసలతో రహదారి నిర్మించే విషయమై కేంద్రం స్పష్టతకు వచ్చినట్లు సమాచారం. ఈ రహదారికి సర్వీస్ రోడ్లు ఉండవు. ప్రధాన పట్టణాలకు సమీపంలో అతి తక్కువగా ఎగ్జిట్ రోడ్లను ఏర్పాటుచేస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయాల(ఆర్‌వో) పరిధిలో ఎక్కడికక్కడ రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచే బాధ్యతలను అప్పగించనున్నారు. ఈ రహదారి పొడవు సుమారు 230-250 కి.మీటర్లు ఉండనుంది. మొత్తం నిర్మాణ వ్యయం రూ.8,800 కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు ఉండొచ్చని ప్రాథమిక అంచనా.

మొక్కు తీరాలంటే మాడు పగలాల్సిందే!

- పూజారితో తలపై కొబ్బరికాయతో కొట్టించుకున్న భక్తులు
- తమిళనాడులో వింత ఆచారం



భక్తుల తలలపై కొబ్బరికాయలు కొడుతున్న పూజారి

చెన్నై (విల్లివాక్కం), న్యూస్‌టుడే: తలపై కొబ్బరికాయ కొట్టించుకుని మొక్కు తీర్చుకునే వింత ఆచారం తమిళనాడులోని ఓ ఆలయంలో ఇప్పటికీ కొనసాగుతోంది. కరూర్ జిల్లా మెట్టుమహాదానపురంలో సుమారు 400 ఏళ్ల పురాతనమైన అరుళ్‌మిగు శ్రీమహాలక్ష్మి ఆలయం ఉంది. ఏటా ఆడి మాసంలో 18 రోజులు దీక్ష చేపట్టిన భక్తులు 19వ రోజు ఈ ఆలయంలో తలపై కొబ్బరికాయలు కొట్టించుకొని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. సోమవారం ఈ క్రతువు జరుగగా 800 మందికి పైగా మహిళలు, పురుషులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు వరుసగా కూర్చోగా ఆలయ పారంపర్య పూజారి వారి తలలపై కొబ్బరికాయలు కొట్టారు. కాయ పగిలితేనే మొక్కు తీరినట్టు భక్తులు భావిస్తారు.

మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడిపై కేసు

- ఉద్యోగాల పేరుతో మోసం చేశారని ఫిర్యాదు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులను మోసం చేసిన కేసులో కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణపై ఆదోని రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. వైకాపా హయాంలో గుమ్మనూరు నారాయణ ద్వారా సచివాలయ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఆదోనికి చెందిన జి.వెంకటేశ్, ప్రశాంత్, గుత్తికి చెందిన పి.భాస్కర్, అనంతపురానికి చెందిన అశోక్, ఇమ్రాన్ అనే యువకుల నుంచి ఆదోనికి చెందిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్‌అహ్మద్ రూ.5 లక్షలు తీసుకున్నారు. అందులో కొంత నారాయణకు పంపించారు. అయితే అనంతర కాలంలో సచివాలయ ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సదరు యువకులు తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నూర్‌అహ్మద్‌తో పాటు గుమ్మనూరు నారాయణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



విశాఖపట్నంలో 33% పడిపోయిన గాలి నాణ్యత

ఈనాడు, దిల్లీ: జాతీయ స్వచ్ఛ గాలి పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసినా పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంవల్ల విశాఖపట్నంలో గాలి నాణ్యత పడిపోయింది. 2017-18 నుంచి 2024-25 మధ్య కాలంలో ఈ నగరంలో గాలి నాణ్యత 33% పడిపోయినట్లు కేంద్ర పర్యావరణశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్ చెప్పారు. విజయనగరం తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 2017-18లో విశాఖనగరంలో ప్రతి ఘనపు మీటరు గాలిలో 76 మైక్రోగ్రాముల సూక్ష్మధూళికణాలు ఉండగా 2024-25 నాటికి 101 మైక్రోగ్రాములకు చేరినట్లు చెప్పారు. ఈ నాణ్యత శ్రీకాకుళంలో 14.5%, విజయనగరంలో 2.8% మేర పడిపోయినట్లు తెలిపారు. ఇదే సమయంలో రాజమహేంద్రవరంలో 30.6%, విజయవాడలో 29.7, కడపలో 25.3, కర్నూలులో 24.1, అనంతపురంలో 23.1, నెల్లూరులో 20.3, చిత్తూరులో 14.3, ఏలూరులో 11.1, ఒంగోలులో 10.8, గుంటూరులో 3%మేర నాణ్యత మెరుగుపడినట్లు వెల్లడించారు.

గత 5 ఏళ్లలో నికర పరిమితికి మించి రుణం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గత అయిదేళ్లలో రూ.2,10,328 కోట్ల నికర రుణ పరిమితికి ఉండగా, వాస్తవంగా బహిరంగ మార్కెట్ నుంచి రూ.3,10,422 కోట్లు, బడ్జెటేతర మార్గాల నుంచి రూ.8,877 కోట్లు కలిపి మొత్తం రూ.3,19,299 కోట్ల రుణం తీసుకుంది. ఇది వాస్తవ పరిమితికంటే 51.81% అధికం. ఇందులో వైకాపా ప్రభుత్వం 2020-21 నుంచి 2023-24 మధ్యకాలంలో రూ.1,61,111 కోట్లకు గాను బహిరంగ మార్కెట్ నుంచి రూ.2,23,217 కోట్లు, బడ్జెటేతర మార్గాలనుంచి మరో రూ.8,877 కోట్ల రుణం తీసుకుంది. 2024-25లో ఏపీ ప్రభుత్వం రూ.49,217 కోట్ల రుణపరిమితికిగాను రూ.78,205 కోట్ల అప్పు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

- ఆర్బీఐ నివేదిక ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో రూ.7 వేల కోట్లు, మేలో రూ.14 వేల కోట్లు అంటే రెండు నెలల్లోనే వైకాపా ప్రభుత్వం రూ.21 వేల కోట్ల రుణం తీసుకుంది. అదే ఏడాది మిగిలిన పది నెలల కాలంలో కూటమి సర్కారు రూ.57,205 కోట్ల అప్పు చేసింది.

ఏపీలోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు 5 ఏళ్లలో రూ.529 కోట్లు

విభజన చట్టం కింద ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేసిన రెండు కేంద్ర విశ్వవిద్యాలయాలకు గత అయిదేళ్లలో రూ.529.14 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. ఆయన సోమవారం లోక్‌సభలో విజయవాడ తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఇందులో ఏపీ సెంట్రల్ యూనివర్సిటీకి రూ.404.05 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.125.09 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన 18 బోధన, 12 మంది బోధనేతర సిబ్బంది పూర్తిగా పనిచేస్తున్నారని, సెంట్రల్ యూనివర్సిటీలో 1 బోధన, 3 బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

ఏపీలో 5.18 లక్షలమంది పీవీటీజీలు

ప్రత్యేక దుర్బల గిరిజన బృందాలు (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్) ఏపీలో 5,18,997 మంది ఉన్నట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌదరి తెలిపారు. లోక్‌సభలో అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేష్ అడిగిన ప్రశ్నకు ఈమేరకు బదులిచ్చారు. వీరికోసం 73 వన్‌ధన్ వికాస్ కేంద్రాలు ఏర్పాటుచేసి 5,950 మందికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద శిక్షణ ఇప్పించినట్లు చెప్పారు. ఇందులో పురుషులు 841 మంది, మహిళలు 5,109 మంది ఉన్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌లో కుండపోత వర్షం




హైదరాబాద్‌లోని ఫతేనగర్ దీన్‌దయాళ్‌నగర్‌లో ఓ ఇంట్లోకి వరద చేరడంతో పాడైన సామగ్రి ★ మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో రామసముద్రం కుంటకు గండి పడి వృథాగా పోతున్న నీరు

ఈనాడు, హైదరాబాద్-దంతాలపల్లి, న్యూస్‌టుడే: కుండపోత వర్షానికి హైదరాబాద్‌లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రహదారులన్నీ వరదనీటి కాలువల్లా మారిపోయాయి. ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యధికంగా కుత్బుల్లాపూర్ ప్రాంతంలో 15.15 సెం.మీ., ఆ తర్వాత బంజారాహిల్స్‌లో 12.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కొద్ది రోజులుగా నగరంలో వాతావరణం పొడిగా ఉంది. సోమవారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకుని రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో నాలాల సామర్థ్యం సరిపోక వరద రోడ్డెక్కింది. ఇళ్లలోకి నీరు చేరింది. ద్విచక్ర వాహనాలు నీటిలో మునిగి మొరాయించాయి. బంజారాహిల్స్ లాంటి కొండ ప్రాంతాల్లోనూ రోడ్లపై మోకాలు లోతున నీరు ప్రవహించింది. పక్కనే ఉన్న కృష్ణానగర్ వీధులు.. కాలువల్లా మారాయి. సచివాలయం ముందు భారీగా వరద చేరింది. నగర ప్రయాణికులు మెట్రో బాట పట్టడంతో స్టేషన్లు కిటకిటలాడాయి. మరోవైపు వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు పడ్డాయి.

చెరువుకు గండి.. పొలాల్లోకి నీరు

మహబూబాబాద్ జిల్లాలో పలుచోట్ల ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దంతాలపల్లి మండలంలో 10.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో పాలేరు వాగుకు వరద పోటెత్తింది. చెక్‌డ్యాంలు పూర్తిగా నిండి దిగువకు జలాలు పరవళ్లు తొక్కాయి. గున్నేపల్లి శివారులోని రామసముద్రం కుంట చెరువు కట్టకు గండిపడింది. దీంతో పంట పొలాలు దెబ్బతిని నష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం

హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. "ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలి. లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలి. వరదనీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. రానున్న రెండు, మూడు రోజులు వర్షాలు కురుస్తాయనే సమాచారం ఉంది. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలి. కలెక్టర్లతో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షించాలి. విపత్తు సహాయ బృందాలు అందుబాటులో ఉండి తక్షణమే స్పందించాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు.

ప్రజావాణిలో 'వ్యాపార' పాఠం



తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సప్తగిరికాలనీ, శంకరపట్నం, చిగురుమామిడి కేజీబీవీ విద్యార్థినులు ప్రత్యేక శిక్షణలో భాగంగా రాఖీల తయారీని నేర్చుకున్నారు. సొంతంగా తయారు చేశారు. ఈ విషయం తెలిసి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచనతో వీరు రాఖీలను జిల్లా కేంద్రంలోని ప్రజావాణి హాల్ వద్ద సోమవారం ప్రదర్శనగా ఉంచారు. ప్రజావాణికి వచ్చిన పలువురు వాటిని కొనుగోలు చేశారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టరు అశ్విని తానాజీ వాకడే, డీఈవో చైతన్యజైనీ, బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, గర్ల్స్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి కృపారాణి తదితర అధికారులు విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతికి, ఇతర అధికారులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు.

– ఈనాడు, కరీంనగర్; న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



సోమవారం దిల్లీ వచ్చిన గోవా గవర్నర్ అశోకగజపతిరాజును సన్మానిస్తున్న తెదేపా ఎంపీలు బీద మస్తాన్‌రావు, శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, హరీష్ బాలయోగి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని శివనాథ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

సత్తయ్య.. ప్రాణం పోశావయ్య..

సత్తయ్యది.. తెలంగాణలోని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల. గ్రామంలోని రైతుల పొలాల్లో, తోటల్లోని సుమారు 20 నుంచి 25 ఏళ్ల వయసున్న రావి తదితర 15 చెట్లను నరికేయబోతున్నారని ఆయనకు తెలిసింది. ఇది సత్తయ్యకు నచ్చలేదు. అన్నేళ్ల పెరిగిన చెట్లను రక్షించుకోలేమా? అని మదనపడ్డారు. హైదరాబాద్‌లోని వటా ఫౌండేషన్.. రహదారులు, భవనాల నిర్మాణాల్లో భాగంగా తొలగించే మహా వృక్షాలను ఇతర ఖాళీ స్థలాల్లో నాటి బతికిస్తున్న విషయం తెలుసుకుని వారిని సంప్రదించారు. గ్రామస్థులు, స్థానిక ఉద్యానవన కమిటీతోనూ చర్చించారు. వారి సహకారంతో ఆ చెట్లను గ్రామంలో పలు చోట్ల నాటారు. వాటిలో 14 తిరిగి ప్రాణం పోసుకున్నాయి. ఒక్కో చెట్టును ఇలా ట్రాన్స్‌లొకేషన్ చేయడానికి రూ.5 వేల వరకూ ఖర్చు కాగా.. గ్రామస్థులే భరించారు.

- న్యూస్‌టుడే, రాయికల్




శిక్షణ పూర్తి చేసుకున్న ఐఏఎస్‌లకు సబ్‌కలెక్టర్లుగా పోస్టింగ్

ఈనాడు, అమరావతి: రెండో దశ శిక్షణ పూర్తి చేసుకున్న 2023 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ఐఏఎస్ ప్రొబేషన్ అధికారులను ప్రభుత్వం సోమవారం వివిధ జిల్లాల్లో సబ్‌కలెక్టర్లుగా నియమించింది. వారంతా ఈ నెల 11న విధుల్లో చేరాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ స్థానాల్లో పని చేస్తున్న అధికారులను బదిలీ చేశారు.

సబ్‌డివిజన్	పోస్టింగ్ పొందిన అధికారి	బదిలీ అయిన అధికారి
మదనపల్లె	చల్లా కల్యాణి	వై.మేఘస్వరూప్
కందుకూరు	దామెర హిమవంశీ	తిరుమాని శ్రీపూజ
పాలకొండ	పవార్ స్వప్నిల్ జగన్నాథ్	సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి
నూజివీడు	బొల్లిపల్లి వినూత్న	బచ్చు స్మరణ్‌రాజ్
రాజంపేట	హెచ్.ఎస్.భావన	వైకోమ్ నైదియా దేవి
రంపచోడవరం	శుభం నొఖ్వాల్	కల్పశ్రీ కె.ఆర్.
పార్వతీపురం	ఆర్.వైశాలి	అశుతోష్ శ్రీవాత్సవ

హైదరాబాద్‌కు 2 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు': కిషన్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: దేశంలో క్రిటికల్ మినరల్స్ పరిశోధనల కోసం దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఏడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల్లో రెండు హైదరాబాద్‌కు కేటాయించినట్లు కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఒకటి హైదరాబాద్ ఐఐటీ, మరొకటి నాన్‌ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎన్ఎఫ్‌టీడీసీ)లో నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. మిగతా వాటిని బాంబే ఐఐటీ, ధన్‌బాద్ ఐఐటీ-ఐఎస్ఎం, ఐఐటీ రూర్కీ, భువనేశ్వర్ సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ, జంషెడ్‌పూర్‌లోని సీఎస్ఐఆర్-ఎన్ఎంఎల్‌ల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటి ఆర్‌అండ్‌డీ కోసం రూ.500 కోట్లు, అంతర్జాతీయ స్థాయి మానవ వనరుల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు అందించనున్నట్లు వివరించారు.

"క్రికెట్ అభిమాని కోణంలో సిరీస్ 2-2తో ముగియడం సరైందే. కానీ కోరుకున్న ఫలితం రానందుకు మేం నిరాశచెందాం. జట్టులో అందరూ అసహనంతో ఉన్నారు"
– బెన్ స్టోక్స్, ఇంగ్లాండ్ కెప్టెన్

ఛాంపియన్



6
అయిదో టెస్టులో భారత్ గెలుపు అంతరం. పరుగుల పరంగా టీమ్‌ఇండియాకు ఇదే అతి చిన్న విజయం

భారత్ @3

దుబాయ్: అయిదో టెస్టులో ఇంగ్లాండ్‌పై సంచలన విజయం సాధించిన భారత్.. ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఆ జట్టును వెనక్కి నెట్టి మూడో స్థానం సొంతం చేసుకుంది. 2025-27 డబ్ల్యూటీసీలో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన భారత్ రెండేసి విజయాలు, ఓటములు.. ఒక డ్రా నమోదు చేసింది. 46.67 శాతంతో 28 పాయింట్లు గెలుచుకుంది. ఇంగ్లాండ్ 43.33 శాతంతో 26 పాయింట్లు సాధించింది. లార్డ్స్ టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా 2 పాయింట్లు కోత పడటం ఇంగ్లాండ్‌ను నష్టం చేసింది. ఆస్ట్రేలియా, శ్రీలంక తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

"ప్రతి కెప్టెన్ కోరుకునే పేసర్ సిరాజ్. తన బౌలింగ్‌లో ప్రతి స్పెల్, ప్రతి బంతిని జట్టు కోసం ఇచ్చాడు. 2-2 అన్నది న్యాయమైన ప్రతిబింబం. ఇరుజట్ల ఉత్సాహం, ప్రదర్శనకు నిదర్శనం. సిరాజ్, ప్రసిద్ధ్ లాంటి బౌలర్లు ఉన్నప్పుడు కెప్టెన్సీ సులభం అనిపిస్తుంది. సోమవారం ఆటగాళ్లు స్పందించిన విధానం అద్భుతం. ఆదివారం కూడా విజయంపై నమ్మకంతో ఉన్నాం. ఇంగ్లాండ్ ఆటగాళ్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని తెలుసు" - శుభ్‌మన్ గిల్

"సోమవారం నిద్ర లేవగానే 'బిలీవ్' అనే క్యాప్షన్‌తో ఉన్న రొనాల్డో ఫొటోను వాల్‌పేపర్‌గా పెట్టుకుని, 'నేను ఇది సాధించగలను' అనుకున్నా. ఏ దశ నుంచి అయినా విజయం సాధించగలం అని నేను నమ్మతా. మ్యాచ్ మధ్యలో జడేజా నా దగ్గరికి వచ్చి.. 'నీ దివంగత తండ్రి ఎన్నెన్ని కష్టాలు పడ్డాడో గుర్తు చేసుకో. తన కోసం సాధించు' అని చెప్పాడు. ఎక్కువ ఓవర్లు వేయడం నాకు సమస్య కాదు. నేను బౌలింగ్ చేసేది నా కోసం కాదు, దేశం కోసం. నాలుగో రోజు బ్రూక్ క్యాచ్‌ను అందుకున్నపుడు నేను బౌండరీ కుషన్‌ను తాకుతున్నట్లు అనిపించలేదు. అప్పుడు మ్యాచ్ పోయిందనే అనుకున్నా. దేవుడి దయ వల్ల మళ్లీ పుంజుకున్నాం" - సిరాజ్

ఓ కలలా.. ఓ కథలా!

- ఆఖరి టెస్టులో భారత్ చిరస్మరణీయ విజయం
- నిప్పులు చెరిగిన సిరాజ్
- ఇంగ్లాండ్‌తో సిరీస్ 2-2తో సమం

కోట్ల జతల కళ్లు టీవీలకు అతుక్కుపోయాయి.. ఉత్కంఠ ఉప్పెనైంది! దేశమంతా మునివేళ్లపై నిలబడింది! లబ్‌డబ్ చప్పుళ్లు పెరుగుతూ ఉంటే ఆశనిరాశల మధ్య ఊగుతోంది. ఒక్క వికెట్టే చేతిలో ఉన్నా.. ఇంగ్లాండ్ విజయానికి కేవలం ఏడు పరుగుల దూరంలో నిలవడంతో చిన్నగా ఆందోళనా మొదలైంది. ఒక్క షాట్ చాలు ఓవల్‌లో కథ ముగియడానికి! అప్పటికే అట్కిన్సన్ ఓ సిక్స్ కొట్టి ప్రమాదకరంగా కనిపిస్తున్నాడు. ఆ స్థితిలో అందరి చూపూ ఒకడిపైనే.. అందరి నమ్మకం ఒక్కడే. మహ్మద్ సిరాజ్! ఆ నమ్మకం ఊరికే వచ్చింది కాదని నిరూపితమైంది ఇంకొన్ని సెకన్లలోనే.! ఓవల్‌లో ఓ అద్భుతం ఆవిష్కారమైంది.

143 కిలోమీటర్ల వేగంతో సర్రున దూసుకొచ్చిన ఓ యార్కర్ అట్కిన్సన్ ఆఫ్‌స్టంప్‌ను ఎగరగొట్టింది. ఇంగ్లాండ్ కథ ముగిసింది. అంతే.. పోరు మొదలైనప్పటి నుంచి ఓ యుద్ధవీరుడిలా పోరాడుతూ వచ్చిన హైదరాబాదీ స్టార్ సింహగర్జన చేశాడు. యావద్భారతం అంతులేని ఆనందంతో ఉర్రూతలూగిపోయింది. చరిత్రలో నిలిచిపోయే విజయాన్నందుకున్న భారత్ సిరీస్‌ను 2-2తో సమం చేసింది.

భారత్‌ను గెలిపించిన ఆ ఆఖరి వికెట్ సోమవారం సిరాజ్ అద్వితీయ బౌలింగ్‌కు ఓ ఉదాహరణ మాత్రమే. నాలుగు వికెట్లు చేతిలో ఉండగా విజయానికి కేవలం 35 పరుగులు చేయాల్సిన ఇంగ్లాండ్‌పై ఒత్తిడి తెచ్చింది, ఆటను రసవత్తరంగా మార్చింది అతడే. ప్రమాదకర జేమీ స్మిత్‌తో పాటు ఓవర్టన్‌ను వరుస ఓవర్లలో వెనక్కి పంపి.. టీమ్‌ఇండియా విజయానికి బాటలు వేసిన సిరాజ్.. ఫైనల్ పంచ్‌ను విసిరాడు. అయిదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. శెభాష్ డీఎస్పీ.. ఈ సిరీస్ నీది!

సిరాజ్
5/104

లండన్

ఓవల్‌లో అద్భుతం. అయిదు రోజుల పాటు ఆసక్తికరంగా సాగిన పోరులో పడిలేచిన టీమ్‌ఇండియా.. ఆఖరి టెస్టులో చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఒత్తిడిలో గొప్పగా పోరాడిన గిల్‌సేన చివరిదైన అయిదో రోజు 6 పరుగుల స్వల్ప తేడాతో ఆతిథ్య ఇంగ్లాండ్‌ను ఓడించి, సిరీస్‌ను 2-2తో సమం చేసింది. సిరాజ్ (5/104) అద్వితీయ బౌలింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 374 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 339/6తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. సిరాజ్ ధాటికి 367 పరుగులకు ఆలౌటైంది. ప్రసిద్ధ్ (4/126) కూడా రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లాండ్ 247 చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు సాధించింది. పరుగుల పరంగా టీమ్‌ఇండియాకు ఇది అతి చిన్న విజయం. సిరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. శుభ్‌మన్ గిల్, బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులను దక్కించుకున్నారు.

సిరాజ్ మంటలు: నాలుగు వికెట్లు చేతిలో ఉన్న ఇంగ్లాండ్‌ను ఆఖరి రోజు కేవలం 35 పరుగులు చేయకుండా భారత్ అడ్డుకోగలదన్న నమ్మకం భారత్ అభిమానుల్లో ఉండడానికి ప్రధాన కారణం సిరాజ్. ఆ నమ్మకాన్ని అతడు వమ్ము చేయలేదు. ఆఖరి పంచ్‌ను బలంగా విసిరాడు. మిగిలిన నాలుగు వికెట్లలో మూడు పడగొట్టి ఇంగ్లాండ్‌కు షాకిచ్చాడు. జేమీ స్మిత్, ఓవర్టన్‌లను వరుస ఓవర్లలో ఔట్ చేసి భారత్ విజయావకాశాలను పెంచిన అతడు.. అట్కిన్సన్‌ను ఓ పదునైన యార్కర్‌తో బౌల్డ్ చేసి, ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు తెరదించి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. కొన్ని ఓవర్ల పాటే సాగినా.. చివరి రోజు ఆట అభిమానులను ఉర్రూతలూగించింది. ప్రసిద్ధ్ వేసిన తొలి ఓవర్లో ఓవర్టన్ రెండు బౌండరీలు కొట్టగా.. ఇంగ్లాండ్ సాధించాల్సిన పరుగులు 27కు తగ్గాయి. రెండో ఓవర్లో సిరాజ్ బంతిని అందుకున్నాడు. వెంటనే ఫలితాన్ని రాబట్టాడు. మూడో బంతికి ప్రమాదకర బ్యాటర్ స్మిత్ (2)ను పెవిలియన్ చేర్చాడు. తర్వాతి ఓవర్లో ప్రసిద్ధ్ నాలుగు పరుగులు ఇవ్వగా, తిరిగి బౌలింగ్‌కు వచ్చిన సిరాజ్.. ఓ సూపర్ డెలివరీతో ఓవర్టన్ (9)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఇంగ్లాండ్ 354/8తో నిలిచింది. కాసేపటి తర్వాత టంగ్ (0)ను బౌల్డ్ చేయడం ద్వారా ప్రసిద్ధ్ కూడా వికెట్ల వేటలో చేరడంతో.. మ్యాచ్‌లో ఉత్కంఠ పెరిగింది. భుజానికి కట్టుతోనే క్రీజులోకి వచ్చాడు వోక్స్. కానీ సిరాజ్ బౌలింగ్‌లో ఓ సిక్స్ బాదిన అట్కిన్సన్.. వోక్స్‌ను కాపాడుకుంటూ ఇంగ్లాండ్ చేయాల్సిన స్కోరును 7కు తేవడంతో భారత్‌లో ఆందోళన మొదలైంది. ఆ స్థితిలో బౌలింగ్‌కు వచ్చిన సిరాజ్.. తీవ్ర ఉత్కంఠ మధ్య ఓ కళ్లు చెదిరే యార్కర్‌తో అట్కిన్సన్‌ను బౌల్డ్ చేసి మ్యాచ్‌ను ముగించాడు. అంతే.. టీమ్ ఇండియా సంబరాలకు హద్దే లేదు.

వోక్స్ కట్టుతో..



ఒక్క బంతి ఆడకపోయినా ఇంగ్లాండ్ ఆటగాడు వోక్స్ తన అంకితభావంతో ఆకట్టుకున్నాడు. భుజానికి తీవ్ర గాయం కావడంతో తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయని అతడు.. 9వ వికెట్ తర్వాత ఎడమ చేతికి కట్టుతోనే బరిలోకి దిగాడు. అయితే వోక్స్‌కు స్ట్రైకింగ్ రాలేదు. వచ్చినా.. అతడు ఒక్క చేత్తో బ్యాటింగ్ చేయాల్సి వచ్చేది.

భారత్ తొలి ఇన్నింగ్స్: **224**; ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 247
భారత్ రెండో ఇన్నింగ్స్: 396; ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (బి) సిరాజ్ 14; డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్‌కృష్ణ 54; ఓలీ పోప్ ఎల్బీ (బి) సిరాజ్ 27; రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్‌కృష్ణ 105; బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్‌దీప్ 5; బెతెల్ (బి) ప్రసిద్ధ్‌కృష్ణ 5; జేమీ స్మిత్ (సి) జురెల్ (బి) సిరాజ్ 2; ఓవర్టన్ ఎల్బీ (బి) సిరాజ్ 9; అట్కిన్సన్ (బి) సిరాజ్ 17; జోష్ టంగ్ (బి) ప్రసిద్ధ్‌కృష్ణ 0; వోక్స్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 23 **మొత్తం:** (85.1 ఓవర్లలో ఆలౌట్) **367**; **వికెట్ల పతనం:** 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337, 7-347, 8-354, 9-357; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20-4-85-1; ప్రసిద్ధ్‌కృష్ణ 27-3-126-4; సిరాజ్ 30.1-6-104-5; సుందర్ 4-0-19-0; జడేజా 4-0-22-0



4
21వ శతాబ్దంలో 27 అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లు జరిగితే.. అందులో ప్రస్తుత సిరీస్ సహా నాలుగింట్లోనే అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆట అయిదో రోజుకు చేరింది.

సలామ్ డీఎస్పీ సాబ్!

ఈనాడు క్రీడావిభాగం

2025 జులై 14న సాయంత్రం..

ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో టీమ్‌ఇండియా గెలుపు కోసం పోరాడుతోంది. ఇంకో 23 పరుగులు చేస్తే చాలు భారత్‌దే విజయం. మిగిలింది ఒక్కటే వికెట్. అంతలో ఓ బంతి దూసుకొచ్చింది. ఆ బ్యాటర్ ఆత్మవిశ్వాసంతో డిఫెన్స్ ఆడినా.. బంతి దొర్లుకుంటూ వెళ్లి స్టంప్‌ను తాకింది. నిర్వేదంతో కూలబడ్డ ఆ ఆటగాడు.. కళ్లలో నీళ్లతో మైదానాన్ని వీడాడు.

2025 ఆగస్టు 4 ఉదయం..

ఓవల్ స్టేడియంలో మ్యాచ్ తీవ్ర ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఇంగ్లాండ్ విజయానికి 7 పరుగులు చేస్తే చాలు. భారత్‌కు ఓ వికెట్ కావాలి. ఒక్క షాట్‌తో భారత్ ఆశలు ఆవిరైపోతాయి. ఆ స్థితిలో ఓ యార్కర్‌కు స్టంప్ ఎగిరిపోయింది. బౌలర్ ఆనందానికి అవధుల్లేవు. నాడు బాధతో తడి అయిన ఆ ఆటగాడి కళ్లే.. ఇప్పుడు ఇప్పుడు ఆనందంతో వర్షించాయి. ఆ ఆటగాడు మహ్మద్ సిరాజే అని ప్రత్యేకంగా చెప్పాలా?

23
ఈ సిరీస్‌లో సిరాజ్ వికెట్లు. సిరీస్‌లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ అతడే. జోష్ టంగ్ (19) రెండో స్థానంలో ఉన్నాడు.

లార్డ్స్‌లో సిరాజ్ గొప్పగానే పోరాడినా.. విజయం ముంగిట వికెట్ ఇచ్చేశాడే అని అతణ్ని తిట్టుకునే ఉంటారు అభిమానులు! ఇక నాలుగో రోజు బ్రూక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను ఫైన్ లెగ్‌లో అందుకున్నట్లే అందుకుని బౌండరీ కుషన్‌పై కాలు వేయడంతో అభిమానులకు సిరాజ్‌పై ఎంత కోపం తెప్పించిందో చెప్పాల్సిన పని లేదు. 19 పరుగులపై ఆ జీవన దానాన్ని అందుకున్న బ్రూక్ ఏకంగా సెంచరీ కొట్టేశాడు. దీంతో ఇంగ్లాండ్ సునాయాసంగా మ్యాచ్‌ను గెలిచేలా కనిపించింది. అలా గెలిచేసి ఉంటే సిరాజ్ మరోసారి విలన్ అయ్యేవాడు. కానీ తాను చేసిన తప్పిదాన్ని మరిపించాలన్న తపనో ఏమో.. చివరి రోజు అతను మామూలుగా బౌలింగ్ చేయలేదు. ముందుగా భారత విజయానికి అతిపెద్ద అడ్డుగా కనిపించిన స్మిత్‌ను ఔట్ చేశాడు. తర్వాత ఓవర్టన్‌నూ పెవిలియన్ చేర్చాడు. చివరగా అట్కిన్సన్‌ను అద్భుతమైన యార్కర్‌తో బౌల్డ్ చేసిన దృశ్యం భారత అభిమానుల మనసుల్లో నిలిచి పోతుంది. బుమ్రా లాంటి దిగ్గజ బౌలర్ నీడలో సిరాజ్‌కు రావాల్సిన పేరు రాలేదు కానీ.. విదేశాల్లో అతను కీలక మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించడం ఇది తొలిసారి కాదు. ఆస్ట్రేలియాలో భారత్ తొలిసారి సిరీస్ విజయాన్నందుకోవడంలో అతడి పాత్ర కీలకం. 2020-21లో మెల్‌బోర్న్ టెస్టులో 5 కీలక వికెట్లతో అదరగొట్టాడు. తర్వాత సిరీస్ ఫలితాన్ని నిర్దేశించిన గబ్బా టెస్టులో 6 వికెట్లతో అబ్బురపరిచాడు. 2021లో ఇంగ్లాండ్ పర్యటనలో లార్డ్స్ వేదికగా భారత్ అద్భుత విజయాన్నందుకోవడంలో తనదే అత్యంత కీలక పాత్ర. ఆ మ్యాచ్‌లో సిరాజ్ 8 వికెట్లు తీశాడు. ఇంకా గత ఏడాది కేప్‌టౌన్‌లో 7 వికెట్లతో దక్షిణాఫ్రికాపై, పెర్త్‌లో 5 వికెట్లతో ఆస్ట్రేలియాపై జట్టును గెలిపించాడు. ఇక ప్రస్తుత సిరీస్‌లో బర్మింగ్‌హామ్‌లో, ఓవల్‌లో భారత్ గెలవడంలోనూ సిరాజ్ పాత్ర ఎంతో కీలకం. ఈ ప్రదర్శనలన్నీ ప్రత్యర్థి జట్లకు కంచు కోటల్లాంటి మైదానాల్లో, భారత్ గెలిచి తీరాల్సిన పరిస్థితుల్లో వచ్చినవి.

అలసటా.. అంటే?: పని భార నిర్వహణలో భాగంగా ఫాస్ట్‌బౌలర్లకు అప్పుడప్పుడూ విశ్రాంతినివ్వడం అన్ని జట్లూ చేస్తున్నాయి. భారత ప్రధాన పేసర్ బుమ్రా ఇలా తరచుగా గాయాల పాలవుతుండడంతో ప్రస్తుత సిరీస్‌లో మూడు మ్యాచ్‌లే ఆడించారు. భారత జట్టులో వేరే పేసర్లు కూడా గాయాలతో పోరాడుతున్నారు. కానీ సిరాజ్ మాత్రం కెరీర్ ఆరంభం నుంచి గాయపడ్డదే లేదు. ఇప్పటిదాకా అతను ఒక్కసారీ ఫిట్‌నెస్ సమస్యలతో జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) గడప తొక్కలేదు. సిరీస్ ఏదైనా అతను అన్ని మ్యాచ్‌లూ ఆడేస్తాడు. ప్రస్తుత సిరీస్‌లోనూ అంతే. ప్రస్తుత సిరీస్‌లో రెండు జట్లలో గాయపడకుండా అయిదు టెస్టులూ ఆడిన ఏకైక పేసర్ అతనే కావడం విశేషం. అంతే కాదు, సిరీస్‌లో ఏకంగా 185.3 ఓవర్లు (1113 బంతులు) బౌలింగ్ చేశాడు. వరుసగా ఎన్ని మ్యాచ్‌లు ఆడినా.. ఎన్ని ఓవర్లు వేసినా.. అలసట సిరాజ్ దరిచేరదు. మ్యాచ్‌లో ఏ స్థితిలో అయినా కెప్టెన్ అడగ్గానే బంతి అందుకుంటాడు. వరుసగా పది ఓవర్లకు పైగా బౌలింగ్ చేస్తుంటాడు. సిరాజ్ జట్టులోకి వచ్చాకే విదేశాల్లో భారత్ అనేక అద్భుత విజయాలందుకుంది. జట్టులోకి చాలామంది బౌలర్లు వస్తున్నారు. వెళ్తున్నారు. బుమ్రా గొప్ప బౌలరైనప్పటికీ.. ఎప్పుడు ఆడతాడో తెలియని అనిశ్చితి! కానీ జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకుని, ప్రతి టెస్టులో ఆడుతూ, నిలకడగా వికెట్లు తీస్తున్న బౌలర్ సిరాజ్ ఒక్కడే. కెరీర్ ఆరంభంలో వేగం ఉన్నా, లైన్ అండ్ లెంగ్త్ కుదరక కొంత ఇబ్బంది పడేవాడు సిరాజ్. కానీ అనుభవం మీద అతడికి బౌలింగ్‌పై నియంత్రణ వచ్చింది. నిలకడ కూడా పెరిగింది. సాధారణంగా పేసర్లు కెరీర్లో కొన్నేళ్లు గడిచాక గాయాల భయంతో వేగం తగ్గించేస్తుంటారు. కానీ సిరాజ్ మాత్రం ఇప్పటికీ మెరుపు వేగంతో బంతులేస్తున్నాడు. సోమవారం కూడా ఆ ఆయుధాన్ని ఉపయోగించే.. ఇంగ్లిష్ లోయరార్డర్‌ను కకావికలు చేసి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్నందించాడు. ఇంకో 35 పరుగులే చేయాల్సి ఉండగా.. 4 వికెట్లు చేతిలో ఉంచుకున్న ఇంగ్లాండ్ జట్టు ఈ మ్యాచ్‌లో ఓడిపోతుందని ఎవరైనా అనుకుని ఉంటారా? కానీ తన మొబైల్లో రొనాల్డో ఫొటోతో పాటు.. 'బిలీవ్' (నమ్ము) అనే క్యాప్షన్‌ను స్క్రీన్ సేవర్‌గా పెట్టుకున్న సిరాజ్ మాత్రం భారత విజయం మీద నమ్మకంతోనే ఉన్నాడు. అద్భుత ప్రదర్శనతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. విదేశాల్లో ఎన్నో అద్భుత విజయాల్లో భాగం అయినప్పటికీ సిరాజ్‌కు రావాల్సినంత పేరు రాలేదు కానీ.. ప్రస్తుత సిరీస్‌లో, ముఖ్యంగా చివరి టెస్టులో ప్రదర్శనతో అతను నేషనల్ హీరో అయిపోయాడు. ఈ ప్రదర్శనకు అబ్బురపడి క్రికెట్ ప్రపంచం మన డీఎస్పీకి సలామ్ చేస్తోంది!

సమమైనా సగర్వంగా..



ఈనాడు క్రీడావిభాగం

అశ్విన్, రోహిత్ కోహ్లి రిటైరైపోయారు. కొత్త కెప్టెన్.. అనుభవం తగ్గిన జట్టు.. బుమ్రాకు గాయాల సమస్య.. తుది జట్టుపై అయోమయం.. ఇంతటి అనిశ్చితిలో తొలి టెస్టులో పరాజయం! ఇలా ఆరంభించిన జట్టు.. సిరీస్ చేజారకుండా కాపాడుకుంటుందని ఎవరైనా ఊహించి ఉంటారా? ఆఖరికి లెక్క చూస్తే 2-2తో సమంగా కనిపిస్తుంది కానీ.. సిరీస్‌లో పైచేయి భారతే.

సిరీస్‌లో ఇంగ్లాండ్ రెండు విజయాలు సాధించింది. కానీ అవి సాధికార విజయాలు కావు. తొలి టెస్టులో నాలుగు రోజులు భారత్‌దే ఆధిపత్యం. రెండో ఇన్నింగ్స్‌లోనూ అదరగొట్టి 371 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడంతో విజయం మనదే అనుకున్నారంతా. కానీ చివరి రోజు భారత బౌలర్ల వైఫల్యంతో మ్యాచ్ ఇంగ్లిష్ జట్టు సొంతమైంది. ఇక ఇంగ్లాండ్ గెలిచిన మరో మ్యాచ్.. లార్డ్స్‌లో. ఆ మ్యాచ్‌లోనూ ఎక్కువ ఆధిపత్యం భారత్‌దే. 193 పరుగుల ఛేదనలో 87 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచి కూడా గొప్పగా పోరాడి విజయానికి చేరువగా వెళ్లింది. కానీ త్రుటిలో ఓటమి తప్పలేదు. రెండో టెస్టులో ఏకంగా 336 పరుగులతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది భారత్. నాలుగో టెస్టులో 5 సెషన్ల ఆట మిగిలుండగా.. నాలుగో ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే 2 వికెట్లు కోల్పోయిన టీమ్‌ఇండియా ఓటమి తప్పించుకోగలదని ఎవ్వరూ ఊహించి ఉండరు. కానీ అసాధారణ పోరాటంతో ఆ మ్యాచ్‌ను డ్రాగా ముగించడం భారత క్రికెట్ చరిత్రలోనే ఓ అపూర్వ ఘట్టం. చివరికి ఓవల్‌లో ఓటమి లాంఛనమే అనుకున్న మ్యాచ్‌లో అద్భుతంగా పుంజుకుని విజయం సాధించింది. ఇంగ్లాండ్‌లో గొప్ప రికార్డు లేకపోయినా.. గాయాలు దెబ్బ కొట్టినా.. ప్రతి మ్యాచ్‌కూ తుది జట్టును మార్చుకోవాల్సి వచ్చినా.. సిరీస్‌ను సమం చేయగలిగింది శుభ్‌మన్ సేన. బ్యాటింగ్‌లో టాప్-5 జాబితా తీస్తే అందులో నలుగురు మన వాళ్లే. సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ సిరాజ్. బాజ్‌బాల్‌తో ప్రత్యర్థులను బెదరగొట్టే ఇంగ్లిష్ జట్టును ఈ సిరీస్‌లో శుభ్‌మన్‌సేన కంగారెత్తించింది.

సిరీస్‌లో హీరోలు వీళ్లే..

	మ్యా	ప	సగటు	100/50లు
గిల్	5	754	75.40	4/0
రాహుల్	5	532	53.20	2/2
జడేజా	5	516	86.00	1/5
పంత్	4	479	68.42	2/3
	మ్యా	వికెట్లు	సగటు	ఉత్తమం
సిరాజ్	5	23	32.43	6/70
బుమ్రా	3	14	26.00	5/74
ప్రసిద్ధ్	3	14	37.07	4/62

మ్యా: మ్యాచ్‌లు, ప: పరుగులు

"సునాయాసంగా గెలువొచ్చని ఉదయం అనిపించింది. కానీ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ విజయానికి అతను అర్హుడు. సిరాజ్‌కు ఇది అద్భుత సిరీస్. అతను గొప్పగా ముగించాడు" - బ్రూక్

3809
ఈ సిరీస్‌లో టీమ్‌ఇండియా పరుగులు. అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా భారత్ నిలిచింది.

భారత్‌కు మరో ఆరు పతకాలు

బ్యాంకాక్: ఆసియా అండర్-22 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో ఆరు పతకాలు ఖాయమయ్యాయి. మహిళల విభాగంలో ప్రియ (60 కిలోలు), ప్రాంజల్ యాదవ్ (70 కిలోలు) పురుషుల విభాగంలో హర్ష్ (60 కిలోలు), నీరజ్ (75 కిలోలు), రాకీ (85 కిలోలు), ఇషాన్ కటారియా (90+ కిలోలు) సెమీస్‌కు చేరడం ద్వారా పతకాలు ఖాయం చేశారు. భావన, యాత్రి పటేల్ ఇప్పటికే సెమీస్ చేరిన సంగతి తెలిసిందే.

హాకీ జట్టుకు హర్మన్‌ప్రీత్ సారథ్యం

దిల్లీ: ఆస్ట్రేలియా పర్యటనలో స్టార్ డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత హాకీ జట్టు బరిలో దిగనుంది. ఈనెల 15న పెర్త్‌లో ప్రారంభమయ్యే పర్యటన కోసం 24 మందితో కూడిన భారత జట్టును సోమవారం హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. ఆసియా కప్‌నకు ముందు నాలుగు మ్యాచ్‌ల ఈ సిరీస్ మంచి సన్నాహకంగా పనికొస్తుందని భారత్ భావిస్తోంది. ఈనెల 29న బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ప్రారంభమయ్యే ఆసియా కప్.. ప్రపంచకప్‌కు అర్హత టోర్నీ కూడా.

అక్టోబరులో ఆర్చరీ లీగ్

దిల్లీ: క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, బాక్సింగ్, రెజ్లింగ్‌తో సహా పలు లీగ్‌ల సరసన ఆర్చరీ చేరనుంది. విలు విద్య క్రీడలోనూ ఫ్రాంఛైజీ తరహా లీగ్‌ను నిర్వహించనున్నట్లు భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) సోమవారం ప్రకటించింది. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో పురుషులు, మహిళలతో ప్రపంచ స్థాయి లీగ్‌కు శ్రీకారం చుట్టనున్నట్లు ఏఏఐ వెల్లడించింది. ఆరు ఫ్రాంఛైజీల తరపున ప్రపంచంలోని టాప్-10 క్రీడాకారులు, భారత అగ్రశ్రేణి ఆర్చర్లు లీగ్ బరిలో దిగనున్నారు. అక్టోబరులో దిల్లీలోని యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 11 రోజుల పాటు ఈ లీగ్ జరిగే అవకాశముంది. ప్రపంచ, ఆసియా ఆర్చరీ సమాఖ్యలు.. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ లీగ్‌ను ప్రోత్సహించనున్నాయి.

పాక్‌దే టీ20 సిరీస్

లాడర్‌హిల్ (అమెరికా): వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో సొంతం చేసుకుంది. ఆదివారం చివరి మ్యాచ్‌లో 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సాహిబ్‌జాదా ఫర్హాన్ (74; 53 బంతుల్లో 3×4, 5×6), సయిమ్ అయూబ్ (66; 49 బంతుల్లో 4×4, 2×6) చెలరేగడంతో మొదట పాక్ 4 వికెట్లకు 189 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో విండీస్ తడబడింది. నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేయగలిగింది. అలిక్ అథనాజ్ (60; 40 బంతుల్లో 8×4, 1×6), రూథర్‌ఫోర్డ్ (51; 35 బంతుల్లో 4×4, 3×6) అర్ధ సెంచరీలతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో పాక్.. రెండో పోరులో విండీస్ నెగ్గాయి.

తరతరాలకీ తరగని 'ఇంటి 'బంధం



సూరత్: గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న మైత్రి అనే ఆ డూప్లెక్స్ బంగ్లాలో అన్నీ రెండే. రెండు వంట గదులు.. రెండు పడక గదులు.. రెండు కుటుంబాలు.. డ్రాయింగ్ రూం మాత్రం ఒక్కటే. రెండు కుటుంబాలకు చెందినవారు అక్కడే గడుపుతూ ముచ్చట్లు చెప్పుకొంటారు. వారిమధ్య ఎలాంటి రక్తసంబంధమూ లేదు. కానీ ఆ కుటుంబాలను ఒక్క గూటికి చేర్చిందేంటో తెలుసా.. స్నేహబంధం! 1940లో గున్వంత్ దేశాయ్, బిపిన్ దేశాయ్ అనే వ్యక్తుల మధ్య పాఠశాలలో చెలిమి ఏర్పడింది. ఇద్దరూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. ఉమ్మడిగానే పాల వ్యాపారం మొదలుపెట్టారు. ఆ తర్వాత తమ స్నేహం ఎప్పటికీ ఇలాగే ఉండాలని 1970లో ఉమ్మడిగా భవనాన్ని నిర్మించుకున్నారు. కాలక్రమంలో వారు గతించినా వారి తర్వాతి తరాల వారసులు ఆ స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు.


చేతిలో చెయ్యేసి..



ఉత్తరాఖండ్ రాజధాని దేహ్రాదూన్‌లో వరదలో చిక్కుకున్న ప్రజలను రక్షిస్తున్న సహాయక సిబ్బంది

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మేఘాలయ అతలాకుతలమవుతున్నాయి. యూపీలో గంగా, యమునా నదులు ఉగ్రరూపం దాల్చడంతో వందల గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయి. ఉత్తరాఖండ్‌లోని బాక్రా నదిలో కొట్టుకుపోయి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మేఘాలయలో ఓ వ్యవసాయాధికారి కొట్టుకుపోయారు.

హలో సిరి.. అనకపోయినా సరి!



గువాహటీ: హలో సిరీ.. అనడం ద్వారా చేతితో తాకకుండానే స్మార్ట్ ఫోన్ వాడేస్తుంటాం. కానీ పుట్టుకతోనే మూగవారు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోలేరు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఐఐటీ గువాహటి పరిశోధకులు అమెరికాలోని ఒహాయో స్టేట్ వర్సిటీ సహకారంతో ఓ కొత్త సెన్సర్ వ్యవస్థను రూపొందించారు. "ఎవరైనా శబ్దం రాకుండా మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడు, వారి ఊపిరితిత్తుల్లో నుంచి గాలి ప్రవాహం నోటి ద్వారా బయటకు వస్తుంది. దాన్ని నీటి ఉపరితలం మీద కేంద్రీకరించినప్పుడు చిన్న తరంగాలను ఏర్పరుస్తుంది. వాటిని గ్రహించి ఎలక్ట్రికల్ సిగ్నళ్లుగా మార్చడం ద్వారా గొంతును గుర్తించగలిగేలా నీటి ఉపరితలానికి దిగువ భాగంలో పనిచేసే ఈ సెన్సర్‌ను రూపొందించాం" అని పరిశోధకులు చెప్పారు.

మహిళా ఎంపీ గొలుసునూ కొట్టేశాడు!



దిల్లీ: కాంగ్రెస్ నేత, తమిళనాడు ఎంపీ సుధా రామకృష్ణన్ మెడలోని బంగారు గొలుసును దిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో ఓ ఆగంతుకుడు లాక్కెళ్లాడు. పోలండ్ రాయబార కార్యాలయం సమీపంలో తాను మార్నింగ్ వాక్ చేస్తుండగా ఈ సంఘటన జరిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎంపీ పేర్కొన్నారు. ఈ క్రమంలో తనకు స్వల్పగాయాలయ్యాయని కూడా ఆమె తెలిపారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సుధా రామకృష్ణన్ లేఖ రాశారు. "ఉదయం 6 గంటల సమయంలో హెల్మెట్ పెట్టుకొని స్కూటీ మీద వచ్చిన వ్యక్తి నా మెడలోని బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు. నా మెడమీద గాయాలయ్యాయి. దుస్తులు కొద్ది మేర చిరిగాయి. అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలో ఓ మహిళపై దాడి దిగ్భ్రాంతికరం" అని ఆమె లేఖలో పేర్కొన్నారు.

తృణమూల్‌లో రగడ

- చీఫ్ విప్ పదవికి కల్యాణ్ రాజీనామా
- లోక్‌సభాపక్ష నేతగా అభిషేక్ ఎంపిక



అభిషేక్ కల్యాణ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సోమవారం పార్టీ ఎంపీలతో నిర్వహించిన వర్చువల్ భేటీలో తన మేనల్లుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని లోక్‌సభలో తృణమూల్ పక్ష నేతగా ఆమె ఎంపిక చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుదీప్ బందోపాధ్యాయ్ స్థానంలో ఆయన్ను నియమించారు. సమావేశం ముగిసిన కొద్దిసేపటికే లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్ కల్యాణ్ బెనర్జీ ఆ పదవికి రాజీనామా చేశారు. ఇటీవల కొందరు తృణమూల్ ఎంపీలు బహిరంగంగా ఘర్షణపడిన విషయంపై మమత అసంతృప్తి వ్యక్తంచేశారని, దానికి బాధ్యత వహిస్తూ వైదొలగానని కల్యాణ్ చెప్పారు. కల్యాణ్ బెనర్జీ, సహచర ఎంపీ మహువా మొయిత్రా మధ్య రెండ్రోజులుగా జరుగుతున్న మాటల యుద్ధం చర్చనీయాంశంగా మారింది. కల్యాణ్‌ను మొయిత్రా 'పంది' అని సంబోధించారు. ఆమె వాడేభాష దురదృష్టకరమని కల్యాణ్ అభ్యంతరం తెలిపారు.

రాష్ట్ర హోదా ఇస్తారా?

- రాష్ట్రపతితో మోదీ, అమిత్ షాల భేటీ కశ్మీర్‌పైనేనా..

ఈటీవీ భారత్: జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆరేళ్లు పూర్తవుతున్న వేళ మోదీ, అమిత్ షా.. ఒకే రోజు రాష్ట్రపతితో సమావేశం కావడంతో ఈ చర్చ మొదలైంది. రాష్ట్రపతితో ప్రధాని మోదీ భేటీ తర్వాత కొన్ని గంటలకు అమిత్ షా.. ముర్ముతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన జమ్మూ కశ్మీర్ నేతలను కలిశారు. జమ్మూ కశ్మీర్‌పైనే ఈ సమావేశాలు జరిగాయనే ప్రచారం ఊపందుకుంది. కచ్చితమైన గడువు నిర్దేశించకపోయినప్పటికీ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ప్రధాని, హోం మంత్రి పలుమార్లు హామీ ఇచ్చారు.

దేశంలోని పరిస్థితిపై సమీక్ష

ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లవుతున్న సందర్భంగా.. దేశంలోని పరిస్థితిపై సమీక్షించేందుకు అమిత్ షాతో జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, నిఘా విభాగం డైరెక్టర్ తపన్ డేకా సమావేశమయ్యారు. పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో ఈ సమావేశం జరిగింది. సమావేశ వివరాలు తెలియకపోయినా.. దేశంలోని పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం.

'తొలి రాయబారి శ్రీకృష్ణుడే'



దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీ బాంకే బిహారీ టెంపుల్ ట్రస్ట్ మధ్య నెలకొన్న వివాదంలో సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మధురలో జన్మించిన శ్రీకృష్ణుడు ప్రపంచానికి తెలిసిన మొదటి రాయబారి అని.. ఆయన మార్గంలో మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలంటూ ఇరుపక్షాలకు సూచించింది. ఇందుకోసం ఒక కమిటీని ప్రతిపాదించింది. దేవాలయ నిధుల నుంచి రూ.500 కోట్లతో మధురలోని బృందావన్‌లో కారిడార్‌ను అభివృద్ధి చేయడానికి వీలుగా ఆలయ నిర్వహణను స్వాధీనం చేసుకోవడానికి ప్రతిపాదిస్తూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ సందర్భంగా శ్రీకృష్ణుడి రాయబారం గురించి సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది.

ధనికుల తీరుపై ధర్మాగ్రహం

దిల్లీ: క్రిమినల్ కేసుల్లో నిందితులైన 'ధనికులు' చట్టపరమైన చర్యల నుంచి ఊరట పొందేందుకు కింది స్థాయి కోర్టులకు వెళ్లకుండా నేరుగా తనవద్దకే రావడాన్ని సుప్రీంకోర్టు సోమవారం తప్పుపట్టింది. ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం తదితర వ్యవహారాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్న కేసుల పరిష్కారానికి హైకోర్టుకు వెళ్లాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌ను, ఆయన కుమారుణ్ని ఆదేశించింది. "ఇదో కొత్త ధోరణి. ధనికుడైన వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రతిసారీ నిర్దేశాలు మారిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే సామాన్యులకు, వారి సాధారణ న్యాయవాదులకు సుప్రీంకోర్టులో చోటే లేకుండా పోతుంది" అని న్యాయమూర్తులు అన్నారు.


పరిమితులేవీ లేవన్నట్టు ఆలోచించండి



మీరు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటున్నారా..? అయితే- మీకు భయాలేవీ లేవన్నట్టుగా పనిచేయండి. పరిమితులేవీ లేనట్టుగా ఆలోచించండి. మీ జీవితం పూర్తిగా మీ నియంత్రణలో ఉన్నట్టుగా జీవించండి. ఇప్పటికే విజయం సాధించారన్నట్టుగా నడవడం అలవాటు చేసుకోండి. మరింత గొప్ప లక్ష్యాన్ని అందుకోబోతున్నట్లు నిరంతరం విశ్వసించండి.

– అదితి చౌధరీ, న్యాయవాది

రాఖీల సిందూరం



ఈటీవీ భారత్: సోదర సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌కు ఈసారి దేశభక్తిని జోడించారు ఆ ఊరి ఐఐటీ విద్యార్థులు. తాము తయారు చేసిన దాదాపు 2వేల 'ఆపరేషన్ సిందూర్' రాఖీలను ఆగస్టు 9న (శనివారం) రక్షాబంధన్ పండుగ వేళ ప్రధాని మోదీతోపాటు సరిహద్దుల్లోని భారత సైనికులకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు. 'ఆపరేషన్ సిందూర్'తో భారత సైన్యం చూపిన తడాఖా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్న తీరుకు అద్దంపట్టేలా ఒక ప్రత్యేక రాఖీని ప్రధాని మోదీకి పంపనున్నట్లు బిహార్‌లోని గయా జిల్లా పట్వాటోలీ గ్రామ విద్యార్థులు వెల్లడించారు. పట్వాటోలీని ఐఐటియన్ల గ్రామం అని పిలుస్తుంటారు.

గిన్నిస్‌కెక్కిన పరీక్షా పే..

దిల్లీ: ప్రధాని మోదీ నిర్వహించే పరీక్షా పే చర్చ గిన్నిస్ రికార్డులకెక్కింది. ఒక నెలలో ఈ కార్యక్రమానికి అత్యధిక రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎనిమిదో ఎడిషన్‌కు 3.53 కోట్ల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఒక పౌర కార్యక్రమంలో ఇంతమంది పాల్గొనడం విశేషమని సోమవారం కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల సమయంలో విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులతో ప్రధాని మోదీ చర్చించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఇళ్లపై మువ్వన్నెల జెండా



దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగరేయాలని దేశ ప్రజలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఆ జెండాలతో సెల్ఫీలు తీసుకుని 'హర్‌ఘర్‌తిరంగా.కామ్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

విమానంలో బొద్దింకల హల్‌చల్

దిల్లీ: శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ముంబయి వస్తున్న ఎయిరిండియా విమానంలో ప్రయాణికులు సోమవారం బొద్దింకలను గుర్తించారు. దీంతో అసౌకర్యానికి గురైన ఇద్దరు ప్రయాణికులను సిబ్బంది వేరే సీట్లలో కూర్చోబెట్టారు. "షెడ్యూల్ ప్రకారం కోల్‌కతా విమానాశ్రయంలో ఇంధనం కోసం ల్యాండ్ అయిన సమయంలో విమానాన్ని శుభ్రం చేయించాం. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి, ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం" అని ఎయిర్‌లైన్ ప్రతినిధి తెలిపారు.

'ఏ ఫర్ అఖిలేశ్.. డి ఫర్ డింపుల్'

సహారన్‌పూర్: పాఠశాలల్లో విద్యార్థులకు 'ఏ ఫర్ ఆపిల్, బీ ఫర్ బాల్' అని బోధిస్తుంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని 'పీడీఏ పాఠశాలల్లో' మాత్రం ఏ ఫర్ అఖిలేశ్, బీ ఫర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, డి ఫర్ డింపుల్, ఎం ఫర్ ములాయం సింగ్ యాదవ్ అంటూ బోధించడం వివాదాస్పదమైంది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఆయా పాఠశాలల యాజమాన్యంపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్‌గజపతిరాజు



ప్రధానమంత్రి నరేంద్రమోదీతో అశోక్‌గజపతిరాజు

రాష్ట్రపతి, ప్రధానిని కలిసిన గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు

- కేంద్ర మంత్రులతోనూ భేటీ

ఈనాడు, దిల్లీ: గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు సోమవారం దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో భేటీ అయ్యారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి వారిని మర్యాదపూర్వకంగా కలిసి తనకు ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు అశోక్‌గజపతిరాజును తెదేపా పార్లమెంటరీ పార్టీ సత్కరించి అభినందనలు తెలిపింది. నాలుగు దశాబ్దాలపాటు తెలుగుదేశం పార్టీకి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా పార్టీ ఎంపీలు శ్లాఘించారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఎంతో నిబద్ధతతో పనిచేసి పదవులకు వన్నె తెచ్చిన అశోక్‌గజపతిరాజు గవర్నర్‌గానూ అదే తరహాలో బాధ్యతలు నిర్వర్తించి ఆదర్శంగా నిలుస్తారన్న నమ్మకాన్ని వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, తెలంగాణ భాజపా ఎంపీ లక్ష్మణ్ కూడా అశోక్‌గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

రఘురామపై నాడు పెట్టిన కేసు కొనసాగించేందుకు కానిస్టేబుల్ విముఖత

ఈనాడు, దిల్లీ: ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై గతంలో తాను పెట్టిన కేసును కొనసాగించదలచుకోలేదని ఎస్. ఫారూఖ్‌బాషా అనే కానిస్టేబుల్ సుప్రీంకోర్టుకు విన్నవించారు. 2022 జూన్‌లో ఫారూఖ్‌బాషా హైదరాబాద్‌లోని తమ ఇంటి సమీపంలో తిరుగుతుండగా రఘురామ గమనించారు. వైకాపా ప్రభుత్వం తరఫున నిఘా ఉంచారనే ఉద్దేశంతో రఘురామ, ఆయన కుమారుడు భరత్, భద్రత విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ఫారూఖ్‌బాషాను పట్టుకొని తెలంగాణ పోలీసులకు అప్పగించారు. అయితే రఘురామ తదితరులు తనపై దాడి చేశారంటూ ఆ కానిస్టేబుల్ ఎదురు కేసు పెట్టారు. గచ్చిబౌలి పోలీసులు ఆ ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు తమ ఫిర్యాదును పట్టించుకోకుండా తమపైనే కేసు పెట్టడాన్ని రఘురామ హైకోర్టులో సవాల్ చేశారు. దాన్ని హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సోమవారం విచారణ జరిపిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ముందు రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. నాటి సీఎం జగన్‌తో రఘురామకు ఉన్న వివాదాల కారణంగానే ఈ కేసు నమోదు చేయించారని కోర్టు దృష్టికి తెచ్చారు. రఘురామపై కేసు పెట్టిన కానిస్టేబుల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ. . ఫారూఖ్‌బాషా ప్రస్తుతం హైదరాబాద్ నుంచి 400 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్నందున ఈ కేసును కొనసాగించడం ఆయనకు ఇష్టం లేదన్నారు. జస్టిస్ జేకే మహేశ్వరి స్పందిస్తూ దానిపై అఫిడవిట్ వేయాలని సూచిస్తూ తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు ఈ నెల 17లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ధర్మస్థలలో మరో అస్థిపంజరం ఆనవాళ్లు

మంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని చారిత్రక ధర్మస్థల మరోసారి ఉలికిపాటుకు గురైంది. తాను వందల మృతదేహాలను ఖననం చేశానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు 'భీమ' చేసిన ఫిర్యాదుపై దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు సోమవారం ధర్మస్థల పరిసరాల్లో తవ్వకాలు జరిపారు. ఈ క్రమంలో ఏడాదిన్నర నుంచి రెండేళ్ల కిందటిదిగా భావిస్తున్న ఓ మృతదేహం ఆనవాళ్లు వెలుగుచూశాయి. దాని ఒంటిపై చొక్కా ఉండడం, మెడకు ఉరి వేసుకున్నట్లు తాడు ఉండడాన్ని సిట్ అధికారులు గుర్తించారు. కొత్తగా లభించిన అస్థిపంజరానికి సంబంధించి నిజానిజాలను వెలుగులోకి తెచ్చేందుకు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని సిట్ అధికారి అనుచేత్ తెలిపారు. తన కక్షిదారు చూపించిన అన్ని ప్రదేశాల్లో గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్‌ను ఉపయోగించాలని నిందితుడి తరఫు న్యాయవాది కోరారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు

ఆపరేషన్ కుంకీతో రైతులకు భరోసా

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కుంకీ ఏనుగుల ద్వారా చేపట్టిన తొలి ఆపరేషన్ విజయవంతమైందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం పరిధిలోని మొగిలి వద్ద మామిడితోటలు ధ్వంసం చేస్తున్న అటవీ ఏనుగుల గుంపును కుంకీ ఏనుగులు విజయవంతంగా తరిమికొట్టాయని చెప్పారు. కృష్ణ, జయంత్, వినాయక్ అనే కుంకీ ఏనుగులు దీనిలో పాల్గొన్నాయన్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ కొనసాగిన ఈ ఆపరేషన్‌లో కర్ణాటక నుంచి తీసుకొచ్చిన కృష్ణ అనే కుంకీ ఏనుగు చాలా చురుగ్గా పాల్గొందని వివరించారు. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ ద్వారా భరోసా కల్పించామని చెప్పారు. పుంగనూరు అటవీ ప్రాంతంలో తదుపరి ఆపరేషన్ చేపట్టనున్నట్లు చెప్పారు.

అనిల్‌కుమార్ యాదవ్‌కు 36 ప్రశ్నలు

విచారణలో అడిగిన డీఎస్పీ



మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ప్రశ్నించినందుకే నాపై కేసు పెట్టారని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నమోదైన కేసులో సోమవారం నెల్లూరు గ్రామీణ డీఎస్పీ కార్యాలయంలో విచారణ జరిగింది. ఉదయం పది గంటలకు హాజరైన అనిల్‌కుమార్ యాదవ్‌ను నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి విచారించారు. కేసుకు సంబంధించి 36 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. అనంతరం అనిల్‌కుమార్ యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు చేస్తే నవ్వినందుకు తన పేరు చేర్చారని, వేదిక మీద కూర్చొని నవ్వడం కూడా తప్పేనా? అని ప్రశ్నించారు.

హడావుడిగా అరెస్టు ఎందుకు?

కిశోర్ కేసులో హైకోర్టు ప్రశ్న

ఈనాడు, అమరావతి: రెండు, మూడేళ్ల కిందట చోటుచేసుకున్న ఘటనల విషయంలో వైకాపా నేత తురకా కిశోర్‌పై తాజాగా కేసులు నమోదు చేసి, హడావుడిగా అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. అరెస్టు సమయంలో పోలీసులు నిబంధనలను పాటించలేదని తప్పుపట్టింది. ఈ కేసులో మేజిస్ట్రేట్ రిమాండ్ విధించిన విధానాన్నీ ఆక్షేపించింది. కిశోర్ తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి.. కేసుకు సంబంధించిన కొన్ని దస్త్రాలను కోర్టులో నేరుగా అందజేయడానికి యత్నించగా ఏజీపీ నిరాకరించారు. ఏజీపీ తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌ను పిలిపించి.. ఆ దస్త్రాలను సీల్డ్ కవర్లో భద్రపరిచి విచారణ రోజున తమ ముందుంచాలని స్పష్టం చేసింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

ఎయిర్ ఇండియా విమానంలో సమస్య

- 3 గంటలపాటు లోపలే ప్రయాణికుల సతమతం
- విమానంలో న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్
- ఆయన హెచ్చరికతో ఆహార ఏర్పాట్లు చేసిన సిబ్బంది

ఈనాడు, దిల్లీ: దిల్లీ నుంచి విజయవాడకు బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా ఏఐ-2571 విమానంలో సోమవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తడంతో ఎగరలేకపోయింది. టేకాఫ్ కాబోతుండగా ఇంజిన్‌లో తగినంత శక్తి వెలువడడంలేదని గుర్తించిన పైలట్‌లు విమానాన్ని రన్‌వే పై నుంచి వెనక్కు తీసుకువచ్చారు. అరగంట తర్వాత ఇంజినీర్లు వచ్చి తనిఖీ చేసినా సమస్యకు పరిష్కారం చెప్పకుండానే వెళ్లిపోయారు. ఆ విమానంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్‌తోపాటు, సుమారు 160 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఉదయం 8.30 గంటలకే బోర్డింగ్ అయినవాళ్లు దాదాపు 11.30 గంటల వరకు లోపలే చిక్కుకుపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఆకలితో ఇబ్బందిపడాల్సి వచ్చింది. వారి అవస్థలను గమనించిన జస్టిస్ బట్టు దేవానంద్ ఈ విషయాన్ని విమాన సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆహార సరఫరా విషయంలో తమకు ఆదేశాలు లేవని వారు బదులిచ్చారు. దాంతో జస్టిస్ దేవానంద్ తాను ఏపీ హైకోర్టు న్యాయమూర్తిననే విషయాన్ని వారికి చెప్పి, వెంటనే ప్రయాణికులకు ఆహారం ఏర్పాటు చేయకపోతే విషయాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్తానని హెచ్చరించడంతో సిబ్బంది ప్రయాణికులకు ఆహారం సమకూర్చారు. అలాగే అందరినీ టెర్మినల్‌కు తరలించాలని ఆయన నిర్దేశించడంతో మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో టెర్మినల్‌కు తీసుకువెళ్లి తర్వాత వేరే విమానంలో విజయవాడ తరలించారు. జస్టిస్ దేవానంద్ మాత్రం తన టికెట్ రద్దు చేసుకొని సాయంత్రం మరో విమానంలో విజయవాడ వెళ్లారు.



తల్లి సువర్చలతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయిన కేంద్రమంత్రి పెమ్మసాని

కుటుంబసభ్యులతో ప్రధానమంత్రిని కలిసిన కేంద్రమంత్రి పెమ్మసాని

ఈనాడు, దిల్లీ: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం ఇక్కడ తన తల్లి సువర్చల, సోదరుడు రవికిషోర్, సతీమణి రత్నలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. 'ప్రధానమంత్రిని కలిసిన అమూల్యమైన క్షణాలు మరువలేనివి. మాకోసం విలువైన సమయం కేటాయించినందుకు కృతజ్ఞతలు. ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వం, అంకితభావం, వినయశీలతతో కూడిన వ్యక్తిత్వం మమ్మల్ని ఎంతో ప్రభావితం చేసింది. ఈ క్షణాలు మాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి' అని పెమ్మసాని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

15 వేల నీటి తొట్టెల నిర్మాణం

ఈనాడు, అమరావతి: పశువుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రాష్ట్రంలో 15 వేల నీటి తొట్టెలు నిర్మించామని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో నీటి లభ్యత లేని గ్రామాల్లో వీటిని నిర్మించామని, ఈ తొట్టెలను పంచాయతీల సహకారంతో నిర్వహించనున్నామని పేర్కొంది.



కొన్నింటికి మీరు కారణం కాకపోవచ్చు!

మీరు తీసుకునే నిర్ణయాలు, ఎంచుకునే ఐచ్ఛికాలు మీ జీవితాన్ని చాలా ప్రభావితం చేస్తాయి. అంతమాత్రాన మీ జీవితంలో చోటుచేసుకునే ప్రతి పరిణామానికీ మీరే కారణమని మాత్రం భావించకండి! కొన్నిసార్లు అనుకోకుండా అదృష్టం కలిసిరావొచ్చు. ఇంకొన్నిసార్లు దురదృష్టం వెంటాడొచ్చు. కాబట్టి- విజయం దక్కినప్పుడు వినయంతో నడుచుకోవడం, వైఫల్యం ఎదురైనప్పుడు కుంగిపోకుండా ముందుకు సాగడం అలవాటు చేసుకోండి.

– దివ్యా మిత్తల్, ఐఏఎస్ అధికారిణి

ఆ 11 కోట్లు బ్యాంక్ చెస్ట్‌కు వెళ్లాయి

- మాచవరం ఎస్‌బీఐలో జమ చేయాలన్న కోర్టు ఆదేశాలు పాటించాం
- రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌పై ప్రాసిక్యూషన్స్ వాదనలు

ఈనాడు, అమరావతి: 'శంషాబాద్‌లో ఇటీవల సీజ్ చేసిన రూ.11 కోట్ల మద్యం ముడుపుల సొమ్మును విజయవాడ మాచవరం స్టేట్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసే విషయంలో ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాం. డిపాజిట్ చేస్తున్న సమయంలో వీడియో కూడా తీయించాం. ఆ డబ్బు బ్యాంక్ నుంచి కరెన్సీ చెస్ట్‌కు తరలింది' అని సిట్ తరఫున ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. సీజ్ చేసిన సొమ్మును ఇతర నోట్లతో కలపకుండా వేరుగా ఉంచాలని ఈ కేసులో ప్రధాన నిందితుడు (ఏ1) రాజ్ కెసిరెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం సిట్ దాఖలు చేసిన కౌంటర్‌లో పై వివరాలను ప్రస్తావించింది. సోమవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో జరిగిన విచారణలో ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. 'డిపాజిట్ విషయంలో సిట్ అధికారులు బ్యాంకర్లతో కుమ్మక్కయ్యారనేది అవాస్తవం. డిఫెన్స్ వాదనలు కోర్టును తప్పుదారి పట్టించేలా ఉన్నాయి. బ్యాంక్ నుంచి చెస్ట్‌కు.. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయో కోర్టుకు చెబుతాం' అని అన్నారు.

సీసీ కెమెరాల ఫుటేజ్ బయటపెట్టాలి: 'నగదు సీజ్ వ్యవహారం వెనుక కుట్ర ఉంది. 2024 జూన్ తర్వాత ముద్రించిన నోట్ల కట్టలను తీసుకొచ్చి చూపించారు. వాటి సీరియల్ నంబర్లు చూస్తే వివరాలు తెలుస్తాయి. ఈ నగదు డిపాజిట్ విషయంలోనూ పోలీసులు దోబూచులాడుతున్నారు. బ్యాంక్‌లో జమ చేసిన మూడు గంటల్లోనే అంత సొమ్మును లెక్కించడం, వెంటనే చెస్ట్‌కు, అక్కడి నుంచి ఏటీఎం కేంద్రాలకు పంపడం సాధ్యమేనా? దీనిపై ఎస్‌బీఐ నుంచి నివేదికతోపాటు సీసీ కెమెరా దృశ్యాలను కోర్టు ముందుంచాలి' అని డిఫెన్స్ తరఫున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు.

మీవాళ్లలోనూ మా మనుషులున్నారు.. పొన్నవోలు: పిటిషనర్ తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పలు సందర్భాల్లో సహనం కోల్పోయి ప్రాసిక్యూషన్స్ జేడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకే సీజ్ చేసిన సొమ్మును బ్యాంక్‌లో జమ చేశామని ఇందులో ఎటువంటి ఉల్లంఘనలు లేవని జేడీ వాదించారు. 'మీరేం చేశారో మాకంతా తెలుసు! మా వాళ్లలో మీవారు ఉన్నట్లే.. మీ మనుషుల్లోనూ మా వారు ఉన్నారు' అని పొన్నవోలు వ్యాఖ్యానించారు. వాదనలు విన్న న్యాయాధికారి భాస్కరరావు.. సీజ్ చేసిన నగదును డిపాజిట్ చేయక ముందు తీసిన ఫొటోలను సమర్పించాలని సిట్ అధికారులను ఆదేశించారు. నగదు జమ చేసే సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలు, సీసీ కెమెరాల్లోని దృశ్యాలతోపాటు ఆ సొమ్మును చెస్ట్‌కు తరలిస్తే ఆ దృశ్యాలు, స్టేట్‌మెంట్లను సమర్పించాలని ఎస్‌బీఐ అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చారు.

ముమ్మరంగా భూగర్భ విద్యుత్తు లైన్ల పనులు

రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ ఇప్పటికే జనావాసాలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించిన సంగతి విదితమే. అయితే ఆ భూముల్లో చాలా చోట్ల 220 కేవీ, 132 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల స్తంభాలు ఉన్నాయి. వీటి వల్ల నిర్మాణాలకు ఇబ్బందులు రాకుండా భూగర్భ విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం తాళ్లాయపాలెంలోని 400 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు లింగాయపాలెం, నేలపాడులో నిర్మించబోయే 220 కేవీ ఉపకేంద్రాల నుంచి వచ్చే లైన్లను భూగర్భంలో వేసే పనులు, ఇప్పటికే ఉన్న టవర్లను మార్చే పనులు జరుగుతున్నాయి.



భూగర్భంలో నుంచి హెచ్‌టీ లైన్లు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న డక్ట్‌లు

భూగర్భంలో డక్ట్‌లు ఏర్పాటు చేసి వాటి గుండా హెచ్‌టీ లైన్లు వెళ్లేలా అమర్చుతున్నారు.

– ఈనాడు, అమరావతి

అమరావతి నిర్మాణంలో ప్రజాభాగస్వామ్యం

- విరాళాల స్వీకరణకు సీఆర్డీఏ ఆహ్వానం

ఈనాడు, అమరావతి: అమరావతి నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా విరాళాలు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవాలన్న ఆకాంక్ష ఉన్న వారి కోసం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీఆర్డీఏ వెబ్‌సైట్ crda.ap.gov.in లో ఇందుకు ప్రత్యేకంగా 'డొనేట్ ఫర్ అమరావతి' అనే ఆప్షన్ ఇచ్చారు. దీనిపై క్లిక్ చేస్తే.. క్యూఆర్ కోడ్ వస్తుంది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే.. పేమెంట్ గేట్‌వే వస్తుంది. అందులో విరాళం అందజేయాల్సిన మొత్తాన్ని నమోదుచేసి.. మన యూపీఐ పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. ఆ మొత్తం సీఆర్డీఏ ఖాతాకు జమవుతుంది.

★ 2015లో అక్టోబరులో కొత్త రాజధాని నిర్మాణం కోసం అప్పటి సీఎం చంద్రబాబు.. 'మై బ్రిక్..మై అమరావతి'ని ప్రారంభించారు. ఒక్కో ఈ-ఇటుకను రూ.10 వెచ్చించి ప్రజలు కొనుగోలు చేశారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా..పలు దేశాల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. పలువురు ఎన్‌ఆర్‌ఐలు ఒక్కొక్కరు 10 వేల ఇటుకలను విరాళంగా ఇచ్చారు. దాతకు సీఎం సంతకంతో కూడిన రశీదు వెళ్లింది.



సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో ఉంచిన యూపీఐ క్యూఆర్ కోడ్

వైద్య విద్య పీజీ ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యుల కోటా ఖరారు

ఈనాడు, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల ప్రవేశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ వైద్యుల రిజర్వేషన్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. 2028-29 నాటికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్లినికల్, నాన్-క్లినికల్ స్పెషలిస్టులు ఎంతమంది అవసరం అవుతారో అంచనా వేసి ఈ నిర్ణయం తీసుకుంది. 17 పీజీ వైద్య విద్య కోర్సుల ప్రవేశాల్లో.. 7 క్లినికల్ సబ్జెక్టుల్లో పీహెచ్‌సీ వైద్యులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. 9 నాన్ - క్లినికల్ కోర్సుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద లభించే 50 శాతం పీజీ కోర్సుల్లో.. నిర్ణయించిన కోటా మేరకు ప్రభుత్వ వైద్యులకు ప్రవేశాలు దక్కుతాయి. మొత్తం 272 సీట్లలో.. క్లినికల్ విభాగాల్లో 154 సీట్లు, నాన్-క్లినికల్ విభాగాల్లో 118 సీట్లు వారికి అందుబాటులోకి వస్తాయి. పీహెచ్‌సీల్లో మూడేళ్ల సర్వీసు చేసిన వైద్యులు పీజీ కోర్సుల్లో రిజర్వేషన్ కోటాలో ప్రవేశాలకు అర్హులు. రాష్ట్రంలో 1,144 ప్రభుత్వ పీహెచ్‌సీల్లో పనిచేసే 2,288 వైద్యుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పీజీఈసెట్ కౌన్సెలింగ్ వాయిదా

ఈనాడు, అమరావతి: ఎంటెక్‌లో ప్రవేశాలకోసం నిర్వహిస్తున్న పీజీఈసెట్ కౌన్సెలింగ్‌ను ఉన్నత విద్యామండలి వాయిదా వేసింది. బోధన రుసుములను ప్రభుత్వం చెల్లించకపోవడంతో పలు కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్ల జారీని నిలిపివేశాయి. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు సైతం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ప్రైవేటు కళాశాలలదీ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో పీజీఈసెట్ కౌన్సెలింగ్ కోసం సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసేందుకు సమయం ఇవ్వాలంటూ అభ్యర్థులు కోరడంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటించింది.



కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురీకి వినతిపత్రం సమర్పిస్తున్న తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు. చిత్రంలో ఎంపీలు బీద మస్తాన్‌రావు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తిపాటి నాగరాజు, ఎ.లక్ష్మీనారాయణ, బైరెడ్డి శబరి

బీపీసీఎల్ రిఫైనరీ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయండి

కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీకి తెదేపా ఎంపీల వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన మూడు పెట్రోలియం, సహజవాయు రంగాలకు చెందిన ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని తెదేపా ఎంపీలు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురీని కోరారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో వారు కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఇందులో రామాయపట్నంలో బీపీసీఎల్ సంస్థ ఏర్పాటుచేయనున్న రిఫైనరీకి వేగంగా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఓఎన్‌జీసీ జాక్‌అప్ రిగ్ కాంట్రాక్టును హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని 65.40 లక్షల మంది దీపం లబ్ధిదారులను పీఎం ఉజ్వల యోజన కింద చేర్చి ఆ పథకం కింద అందే ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కోరారు.

విద్యుత్తు సరఫరా వ్యవస్థ బలోపేతానికి ఆర్థికసాయంపై ప్రహ్లాద్ జోషీకి వినతి

ఈనాడు, దిల్లీ: గ్రీన్ ఎనర్జీ కారిడార్ (జీఈసీ-3) కింద ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు సరఫరా వ్యవస్థ బలోపేతం కోసం ఆర్థికసాయం చేయాలని తెదేపా ఎంపీలు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషీని కోరారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వ పరంగా సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వ్యక్తిగతంగా చొరవ తీసుకోవాలన్నారు.


విదేశాల్లో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు

ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ వెల్లడి

ఈనాడు, అమరావతి: జలంధర్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యూఏఈ నుంచి రాష్ట్రానికి తిరిగొచ్చిన డీజిల్ ట్యాంకర్, కంటెయినర్, ఐటీవీ, ట్రక్కు డ్రైవర్ల కోసం ప్రత్యేక విదేశీ నియామకాలు చేపడుతున్నారు. అంతర్జాతీయ నైపుణ్య కార్యక్రమంలో భాగంగా వీటిని చేపడుతున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈఓ గణేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. "దుబాయిలోని త్రీస్టార్ గ్రూపు, వియోలీయ, అల్లయ్డ్ ట్రాన్స్‌పోర్టు ఉద్యోగాలకు ఈ నెల 10, ఇండియన్-జీసీసీ(ఐటీవీ) లైసెన్సు ఉన్న డ్రైవర్ల నియామకాలకు ఈ నెల 30లోపు దరఖాస్తులు సమర్పించాలి. నైపుణ్యం వెబ్‌పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. మధ్య తూర్పు దేశాలలో డ్రైవింగ్ అనుభవం ఉండి తిరిగొచ్చిన వారికి ఇది మంచి అవకాశం. యూఏఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉన్న పురుషులు అర్హులు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై 24-48 ఏళ్ల వయస్సు ఉండాలి" అని సూచించారు.

EENADU Vol: 51, Issue: 357 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

యువ గుండెలు ఉన్నట్టుండి చేతులెత్తేస్తున్నాయి. భవిష్యత్తు ఆశలను చిదిమేస్తున్నాయి. అప్పటివరకూ చలాకీగా, చురుకుగా తిరుగుతూ.. నవ్వుతూ తుళ్లుతూ ఆటలాడుతున్నవారిని, వ్యాయామం చేస్తున్న వారిని హఠాత్తుగా కుప్పకూల్చేస్తున్నాయి. ఇలా చిన్నవయసులోనే హఠాన్మరణం పొందటం ఇటీవల తరచూ చూస్తున్నాం. చాలామందికిది విస్మయం, విపరీతమైన భయం కలిగిస్తోంది కూడా. అపోహలకూ దారితీస్తోంది. ఎందుకీ దుస్థితి? దీనికి కారణాలేంటి?



గుండెలో పిడుగు!


హఠాత్తుగా గుండె స్తంభించి మరణించటమనేది పెద్దవయసువారికే పరిమితమనే భావన పోయింది. ప్రస్తుతం ఎంతోమంది చిన్నవయసులోనూ.. చివరికి పిల్లలూ దీని బారినపడుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు, ఎలాంటి సమస్యలు లేనివారూ దీనికి బలవుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అసలు విషయం ఏంటంటే- పైకి అంతా బాగా ఉన్నట్టు కనిపించినా లోపల ఎలాంటి సమస్యా లేదనుకోవటానికి లేదు. జన్యుపరంగా పుట్టుకతో తలెత్తే కొన్ని గుండెజబ్బులు లోలోపలే ముదురుతూ వస్తుండొచ్చు. చాలామందికివి ఉన్నట్టయినా తెలియదు. ఎప్పుడివి ఉద్ధృతమవుతాయో కూడా ఊహించలేం. తీవ్రమైన శారీరక శ్రమ, వ్యాయామాల వంటివి చేస్తున్నప్పుడు ఉన్నట్టుండి ప్రతాపం చూపించొచ్చు. మన శరీరంలోని అన్ని అవయవాలకూ అవసరమైన ఆక్సిజన్, పోషకాలు రక్తం ద్వారానే సరఫరా అవుతాయి. ఇందుకు గుండె సమర్థంగా పంప్ చేయటం చాలా కీలకం. లేకపోతే మెదడు వంటి కీలక అవయవాలకు తగినంత రక్తం అందక స్పృహ కోల్పోవచ్చు. గుండెలోని విద్యుత్ వ్యవస్థ ఉన్నట్టుండి ప్రేరేపితమైతే, లయ తప్పి స్తంభించిపోవచ్చు. ఇందుకు రకరకాల సమస్యలు దోహదం చేస్తుంటాయి. వీటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది గుండె కండరం మందం కావటం. గుండె కణాలకు ఖనిజ లవణాలను సరఫరా చేసే మార్గాలు దెబ్బతినటం, గుండె లోపాలు, మరీ ఎక్కువగా కొలెస్ట్రాల్ ఉత్పత్తి కావటం వంటివీ కారణమే. వీటిని ముందుగా గుర్తిస్తే తగు జాగ్రత్తలు తీసుకోవచ్చు. పెను విపత్తు సంభవించకుండా కాపాడుకోవచ్చు.



డా. ఎ.వి.అంజనేయులు
సీనియర్ కార్డియాలజిస్ట్
ఫోకస్ డయాగ్నోస్టిక్ సెంటర్
పంజాగుట్ట, హైదరాబాద్

1 గుండె మందం (హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతీ)

గుండె కండరం.. ముఖ్యంగా గదుల మధ్య ఉండే పొర (సెప్టమ్) మందం కావటం పెద్ద సమస్య. దీంతో ఎడమ జఠరిక లోపలి భాగం తగ్గుతుంది. దీంతో రక్తం సరిగా పంప్ కాదు (వెంట్రిక్యులార్ అవుట్‌ఫ్లో అబ్‌స్ట్రక్షన్). ఫలితంగా పనులు, వ్యాయామం చేసేటప్పుడు ఆయాసం కలుగుతుంది. కండరం మందమైతే సరిగా వ్యాకోచించదు కూడా. ఇదీ రక్త సరఫరాను దెబ్బతీస్తుంది. మెదడుకు రక్తం అందకపోతే ఉన్నట్టుండి స్పృహ కోల్పోయే ప్రమాదముంది. కొందరికి కండరం గట్టిపడి మచ్చలా ఏర్పడొచ్చు కూడా. ఇది గుండె విద్యుత్ ప్రసారానికి ఆటంకం కలిగించటం వల్ల హఠాత్తుగా గుండె లయ అస్తవ్యస్తమై (అరిత్మియా), వేగంగా కొట్టుకుంటుంది. కొందరికి నిమిషానికి 300 కన్నా ఎక్కువసార్లు కొట్టుకోవచ్చు. ఇలాంటి స్థితిలో గుండె కండరం సరిగా సంకోచించదు. దీంతో హఠాత్తుగా గుండె స్తంభించొచ్చు (సడెన్ కార్డియాక్ అరెస్ట్). రక్తం సరిగా సరఫరా కాకపోవటం వల్ల ఉన్నట్టుండి స్పృహ తప్పుతుంటారు. కొందరు ఛాతీలో నొప్పితోనూ కుప్పకూలొచ్చు. సత్వరం సీపీఆర్ చేయకపోతే, డిఫిబ్రిలేటర్‌తో షాక్ ఇవ్వకపోతే మరణమూ సంభవించొచ్చు. వీటిని ఎలా చేయాలో ప్రతి ఒక్కరూ నేర్చుకొని ఉండాలి. స్పోర్ట్స్ క్లబ్‌లు, జిమ్‌లలో డిఫిబ్రిలేటర్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడటమూ తప్పనిసరి.



మామూలు గుండె — మందమైన గుండె

జన్యువులే కారణం

గుండె మందం కావటానికి మూలం జన్యు లోపాలే. మన గుండె సంకోచించటంలో యాక్టిన్, మయోసిన్ ప్రొటీన్లు కీలక పాత్ర పోషిస్తాయి. మయోసిన్ తయారీకి తోడ్పడే జన్యువులో లోపముంటే కండ మందమవుతూ వస్తుంటుంది. కుటుంబంలో ఎవరికైనా ఇది ఉన్నట్టయితే తర్వాత తరానికి 50% వరకూ వచ్చే అవకాశముంది. అందువల్ల కుటుంబం మొత్తం ముందు జాగ్రత్తగా 2డీ ఎకో పరీక్ష చేయించుకోవటం మంచిది. దీంతో ముందుగానే సమస్యను పట్టుకోవచ్చు. ఈ పరీక్షను 12 ఏళ్ల వయసు నుంచే మొదలెట్టాలి. ప్రతి మూడేళ్లకోసారి 21 ఏళ్లు వచ్చేవరకూ చేయించుకోవాలి. ఈ లోపు సమస్య ఎప్పుడైనా బయటపడొచ్చు. 21 ఏళ్లు దాటాక ప్రతి ఐదేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే చాలు.

రెండు రకాలు

- మధ్యగోడ మందమై, గుండెలోంచి రక్తం బయటకు రావటం తగ్గటం అబ్‌స్ట్రక్టివ్ రకం. ఇది ప్రమాదకరమైంది.
- గుండె మందమైనా, రక్త సరఫరాలకు విఘాతం కలగకపోవటం నాన్ అబ్‌స్ట్రక్టివ్. వీరికి కుప్పకూలటం, హఠాత్తుగా గుండె స్తంభించటం వంటి ఇబ్బందులేవీ ఉండవు. కాకపోతే పనులు చేస్తున్నప్పుడు ఆయాసం కలగొచ్చు. మందులు వాడుకుంటే చాలావరకూ హాయిగా జీవించొచ్చు.

ఎలా తెలుసుకోవాలి?

గుండె మందం కావటం ఈసీజీ పరీక్షలో కొంతవరకు తెలుస్తుంది. 2డీ ఎకోతో పూర్తిగా బయటపడుతుంది. కొన్నిసార్లు 24 గంటల పాటు ఈసీజీని నమోదు చేసే హోల్టర్ పరీక్ష చేయాల్సి ఉంటుంది. కొందరికి ఎమ్మారై పరీక్షా అవసరపడొచ్చు. ఇందులో మామూలు కండరం, మచ్చ ఏర్పడిన భాగం ఎంతెంత ఉన్నాయో బయటపడతాయి. జన్యులోపాన్ని పరీక్షతో గుర్తించే అవకాశమూ ఉంది. కాకపోతే మయోసిన్ జన్యులోపమే కాకుండా ఇతరత్రా జన్యులోపాలూ కారణమవుతాయి కాబట్టి ఇందత సులభమైన పని కాదు.

అనుమానించేదెలా?

ఆటలాడుతున్నప్పుడో, పరుగెత్తుతున్నప్పుడో, వ్యాయామాలు చేస్తున్నప్పుడో ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవటం, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నట్టయితే గుండె కండరం మందమై ఉండొచ్చని అనుమానించటం తప్పనిసరి.

క్రీడాకారుల గుండె ప్రత్యేకం

క్రీడాకారులు రోజూ తీవ్రమైన కసరత్తులు చేస్తుంటారు కదా. వీరిలోనూ గుండె కండరం మందమవుతుంది. అయితే ఇదేమీ సమస్య కాదు. ఇది శారీరక శ్రమకు తగ్గట్టుగా అవయవాలకు తగినంత రక్తాన్ని సరఫరా చేయటానికి గుండె చేసుకునే సర్దుబాటు. వీరిలో గదుల మధ్య గోడ మాత్రమే కాదు, గుండె మొత్తమూ మందమవుతుంది. గుండె గదుల సైజూ పెరుగుతుంది. గుండె కూడా చాలా నెమ్మదిగా కొట్టుకుంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి సూచికే గానీ సమస్య కాదు. గుండె సంకోచించటం, పంపింగ్ సమర్థంగా సాగుతాయన్నమాట. ఫిట్‌నెస్ కోసం విపరీతంగా వ్యాయామాలు చేసేవారిలోనూ ఇలా ఉండొచ్చు.

మందులు, చికిత్స మార్గాలు

గుండె కండరం మందమైనవారు కఠినమైన వ్యాయామాలు, తీవ్ర శారీరక శ్రమకు గురిచేసే ఆటలకు దూరంగా ఉండాలి. అలాగే కొన్ని మందులు, చికిత్సలూ ఉపయోగపడతాయి.

మందులు: గుండె కండరాన్ని వ్యాకోచించేలా చేసే డైసోపిరమైడ్, అలాగే బీటా బ్లాకర్ల వంటి మందులు ఆయాసం వంటివి తగ్గటానికి తోడ్పడతాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకోవటం ముఖ్యం.

శస్త్రచికిత్స: మధ్య గోడ బాగా మందమైతే శస్త్రచికిత్సతో ఆ భాగాన్ని తొలగించొచ్చు (మయోమెక్టమీ). దీంతో రక్త సరఫరాకు ఆటంకం తొలగి, ఉపశమనం కలుగుతుంది.


ఆల్కహాల్‌తో మాడ్చటం: మధ్య గోడకు రక్తాన్ని సరఫరా చేసే నాళంలోకి ఆల్కహాల్‌ను పంపించటం మరో పద్ధతి. దీన్నే ఆల్కహాల్ సెప్టల్ అబ్లేషన్ అంటారు. దీంతో మందమైన భాగానికి రక్త సరఫరా తగ్గిపోయి, సన్నబడుతుంది. ఇది ఐదారేళ్ల వరకూ ఇబ్బందులు కలగకుండా చూస్తుంది.

ఐసీడీ పరికరం: గుండెలో మధ్య గోడ మందం 3 సెం.మీ. కన్నా మించితే హఠాత్తుగా చనిపోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. గుండె కండరంలో మచ్చ 15% కన్నా ఎక్కువగా ఉన్నవారికీ ఈ ప్రమాదం పొంచి ఉంటుంది. ఇలాంటివారికి ఛాతీ లోపల ఐసీడీ (ఇంట్రా కార్డియాక్ డిఫిబ్రిలేటర్) పరికరాన్ని అమర్చటం మేలు చేస్తుంది. ఇది గుండె వేగం బాగా పెరిగినప్పుడు షాక్ ఇవ్వటం ద్వారా తిరిగి మామూలు స్థితికి తీసుకొస్తుంది.

- ఐసీడీతోనూ ఫలితం లేకపోతే జీవితం దుర్భరంగా తయారవుతుంది. ఇలాంటి వారికి జన్యు చికిత్స ఉపయోగపడుతుంది. కాకపోతే ఇదింకా మనదేశంలో అందుబాటులో లేదు.
- ప్రస్తుతం జన్యువును మార్చే పద్ధతుల మీదా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి సఫలమైతే అసలు జబ్బు బారినపడకుండానే చూసుకోవటం సాధ్యమవుతుంది.

2 కణ మార్గ సమస్యలు

ఈసీజీ, ఎకో పరీక్షల్లో ఎలాంటి మార్పులు లేకపోయినా కొందరు హఠాత్తుగా కుప్పకూలుతుండటం చూస్తున్నాం. దీనికి ప్రధాన కారణం గుండె కణాల మార్గాలు అస్తవ్యస్తం కావటం (ఛానెలోపతీ). గతంలో ఇది అంతగా తెలిసేది కాదు. ఐదారేళ్లుగా బాగా గుర్తించగలుతున్నారు. ప్రతి కణానికీ సోడియం, పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలు అవసరం. ఇవి అతి సూక్ష్మమైన మార్గాల ద్వారా వస్తూ పోతుంటాయి. ఒకవేళ గుండె కణాల్లో సోడియం మార్గాల పనితీరు దెబ్బతింటే ఖనిజ లవణాల సమతుల్యత లోపిస్తుంది. దీంతో గుండె లయ అస్తవ్యస్తమై, ఉన్నట్టుండి వేగం పెరిగిపోతుంది. దీంతో హఠాత్తుగా కుప్పకూలుతారు. కణమార్గ సమస్యల్లో కొన్నింటిని ఈసీజీ ద్వారా గుర్తించే అవకాశం ఉండటం గమనార్హం.



- **క్యూటీ సిండ్రోమ్:** ఈసీజీ పరీక్షలో క్యూ, టీ తరంగాల మధ్య వ్యవధి ఎక్కువగా (లాంగ్ క్యూటీ), మరీ తక్కువగా (షార్టెన్డ్ క్యూటీ) ఉన్నట్టయితే గుండె లయ అస్తవ్యస్తం కావటం, హఠాత్తుగా గుండె ఆగి చనిపోయే ముప్పు ఎక్కువని చెప్పుకోవచ్చు.
- **బ్రుగాడ సిండ్రోమ్:** విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు, కడుపు నిండా తిన్నప్పుడు హఠాత్తుగా గుండె వేగం పెరిగి, మరణం సంభవించేలా చేయటం దీని ప్రత్యేకత. నిద్ర పోతున్నప్పుడు చిన్నవయసులోనే మరణించటానికి చాలావరకూ ఇదే కారణం.
- **క్యాటకొలమిన్ వీటీ:** ఇది ఈత, పరుగు వంటి కఠిన వ్యాయామాలు చేస్తున్నప్పుడు గానీ తీవ్ర భావోద్వేగాలకు గురైనప్పుడు గానీ తలెత్తుతుంది. సింపథెటిక్ నాడీ వ్యవస్థ అతిగా స్పందించటం మూలంగా అడ్రినలిన్, నార్ అడ్రినలిన్, కార్టిజోల్ వంటి హార్మోన్ల మోతాదులు ఒక్కసారిగా పెరుగుతాయి. దీంతో గుండె వేగంగా కొట్టుకుంటుంది. నిమిషానికి 300, 400 సార్లూ కొట్టుకోవచ్చు. మామూలు సమయాల్లో వీరిలో ఈసీజీ, ఎకో పరీక్షల వంటివన్నీ నార్మల్‌గానే ఉండటం గమనార్హం. అందుకే ఇది సమస్యను గుర్తించటంలో చాలామందిని బోల్తా కొట్టిస్తుంది. 35 ఏళ్ల లోపు వయసువారు వ్యాయామం చేస్తున్నప్పుడు హఠాత్తుగా గుండె స్తంభించి, మరణించటానికి ప్రధాన కారణం ఇదే.

- ఈ సమస్యలకు మందులతో పెద్దగా ప్రయోజనమేమీ ఉండదు. కొందరికి ఛాతీలో సింపథెటిక్ నాడుల గొలుసును కత్తిరించటం (సింపథెక్టమీ) ద్వారా అడ్రినలిన్, నార్ అడ్రినలిన్ ఉద్ధృతి తగ్గి, ఉపశమనం కలగొచ్చు.

3 గుండె లోపాలు

కొందరికి పుట్టుకతోనే గుండె లోపాలు ఉండొచ్చు. వీటిల్లోనూ కొన్ని గుండె హఠాత్తుగా స్తంభించేలా చేయొచ్చు. వీటిల్లో ఒకటి అరిత్మోజెనిక్ రైట్ వెంట్రిక్యులార్ కార్డియోమయోపతీ (ఏఆర్‌వీసీ). పది పదిహేనేళ్ల వయసులో గుర్తిస్తే మందులతో కొంత కాలం గుండె లయ తప్పకుండా చూడొచ్చు.

4 అతి కొలెస్ట్రాల్

గుండె రక్తనాళాల్లో పూడికలు కొందరిలో చిన్నవయసులోనూ కనిపిస్తుంటాయి. దీనికి ప్రధాన కారణం వంశపారంపర్యంగా రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటం (ఫెమిలియల్ హైపర్‌కొలెస్ట్రీమియా). వీరిలో కొలెస్ట్రాల్ 500కు దాటుతుంటుంది కూడా. దీని మూలంగా ఏర్పడే పూడికలతోనూ హఠాత్తుగా గుండెపోటు రావొచ్చు. అధిక కొలెస్ట్రాల్‌ను ముందే గుర్తిస్తే మందులతో తగ్గేలా చేయొచ్చు.

5 ధమనులు అస్తవ్యస్తం

గుండె నుంచి రక్తాన్ని తీసుకొచ్చే మూడు ధమనులు ఒక క్రమ పద్ధతిలో అమరి ఉంటాయి. కొందరిలో ఇవి పుట్టుకతోనే అస్తవ్యస్తంగా ఉండొచ్చు. దీంతో వ్యాయామం చేస్తున్నపుడు హఠాత్తుగా కుప్పకూలుతుంటారు. ధమనుల లోపాలను సర్జరీతో సరిచేయొచ్చు.

6 జీవ రసాయనాలు పెరగటం

కొలెస్ట్రాల్ పంపిణీలో తోడ్పడే లైపోప్రొటీన్ ఏ, హోమోసిస్టీన్, ఏపోబీ అనే జీవ రసాయనాల మోతాదులు ఎక్కువగా ఉన్నా చిన్న వయసులో గుండెపోటు రావొచ్చు. ఎందుకంటే ఇవి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తాయి. అందువల్ల కుటుంబంలో ఎవరికైనా గుండెజబ్బులు ఉన్నట్టయితే చిన్నవయసువారు వీటి మోతాదులను పరీక్షించుకోవటం మంచిది.

7 బృహద్ధమని చీలిక

అరుదే అయినా.. మరీ అధిక బరువులు ఎత్తే వెయిట్ లిఫ్టర్లలో బృహద్ధమని చీలిపోయి, కీలక అవయవాలకు రక్త సరఫరా నిలిపోవచ్చు. దీంతో హఠాత్తుగా కుప్పకూలి, మరణిస్తుంటారు.

ఒమేగా 3 కొవ్వులంటే?



ఒమేగా 3 కొవ్వు ఆమ్లాల మెదడు కణాల తయారీకి.. గుండె, ఇతర అవయవాలు సక్రమంగా పనిచేయటానికి తోడ్పడతాయి. వీటిని శరీరం తయారుచేసుకోలేదు. ఆహారం లేదా మాత్రల రూపంలోనే తీసుకోవాల్సి ఉంటుంది. సాల్మన్, టూనా వంటి కొవ్వుతో కూడిన చేపల్లో డీహెచ్‌ఏ, ఈపీఏ రకం ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలుంటాయి. కనోలా, సోయా నూనెల వంటి వంట నూనెల్లో ఏఎల్‌ఏ రకం ఆమ్లాలుంటాయి. అవిసె, చియా, గుమ్మడి విత్తనాలు.. అక్రోట్లతోనూ ఇవి దండిగా లభిస్తాయి. ఒమేగా 3 మాత్రలూ అందుబాటులో ఉన్నాయి గానీ వీటిని ఆహారం ద్వారా పొందేలా చూసుకోవటమే మంచిదన్నది నిపుణుల సూచన.

సర్వైకల్ క్యాన్సర్‌కు ఇంటి కిట్ల పరిష్కారం

గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్‌ను గుర్తించటానికి హెచ్‌పీవీ పరీక్షలున్నాయి. కానీ చాలామంది మహిళలు వీటిని చేయించుకోవటానికి వెనకాడుతుంటారు. ఇలాంటి పరిస్థితిని తప్పించటానికి ఇంట్లోనే నమూనాలు సేకరించే పద్ధతి బాగా ఉపయోగపడుతున్నట్టు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనంలో వెల్లడైంది. పరీక్ష కోసం కొందరికి ఫోన్ చేసి ఆసుపత్రికి రమ్మని చెప్పగా.. మరికొందరికి ఫోన్ చేయటంతో పాటు పరీక్ష కిట్లను పంపించారు. వీరికి సొంతంగా నమూనాలు తీసి, వాటిని మెయిల్ ద్వారా పంపించమని సూచించారు. మరికొందరికి కాల్ చేయటం, కిట్లను పంపించటంతో పాటు ఆ కిట్లను వెనక్కి పంపించేలా ప్రోత్సహించారు కూడా. కేవలం ఫోన్ చేయటంతో పోలిస్తే కిట్లను అందుకున్నవారు 40% కన్నా ఎక్కువ మంది ముందస్తు పరీక్షలను పూర్తి చేసుకున్నారు. కిట్లను తిరిగి పంపించేలా ప్రోత్సహించిన వారిలో మరింత ఎక్కువ మంది పరీక్షలకు మొగ్గు చూపారు. ఇంటి వద్దే ఎవరికి వారు నమూనాలు ఇచ్చే పద్ధతితో మంచి ఫలితం ఉంటున్నట్టు ఇది సూచిస్తోంది. నివారించటానికి వీలైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ విషయంలో ఇది నిజంగా గొప్ప విషయమే.

శ్వాస సమస్యలకు దూరంగా..

వృద్ధుల్లో సీవోపీడీ, దీర్ఘకాల బ్రాంకైటిస్, ఉబ్బసం వంటి శ్వాసకోశ సమస్యలు తరచూ చూస్తుంటాం. వీటి బారినపడటం కన్నా నివారించుకోవటమే ఉత్తమం.

- ప్రాణాయామం వంటి పద్ధతులతో గాఢంగా శ్వాస తీసుకోవటం సాధన చేయాలి. రోజుకు 5 నిమిషాలు గాఢంగా శ్వాస తీసుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది. ఊపిరితిత్తులు బలోపేతమవుతాయి.
- సిగరెట్లు, బీడీలు, చుట్టల జోలికి అసలే వెళ్లొద్దు. వీటిని కాల్చే అలవాటుంటే వెంటనే మానెయ్యాలి. అలాగే ఇంటా బయటా ఇతరులు కాల్చిన సిగరెట్ పొగలను పీల్చకుండానూ చూసుకోవాలి. పొగతో శ్వాస మార్గాలు సంకోచిస్తాయి. శ్వాస తీసుకోవటం కష్టమవుతుంది. అంతేకాదు, పొగ ఊపిరితిత్తుల్లో వాపు తలెత్తేలా చేస్తుంది కూడా. ఇది బ్రాంకైటిస్‌కు దారితీస్తుంది.
- దుమ్ము, ధూళి, పొగ వాతావరణాలకు దూరంగా ఉండాలి. ఇంట్లోనూ గాలి కలుషితం కాకుండా చూసుకోవాలి.
- స్వచ్ఛమైన గాలితో కూడిన ప్రాంతాలకు వెళ్లాలి. చిన్న చిన్న దూరాలకు ప్రయాణాలు చేయాలి. అయితే ట్రాఫిక్ ఎక్కువగా ఉండే చోట్లకు వెళ్లొద్దు. అలాంటి ప్రాంతాల్లో వ్యాయామం చేయొద్దు.

వాంతితో గొంతునొప్పా?

వాంతులైన తర్వాత కొన్నిసార్లు గొంతునొప్పి మొదలవుతుంది కదా. దీనికి కారణం జీర్ణాశయం నుంచి ఆహారం, ఆమ్లాలు బలంగా పైకి తోసుకొని రావటం. అన్నవాహిక బలవంతంగా సాగటం, సంకోచించటం, వాంతిని బయటకు తోయటం వంటివి నొప్పికి దారితీస్తాయి.



కొన్నిసార్లు అన్నవాహికలో చిన్న చిన్న చీలికలూ ఏర్పడొచ్చు. కడుపులోంచి ఆమ్లం బయటకు రావటం వల్ల మంటతో కూడిన నొప్పి పుడుతుంది. వాంతి తర్వాత గొంతు ఎండిపోవటమూ ఇబ్బంది కలిగిస్తుంది. కొన్ని చిట్కాలతో ఈ గొంతు నొప్పిని తగ్గించుకోవచ్చు.

- నొప్పి తగ్గుముఖం పట్టేంతవరకూ వేడి, కారం, మసాలా, పుల్లటి పదార్థాలు తినకపోవటమే మంచిది. ఇవి నొప్పిని మరింత తీవ్రం చేస్తాయి. కోలుకోవటం ఆలస్యమవుతుంది. అదే మెత్తటి అన్నంలో పెరుగు, మజ్జిగ కలిపి తింటే నొప్పి అంతగా ఇబ్బంది పెట్టదు.
- గొంతు వెనకాల భాగాన్ని ఉప్పునీటితో పుక్కిలించటం మేలు చేస్తుంది. ఇది ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండానూ కాపాడుతుంది. అయితే ఉప్పునీటిని మింగొద్దు. ఇది జీర్ణాశయాన్ని మరింత చికాకు పరుస్తుంది. నీటిశాతం తగ్గేలా చేస్తుంది.
- తేనీరు వంటి గోరువెచ్చటి ద్రవాలు గొంతుకు హాయిని కలిగిస్తాయి. పుదీనా వంటి వాటితో కాచిన నీరు అయితే ఇంకా మంచిది.
- గోరువెచ్చటి నీటిలో చెంచాడు తేనె కలిపి తాగినా అన్నవాహిక నొప్పి తగ్గటానికి తోడ్పడుతుంది. తేనెలో వాపు, బ్యాక్టీరియాను అడ్డుకునే గుణాలుంటాయి మరి.
- ఇబ్బంది మరీ ఎక్కువగా ఉంటే నొప్పి మాత్రలు ఉపయోగపడతాయి.
- ఇలాంటి చిట్కాలు ఉపయోగపడే మాట నిజమే అయినా అన్నింటికన్నా ముఖ్యమైంది విశ్రాంతి తీసుకోవటం. కొద్దిరోజులు ఓపిక పడితే నొప్పి నెమ్మదిగా అదే తగ్గుతుంది.

వారి గురించే కాదు

జబ్బులతో బాధపడుతున్నవారిని, మంచాన పడ్డవారిని, వృద్ధులను కనిపెట్టుకోవటం అంత తేలికైన పని కాదు. కొన్నిసార్లు ఇంటిని విడిచి వెళ్లటమూ కుదరకపోవచ్చు. రోజువారీ పనులనూ మార్చుకోవాల్సి వస్తుంది. ఇది శారీరకంగానే కాదు, మానసికంగానూ కుంగదీస్తుంది. అందువల్ల వారి బాగోగులనే కాదు, మీ ఆరోగ్యం గురించీ శ్రద్ధ తీసుకోవటం తప్పనిసరి.

- మనసుకు ఆనందం కలిగించే అలవాట్లను కొనసాగించండి.
- అరగంట ముందే నిద్రకు ఉపక్రమించండి.
- కాసేపు అలా బయటకు వెళ్లి, నడవండి.
- యోగా, ప్రాణాయామం సాధన చేయండి.
- అప్పుడప్పుడూ స్నేహితుల ఇంటికి వెళ్లండి. వారినైనా ఇంటికి ఆహ్వానించండి.
- మీలాగే సేవలు చేస్తున్నవారితో జట్టు కట్టండి.

వెక్సాస్.. ఓ కొత్త జబ్బు

వెక్సాస్ సిండ్రోమ్. ఇదేం జబ్బు, ఎప్పుడూ వినలేదే అనుకుంటున్నారా? నిజమే. మనలో చాలామందికి తెలియదనుకోండి. ఇది బయటపడి కొద్ది సంవత్సరాలే అయ్యింది మరి. కచ్చితంగా చెప్పాలంటే 2020లో తొలిసారి గుర్తించారు. మధ్యవయసులో ఉన్నట్టుండి కనిపించటం దీని ప్రత్యేకత. కారణమేదీ లేకుండానే తరచూ ఒంట్లో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రేరేపితం కావటంతో ఇది తలెత్తుతుంది. దీని గురించి ఇప్పుడిప్పుడే అధ్యయనాలు కొత్త విషయాలను వెల్లడిస్తున్నాయి.



వెక్సాస్ జబ్బు చాలా అంశాలతో ముడిపడి ఉంటుంది. కణంలో జీవ పదార్థంలోని చోటు (వ్యాక్యూల్), ఈ1 ఎంజైమ్, ఎక్స్ క్రోమోజోమ్, స్వీయ వాపుప్రక్రియ గుణాలు, శారీరక మార్పులు ఇందులో పాలు పంచుకుంటాయి. అందుకే వీటన్నింటినీ ధ్వనించేలా వెక్సాస్ అనే పేరును నిర్ణయించారు. రక్తకణాల్లోని యూబీఏ1 జన్యువులో తలెత్తే మార్పులు వెక్సాస్‌కు కారణమవుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ జన్యువు ఎక్స్ క్రోమోజోమ్‌లో ఉంటుంది. పురుషుల్లో ఒక ఎక్స్ క్రోమోజోమ్ ఉంటే మహిళల్లో రెండుంటాయి. మగవారిలో ఒక జన్యు ప్రతిలో లోపం తలెత్తినా వెక్సాస్ రావొచ్చు. అదే మహిళల్లోనైతే రెండు ప్రతుల్లోనూ మార్పులు తలెత్తాల్సి ఉంటుంది. అందువల్ల వెక్సాస్ జబ్బు మగవారికి ఎక్కువగా వచ్చే అవకాశముంది. సాధారణంగా 50 ఏళ్లు పైబడ్డవారికి వస్తుంటుంది.

- యూబీఏ1 జన్యువు చేసే పనేంటో తెలుసా? యుబిక్విటిన్-యాక్టివేటింగ్ ఎంజైమ్ 1 (ఈ1 ఎంజైమ్) అనే ప్రొటీన్ తయారు కావటానికి అవసరమైన సూచనలు ఇవ్వటం. దెబ్బతిన్న, అనవసర ప్రొటీన్లను గుర్తించి, వాటిని బయటకు పంపటానికి ఈ జన్యువు తోడ్పడుతుంది. ఒకవేళ యూబీఏ1 జన్యువు మారిపోతే ఈ1 ఎంజైమ్ సక్రమంగా పనిచేయదు. దీంతో కణాల్లో దెబ్బతిన్న, అనవసర ప్రొటీన్లు పోగుపడతాయి. ఫలితంగా రోగనిరోధక వ్యవస్థ ప్రేరేపితమై వాపు ప్రక్రియకు దారితీస్తుంది.

వంశపారంపర్యం కాదు

వెక్సాస్‌కు కారణమయ్యే జన్యు మార్పులు వంశపారంపర్యం కావు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించవు. పుట్టిన తర్వాతే యూబీఏ1 జన్యువు మారుతుందన్నమాట. కొత్త కణాలు పుట్టుకొచ్చేటప్పుడు డీఎన్ఏ ప్రతులు ఏర్పడుతున్న సమయంలో జన్యువులో మార్పులు తలెత్తుతాయి. కొన్నిరకాల రేడియేషన్, రసాయనాల ప్రభావంతోనూ జన్యు మార్పులు తలెత్తొచ్చు. నిజానికి వయో ప్రక్రియలో భాగంగా కణాల్లో మార్పులు జరగటం సహజమే. వీటిల్లో చాలావరకూ హాని చేసేవేమీ కావు. కానీ యూబీఏ1 జన్యువులో తలెత్తే మార్పులు వెక్సాస్ జబ్బుకు దారితీస్తుండటం గమనార్హం.

గుర్తించేదెలా?

వెక్సాస్‌కు కారణమయ్యే జన్యు మార్పు ప్రతి 13,600 మందిలో ఒకరిలో ఉంటున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. 50 ఏళ్లు పైబడినవారిలో ప్రతి 8వేల మందిలో ఒకరిలో.. అదే 50 ఏళ్లు పైబడ్డ మగవారిలో ప్రతి 4వేల మందిలో ఒకరిలో ఉంటున్నట్టు బయటపడింది. జబ్బు లక్షణాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటున్నందున జన్యు పరీక్ష ద్వారా యూబీఏ1 మార్పులను గుర్తించటం మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ఇవీ లక్షణాలు

వెక్సాస్ చాలావరకూ రక్తం, ఎముక మజ్జ మీద ప్రభావం చూపుతుంది. చర్మం, ఊపిరితిత్తుల వంటి ఇతర అవయవాలూ ప్రభావితం కావొచ్చు. దీని లక్షణాలు అందరిలో ఒకేలా ఉండవు. ఒక్కొక్కరిలో ఒక్కో లక్షణాలు కనిపిస్తుంటాయి.

- చర్మం మీద నొప్పితో కూడిన దద్దు
- చెవులు, ముక్కు ఎరుపెక్కటం, నొప్పి, వాపు
- ఊపిరితిత్తులు ప్రభావితం కావటం వల్ల దగ్గు, ఆయాసం
- రక్తనాళాలు ఉబ్బటం, రక్తం గడ్డలు ఏర్పడటం
- జ్వరాలు
- తీవ్రమైన నిస్సత్తువ
- ఎర్ర రక్తకణాలు లేదా హిమోగ్లోబిన్ తగ్గటం (రక్తహీనత)
- ప్లేట్‌లెట్లు, తెల్లరక్తకణాలు తగ్గటం
- ఎముక మజ్జ బయాప్సీలో అసాధారణ మార్పులు

చికిత్సల అన్వేషణ

వెక్సాస్ కొత్త జబ్బు కావటం వల్ల దీన్ని బాగా నయం చేయగల చికిత్సలను పరిశోధకులు అన్వేషిస్తున్నారు. శరీర రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందనను ఆపే స్టెరాయిడ్లు వాపు ప్రక్రియను అదుపులో ఉంచటానికి తోడ్పడతాయి. వెక్సాస్ జబ్బు రక్తం, ఎముక మజ్జ మీద చూపే ప్రభావాలను తగ్గించటానికి రక్తక్యాన్సర్లలో వాడే మందులనూ పరీక్షిస్తున్నారు. ఎముక మజ్జ మార్పిడితో ప్రయోజనం కలుగుతుందేమో తెలుసుకోవటానికి ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

త్వరలో 'ధ్రువ స్పేస్' అంతరిక్ష ప్రయోగం



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష సేవల సంస్థ ధ్రువ స్పేస్ తన తొలి అంతరిక్ష ప్రయోగాన్ని త్వరలో చేపట్టనుంది. ఈ సంస్థ లీప్-1 పేరుతో అంతరిక్ష ప్రయోగాన్ని నిర్వహించడానికి కొంతకాలంగా సన్నాహాలు చేస్తోంది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ రూపొందించిన ఫాల్కన్ 9 అనే రెండు దశల రాకెట్ ప్రయోగంలో లీప్-1 భాగస్వామ్య అవుతుంది. ఈ ఏడాది చివర్లో ఈ ప్రయోగాన్ని చేపడతారు. వాణిజ్యపరంగా ధ్రువ స్పేస్ నిర్వహించే తొలి అంతరిక్ష ప్రయోగం ఇదే. స్వతంత్రంగా రూపొందించిన పి-30 శాటిలైట్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా లీప్-1 ప్రయోగాన్ని నిర్వహిస్తారు. ఇందులో అకులు టెక్‌కు చెందిన నెబ్యూస్-01 ఏఐ సాంకేతిక పరిజ్ఞానం, స్పార్క్ శాటిలైట్స్ హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ సామర్థ్యం గల ఓటీబీ-2 మిషన్ ఉంటాయి. దీనివల్ల రక్షణ అవసరాలు, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, గనుల తవ్వకం, పర్యావరణ పరిరక్షణ.. తదితర విభాగాలకు సేవలు అందించే అవకాశం కలుగుతుంది.

వచ్చే ఏడాది నుంచి పాన్ 2.0

ఎల్‌టీఐమైండ్‌ట్రీకి ప్రాజెక్టు పనులు



దిల్లీ: ఆదాయపు పన్ను విభాగం పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) 2.0 ప్రాజెక్టును అమలు చేయడానికి సిద్ధమవుతోంది. దీన్ని అమలు చేసే పనుల కోసం ఎల్‌టీఐమైండ్‌ట్రీని ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానుందని ఒక ఉన్నతాధికారి తెలిపారు. పాన్ 2.0 ప్రాజెక్టులో భాగంగా పాన్, టీఏఎన్‌లకు సంబంధించిన అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో పాన్ కేటాయింపు, సవరణలు, నవీకరణ, ఆధార్-పాన్ అనుసంధానం, కార్డును తిరిగి జారీ చేయడం, ఆన్‌లైన్ పాన్ ధ్రువీకరణ లాంటి అన్ని సేవలు ఒకే వేదికగా అందుబాటులోకి వస్తాయి. ప్రజలకు పాన్ సేవలను మరింత మెరుగ్గా అందించడమే దీని లక్ష్యం. దీనికోసం బిడ్డింగ్‌ను ఆహ్వానించగా, ఎల్‌టీఐమైండ్‌ట్రీ లిమిటెడ్ దీన్ని సొంతం చేసుకుంది. ఈ ప్రాజెక్టు 18 నెలల్లో ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి.

10% తగ్గిన అరబిందో ఫార్మా లాభం



దిల్లీ: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అరబిందో ఫార్మా రూ.824 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.918 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 10% తక్కువ. అమెరికాలో విక్రయాలు తగ్గడం, ఏపీఐ వ్యాపారం నిరాశపరచడం ఇందుకు కారణమయ్యాయి. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.7,567 కోట్ల నుంచి రూ.7,868 కోట్లకు పెరిగింది. 'ఈ ఏడాది స్థిరంగా ప్రారంభించాం. మా ఐరోపా వ్యాపారం బలమైన వృద్ధిని కనబరిచింది. ప్రైసింగ్, సీజనల్ పరిస్థితులు వంటి తాత్కాలిక సవాళ్లు ఎదురైనప్పటికీ అమెరికా వ్యాపారం రాణించింది' అని కంపెనీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు. బ్రాండెడ్ వ్యాపారంలో నిర్వహణాపరమైన చర్యలు చేపట్టడం, ఇటీవలి అమెరికా సంస్థ కొనుగోలుతో వృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రూ.1 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.4 (400 శాతం) మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు సోమవారం ఆమోదం తెలిపింది. ఇందుకు రికార్డు తేదీగా ఆగస్టు 8ని నిర్ణయించింది. సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు 1.04% లాభపడి రూ.1,090.90 వద్ద ముగిసింది.



అయిదో అతిపెద్ద విమానయాన విపణి మనదే

ముంబయి-దిల్లీ అత్యంత రద్దీగా ఉండే జంట విమానాశ్రయాలు

దిల్లీ: ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద విమానయాన విపణిగా భారత్ అవతరించింది. 2024లో 24.1 కోట్ల మంది విమానాల్లో గమ్యస్థానాలకు చేరారని అంతర్జాతీయ విమానయాన సంస్థల సంఘం ఐఏటీఏ పేర్కొంది. ఐఏటీఏ విడుదల చేసిన తాజా నివేదిక (వరల్డ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ గణాంకాలు) ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక విమాన ప్రయాణికులతో అమెరికా (87.6 కోట్లు) తొలిస్థానంలో నిలిచింది. చైనా (74.1 కోట్లు), యూకే (26.1 కోట్లు), స్పెయిన్ (24.1 కోట్లు) కూడా భారత్ కంటే ముందున్నాయి. భారత్‌లో 2023లో 21.1 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారు.. గతేడాది 11.1% వృద్ధి కనిపించింది.

✦ ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే జంట విమానాశ్రయాల్లో ముంబయి-దిల్లీ 59 లక్షల మంది ప్రయాణికులతో 7వ స్థానంలో నిలిచాయి.

✦ జెజు-సియోల్ మార్గంలో 1.32 కోట్ల మంది ప్రయాణించడంతో ఆ జంట విమానాశ్రయాలు అగ్రస్థానంలో నిలిచి, ఆసియా పసిఫిక్ ప్రాంత ఆధిపత్యాన్ని చాటాయి. టాప్-10లో కేవలం ఒక జంట(జెద్దా-రియాద్) మాత్రమే ఆసియా పసిఫిక్ ప్రాంతం కాదు.

ఎకానమీ సీట్లదే హవా..

అంతర్జాతీయ విమాన ప్రయాణాల్లో ప్రీమియం క్లాస్ (బిజినెస్, ఫస్ట్‌క్లాస్) 11.8% వృద్ధిని నమోదు చేసింది. ఎకానమీ ప్రయాణం 11.5% వృద్ధికే పరిమితమైంది. 2024లో అంతర్జాతీయ ప్రీమియం క్లాస్ ప్రయాణికుల సంఖ్య 11.69 కోట్లుగా నమోదైంది. ఇది మొత్తం అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్యలో 6 శాతమే. మిగిలిన వారు ఎకానమీ తరగతిలోనే ప్రయాణించారు.

✦ గతేడాది ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రీమియం ప్రయాణికులు 2.1 కోట్ల మంది. 2023తో పోలిస్తే 22.8% వృద్ధి కనిపించింది. అయితే ఎకానమీ క్లాస్‌లో 50.08 కోట్ల మంది ప్రయాణించడంతో పాటు 28.6% వృద్ధి నమోదైంది.

✦ ఐరోపా, లాటిన్ అమెరికా, మధ్య ప్రాచ్యం, ఉత్తర అమెరికాల్లో మాత్రం ఎకానమీ క్లాస్‌తో పోలిస్తే ప్రీమియం ప్రయాణ వృద్ధి అధికంగా కనిపించింది. ఐరోపా ఈ విషయంలో 3.93 కోట్ల మంది ప్రీమియం ప్రయాణికులతో అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం ప్రయాణికుల్లో ప్రీమియం ప్రయాణికుల వాటా విషయంలో 14.7 శాతంతో మధ్యప్రాచ్యం తొలి స్థానంలో ఉంది.

బోయింగ్ బీ737.. కోటి సార్లు ప్రయాణం

గతేడాదిలో బోయింగ్, ఎయిర్‌బస్‌లకు చెందిన చిన్న (నారో బాడీ) విమాన సర్వీసులు అధికంగా నడిచాయి. బోయింగ్ బీ737 విమాన సర్వీసులు కోటికి పైగా నమోదయ్యాయి. ఎయిర్‌బస్ ఏ320 విమానాలు (79 లక్షలు), ఎయిర్‌బస్ ఏ321 (34 లక్షలు) కూడా అధిక సర్వీసులను అందించాయి.

ఈనాడు బిజినెస్

రిలయన్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈడీ సమన్లు

దిల్లీ: మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం సమన్లు జారీ చేసింది. అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, సతీశ్ సేథ్ సహా గ్రూప్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈడీ సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో భాగంగా వీరి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. బ్యాంకుల కన్సార్షియంను మోసం చేయడంలో వీరు కీలకపాత్ర పోషించినట్లు ఈడీ అనుమానిస్తోంది.

✦ బ్యాంకుల నుంచి రిలయన్స్ గ్రూప్ కంపెనీలు తీసుకున్న రూ.17,000 కోట్ల రుణాలను అక్రమంగా తరలించిన ఆరోపణలపై ఈడీ కేసు దాఖలు చేసింది. ఇందులో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ రూ.5,901 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ రూ.8,226 కోట్లు, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించి రూ.4,105 కోట్ల రుణాలు ఉన్నాయి. ఈ కేసులో ఆగస్టు 5న (నేడు) విచారణకు హాజరు కావాల్సిందిగా రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఈడీ ఇప్పటికే సమన్లు జారీ చేసింది. విదేశాలకు పారిపోకుండా లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ)ను కూడా ఇచ్చింది.

20 బ్యాంకుల అధికారులకూ: దాదాపు 20 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల అధికారులకు కూడా సమన్లు జారీ చేయాలని ఈడీ భావిస్తోంది. అనిల్ అంబానీ గ్రూప్ సంస్థలకు రుణాలు ఇవ్వడానికి వారు పరిశీలించిన అంశాలు, రుణాల చెల్లింపుల్లో ఆ సంస్థ విఫలమయ్యాక తీసుకున్న చర్యలపై వారిని ప్రశ్నించనుంది.

పీఎస్‌బీలకు ఈడీలుగా 11 మంది సీజీఎంల పేర్ల సిఫారసు: ఎఫ్ఎస్ఐబీ

దిల్లీ: వివిధ బ్యాంకులకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీ)గా నియమించేందుకు 11 మంది చీఫ్ జనరల్ మేనేజర్ల (సీజీఎం) పేర్లను ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) సిఫారసు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు), ఆర్థిక సంస్థలకు డైరెక్టర్లను అన్వేషించే ప్రక్రియను ఎఫ్ఎస్ఐబీ నిర్వహిస్తుంటుంది. ఈ ఏడాది జులై 19 నుంచి ఆగస్టు 4 మధ్య 80 మంది అభ్యర్థులకు ఈ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. అనుభవం, పనితీరు, ఇతరత్రా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని.. పీఎస్‌బీల్లో ఈడీ పదవి కోసం తగిన అర్హతలు ఉన్న 11 మంది సీజీఎంల పేర్లను సిఫారసు చేసినట్లు ఎఫ్ఎస్ఐబీ తెలిపింది. వీరిలో అమిత్ కుమార్ శ్రీవాస్తవ, అమ్రేశ్ ప్రసాద్, సునీల్ కుమార్ ఛుగ్ (సీజీఎంలు, పంజాబ్ నేషనల్ బ్యాంక్); మిని టి ఎం, సుశాంత కుమార్ మొహంతి (బ్యాంక్ ఆఫ్ బరోడా); ప్రభాత్ కిరణ్, ఉదయ్ శంకర్ మజుందార్, రాజేశ్ కుమార్ సింగ్ (కెనరా బ్యాంక్); రతన్ కుమార్ (సెంట్రల్ బ్యాంక్), ప్రమోద్ కుమార్ ద్వివేది (బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఏకే వినోద్ (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పేర్లను ఎఫ్ఎస్ఐబీ సిఫారసు చేసింది. భవిష్యత్తులో అయ్యే ఖాళీలను బట్టి, వీళ్ల పదోన్నతులు ఆధారపడి ఉంటాయని తెలిపింది. ఎఫ్ఎస్ఐబీ సిఫారసు చేసిన పేర్లపై తుది నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని నియామకాలపై ఏర్పాటైన మంత్రి వర్గం తీసుకుంటుంది.

కోడి గుడ్లు

5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	435
వరంగల్	437
విజయవాడ	475
గోదావరి	470
విశాఖపట్నం	470
చిత్తూరు	513

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీకి ఆకర్షణీయ లాభాలు



ఈనాడు, హైదరాబాద్: స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసింది. రూ.178 కోట్ల త్రైమాసిక ఆదాయంపై రూ.21 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాలంతో పోల్చినప్పుడు ఆదాయం 23.6%, లాభం 37.6% పెరిగాయి. ఎబిటా (వడ్డీ, పన్ను, తరుగుదల, ఇతర కేటాయింపుల కంటే ముందు ఆదాయం) 31.9% వృద్ధితో రూ.35 కోట్లుగా నమోదైంది. బయోకాన్ సొల్యూషన్స్ పీటీఈ లిమిటెడ్ అనే సింగపూర్ సంస్థతో ఇటీవల దీర్ఘకాలిక వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఎండీ నాగేశ్వరరావు కందుల వెల్లడించారు. దీనివల్ల తమ ఉత్పత్తులను ఆగ్నేయాసియా దేశాలైన సింగపూర్, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌ల్యాండ్‌లకు ఎగుమతి చేసే అవకాశం కలుగుతుందన్నారు. అమెరికాలో స్టాండర్డ్ ఇంజినీరింగ్ ఇంక్., అనే అనుబంధ కంపెనీని పారిశ్రామిక తయారీకి కేంద్రస్థానమైన సౌత్ కరోలినా రాష్ట్రంలో నెలకొల్పామని.. ఇందువల్ల ఉత్తర అమెరికాలో అమ్మకాలు పెంచుకునే వీలుకలుగుతుందని నాగేశ్వరరావు వెల్లడించారు. ఫార్మాలో సీడీఎంఓ విభాగం వేగంగా విస్తరిస్తున్నందున.. ఫార్మా ఇంజినీరింగ్ కంపెనీ అయిన తమకు అమ్మకాలు పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు.

పేటీఎం నుంచి అలీబాబా నిష్క్రమణ!

దిల్లీ: పేటీఎం బ్రాండ్‌పై కార్యకలాపాలు సాగించే ఫిన్‌టెక్ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్‌లోని అతిపెద్ద వాటాదారుల్లో ఒకటైన యాంట్‌ఫిన్ (నెదర్లాండ్స్) హోల్డింగ్ బీవీ, బ్లాక్ డీల్ ద్వారా కంపెనీలో ఉన్న మొత్తం 5.84% వాటాను విక్రయించనుంది. చైనా దిగ్గజ సంస్థ అలీబాబా గ్రూప్‌నకు చెందిన యాంట్‌ఫిన్, గత రెండేళ్లుగా పేటీఎంలో వాటాను తగ్గించుకుంటూ వస్తోంది. తాజా వాటా విక్రయంతో పేటీఎం నుంచి పూర్తిగా నిష్క్రమించనుంది. ఒక్కో పేటీఎం షేరును రూ.1020 చొప్పున మొత్తం 3.77 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఫలితంగా ఈ లావాదేవీ విలువ రూ.3,803 కోట్లు అవుతుంది. ఆగస్టు 4న పేటీఎం షేరు ముగింపు ధర రూ.1078.20తో పోలిస్తే ఈ విలువ 5.4% తక్కువ. ఇంతకు ముందు 2023 ఆగస్టులో కూడా దాదాపు రూ.1371 కోట్ల విలువైన షేర్లను యాంట్‌ఫిన్ విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో పేటీఎం నష్టాలను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన నిర్వహణ మార్జిన్‌లను నమోదు చేసిన సంగతి విదితమే.

జాగ్వార్‌కు తొలి భారతీయ సీఈఓ



పీబీ బాలాజీ

దిల్లీ: జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా పీబీ బాలాజీని ఖరారు చేశారు. ఈ బ్రిటిష్ దిగ్గజ బ్రాండ్ తొలిసారిగా ఒక భారతీయుడిని ఈ స్థానంలో నియమించింది. ప్రస్తుత సీఈఓ యాండ్రియన్ మార్డెల్ పదవీ విరమణ చేయాలని భావించిన నేపథ్యంలో, కంపెనీ తాజా నిర్ణయం తీసుకుంది. కంపెనీలో 35 ఏళ్లుగా పనిచేసిన యాడ్రియన్.. మూడేళ్ల నుంచి సీఈఓగా ఉన్నారు. ఐఐటీ చెన్నైలో మెకానికల్ ఇంజినీరింగ్, ఐఐఎమ్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా చేసిన బాలాజీ ప్రస్తుతం టాటా గ్రూప్ సీఎఫ్‌ఓగా సేవలందిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు నుంచి జేఎల్ఆర్ సీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తారు. సోమవారం జరిగిన జేఎల్ఆర్ బోర్డు డైరెక్టర్ల సమావేశంలో బాలాజీ నియామకానికి ఆమోదం లభించిందని జేఎల్ఆర్ మాతృ సంస్థ టాటా మోటార్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో తెలిపింది.

100 కోట్ల చ.అ.కు కార్యాలయ స్థలం

విలువ రూ.16.27 లక్షల కోట్లు



దిల్లీ: దేశంలోని 8 ప్రధాన నగరాల్లో మొత్తం కార్యాలయ స్థలం 100 కోట్ల చదరపు అడుగులకు సమీపించిందని నైట్‌ఫ్రాంక్ నివేదిక తెలిపింది. రూ.16.27 లక్షల కోట్ల విలువైన 99.30 కోట్ల చదరపు అడుగుల స్థలం ఇప్పటికి అందుబాటులో ఉండగా, ఈ త్రైమాసికం చివరకు ఇది 100 కోట్ల చ.అ.కు చేరుతుందని పేర్కొంది. అమెరికాలో 1020 కోట్ల చ.అ., చైనాలో 626 కోట్ల చ.అ., జపాన్‌లో 177 కోట్ల చ.అ. కార్యాలయ స్థలం అందుబాటులో ఉందని వివరించింది. 2005లో కేవలం 20 కోట్ల చ.అ. కార్యాలయ స్థలమే మన దేశంలోని 8 నగరాల్లో ఉందని, 2025కు ఇది 100 కోట్ల చ.అ.కు చేరిందనీ వివరించింది. ఇందులో హైదరాబాద్‌లో 12.30 కోట్ల చ.అ. కార్యాలయ స్థలం విలువ రూ.1.40 లక్షల కోట్లుగా వివరించింది.

క్యాప్‌స్టన్ సర్వీసెస్‌కు రూ.6.13 కోట్ల లాభం

ఈనాడు, హైదరాబాద్: మానవ వనరుల సేవలు అందించే సంస్థ క్యాప్‌స్టన్ సర్వీసెస్ జూన్ త్రైమాసికానికి మెరుగైన ఫలితాలు సాధించింది. మొత్తం ఆదాయం రూ.191.29 కోట్లు కాగా, దీనిపై రూ.6.13 కోట్ల నికర లాభం, రూ.3.01 ఈపీఎస్ నమోదయ్యాయి. 2024-25 ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.153.65 కోట్లు, నికరలాభం రూ.3.32 కోట్లు, ఈపీఎస్ రూ.1.64 మాత్రమే ఉన్నాయి. దీంతో పోలిస్తే ఈ సారి మొత్తం ఆదాయం 24.50%, నికరలాభం 84.63% పెరిగాయి. వివిధ వ్యాపార విభాగాల్లో కొత్త క్లయింట్లను సంపాదిస్తున్నామని, కొత్త ప్రదేశాలకు సేవలు విస్తరించనున్నట్లు క్యాప్‌స్టన్ సర్వీసెస్ ఎండీ శ్రీకాంత్ కొడాలి తెలిపారు.

డీఎల్ఎఫ్ లాభంలో 18% వృద్ధి

దిల్లీ: స్థిరాస్తి సంస్థ డీఎల్ఎఫ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్‌లో రూ.762.67 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.644.67 కోట్లతో పోలిస్తే ఇది 18% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.1,729.82 కోట్ల నుంచి రూ.2,980.88 కోట్లకు వృద్ధి చెందింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ అమ్మకాల బుకింగ్‌లు 78% అధికమై రూ.11,425 కోట్లుగా నమోదయ్యాయి.

రూ.10,000 కోట్ల అద్దె ఆదాయమే లక్ష్యం: మధ్య కాలవ్యవధిలో కంపెనీ వాణిజ్య ఆస్తుల నుంచి రూ.10,000 కోట్ల వార్షిక అద్దె ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీఎల్ఎఫ్ ఛైర్మన్ రాజీవ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం డీఎల్ఎఫ్ గ్రూప్ చేతిలో కార్యాలయ స్థలాలు, షాపింగ్ మాల్స్ కలిపి దాదాపు 46 మిలియన్ చదరపు అడుగుల మేర ఉన్నాయి. వీటిపై ద్వారా రూ.6000 కోట్లకు పైగా వార్షిక అద్దె ఆదాయం లభిస్తోంది. 2024-25లో కంపెనీ బలమైన పనితీరు నమోదు చేసిందని రాజీవ్ సింగ్ వెల్లడించారు.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
బాష్	1,115	465	5,077	4,496
సీమెన్స్ ఎనర్జీ	263	146	1,785	1,484
ఆదిత్య బిర్లా క్యాపిటల్	835	759	9,531	8,719
సోనా బీఎల్‌డబ్ల్యూ	122	142	895	900
బీఎల్ఎస్ ఇ-సర్వీసెస్	17.5	12.6	251.2	82.3
ఎస్కార్ట్స్ కుబోటా	369.5	264.4	2,500.1	2,573.7
ఏథర్ ఎనర్జీ	(178)	(183)	673	368
ఆక్జో నోబెల్	91	114.6	995.1	1,036.3
గాడ్‌ఫ్రే ఫిలిప్స్	356.28	228.55	1,813.26	1,358.81
హెల్త్‌కేర్ గ్లోబల్	5.00	12.00	613	526

మస్క్‌కు రూ.2.50 లక్షల కోట్ల విలువైన టెస్లా షేర్లు



వాషింగ్టన్: తమ సీఈఓ ఎలాన్ మస్క్‌కు 29 బి.డాలర్ల (దాదాపు రూ.2.5 లక్షల కోట్ల) విలువైన 9.6 కోట్ల షేర్లను అమెరికా విద్యుత్తు కార్ల సంస్థ టెస్లా జారీ చేయనుంది. 2027 వరకు కీలక పదవిలో ఉంటేనే ఈ కొత్త షేర్లు వస్తాయి. అయిదేళ్ల హోల్డింగ్ పీరియడ్ కూడా ఉంది. అయితే ఈ షేర్ల కోసం తొలుత ప్రతి షేరుకు 23.34 డాలర్ల (సుమారు రూ.2,000) చొప్పున టెస్లాకు మస్క్ చెల్లించాల్సి ఉంటుంది. అమ్మకాలు తగ్గి, పుంజుకోవడానికి కంపెనీ సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో 2018 నాటి 50 బి.డాలర్లకు పైగా మస్క్ ప్యాకేజీలో కోత వేశారు. సీఈఓ వేతన ప్యాకేజీని నవంబరు 6న జరగబోయే వార్షిక మదుపర్ల సమావేశంలో ఓటింగ్‌కు పెట్టనున్నారు.

ఎందుకు తగ్గించారంటే: 2018 నాటి మస్క్ వేతన ప్యాకేజీని టెస్లా వాటాదారు ఒకరు డెలావేర్ కోర్టులో సవాలు చేశారు. అంత వేతనం నిర్ణయిస్తూ, బోర్డు తీసుకున్న అనుమతి ప్రక్రియ పలు పొరపాట్లతో నిండిఉందని, ఆయన భారీ ప్యాకేజీని రద్దు చేయాలని ఒక న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఆరు నెలల అనంతరం టెస్లా తాజా నిర్ణయం తీసుకుంది.

ముంబయిలో టెస్లా తొలి ఛార్జింగ్ కేంద్రం: ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని వన్ బీకేసీ వద్ద తొలి ఛార్జింగ్ కేంద్రాన్ని అంతర్జాతీయ ఈవీ దిగ్గజం టెస్లా ప్రారంభించింది. నాలుగు వీ4 సూపర్ ఛార్జింగ్ స్టాళ్లు(డీసీ ఛార్జింగ్), నాలుగు డెస్టినేషన్ ఛార్జింగ్ స్టాళ్లు (ఏసీ ఛార్జింగ్) ఇక్కడ ఉన్నాయి. సెప్టెంబరులోగా థానే, నవీ ముంబయిలలోనూ ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కంపెనీ భావిస్తోంది. మోడల్ వై (ప్రారంభ ధర రూ.59.89 లక్షల) కారుతో జులై 15న ఈ కంపెనీ భారత్‌లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.

రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేత

అయిదేళ్లలో గుర్తించిన అధికారులు



దిల్లీ: 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు గత అయిదేళ్లలో రూ.7.08 లక్షల కోట్ల మేర జీఎస్‌టీ ఎగవేతలను కేంద్ర జీఎస్‌టీ అధికారులు గుర్తించారు. ఇందులో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రూపేణా మోసమే రూ.1.79 లక్షల కోట్లు అని పార్లమెంటుకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రి తెలిపారు. మొత్తంగా 91,370 జీఎస్‌టీ ఎగవేత కేసులు నమోదుకాగా.. వీటిల్లో ఐటీసీ మోసాల కేసులు 44,938 అని వెల్లడించారు. 2024-25లోనే రూ.2.23 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతను గుర్తించినట్లు పేర్కొన్నారు.

ఇనుము, ఉక్కు రంగంలో రూ.47.12 కోట్ల ఐటీసీ మోసం: ఇనుము, ఉక్కు రంగంలో మోసపూరితంగా రూ.47.12 కోట్ల ఐటీసీని క్లెయిమ్ చేసుకున్నట్లు జీఎస్‌టీ అధికారులు గుర్తించారని సోమవారం ఆర్థిక శాఖ తెలిపింది. ఈ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించింది.

81,000 పాయింట్లపైకి సెన్సెక్స్

లోహ, వాహన షేర్లకు కొనుగోళ్ల మద్దతు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,566.51 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.4,386.29 కోట్లు



సెన్సెక్స్ ▲ 419 81019
నిఫ్టీ ▲ 157 24723

సమీక్ష

అంతర్జాతీయ మార్కెట్ల ధోరణికి అనుగుణంగా లోహ, కమొడిటీస్, వాహన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో, దేశీయ సూచీలు సోమవారం లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ మళ్లీ 81,000 పాయింట్లపైన ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 48 పైసలు నష్టపోయి 87.66 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.15% తగ్గి 68.87 డాలర్ల వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, దక్షిణ కొరియా, షాంఘై సూచీలు లాభపడగా, జపాన్ సూచీ నష్టపోయింది. ఐరోపా సూచీలు సానుకూలంగా కదలాడాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.27 లక్షల కోట్లు పెరిగి, రూ.448.79 లక్షల కోట్ల (5.13 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 80,765.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,599.91 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. అయితే ఒక దశలో 80,500.51 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ, తర్వాత లభించిన కొనుగోళ్ల మద్దతుతో 81,093.19 పాయింట్ల వద్ద గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 418.81 పాయింట్ల లాభంతో 81,018.72 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 157.40 పాయింట్లు పెరిగి 24,722.75 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,736.25-24,554 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 26 లాభపడ్డాయి. టాటా స్టీల్ 4.31%, బీఈఎల్ 3.33%, అదానీ పోర్ట్స్ 3.24%, టెక్ మహీంద్రా 2.53%, టీసీఎస్ 2.39%, భారతీ ఎయిర్‌టెల్ 1.59%, హెచ్‌సీఎల్ టెక్ 1.47%, ట్రెంట్ 1.29%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.27%, ఎం అండ్ ఎం 1.26%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.22%, టైటన్ 1.17%, ఎల్ అండ్ టీ 1.13% చొప్పున పెరిగాయి. పవర్‌గ్రిడ్ 1.10%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.99%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.57% మేర నష్టపోయాయి.

సంక్షిప్తంగా..

✦ **ఆల్‌టైమ్ ప్లాస్టిక్స్** రూ.401 కోట్ల ఐపీఓ ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.260-275.

✦ బ్యాటరీల తయారీ, స్వచ్ఛ ఇంధన సాంకేతికతల కోసం చైనాకు చెందిన బీవైడీ వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోలేదని **అదానీ గ్రూప్** సోమవారం ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.

✦ ప్రభుత్వ రంగ సంస్థ **ఎస్‌జేవీఎన్** ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా అదనపు బాధ్యతలు నిర్వర్తించేందుకు భూపేంద్ర గుప్తా పదవీ కాలాన్ని ఆగస్టు 1 నుంచి మరో 3 నెలల పాటు ప్రభుత్వం పొడిగించింది.

✦ **ఇండస్ఇండ్ బ్యాంక్** ఎండీ, సీఈఓగా యాక్సిస్ బ్యాంక్ మాజీ డిప్యూటీ ఎండీ రాజీవ్ ఆనంద్‌ను మూడేళ్ల కాలానికి నియమించారు. ఈనెల 25 నుంచి ఇది అమల్లోకి వస్తుంది.

నేటి బోర్డు సమావేశాలు: భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, గ్లాండ్ ఫార్మా, ఎన్‌సీసీ, సీసీఎల్ ప్రోడక్ట్స్, ఎంటార్ టెక్నాలజీస్, బ్రిటానియా, లుపిన్, బెర్జర్ పెయింట్స్, టొరెంట్ పవర్, కంటైనర్ కార్పొరేషన్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, గుజరాత్ గ్యాస్, క్యాస్ట్రాల్ ఇండియా

అమెరికాకు భారత్ ఎగుమతులు 30% తగ్గొచ్చు: జీటీఆర్ఐ



దిల్లీ: అధ్యక్షుడు ట్రంప్ విధించిన 25% అదనపు సుంకాల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో (2025-26) భారత్ నుంచి అమెరికాకు ఎగుమతులు 30% తగ్గి 60.6 బిలియన్ డాలర్లకు పరిమితం కావొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేసింది. 2024-25లో భారత ఎగుమతులు 86.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఎగుమతిదార్లను ఆదుకునేందుకు రూ.15,000 కోట్లతో వడ్డీ రాయితీ పథకాలను పునరుద్ధరించాలని, హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని, వాణిజ్య ఒప్పందాలను వ్యూహాత్మకంగా వినియోగించాలని, మరింతమంది తమ ఉత్పత్తులు ఎగుమతి చేసేలా ప్రోత్సహించాలని జీటీఆర్ఐ సూచించింది. ఆసియా దేశాల్లో భారత్ కూడా అధిక ఎగుమతి సుంకాలను ఎదుర్కొంటోంది. చైనా (30%) తర్వాత 2వ స్థానంలో భారత్ ఉంది. పోటీ దేశాలైన వియత్నాం (20%), బంగ్లాదేశ్ (18%), ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్ (19%), జపాన్, దక్షిణ కొరియా (15%) తక్కువ సుంకాలను కలిగి ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే భారత ఎగుమతులు అమెరికాకు తగ్గే వీలుందని జీటీఆర్ఐ మరోసారి అంచనా వేసింది. అమెరికా మార్కెట్లో తగ్గుతున్న మేర, వేరే దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేసి.. అంతస్థాయిలో లాభాలు అర్జించడం అంతా సులభం కాదని జీటీఆర్ఐ వివరించింది.

అమెరికా ఒత్తిడి ఉన్నా భారత్‌కు రష్యా నుంచి చమురు

వారాంతంలో 4 ట్యాంకర్ల రాక



ముంబయి: భారత రిఫైనరీలు ఈ వారాంతంలో రష్యా నుంచి కనీసం 4 ట్యాంకర్ల చమురు డెలివరీని అందుకున్నాయి. పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో, ఈ దిగుమతులు కొనసాగడం విశేషం. ట్రంప్ కఠిన డిమాండ్‌లు, 25% టారిఫ్‌కు తోడు జరిమానా విధిస్తామన్న హెచ్చరికల నడుమ.. రష్యా నుంచి దిగుమతిని ఆపివేయాలా వద్దా అన్నదానిపై కేంద్రం నుంచి మార్గదర్శకాల కోసం చమురు ట్రేడర్లు, షిప్పింగ్ కంపెనీలు ఎదురు చూశాయి. రష్యా చమురు దిగుమతులను నిలిపేయాలని భారత ప్రభుత్వం ఇంకా రిఫైనరీలకు చెప్పలేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. నయరా ఎనర్జీ, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు యూరల్స్ క్రూడ్ రకానికి చెందిన 2.2 మిలియన్ బ్యారెళ్లను రష్యా పంపింది. వారాంతంలో అవి అందాయి. కోచి, మంగళూరుల్లోని రిఫైనరీలకు(బీపీసీఎల్, ఎమ్ఆర్‌పీఎల్) 7.2 లక్షల బ్యారెళ్ల చమురు వచ్చింది. వచ్చే కొద్ది రోజుల్లో 2.2 మిలియన్ బ్యారెళ్ల యూరల్స్ చమురును మరిన్ని ట్యాంకర్లు తీసుకురానున్నట్లు సమాచారం.

90 కోట్ల టన్నుల బొగ్గు సరఫరా లక్ష్యం: కోల్ ఇండియా

దిల్లీ: 2025-26లో 900 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియా ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది 18 శాతానికి పైగా అధికం. విద్యుత్తుకు పెరుగుతున్న గిరాకీకి అనుగుణంగా సరఫరా పెంచాలని, దేశంలోకి బొగ్గు దిగుమతులను తగ్గించాలనే ఉద్దేశంతో భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

పాలసీబజార్‌పై రూ.5 కోట్ల జరిమానా: ఐఆర్‌డీఏఐ

ఈనాడు, హైదరాబాద్: బీమా సేవలను అందించే పాలసీబజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్‌పై భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) రూ.5 కోట్ల జరిమానా విధించింది. ఆ కంపెనీలో కొన్ని లోపాలు బయటపడటంతో, నియంత్రణ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. నిబంధనలు పాటించే విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. 2008లో ప్రారంభమైన పాలసీబజార్ ఇప్పటి వరకు 4.2 కోట్ల పాలసీలను విక్రయించింది.

గమనాల గుట్టు చెప్పే అధ్యయనం!

జనరల్ స్టడీస్
భౌతిక శాస్త్రం

యాంత్రిక శాస్త్రం

(దూరం - స్థానభ్రంశం)

గమనంలో ఉన్న వస్తువులను, వాటి గమనాన్నీ అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'యాంత్రిక శాస్త్రం' అంటారు. ఇందులో మూడు భాగాలు ఉంటాయి. 1) శుద్ధ గతిశాస్త్రం 2) గతిశాస్త్రం 3) స్థితిశాస్త్రం.

నిజ జీవితంలో కొన్ని వస్తువులు చలనంలో, కొన్ని నిశ్చలస్థితిలో ఉంటాయి.

ఉదా: పక్షులు ఎగరడం, గ్రహాలు, నక్షత్రాలు కదలడం మొదలైనవి.



నియంత్రిత చలనం వల్ల విద్యుత్తు ఉత్పత్తి కూడా జరుగుతుంది. పరిశీలనా బిందువు ఆధారంగా వస్తువు చలనాన్ని వివరించడానికి వీలవుతుంది.

* సరళరేఖ వెంట వస్తువు చలనం సాధారణ రకానికి చెందింది.
* పరిసరాల దృష్ట్యా వస్తువు స్థానంలో మార్పు జరిగితే అది చలనంలో ఉందంటారు.
* పరిసరాల్లో కొలిచే రాశులను భౌతిక రాశులు అంటారు.
* భౌతిక రాశి పరిమాణం = సంఖ్యాత్మక విలువ × ప్రమాణం

ఉదా: 100 కేజీ, 5 కి.మీ., 200 గ్రా., 5 సెకన్లు

భౌతిక రాశులు రెండు రకాలు (దిశ, పరిమాణం ఆధారంగా)

1) సదిశ రాశులు: దిశ, పరిమాణం రెండూ కలిగే రాశులు.

ఉదా: వేగం, త్వరణం, స్థానభ్రంశం, బలం, ద్రవ్యవేగం, బలయుగ్మం


2) అదిశ రాశులు: కేవలం పరిమాణం మాత్రమే ఉండి, దిశతో సంబంధం లేని రాశులు.

ఉదా: పొడవు, ద్రవ్యరాశి, కాలం, ఉష్ణోగ్రత, సాంద్రత, వైశాల్యం, ఘనపరిమాణం.

చలనం: ఒక వస్తువు సమాన కాలాల్లో సమాన దూరాలు ప్రయాణిస్తే ఆ చలనాన్ని సమచలనం అంటారు. **ఉదా:** గడియారంలో ముళ్ల చలనం.

వస్తువుల చలనాలు, గమనాలు, వాటిపై పనిచేసే బలాల గురించి అధ్యయనం చేసేదే యాంత్రిక శాస్త్రం. బైకు, కారు, రైలు మొదలైన వాహనాలు ఎలా కదులుతాయి? బ్రేకులు వేసినప్పుడు ఏ విధంగా ఆగుతాయి? టర్నింగ్ తీసుకునేటప్పుడు పడకుండా వెళ్లడంలో ఏం జరుగుతుంది? తదితర అంశాలను భౌతిక శాస్త్రంలో భాగంగా యాంత్రిక శాస్త్రం వివరిస్తుంది. భవనాలు, వంతెనలు, డ్యామ్‌ల లాంటి నిర్మాణాలను డిజైన్ చేసేటప్పుడు వాటి బలం, స్థిరత్వం, అవి తట్టుకోగల బలాలను యాంత్రిక శాస్త్ర సూత్రాల ఆధారంగా లెక్కిస్తారు. భూకంపాలు, గాలుల ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. వస్తువుల చలనాలను వివరించడానికి ఉపయోగపడే ప్రాథమిక భావనలే దూరం, స్థానభ్రంశం. వీటి గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వాటి మధ్య సంబంధాలనూ అర్థం చేసుకోవాలి.






* వస్తువు సమాన కాలంలో అసమాన దూరాలు ప్రయాణిస్తే దానిని 'అసమ చలనం'గా పేర్కొంటారు. **ఉదా:** రద్దీగా ఉండే ట్రాఫిక్‌లో ప్రయాణించే బైకు, కారు.
* కొన్ని వస్తువులు వేగంగా, మరికొన్ని నెమ్మదిగా కదులుతాయి. అవి కదిలే విధానం వాటి కాల వ్యవధులపై ఆధారపడి ఉంటుంది. ఒక వస్తువు వేగంగా లేదా నెమ్మదిగా కదలడానికి అవి ప్రయాణించే దూరాలు, సమాన కాలంలో వేరుగా ఉంటే ఎక్కువదూరం పోయే వస్తువు వేగంగా కదిలింది అంటారు.

దూరం: గమనంలో ఉన్న వస్తువు ప్రయాణించే దాని మొత్తం పొడవును ఆ వస్తువు దూరంగా పరిగణిస్తారు. ఒక వస్తువు సరళ రేఖ వెంట ప్రయాణించే మొత్తం మార్గం పొడవును ఆ వస్తు దూరం అంటారు.

ప్రమాణాలు: * సీజీఎస్ (CGS) ప్రమాణం - సెంటీమీటర్ * ఎంకేఎస్ (MKS) ప్రమాణం-మీటర్ * ఎస్ఐ (SI) ప్రమాణం-మీటర్

స్థానభ్రంశం (s): ఒక వస్తువు స్థానంలో నిర్ణీత దిశలో వచ్చే మార్పును దాని 'స్థానభ్రంశం' అంటారు. వస్తువు ప్రయాణించే తొలి, తుది స్థానాల మధ్య ఉన్న కనిష్ఠ దూరాన్ని 'స్థానభ్రంశం' అంటారు. స్థానభ్రంశం అనేది దిశ, పరిమాణం ఉన్న భౌతిక రాశి. ఇదొక సదిశ రాశి.



* స్థానభ్రంశం అనేది మొత్తం ప్రయాణించే దూరానికి భిన్నంగా ఉంటుంది.

స్థానభ్రంశాన్ని (s) చలన ఫలితంగా సూత్రీకరించవచ్చు. ప్రారంభ స్థానం X_A కు సంబంధించి దాని తుదిస్థానం X_B గా అనుకుంటే స్థానభ్రంశం వెక్టార్‌ను తుది, తొలి స్థానాల వ్యత్యాసంగా చెప్పవచ్చు.

$S = X_B - X_A = \Delta X$

* వస్తువు/కణం కదలికను వివరించేటప్పుడు స్థానభ్రంశం అనే పదాన్ని భ్రమణం ద్వారా తెలియజేయవచ్చు. భ్రమణంలో వస్తు/కణం స్థానభ్రంశాన్ని కోణీయ 'స్థానభ్రంశం' అంటారు. రేఖ వెంబడి వస్తువు స్థానభ్రంశం' చెందితే దానిని 'రేఖీయ స్థానభ్రంశం' అంటారు.



దూరం, స్థానభ్రంశాల మధ్య సంబంధం: వస్తువు సరళరేఖా మార్గంలో ప్రయాణిస్తే అది ప్రయాణించే దూరం, అది పొందే స్థానభ్రంశాలు రెండూ సమానంగా ఉంటాయి. అదే వస్తువు క్రమరహిత మార్గంలో చలిస్తే అది ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశానికి సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది.

* బలం, కారణంతో సంబంధం లేకుండా వస్తువు చలనాన్ని మాత్రమే వివరించేది శుద్ధగతిక శాస్త్రం.
* వస్తువు చలనానికి కారణం బలం అని, బల ప్రభావంతో వస్తువు చలనాన్ని వివరిస్తే అది గతిశాస్త్రం.
* సమతాస్థితిలో ఉన్న వస్తువును మాత్రమే వివరించేది స్థితి శాస్త్రం.

సంఖ్యారేఖపై దూరం, స్థానభ్రంశాన్ని తెలుసుకోవడం


* ఒక విభాగం = 10 యూనిట్లు

A అనే వస్తువు ప్రయాణించే దూరం (d) = 140 + 50 = 190 యూనిట్లు

స్థానభ్రంశం(s) = 90 యూనిట్లు (రెండు బిందువుల మధ్య దూరం)

B అనే వస్తువు సరళరేఖ మార్గంలో ప్రయాణించింది. అయితే అది ప్రయాణించే దూరం = 80 యూనిట్లు.

స్థానభ్రంశం = 80 యూనిట్లు.



* రెండు కణాలు మూల బిందువు నుంచి ధన X- అక్షం వెంట ఒకేసారి ప్రయాణించడం మొదలు పెట్టినప్పుడు అందులో ఒకటి నిశ్చల స్థితి నుంచి బయలుదేరి, ఏకరీతి త్వరణంలో ప్రయాణిస్తుంటే, రెండోది స్థిర వేగంతో ప్రయాణిస్తే వాటి మధ్య ఉన్న దూరం మొదట క్రమేపీ పెరిగి, సున్నాకు తగ్గి తర్వాత పెరుగుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఒక నిర్దిష్టమైన దిశలో వస్తువు ప్రయాణించే అతి తక్కువ దూరం?
   1) వేగం 2) త్వరణం 3) దూరం 4) స్థానభ్రంశం
2. ఒక వస్తువు వృత్తాకార మార్గంలో చలిస్తుంది. అయితే అది ఎక్కడ మొదలైందో తిరిగి అక్కడే చేరితే, ఆ వస్తువు ప్రయాణించే మొత్తం దూరం, స్థానభ్రంశాలు వరసగా?
   1) 0, 0 2) 0, వృత్త వైశాల్యం 3) 2πr, 0 4) 0, 2πr
3. ఒక వస్తువు సరళరేఖ వెంబడి A అనే బిందువు నుంచి B అనే బిందువుకు 60 మీటర్ల దూరం ప్రయాణించి, వెనుదిరిగి 25 మీటర్లు కదిలింది. అయితే అది పొందే స్థానభ్రంశం?
   1) 60 మీ. 2) 85 మీ. 3) 25 మీ. 4) 35 మీ.
4. ఒక వ్యక్తి 190 మీ. పొడవు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత మొదలుపెట్టి ఒకేమార్గంలో ఈదుతూ 2 సార్లు యథా స్థానానికి చేరుకున్నాడు. అయితే అతడు ప్రయాణించిన దూరం, స్థానభ్రంశాలు?
   1) 190 మీ., 0 2) 380 మీ., 190 మీ. 3) 760 మీ., 380 మీ. 4) 760 మీ.,
5. ఒక వ్యక్తి ఒక బంతిని నింగి పైకి 40 మీ. ఎత్తుకు విసిరాడు. ఆ బంతిని తిరిగి అతడు క్యాచ్ పట్టుకున్నాడు. అయితే ఆ బంతి ప్రయాణించిన దూరం?
   1) 40 మీ. 2) 80 మీ. 3) 0 4) 20 మీ.
6. ఒక వాహనం మొదటి 5 ని. గంటకు 3 కి.మీ. వేగంతో ప్రయాణించింది. 6వ ని. నుంచి 10 ని. వరకు ప్రతి నిమిషం వేర్వేరు దూరాలు ప్రయాణిస్తే వాహనం మొత్తం చలన విధానం ఏమిటి?
   1) క్రమచలనం 2) క్రమరహిత చలనం 3) రేఖీయ చలనం 4) భ్రమణ చలనం
7. పైకి విసిరిన ఒక బంతి మొదట 18 మీ. ఎత్తుకువెళ్లి తిరిగి వచ్చేటపుడు 12 మీ. ఎత్తు ఉన్న చెట్టుపై పడింది. అయితే ఆ బంతి పొందే స్థానభ్రంశం?
   1) 12 మీ. 2) 18 మీ. 3) 6 మీ. 4) 30 మీ.
8. ఒక వస్తువు అర్ధ వృత్తాకార మార్గంలో కదిలింది. అది 92 మీ. దూరం ప్రయాణించి వేరొక బిందువును చేరింది. ఆ వస్తువు గమనమార్గ కర్ణం 28 మీ. అయితే ఆ వస్తువు దూరం, స్థానభ్రంశం?
   1) 120 మీ., 92 మీ. 2) 92 మీ., 28 మీ. 3) 184 మీ., 28 మీ. 4) 92 మీ., 0

సమాధానాలు

1-4; 2-3; 3-4; 4-4; 5-2; 6-2; 7-1; 8-2.



రచయిత: ఎస్.వై.నాయుడు

కరెంట్ అఫైర్స్ - మాదిరి ప్రశ్నలు



* భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ డైరెక్టర్‌గా ఎవరు నియమితులయ్యారు?
  జ: ఇ.ఎస్.పద్మకుమార్
* ఒరెష్నిక్ హైపర్ సోనిక్ క్షిపణులు ఏ దేశానికి చెందినవి?
  జ: రష్యా
* ఇటీవల వార్తల్లో నిలిచిన 'సావల్ కోట్' జల విద్యుత్తు ప్రాజెక్టు ఏ నదిపై పునరుద్ధరించనున్నారు? **జ:** చీనాబ్
* సశస్త్ర సీమాబల్ డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు?
  జ: సంజయ్ సింఘాల్
* 2025 వరల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కాన్ఫరెన్స్ ఎక్కడ జరిగింది? **జ:** షాంఘై
* ఇటీవల వార్తల్లో నిలిచిన 'హిమగిరి' అనేది?
  జ: అధునాతన గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ యుద్ధ నౌక.
  నోట్: ప్రాజెక్టు 17A కింద నిర్మించే మూడు యుద్ధ నౌకల్లో మొదటిది.
* ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల జాబితా–2025లో ఏది అగ్రస్థానంలో నిలిచింది? **జ:** వాల్‌మార్ట్
* ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 9 స్వర్ణాలు సహా 29 పతకాలతో టోర్నీలో అగ్ర స్థానంలో నిలిచిన దేశం? **జ:** అమెరికా

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



* ఏపీలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలు (691)
  చివరి తేదీ: 2025, ఆగస్టు 5
* ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో అప్రెంటిస్ ఖాళీలు
  చివరి తేదీ: 05.08.2025

'సమాజానికి సేవ చేసేవాడే సన్యాసి'




భారతదేశంలో 19, 20వ శతాబ్దాల్లో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమాల వల్ల విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తరాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలు, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడ్డాయి. మతం పేరుతో సాగుతున్న పీడివాదాన్ని హేతువాద భావజాలంతో ప్రశ్నించాయి. సాంస్కృతిక పునర్జీవనానికి నాంది పలికాయి. ముఖ్యంగా హిందూ మతాన్ని, హిందువులు పాటించే విశ్వాసాలను ఆధునికంగా, తార్కికంగా, ఆధ్యాత్మికంగా మార్చాయి. ఈ పరిణామక్రమాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఇందులో ఆర్యసమాజ్, బ్రహ్మ సమాజ్ లాంటి సంస్థలు పోషించిన పాత్ర, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రాజా రామ్మోహన్ రాయ్, అనీబిసెంట్ లాంటి సంఘసంస్కర్తలు, ఆధ్యాత్మికవేత్తలు, సంస్కరణవాదుల కృషి, చేసిన ప్రచారం, వ్యాప్తి చేసిన భావాలు, చేసిన వాదనలను అర్థం చేసుకోవాలి.

భారతదేశ చరిత్ర

సాంఘిక మత సంస్కరణోద్యమాలు

1. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.
   1) సాంస్కృతిక పునర్జీవనోద్యమం భారతదేశంలో బెంగాల్‌లో ప్రారంభమైంది.
   2) ఆంధ్రాలో సాంస్కృతిక పునర్జీవనోద్యమం రాజమండ్రిలో ప్రారంభమైంది.
   3) ప్రపంచంలో పునర్జీవనోద్యమం ఇటలీలో ప్రారంభమైంది.
   4) సాంస్కృతిక పునర్జీవనోద్యమానికి మొదట కేంద్రమైన నగరం లండన్.
2. కింది వాటిలో సరైంది?
   1) ఆర్యసమాజ్ స్థాపకుడు స్వామి దయానంద.
   2) బ్రహ్మసమాజ్ స్థాపకుడు రాజా రామ్మోహన్ రాయ్.
   3) ప్రార్థనా సమాజ్ స్థాపకుడు ఆత్మారాం పాండురంగ.
   4) పైవన్నీ
3. ప్రకటన–(ఎ): రాజా రామ్మోహన్ రాయ్ హేతువాదాన్ని సమర్థించాడు, విశ్వసించాడు.
   కారణం–(ఆర్): రాజా రామ్మోహన్ రాయ్‌కు పాశ్చాత్య విద్యావిధానం పట్ల నమ్మకం లేదు.
   1) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్ కు ఎ సరైన వివరణ.
   2) ఎ, ఆర్‌లు సరైనవి; ఆర్ కు ఎ సరైన వివరణ కాదు.
   3) ఎ సరికాదు, కానీ ఆర్ సరైంది.
   4) ఎ సరైంది, కానీ ఆర్ సరికాదు.



రాజారామ్మోహన్ రాయ్

4. కింది ప్రకటనలను పరిశీలించండి.
   ఎ) అనీబిసెంట్ మొదట్లో నాస్తికవాదాన్ని ప్రచారం చేశారు.
   బి) అనీబిసెంట్‌పై బ్లావట్స్కీ ప్రభావం ఉంది.
   1) ఎ సరైంది, బి సరికాదు 2) ఎ, బి లు సరైనవి 3) ఎ, బి లు సరికావు. 4) ఎ సరికాదు, బి సరైంది.
5. కింది వాటిని జతపరచండి.
   1) బ్రహ్మ సమాజం ఎ) 1875
   2) ఆర్య సమాజం బి) 1873
   3) ప్రార్థనా సమాజం సి) 1828
   4) సత్యశోధక సమాజం డి) 1867
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   3) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి 4) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
6. ప్రకటన–(ఎ): బ్రహ్మ సమాజం ఏకేశ్వరోపాసనను బలపరిచింది.
   కారణం–(ఆర్): హిందూమతం బహు దేవతారాధన వల్ల తన ప్రాధాన్యతను కోల్పోయింది.
   1) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్‌కు ఎ సరైన వివరణ.
   2) ఎ, ఆర్‌లు సరైనవి; ఆర్‌కు ఎ సరైన వివరణ కాదు.
   3) ఎ సరికాదు, ఆర్ సరైంది.
   4) ఎ సరైంది, ఆర్ సరికాదు.
7. కింది వాటిని పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
   ఎ) రాజా రామ్మోహన్ రాయ్ వితంతు పునర్వివాహాలను సమర్థించారు.
   బి) రాజా రామ్మోహన్ రాయ్ స్త్రీ హక్కులను డిమాండ్ చేశారు.
   సి) అనుష్ఠాన్ అనే పేరుతో కరపత్రాలు ముద్రించారు.
   డి) సతీసహగమన ఆచారాన్ని వ్యతిరేకిస్తూ దానికి వ్యతిరేక చట్టం కోసం ప్రయత్నించారు.
   1) ఒకటి మాత్రమే సరైంది 2) రెండు మాత్రమే సరైనవి 3) మూడు మాత్రమే సరైనవి 4) పైవన్నీ సరైనవే
8. కింది వాటిలో భారత పత్రికా రంగానికి ఆద్యులుగా ఎవరిని చెబుతారు?
   1) రాజా రామ్మోహన్ రాయ్ 2) కేశవ చంద్రసేన్ 3) అనీబిసెంట్ 4) ఎం.జి.రనడే
9. ప్రకటన–(ఎ): రామకృష్ణ పరమహంస విగ్రహారాధనను సమర్థించారు.
   కారణం–(ఆర్): ఆత్మ సాక్షాత్కారానికి, జ్ఞానానికి, దైవచింతనకు విగ్రహారాధన అవసరం. సాక్షాత్కారం అనంతరం విగ్రహారాధనతో పని లేదు.
   1) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్‌కు ఎ సరైన వివరణ కాదు.
   2) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్‌కు ఎ సరైన వివరణ.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
10. 'స్వచ్ఛమైన హిందూమతాన్ని తన బోధనలతో ప్రపంచానికి అందించిన వ్యక్తి వివేకానంద' అని ప్రకటించిన జాతీయ నాయకుడు?
    1) రవీంద్రనాథ్ ఠాగూర్
    2) సుభాష్ చంద్రబోస్
    3) జవహర్‌లాల్ నెహ్రూ 4) మహాత్మా గాంధీ




సుభాష్ చంద్రబోస్

11. రామకృష్ణ పరమహంసకు సంబంధించి కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.
    1) మోక్షానికి ధ్యానం, భక్తి ప్రధానమైనవని తెలియజేశారు.
    2) జీవుల పట్ల దయ చాలా ముఖ్యమైందని తెలిపారు.
    3) మానవసేవే మాధవసేవ అని బోధించారు.
    4) విగ్రహారాధనను సమర్థిస్తూ దాని ఆవశ్యకతను తెలియజేశారు.
12. బ్రహ్మసమాజ్, ఆర్యసమాజ్‌కు కొంత సారూప్యత ఉన్నప్పటికీ ఆర్యసమాజ్ సిద్ధాంతంలో కొన్ని బ్రహ్మసమాజ్‌కు నచ్చలేదు అవి?
    1) వేదాల ఆధికృత 2) పునర్జన్మ భావన 3) ఉపనిషత్తు ప్రభావం 4) 1, 2
13. కింది అంశాలను పరిశీలించి సరైన సమాధానాలను గుర్తించండి.
    ఎ) దివ్యజ్ఞాన సమాజం భారత తత్వవిజ్ఞానం నుంచి ప్రేరణ పొందింది.
    బి) అనీబిసెంట్ దివ్యజ్ఞాన సమాజ్‌లో ప్రధానపాత్ర పోషించిన మహిళ.
    1) ఎ, బి లు సరైనవి. 2) ఎ, బి లు సరికావు.
    3) ఎ సరికాదు, బి సరైంది.
    4) ఎ సరైంది, బి సరికాదు.
14. ప్రకటన–(ఎ): సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ బ్రిటిష్ సహాయంతో ముస్లిం సంస్కరణల కోసం ప్రయత్నించాడు.
    కారణం–(ఆర్): సిపాయిల తిరుగుబాటుకు ముస్లింలు కారణం కాదని తన పుస్తకం ద్వారా తెలియజేశాడు.
    1) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్ కు ఎ సరైన వివరణ.
    2) ఎ, ఆర్ లు సరైనవి; ఆర్ కు ఎ సరైన వివరణ కాదు.
    3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
    4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
15. కింది వాటిని జతపరచండి.
    1) గో బ్యాక్ టు వేదాస్ ఎ) స్వామి వివేకానంద
    2) గో బ్యాక్ టు ఖురాన్ బి) రామస్వామి నాయర్
    3) ఆత్మగౌరవ ఉద్యమం సి) స్వామి దయానంద
    4) మన మతం వంటింట్లోది డి) అహ్మద్ ఖాన్
    1) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ 2) 1-సి, 2-బి, 3-ఎ, 4-డి
    3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 4) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి
16. 'వేకప్ ఇండియా' అనేది..?
    1) వివేకానంద బోధనల సారం
    2) అనీబిసెంట్ ప్రసంగాల సంకలనం
    3) రాజా రామ్మోహన్‌రాయ్ బ్రహ్మసమాజ్ సూత్రాలు
    4) దయానందుడి సంస్కృత గ్రంథం
17. కింది వారిలో ఎవరి సలహాలను అనుసరించి దయానంద హిందీలో ప్రసంగాలు చేశారు?
    1) వివేకానంద 2) కేశవ చంద్రసేన్ 3) మహాగోవింద రనడే 4) అనీబిసెంట్
18. వివేకానంద బోధనల్లో సరైంది?
    1) కులం, అంటరానితనం అనేవి తప్పు.
    2) మతమార్పిడి వల్ల ఉపయోగం లేదు. అన్ని మతాల్లో సత్యం ఉంది.
    3) సన్యాసి అంటే సమాజానికి దూరంగా వెళ్లేవాడు కాదు. సేవ చేసేవాడు.
    4. పైవన్నీ
19. కింది వారిలో ఈశోపనిషత్ భావాలను వ్యక్తపరిచిన బ్రహ్మసమాజ్ నాయకుడు?
    1) కేశవ చంద్రసేన్
    2) రాజా రామ్మోహన్ రాయ్
    3) దేవేంద్రనాథ్ ఠాగూర్
    4) ఈశ్వరచంద్ర విద్యాసాగర్
20. 'తత్సంగ్' వల్ల మోక్షం వస్తుంది అని చెప్పిన సంస్కర్త?
    1) మహ్మద్ ఖాసిం 2) తులసీరామ్
    3) రామకృష్ణ పరమహంస
    4) దేవేంద్రనాథ్ ఠాగూర్
21. ఆర్యసమాజ్ చీలికకు ప్రధాన కారణం?
    1) విద్యావిధానంలో అభిప్రాయ భేదాలు
    2) మాంసాహారం విషయంలో అభిప్రాయ భేదాలు
    3) మతవిషయంలో అభిప్రాయ భేదాలు
    4) 1, 2
22. ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌కు సంబంధించి సరికానిది.
    1) కోల్‌కతా సంస్కృత కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు.
    2) బ్రాహ్మణేతరులను వేదవిద్యకు అనర్హులుగా భావించారు.
    3) ప్రాచ్య, పాశ్చాత్య విద్యాపండితుడు.
    4) తన సొంత నిధులతో విద్యాలయాలు నడిపారు.



దయానంద సరస్వతి

23. 'సత్యార్థ ప్రకాశిక' అనే గ్రంథాన్ని రచించిన సంఘసంస్కర్త ఎవరు?
    1) దయానంద సరస్వతి 2) స్వామి వివేకానంద
    3) మహాగోవింద రనడే
    4) రాజా రామ్మోహన్ రాయ్
24. బ్రహ్మసమాజ్‌కు విరుద్ధ సూత్రాన్ని గుర్తించండి.
    1) విగ్రహారాధనను వ్యతిరేకించడం
    2) ఏకేశ్వరోపాశనం
    3) సామాజిక సమానత్వం కోరడం
    4) క్రైస్తవ అద్భుత శక్తులపై విశ్వాసం ఉంచడం
25. రామకృష్ణ పరమహంసను 'మీరు దేవుడిని చూశారా' అని వివేకానంద ప్రశ్నకు రామకృష్ణ ఇచ్చిన సమాధానం?
    1) లేదు, నేను చూడలేదు. కానీ, ఆయన సర్వాంతర్యామి.
    2) నేను చూశాను అయితే చెప్పడం కష్టం.
    3) నిన్ను ఎలా అయితే చూస్తున్నానో అలాగే దేవుడిని నేను చూశాను.
    4. దైవత్వం గొప్పదే కానీ దేవుడిని చూడాలనుకోవడం మూర్ఖత్వం.



రామకృష్ణ పరమహంస

26. దివ్యజ్ఞాన సమాజం కేంద్రం?
    1) ముంబయి 2) అడయార్ 3) పుణె 4) రాజమండ్రి
27. స్వామి వివేకానంద చికాగో సమావేశం జరిపిన సంవత్సరం?
    1) 1875 2) 1864 3) 1893 4) 1870
28. యంగ్ బెంగాల్ ఉద్యమం నాయకుడు?
    1) సురేంద్రనాథ్ బెనర్జీ 2) ఆనంద్‌మోహన్ బోస్ 3) హెన్రీడిరాజియో 4) కేశవ చంద్రసేన్
29. 'గులాంగిరి' అనేది ఎవరి రచన?
    1) జ్యోతిరావ్ ఫులే 2) అంబేద్కర్ 3) హెన్రీడిరాజియో 4) అనీబిసెంట్
30. రాజా రామ్మోహన్ రాయ్ అనంతరం బ్రహ్మ సమాజం నాయకుడు?
    1) రామచంద్ర విద్యావాగీస్
    2) దేవేంద్రనాథ్ ఠాగూర్
    3) కేశవ చంద్రసేన్
    4) శివనాథ శాస్త్రి



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-4; 2-4; 3-4; 4-2; 5-3; 6-1; 7-4; 8-1; 9-2; 10-2; 11-2; 12-4; 13-1; 14-1; 15-1; 16-2; 17-2; 18-4; 19-3; 20-2; 21-4; 22-2; 23-1; 24-4; 25-3; 26-2; 27-3; 28-3; 29-1; 30-2.

ఆ సూత్రం పాటించకుంటే.. బండి పక్కకు దొర్లాల్సిందే!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం – ఫిజిక్స్

వస్తువులపై బల ప్రభావాన్ని అధ్యయనం చేసే భౌతికశాస్త్ర విభాగాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు. దీన్ని స్థితి, గతిశాస్త్రాలుగా వర్గీకరించారు. చలనంలో ఉన్న వస్తువుల గురించి అధ్యయనం చేసేదే గతిశాస్త్రం. దీన్ని కైనటిక్స్, కైనమాటిక్స్‌గా తిరిగి వర్గీకరించారు. ఇందులో చలనానికి కారణమైన బలాన్ని సైతం అధ్యయనం చేస్తారు. ఒక వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చేందుకు ప్రయత్నించేది బలం. వస్తువు భారం గురుత్వాక్షరణ బలం కారణంగా ఒక్కో ప్రదేశంలో ఒక్కో విధంగా ఉంటుంది.

గతిశాస్త్రం

గురుత్వాకర్షణ బలం



క్షేత్ర బలాలన్నింటిలో గురుత్వాకర్షణ బలం ముఖ్యమైంది. సర్ ఐజాక్ న్యూటన్ దీనిపై అనేక పరిశోధనలు చేసి గురుత్వాకర్షణ బలం విశ్వమంతటా ఉంటుందని ప్రతిపాదించారు.

✦ విశ్వ గురుత్వాకర్షణ నియమం ప్రకారం ఏ రెండు వస్తువుల మధ్యనైనా పనిచేసే ఆకర్షణ బలం వాటి ద్రవ్యరాశుల లబ్ధానికి అనులోమానుపాతంలో, వాటి మధ్య దూరం వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది.

✦ గురుత్వాకర్షణ బలం భూమిపై ప్రదేశం ఆధారంగా స్వల్పంగా మారుతూ ఉంటుంది. ధృవాల వద్ద ఎక్కువగా, భూమధ్య రేఖ వద్ద తక్కువగా ఉంటుంది. భూమిపై నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ గురుత్వాకర్షణ బలం తగ్గుతుంది.

✦ భూమిపై గురుత్వాకర్షణ శక్తి ఎల్లప్పుడూ భూకేంద్రం వైపు పనిచేస్తుంది. భూమిపై గురుత్వ త్వరణం సుమారు 9.8 మీటర్/సెకన్^{2}.

✦ ఒక వస్తువుపై పనిచేసే గురుత్వాకర్షణ బలాన్ని ఆ వస్తువు భారం అంటారు.

✦ వస్తువు ద్రవ్యరాశి ఎల్లప్పుడు స్థిరంగా ఉంటుంది. అయినా గురుత్వాకర్షణ బలం మార్పు కారణంగా వస్తువు భారం ప్రదేశాన్ని బట్టి మారుతుంది.

✦ చంద్రుడిపై గురుత్వాకర్షణ బలం భూమితో పోలిస్తే ఆరో వంతు ఉంటుంది. అందుకే భూమిపై 60 కేజీల బరువున్న మనిషి చంద్రుడిపై కేవలం 10 కేజీల బరువే ఉంటాడు. సూర్యుడిపై గురుత్వాకర్షణ శక్తి భూమితో పోలిస్తే మూడింతలు అధికం.


న్యూటన్ గమన నియమాలు

వస్తువుల చలనాన్ని అర్థం చేసుకోవడానికి న్యూటన్ మూడు గమన నియమాలను ప్రతిపాదించారు. అవి:

న్యూటన్ మొదటి గమన నియమం:

ఒక అసమతౌల్య బలం పని చేయనంత వరకు నిశ్చల స్థితిలో లేదా సమస్థితిలో ఉన్న వస్తువు అదే స్థితిలో ఉంటుంది.

◆ వస్తువులు వాటి నిశ్చల స్థితి లేదా సమచలనంలో మార్పును వ్యతిరేకించే సహజ లక్షణాన్ని 'జడత్వం' అంటారు. ఒక వస్తువు ద్రవ్యరాశిని జడత్వానికి కొలతగా చెప్పవచ్చు. జడత్వాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:



నిశ్చల జడత్వం: ఆగిన వాహనం ఒక్కసారిగా ప్రయాణం మొదలుపెట్టగానే వాహనంలోని వారు వెనక్కి తూలడానికి కారణం నిశ్చల జడత్వం.

గమన జడత్వం: బస్సులో నిల్చుని ప్రయాణించేవారు బ్రేకులు వేయగానే ముందుకు తూలిపడటానికి కారణం వారికి ఉన్న గమన జడత్వం.

దిశా జడత్వం: ఘాట్‌రోడ్‌లో ప్రయాణించేటప్పుడు వాహనం మలుపు తిరగగానే, ప్రయాణికులు వ్యతిరేక దిశలో వాలడానికి కారణం దిశా జడత్వం.

ద్రవ్యవేగం: వస్తువు ద్రవ్యరాశికి, దాని వేగానికి మధ్య ఉండే లబ్ధాన్ని ద్రవ్యవేగం అంటారు.

న్యూటన్ రెండో గమన నియమం:

ఒక వస్తువు ద్రవ్యవేగంలో మార్పురేటు దానిపై ప్రయోగించిన అసమతౌల్య బలానికి అనులోమానుపాతంలో, ఆ బల దిశలోనే ఉంటుంది. $F = ma$

న్యూటన్ మూడో గమన నియమం:

దీన్నే చర్య - ప్రతిచర్య నియమం అని కూడా పిలుస్తారు. ఈ నియమం ప్రకారం చర్యకు ఎల్లప్పుడూ వ్యతిరేక దిశలో సమానమైన ప్రతిచర్య ఉంటుంది. ఈ రెండూ వేర్వేరు వస్తువులపై పనిచేస్తాయి.

▼ చర్య = – ప్రతిచర్య

అనువర్తనాలు:

రాకెట్, జెట్ విమానం, క్షిపణులు, తుపాకీ నుంచి తూటాలు వెలువడినప్పుడు తుపాకీ వెనక్కి కదలడం, ఈత కొట్టేటప్పుడు నీటిని వెనక్కి నెడితే నీరు ఆ వ్యక్తిని ముందుకు నెట్టడం, పక్షులు ఎగరడం.

■ రబ్బరు బంతిని గోడవైపు విసిరినప్పుడు అది గోడపై కలిగించే బలాన్ని చర్య అని, గోడ బంతిపై కలిగించే బలాన్ని ప్రతిచర్య అని అంటారు.

ఉదా: ఇటీవల ప్రయోగించిన నైసర్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన జీఎస్ఎల్‌వీఎఫ్-16 రాకెట్ న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగానే పనిచేస్తుంది. రాకెట్ నుంచి వేడి వాయువులు వెలుపలికి రావడం చర్య అయితే, అంతే వేగంతో రాకెట్ పైకి దూసుకెళ్లడం ప్రతిచర్య.

ప్రచోదనం:

ఒక వస్తువుపై ఎక్కువ బలం చాలా తక్కువ కాలం పాటు పనిచేస్తే వాటి లబ్ధాన్ని ప్రచోదనం అంటారు. ప్రచోదనానికి ప్రమాణం: డైన్ - సెకన్ లేదా న్యూటన్ - సెకన్

ప్రచోదనం = బలం × కాలం

● ప్రచోదనం కారణంగానే ఎత్తు నుంచి దృఢమైన తలంపై పడిన వ్యక్తి గాయాలపాలవుతాడు. అదే ఎత్తు నుంచి నీటిలో దూకిన వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు. దీనికి కారణం వస్తువు స్థితిలో మార్పు రావడానికి పట్టిన కాలాన్ని పెంచినట్లయితే బలం తగ్గుతుంది.

ఉదా: లాంగ్ జంప్, హై జంప్ లాంటి క్రీడల్లో క్రీడాకారులు దూకే ప్రదేశంలో మెత్తటి ఇసుక, వరిపొట్టు నింపడం ద్వారా కాలాన్ని పెంచి ప్రచోదనం ప్రభావాన్ని తగ్గిస్తారు. దీంతో క్రీడాకారులకు గాయాలు కాకుండా సురక్షితంగా ఉంటారు.



☛ క్రికెట్ ఆడుతున్నప్పుడు క్యాచ్ పట్టే వ్యక్తి బంతిని పట్టుకోగానే తన రెండు చేతులను వెనక్కి లాక్కోవడం ద్వారా పట్టే కాలంలో మార్పు తీసుకువస్తాడు. దీంతో బలం ప్రభావాన్ని తగ్గించుకుంటాడు. ఫలితంగా అతడి చేతులకు గాయాలు కావు.

☛ వాహనాలన్నింటికీ షాక్ అబ్జార్బర్స్ (స్ప్రింగ్‌లు) అమర్చడం ద్వారా ఎగుడుదిగుడు రోడ్లపై వాహనం ప్రయాణించేటప్పుడు ప్రచోదనం ప్రభావాన్ని తగ్గించవచ్చు.

☛ సున్నితమైన గాజు వస్తువులు, ప్రయోగశాల పరికరాలు, పింగాణీ వస్తువులు మొదలైనవి రవాణా చేసేటప్పుడు వాటిని గడ్డి లేదా థర్మకోల్ లేదా కాగితం ముక్కల మధ్య చుట్టి పంపడానికి కారణం కూడా ప్రచోదనం ప్రభావాన్ని తగ్గించడమే.

☛ గమనంలో ఉన్న ఒక వాహనం అంతే ద్రవ్యరాశి గల మరో ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టింది అనుకుందాం. మొదటి వాహనం ఎక్కువ బలాన్ని తక్కువ సమయంలో రెండో వాహనంపై ప్రయోగిస్తుంది. దీంతో ఆగి ఉన్న వాహనానికే ఎక్కువ నష్టం కలుగుతుంది.

గురుత్వ కేంద్రం లేదా గరిమ నాభి

ఒక వస్తువు మొత్తం భారం ఏ బిందువు ద్వారా పని చేస్తుందో దాన్ని గురుత్వ కేంద్రం లేదా గరిమ నాభి అంటారు.

▮ సాధారణంగా క్రమ ఆకారం ఉన్న వస్తువులకు వాటి జ్యామితీయ కేంద్రమే గురుత్వ కేంద్రం.

▮ ఒక వస్తువు పడిపోకుండా స్థిరంగా ఉండాలంటే దాని గురుత్వ కేంద్రం పీఠం నుంచి తక్కువ ఎత్తులో ఉండి, ఆధార వైశాల్యం అధికంగా ఉండాలి. ఈ సూత్రాన్ని పాటించని వాహనాలు రోడ్డుపై పక్కకు దొర్లుతాయి.

ఉదా: రాళ్లు తీసుకువెళ్లే ట్రాక్టర్లకు స్థిరత్వం ఎక్కువ. పెద్ద గడ్డిమోపులను తీసుకువెళ్లే ట్రాక్టర్‌లకు స్థిరత్వం తక్కువ. ఇవి సులభంగా పక్కకు దొర్లే అవకాశం ఉంది.

☛ సాధారణంగా స్టీలు నీటిసీసాలు ఎక్కువసార్లు దొర్లడానికి కారణం అవి పై రెండు నియమాలను పాటించకపోవడమే.

☛ ఒక చేతిలో బరువు పట్టుకుని నడుస్తున్న వ్యక్తి మరొకవైపు వంగడం వల్ల ఎక్కువ స్థిరత్వం పొందుతాడు.

☛ స్పోర్ట్స్ కార్లు, బైక్‌లకు వెడల్పైన, చిన్నగా ఉండే చక్రాలు అమర్చడం వల్ల వాటి గరిమనాభి స్థానం తక్కువ ఎత్తులో ఉండి స్థిరత్వం కలిగి ఉంటాయి.

☛ ఘాట్‌రోడ్‌లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారుడు మలుపుల వద్ద లోపలి వైపునకు వంగి ప్రయాణించడం వల్ల గరిమనాభి స్థానం ఒక స్థిర బిందువు వద్ద ఉండి వాహనానికి స్థిరత్వం వస్తుంది.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day

732

Nought

Telugu meaning: శూన్యం, సున్నా

English meaning: The word nought (నాట్) is a noun that means nothing or zero; it also represents something without value or significance.

Synonyms: Nothing, Zero

Antonyms: Everything, All

Usage: **1.** His efforts to reconcile went for nought as she refused to speak to him.

2. The damage caused by the fire reduced all their savings to nought.

Latest Updates

HDFC Bank Parivartan's ECSS Programme 2025-26

HDFC Bank Parivartans ECSS Programme 2025-26 is an initiative by HDFC Bank aimed at supporting meritorious and financially needy students from underprivileged backgrounds. The scholarship programme is open to school students from Classes 1 to 12, as well as those pursuing diploma, ITI, polytechnic, UG and PG (both general and professional) courses. The last date for online applications is 4 September 2025.

Apprentice Posts

Cochin port authority, Kerala is inviting applications for the recruitment of Apprentice posts in various departments. The total no. of posts is 10. Eligible candidates can apply online before 12 August 2025.

Post Doctoral Posts

National Institute of Ocean Technology (NIOT), Chennai, is inviting applications for the Post Doctoral posts. The total no. of posts is 25. The last date for receipt of online applications is 11 September 2025.

Did You Apply..?

Today (August 5) is the last date for the following Jobs

❖ APPSC FBO, ABO Recruitment Notification 2025 - 691 posts.
Eligibility: Intermediate (10+2).

❖ 32 Engineer Posts in Bharat Electronics Limited.
Eligibility: BE/BTech/BSc Engineering.

❖ 41 Consultant Credit Analyst Jobs in SIDBI.
Eligibility: CA, Degree.

For more information and other notifications - scan QR code

ఆర్టికల్ 370 రద్దయిన రోజు

ఆగస్టు 5 – చరిత్రలో ఈనాడు


స్వాతంత్ర్యానంతరం అనేక స్వదేశీ సంస్థానాలు మన దేశంలో విలీనమై.. పూర్తిగా భారత యూనియన్‌లో భాగంగా మారాయి. వాటిలో జమ్మూకశ్మీర్ కూడా ఒకటి. అయితే భారత రాజ్యాంగంలోని 21వ భాగంలో ఉన్న ఆర్టికల్ 370 ద్వారా ఆ రాష్ట్రానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించారు. తద్వారా కొన్ని ప్రత్యేక అధికారాలు, రాజ్యాంగం, జెండా అమల్లో ఉంటాయి. ఈ ఆర్టికల్ ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, కమ్యూనికేషన్ల రంగాలపై మాత్రమే భారత ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయి. వాటికి సంబంధించిన చట్టాలు మాత్రమే కశ్మీర్‌లో అమలు చేయగలదు. మిగిలిన రంగాల్లో ఏం చేయాలన్నా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరంగా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 2019, ఆగస్టు 5న రద్దు చేసింది. దీనికి సంబంధించిన ముఖ్య విషయాలను పరిశీలిద్దాం.

కశ్మీర్‌కు ప్రత్యేక హోదా:

1949 అక్టోబర్ 17న రాజప్రతినిధిగా హరిసింగ్ కుమారుడు కరణ్‌సింగ్ ఉన్న సమయంలో కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తూ రాజ్యాంగసభ రాజ్యాంగంలో 370 అధికరణను చేర్చింది. 1952లో జరిగిన ఢిల్లీ ఒప్పందంతో రాజరికం రద్దయింది. 1956లో జమ్మూకశ్మీర్ ప్రత్యేక రాజ్యాంగానికి ఆమోదం లభించింది. చివరికి 370 అధికరణం ద్వారా జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి లభించింది. అయితే దీన్ని రాజ్యాంగంలోని 368(1) అధికరణం ద్వారా సవరించే వెసులుబాటును కూడా రాజ్యాంగం కల్పించింది.

✦ నాటి మద్రాస్ రాష్ట్రానికి చెందిన గోపాలస్వామి అయ్యంగార్ ఈ ఆర్టికల్ 370 ప్రధాన రూపకర్త. 1937-43 కాలంలో జమ్మూకశ్మీర్ సంస్థానానికి ప్రధానమంత్రిగా పనిచేశారు.

✦ ఆర్టికల్ 370లోని సెక్షన్ 3 ప్రకారం భారత రాష్ట్రపతి ఎప్పుడైనా కశ్మీర్‌కు ఇచ్చిన స్వయంప్రతిపత్తిని రద్దు చేసే అధికారం ఉంది. దీని ప్రకారమే ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ అధికరణను రద్దు చేసింది. అంతేకాక ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది.



✦ ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ బద్ధమేనని సుప్రీంకోర్టు 2023, డిసెంబరు 11న స్పష్టం చేసింది.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

బాల కార్మిక వ్యవస్థ


ఇంట్లో తల్లిదండ్రులకు సహాయపడితే కూడా బాలకార్మికులు అవుతారా? తల్లిదండ్రులతోపాటు సొంత పొలంలో పనిచేస్తే బాలకార్మికులవుతారా? అసలు బాలకార్మిక వ్యవస్థ అంటే ఏంటి? దీనివల్ల బాలలు, సమాజంపై పడుతున్న ప్రభావమేంటి? ఈ సమస్య తీవ్రత ఎంత? ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?

బాలలు, బాలకార్మికులు

జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారు. యునిసెఫ్ ప్రకారం 18 ఏళ్ల లోపున్నవారు కొన్ని కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే వారిని బాలకార్మికులుగా పరిగణిస్తారు.

▮ ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల హక్కుల సంప్రదాయం (యునైటెడ్ నేషన్స్ చైల్డ్ రైట్స్ కన్వెన్షన్) ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారు ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లయితే బాలకార్మికులుగా పరిగణిస్తారు.

▮ ఓటు హక్కు ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారంతా బాలలు అవుతారు.



బాలకార్మిక వ్యవస్థ – తీవ్రత:

2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశం మొత్తం మీద 14 ఏళ్ల లోపు వయసున్న బాలకార్మికుల సంఖ్య 43,53,247 (2001 జనాభా లెక్కల ప్రకారం చూస్తే 1,26,66,377 మంది ఉన్నారు).

▮ వీరు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్నారు. 2వ స్థానంలో మహారాష్ట్ర ఉంది. కాగా అతి తక్కువ బాలకార్మికులు ఉన్న రాష్ట్రం సిక్కిం.

బాలకార్మికతను ప్రేరేపిస్తున్న కారకాలు

▮ సామాజిక, ఆర్థిక కారణాలు
▮ రాజకీయ కారణాలు
▮ ఇతర కారణాలు

చిన్నాచితక పనుల్లో ఉన్న బాలకార్మికులు, ఎంతలోపు వయసు ఉన్నవారు పని చేయడానికి అనర్హులు, బాలకార్మికులు అధికంగా ఉన్న రంగాలు, బాలకార్మిక వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు, ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు రాజ్యాంగం తీసుకుంటున్న చర్యలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



The Union Minister Nitin Gadkari honoured with 43rd Lokmanya Tilak National Award. The award present by Lokmanya Tilak Smarak Trust on 1 August 2025 in Pune, Maharashtra. The award recognizes significant contributions to national progress. The award includes a cash prize of Rs.1 lakh and citation.

▮ The award was started in 1983 by the Tilak Smarak Mandir Trust to honour the legacy of freedom fighter Lokmanya Bal Gangadhar Tilak.



Abhishek Sharma has become to World's No.1 T20's batter. Sharma now has 829 rating points while Head (Australia batter) is now second with 814 rating points. He became the third Indian men's player to climb the No.1 spot in the ICC ranking for batters after Virat Kohli and Suryakumar Yadav.



The Union Minister of Ports, Shipping & Waterways (MoPSW), Sarbananda Sonowal inaugurated the 1 MW Green Hydrogen Power Plant at the Deendayal Port Authority (DPA), Kandla in Gujarat on 31 July 2025. It is being considered as a milestone under the National Green Hydrogen Mission and Maritime India Vision 2030. The plant is capable of producing approximating 140 matric tonnes of green hydrogen annually.

For more Current Affairs: Scan QR code

Bank Exams

Quantitative Aptitude

Triangles

1. The measures of two angles of triangles are in the ratio 3 : 5. If the sum of these two numbers is equal to the measure of the third angle. Find the smallest angle?

A) $33\frac{1}{3}$ B) $33\frac{3}{4}$ C) $33\frac{1}{4}$
D) $33\frac{2}{3}$ E) $33\frac{2}{5}$

2. ABC is right angle triangle at B. The perimeter of the triangle is 27 cm and the difference between the sum of perpendicular sides and hypotenuse is 7 cm. If a circle is inscribed in the triangle. What is its radius?

A) 20 cm B) 10 cm C) 13.5 cm
D) 3.5 cm E) 12.5 cm

3. In triangle PQR, medians QX, and RY are perpendicular to each other and intersects at 'Z'. If QX = 10 cm and RY= 16 cm. What is the area of triangle PQR?

A) $106\frac{2}{3}$ sqcm B) $106\frac{1}{3}$ sqcm
C) 160 sqcm D) 80 sqcm
E) None

4. In a triangle XYZ, XY + YZ = 18 cm, YZ + ZX= 17 cm and ZX + XY = 21cm. Find the radius of the circle, which has the same perimeter as the triangle XYZ.

A) $4\frac{7}{11}$ Cm B) $4\frac{2}{11}$ Cm
C) $4\frac{5}{11}$ Cm D) $4\frac{3}{11}$ Cm
E) $4\frac{1}{2}$

5. If the side of an equilateral triangle is increased by 30%, then by what percentage will its area increase?

A) 69% B) 60% C) 65%
D) 51% E) None

6. The angles of a triangle are in Arithmetic progression. The ratio of the least angle in degrees to the number of radians in the greatest angle is 36 : π. The angles in degrees are...

A) 36°, 72°, 72° B) 30°, 60°, 90°
C) 30°, 45°, 105° D) 20°, 60°, 100°
E) 10°, 15°, 17°

7. Two unequal sides of isosceles triangles are 9cm, 19cm. Find perimeter of the triangle.

A) 37 cm B) 47 cm C) 45 cm
D) 43 cm E) 27 cm

8. In a triangle PQR, the angle bisector of angle Q meets side PR at S. If PQ = 12 cm, QR = 15 cm, RP = 18 cm. Find the length of PS.

A) $8\frac{1}{2}$ cm B) 9 cm C) 8 cm
D) $7\frac{1}{2}$ cm E) None

9. In a triangle ABC, angle B= 90°, BD is an altitude (perpendicular from B to AC). If AB = 9 cm, BC = 12 cm. Find the length of BD.

A) $7\frac{4}{5}$ Cm B) $7\frac{1}{5}$ Cm
C) $7\frac{3}{5}$ Cm D) $7\frac{2}{5}$ Cm
E) $9\frac{3}{5}$ cm

10. Two similar triangles have corresponding sides in the ratio 4 : 7. If the area of larger triangle is 294 sqcm. What is the area of the smaller triangle?

A) 96 sqcm B) 168 sqcm
C) 106 sqcm D) 100 sqcm
E) 121 sqcm

11. In a triangle XYZ, XY = XZ = 35 cm and YZ = 42 cm. Find the length of altitude from X to YZ

A) 31 cm B) 20 cm C) 28 cm
D) 21 cm E) None

12. In a triangle ABC, the angle B is a right angle. If AB = 18 cm and BC = 7.5 cm. What is the length of the median from B to AC.

A) 13 cm B) 9.5 cm C) 9.25 cm
D) 9.75 cm E) None

13. If the length of the sides of a triangle are in the ratio 5 : 6 : 7 and inradius of the triangle is 4 cm, then the altitude of the triangle corresponding to the smallest side as base is..

A) $14\frac{3}{5}$ cm B) $14\frac{4}{5}$ cm
C) $14\frac{2}{5}$ cm D) $14\frac{1}{5}$ cm
E) None

14. In a triangle PQR, points A and B are on the sides of PQ and RP respectively, such that AB is parallel to QR and AP : PQ = 4 : 7 and BP = 6 cm then find RP.

A) $10\frac{1}{2}$ cm B) $10\frac{2}{3}$ cm
C) 11 cm
D) 13 cm
E) 12 cm

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఆపరేషన్స్
సంస్థ: స్టేఫైండ్జ్ నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.12,000-20,000
☛ https://shorturl.at/wLeSF

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: సూపర్‌వైజర్.ఏఐ
నైపుణ్యాలు: యాంగ్యులర్‌జేఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీఎస్ఎస్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ (జీసీపీ), హెచ్‌టీఎంఎల్, మైఎస్‌క్యూఎల్, నెక్ట్స్.జేఎస్, పైతాన్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, త్రీ.జేఎస్
స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/mPsfW

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్
సంస్థ: రెన్స్‌కె టెక్నాలజీస్ ఇంక్
నైపుణ్యాలు: కంప్యూటర్ స్కిల్స్, కస్టమర్ సపోర్ట్, ఇంగ్లిష్ రాయడం, మల్టీ టాస్కింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.20,000-40,000
☛ https://shorturl.at/5JZx1

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: స్కిల్‌జెనిక్ బై గ్రోత్ ఇగ్నైటర్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, కంటెంట్ ఎడిటింగ్, ఫిల్మోరా, ఫైనల్ కట్ ప్రో, మోషన్ గ్రాఫిక్స్, టైమ్ మేనేజ్‌మెంట్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/5fFWs

కంటెంట్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: ఫ్లోబిజ్ నైపుణ్యాలు: కంటెంట్ ఎడిటింగ్, స్క్రిప్ట్ రైటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/B53C9

బ్రాండ్ డిజైన్ అండ్ డిజిటల్ ఇలస్ట్రేషన్
సంస్థ: ఎక్స్1 రేస్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, అడోబ్ ఇలస్ట్రేటర్ స్టైపెండ్: రూ.15,000-30,000
☛ https://shorturl.at/7eRKG

సోషల్‌మీడియా మార్కెటింగ్
సంస్థ: కమ్యూనిక్రాఫ్ట్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, డిస్‌ప్లే యాడ్స్, హిస్టరీ
స్టైపెండ్: రూ.15,000-25,000
☛ https://shorturl.at/fLOpy

ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్
సంస్థ: లునకల్ నైపుణ్యాలు: డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్ (పీఎల్ఎం), ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, ఎస్‌క్యూఎల్
స్టైపెండ్: రూ.12,000-20,000
☛ https://shorturl.at/TglLU

సేల్స్ అండ్ మార్కెటింగ్
సంస్థ: క్యాబిన్‌స్క్వాడ్ నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, నెగోషియేషన్స్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.7,000-40,000
☛ https://shorturl.at/bM0Dg

వీడియో ఎడిటింగ్/ మార్కెటింగ్
సంస్థ: బ్లూసీల్ టెక్ ఇంక్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఆడిషన్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఫైనల్ కట్ ప్రో, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.20,000
☛ https://shorturl.at/Pz0N5

పైతాన్ డెవలప్‌మెంట్
సంస్థ: థింక్ యాక్ట్ రైజ్ ఫౌండేషన్
నైపుణ్యాలు: మెషిన్ లెర్నింగ్, పైతాన్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/sNK6K

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 27



దేశంలోని ప్రఖ్యాత సంస్థల్లో న్యాయవిద్య చదవాలనుకునేవారు దృష్టి సారించాల్సిన ముఖ్యమైన పరీక్ష.. కామన్ లా అడ్మిషన్ టెస్టు(క్లాట్). జాతీయ స్థాయిలో పేరొందిన 26 న్యాయ విశ్వవిద్యాలయాలు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా, ఏడాది ఎల్ఎల్ఎం కోర్సులను అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి క్లాట్ నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థల్లో చేరినవారు ప్రాంగణ నియామకాల్లో ఆకర్షణీయ వేతనాలు పొందడంతోపాటు వృత్తిలోనూ రాణిస్తున్నారు.

న్యాయవిద్యపై ఆసక్తి ఉందా?



న్యాయవిద్యపై ఆసక్తి ఉన్నవారు ఇంటర్మీడియట్ పూర్తికాగానే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులకు తొలి ప్రాధాన్యం ఇవ్వొచ్చు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఎం, బీఎస్‌డబ్ల్యు.. వీటిలో నచ్చిన కోర్సుతో కలిపి లా చదువుకోవచ్చు. ఏదైనా యూజీ కోర్సు పూర్తిచేసి, లా కోర్సుల్లో చేరడంతో పోలిస్తే ఈ విధానంలో ఏడాది సమయం ఆదాతో పాటు, న్యాయవిద్యపై గట్టి పట్టూ దక్కుతుంది. అలాగే జాతీయ స్థాయిలో దాదాపు మేటి సంస్థలన్నీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులనే అందిస్తున్నాయి. క్లాట్ స్కోరుతో నల్సార్-హైదరాబాద్, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం- విశాఖపట్నం, ఎన్ఎల్ఎస్‌యూ-బెంగళూరు.. ఇలా 26 ప్రఖ్యాత సంస్థల్లో చదువుకోవచ్చు. పలు ప్రైవేటు సంస్థలూ ఈ స్కోరుతో ప్రవేశం కల్పిస్తున్నాయి.

పరీక్ష ఇలా
యూజీ క్లాట్ ఆఫ్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. 120 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. వ్యవధి 2 గంటలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే వస్తాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో 22-26 (20 శాతం వెయిటేజీ), కరెంట్ అఫైర్స్, జీకే 28-32 (25 శాతం వెయిటేజీ), లీగల్ రీజనింగ్ 28-32 (25 శాతం వెయిటేజీ), లాజికల్ రీజనింగ్ 22-26 (20 శాతం వెయిటేజీ), క్వాంటిటేటివ్ టెక్నిక్స్ 10-14 (10 శాతం వెయిటేజీ) ప్రశ్నలు వస్తాయి. ప్రతి విభాగంలోనూ ప్యాసేజ్‌లు ఇచ్చి ప్రశ్నలు అడుగుతారు. వీటిని గ్రహణ, తార్కిక నైపుణ్యాలు, సామర్థ్యాలను తెలుసుకునేలా రూపొందిస్తారు.

కెరియర్
ఎక్కువమంది ప్రాంగణ నియామకాల్లో పెద్ద మొత్తంలో బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, ప్రైవేటు ఈక్విటీలు, కన్సల్టింగ్, అకౌంటింగ్ సంస్థలూ, లీగల్ ఫర్మ్‌లు వీరికి ప్రాధాన్యమిస్తున్నాయి. పెద్ద కోర్టుల్లో జ్యుడీషియల్ క్లర్కులుగానూ తీసుకుంటున్నారు. లీగల్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (ఎల్‌పీవో), బోధనలోనూ అవకాశాలు ఉంటాయి. ఎన్జీవోలు, చైల్డ్ రైట్స్, హ్యూమన్ రైట్స్ కమిషన్లు, కార్పొరేట్ లీగల్ సెల్స్.. ఇవన్నీ వీరికి ఉపాధి మార్గాలే. కార్పొరేట్ లీగల్ ఫర్మ్‌ల్లో గరిష్ఠ వేతనంతో ఉద్యోగాలు పొందవచ్చు. సైబర్ క్రైమ్, కాపీ రైట్, పేటెంట్ కేసులతో కొత్త అవకాశాలెన్నో న్యాయవాద వృత్తిలో చేరుతున్నాయి.

సన్నద్ధత ఎలా?
▼ యూజీ క్లాట్ దరఖాస్తు చేసుకున్నవారికి.. మాదిరి ప్రశ్నలు, మోడల్ క్వశ్చన్ పేపర్లు, ఇన్‌స్ట్రక్షనల్ మెటీరియల్, ప్రతి సబ్జెక్టులోనూ ఎక్సర్‌సైజులు ఎన్ఎల్‌యూ కన్సార్టియం అందిస్తుంది. ఎలా సన్నద్ధం కావాలి, పరీక్షలో విజయానికి సూచనలు.. సబ్జెక్టు నిపుణులతో అందిస్తారు. వీటిని అనుసరించాలి.
▼ క్లాట్ వెబ్‌సైట్‌లో విభాగాల వారీ సిలబస్ వివరాలూ పొందుపరిచారు. ఆ అంశాలనే బాగా చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.
▼ పరీక్షలో సుదీర్ఘ వ్యాసాలు క్లిష్టంగా వస్తున్నాయి. ఆంగ్లంపై గట్టి పట్టు ఉంటేనే అర్థం చేసుకోగలరు. అలాగే మెరుగైన సంగ్రహణ నైపుణ్యం కావాలి. ఇందుకోసం ఆంగ్లంలోని.. నవలలు, వార్తాపత్రిక కథనాలు, సంపాదకీయాలు, విమర్శనాత్మక సమీక్షలు, వార్తాంశాలను బాగా చదవాలి. సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకోగలగాలి.
▼ పత్రికల్లో లీగల్ వార్తలు/వ్యాసాలు రోజూ చదవాలి. అందులోని పదజాలంపై పట్టు పెంచుకోవాలి.
▼ క్వాంటిటేటివ్ విభాగంలో వేగంగా సమాధానం గుర్తించడానికి పదో తరగతి మ్యాథ్స్ ప్రశ్నలు బాగా సాధన చేయాలి.
▼ ప్రశ్నల స్థాయి, చదవాల్సిన అంశాలపై స్పష్టత కోసం క్లాట్ గత ప్రశ్నపత్రాలు బాగా అధ్యయనం చేయాలి.
▼ వర్తమాన అంశాల కోసం జనవరి 2025 నుంచి ముఖ్య సంఘటనలపై అవగాహన ఉండాలి. ఆంగ్ల పత్రికలు చదువుతున్నప్పుడే ఈ విభాగంలో ప్రశ్నలు రావడానికి అవకాశం ఉన్నవి నోట్సు రాసుకోవాలి.
▼ ఇంగ్లిష్ సెక్షన్‌లో రాణించడానికి వ్యాకరణం అందులోనూ ముఖ్యంగా పదసంపదలో ప్రావీణ్యం పొందాలి. జాతీయాలు, సామెతలపై అవగాహన ఉండాలి. దీంతో వ్యాసాలు సులువుగా అర్థం చేసుకోవచ్చు.
▼ కనీసం పది మాక్ టెస్టులు రాసి, ఫలితాలు సమీక్షించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియని ప్రశ్నలు వదిలేయాలి.


ఉపయోగపడే పుస్తకాలు
▼ యూనివర్సల్ క్లాట్ గైడ్
▼ లీగల్ అవేర్‌నెస్ అండ్ లీగల్ ఆప్టిట్యూడ్: ఏపీ భరద్వాజ్
▼ జనరల్ నాలెడ్జ్: లూసెంట్స్
▼ వర్డ్ పవర్ మేడ్ ఈజీ: నార్మన్ లూయిస్
▼ అనలిటికల్ రీజనింగ్: ఎంకే పాండే
▼ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఆర్ఎస్ అగర్వాల్

ముఖ్య వివరాలు
అర్హత: ఇంటర్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీలకు 40 శాతం చాలు. ప్రస్తుత ద్వితీయ సంవత్సర విద్యార్థులూ అర్హులే.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.10.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.4000; ఎస్సీ, ఎస్టీలకు రూ.3500.
పరీక్ష తేదీ: 07.12.2025
వెబ్‌సైట్: https://consortiumofnlus.ac.in/clat-2026/

పీజీ క్లాట్
ఇందులో 120 మల్టిపుల్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒకటి చొప్పున 120 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. కాన్‌స్టిట్యూషన్, ఫ్యామిలీ, క్రిమినల్, ప్రాపర్టీ, కంపెనీ, ట్యాక్స్, లేబర్, ఇండస్ట్రియల్, ఎన్విరాన్‌మెంటల్ లా అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఎల్ఎల్‌బీ పాఠ్యపుస్తకాలతో పాటు సంబంధిత విభాగాల్లో రిఫరెన్స్ బుక్స్ చదివినవారు మేటి స్కోరు సాధించగలరు. సమకాలీన న్యాయ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
అర్హత: ఎల్ఎల్‌బీలో 50 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం సరిపోతాయి. చివరి ఏడాది పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులూ అర్హులే.
క్లాట్ ఎల్ఎల్ఎం స్కోరుతో మేటి ఉద్యోగాలూ పొందవచ్చు. బీహెచ్ఈఎల్, ఓఎన్‌జీసీ, నేషనల్ థర్మల్ పవర్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ మొదలైనవి..లా ఆఫీసర్/ అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్/ ట్రెయినీ లీగల్ అడ్వయిజర్ హోదాతో నియామక ప్రకటనలు వెలువరిస్తున్నాయి. ఎంపికలో క్లాట్ స్కోరుకు దాదాపు 75 శాతం వెయిటేజీ ఇస్తున్నాయి. మిగతా 25 శాతం ఇంటర్వ్యూకు కేటాయిస్తున్నాయి.

దూరవిద్యలో బీఈడీ చేయవచ్చా?

డీఈడీ 2014–16లో, డిగ్రీ (మాథ్స్) 2019లో చేశాను. టీచింగ్ చేయలేదు. రెండేళ్లుగా రైల్వేలో ట్రాక్‌మ్యాన్‌గా ప్రభుత్వోద్యోగం చేస్తున్నాను. ఇప్పుడు డిస్టెన్స్‌లో బీఎడ్ చేయడం సాధ్యపడుతుందా?
- రమణ, విశాఖపట్నం



■ బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ), డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) ప్రోగ్రాంలకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) గుర్తింపు అవసరం. ఎన్‌సీటీఈ అనుమతి, గుర్తింపు ఉన్న సంస్థల నుంచి చేసిన బీఈడీ/ డీఈడీ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుతాయి. నిబంధనల ప్రకారం డిగ్రీతో పాటు రెగ్యులర్ విధానంలో డీఈడీ చేసి, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు మాత్రమే దూరవిద్య ద్వారా బీఈడీ చేయడానికి అర్హులు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ/ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీల్లోనూ, మరికొన్ని స్టేట్ యూనివర్సిటీల దూరవిద్యా కేంద్రాల నుంచి దూరవిద్యలో బీఈడీ చేసే అవకాశం ఉంది. మీరు డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్, డిగ్రీ రెండూ పూర్తి చేశారు కానీ ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బోధనానుభవం లేదు కాబట్టి, దూరవిద్య ద్వారా బీఈడీ చేయడం సాధ్యం కాదు. బీఈడీ లాంటి ప్రొఫెషనల్ ప్రోగ్రాంలను రెగ్యులర్ విధానంలో చదివితేనే బోధన పద్ధతులు, నైపుణ్యాలు బాగా నేర్చుకోవడానికి వీలవుతుంది. అవకాశం ఉంటే మీరు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి రెండు సంవత్సరాల పాటు సెలవుపెట్టి, రెగ్యులర్ విధానంలో బీఈడీ చేసే ప్రయత్నం చేయండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వాక్-ఇన్

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో..
హైదరాబాద్ దుండిగల్‌లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం... 2025-26 విద్యా సంవత్సరానికి ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ పీజీటీ: కంప్యూటర్ సైన్స్ ◗ టీజీటీ: సోషల్ సైన్స్.
◗ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్, స్పెషల్ ఎడ్యుకేటర్
అర్హత: 50% మార్కులతో డీఎస్ఈ, డిగ్రీ, బీఎడ్, డీఎడ్, పీజీ, సీటెట్. కంప్యూటర్ పరిజ్ఞానం, హిందీ, ఇంగ్లిష్ టీచింగ్ ప్రావీణ్యం.
ఇంటర్వ్యూ తేదీ: 07.08.2025.
వేదిక: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, నెం.2, దుండిగల్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://no2dundigal.kvs.ac.in/

అప్రెంటిస్

ఈస్టర్న్ రైల్వేలో 3115 ఖాళీలు
ఈస్టర్న్ రైల్వే కోల్‌కతా వివిధ విభాగాల్లో 3115 అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, లైన్‌మెన్, వైర్‌మెన్, ఆర్ఈఏఫ్&ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ. **వయసు:** 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 14.08.2025
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.100. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో.
వెబ్‌సైట్: https://rrcer.org/notice_board.html

క్వాంటమ్ కంప్యూటింగ్.. సిద్ధమా!

కంప్యూటర్ సైన్స్ - ఇంజినీరింగ్‌లో సరికొత్త బజ్.. క్వాంటమ్ కంప్యూటింగ్! అత్యంత శక్తిమంతమైన కంప్యూటర్లు సైతం పరిష్కరించలేని సమస్యలను.. క్వాంటమ్ మెకానిక్స్ సహాయంతో ఈ కంప్యూటర్లు శరవేగంగా పరిష్కరించగలుగుతాయి. ఈ టెక్నాలజీ మీద అవగాహన పెంచుకోవడం భవిష్యత్తు కెరియర్‌కు బాటలు వేస్తుంది.

క్వాంటమ్ కంప్యూటర్లు సాధారణ సిస్టమ్స్ ఉపయోగించలేని గణిత మెలకువలతో సమాచారాన్ని ప్రాసెస్ చేయగలవు. డేటాకు ఒక రూపం ఇచ్చి.. దాని తీరుతెన్నులను గుర్తుపట్టగలవు. ఇలాంటి టెక్నాలజీ అనేక రంగాల్లో ఉపయోగపడుతుంది. 2035 నాటికి ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ మార్కెట్ మరింత పెరగనున్నట్టు అంచనా. ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు ఇందులో ఆసక్తి చూపుతున్నాయి. ఎన్నో స్టార్టప్స్ సైతం పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టాయి.

● ఇందులో క్వాంటమ్ హార్డ్‌వేర్, క్వాంటమ్ అల్గారిథమ్స్ అనేవి ప్రధాన విభాగాలుగా ఉంటాయి. నిజానికి ఇది ఇంకా అభివృద్ధి దశలో ఉంది. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక అత్యంత క్లిష్టమైన సమస్యలను పరిష్కరించే దిశగా ఎదగగలదు. మామూలు కంప్యూటర్లు బిట్స్ మీద ఆధారపడి పనిచేస్తాయి. కానీ క్వాంటమ్ కంప్యూటర్లు క్వాంటమ్ బిట్స్‌ను ఉపయోగించడం ద్వారా.. కొన్ని వేల గంటలు పట్టే క్లిష్టమైన సమస్యను కేవలం నిమిషాల్లో పరిష్కరిస్తాయి!

ఉద్యోగావకాశాలు..
ఏఐ-మెషిన్ లెర్నింగ్ హవా నడుమ.. క్వాంటమ్ కంప్యూటింగ్ నిశ్శబ్దంగా వచ్చి నిలబడింది. తానే నూతన రంగంగా అవతరిస్తోంది. టెక్నాలజీ నిపుణులకు ఇందులో అన్ని స్థాయుల్లోనూ విభిన్నమైన అవకాశాలు అందించగలదు. ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఎనర్జీ.. ఇలా వివిధ రంగాల్లో కంప్యూటర్ల వాడకాన్ని మార్చివేయగలదు.

● ఇదింకా ప్రాథమిక స్థాయిలో ఉండటం వల్ల చాలా ఉద్యోగాలు ప్రస్తుతానికి రిసెర్చ్-ఇన్నోవేషన్ ఆధారంగా ఉండబోతున్నాయనేది అంచనా. ఎర్రర్ కరెక్షన్ థియరిస్ట్, అల్గారిథమ్స్ డెవలపర్, హార్డ్‌వేర్ ఇంజినీర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, అప్లికేషన్స్ స్పెషలిస్ట్, రిసెర్చ్ సైంటిస్ట్.. ఇలా పలు రకాలైన కెరియర్లు ఉన్నాయి. వీటికి అదనంగా ప్రాజెక్టు మేనేజర్లు, కంట్రోల్ రిసెర్చర్, క్రయోజెనిక్ ఇంజినీర్, క్వాంటమ్ ఆర్కిటెక్ట్, డేటా సైంటిస్ట్.. ఇలా ఎన్నో ఉద్యోగాలు లభించే వీలుంటుంది.



● క్వాంటమ్ కంప్యూటింగ్ భౌతికశాస్త్ర నియమాల ఆధారంగా పనిచేయడం వల్ల ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులు చదువుకున్నవారు.. క్వాంటమ్ మెకానిక్స్, లీనియర్ ఆల్జీబ్రా మీద పట్టున్నవారు ఇందులో బాగా రాణించగలరు.

అర్హతలు..
1. గ్రాడ్యుయేషన్ ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, సంబంధిత విభాగాల్లో చదవాలి. బలమైన ప్రోగ్రామింగ్ స్కిల్స్ అలవరుచుకోవాలి. ఇందులో పైతాన్ లాంగ్వేజ్‌పై పట్టు ముఖ్యమైనది. క్వాంటమ్ మెకానిక్స్ మీద అవగాహనతోపాటుగా వివిధ టూల్స్, టెక్నాలజీ వినియోగం తెలుసుకోవాలి.
2. ● కేవలం థియరీ కాకుండా ప్రాక్టికల్‌గానూ నాలెడ్జ్ సంపాదించాలి. ఇంటర్న్‌షిప్స్, రిసెర్చ్ అవకాశాలు, ప్రాజెక్టుల్లో పనిచేయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. అలాగే ఇది అభివృద్ధి దశలో ఉన్న టెక్నాలజీ కాబట్టి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉండటం అవసరం.
3. ● ఇప్పటికే ప్రభుత్వాలు సైతం ఇటుగా దృష్టిసారిస్తున్నాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నాయి. తగిన నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా ఈ రంగంలో మరింత ముందుకువెళ్లే వీలుంటుంది.
4. ● కోర్సెరా, ఎడ్ఎక్స్, యుడెమీ, ఐబీఎం క్వాంటమ్ లెర్నింగ్ వంటి కొన్ని ప్లాట్‌ఫామ్స్ దీని గురించి వివరించేలా షార్ట్‌టర్మ్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిలో ప్రారంభస్థాయి, అడ్వాన్స్‌డ్, స్పెషలైజేషన్, ప్రోగ్రామింగ్ ఆధారిత కోర్సులు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న కంప్యూటర్ సైన్స్ సంబంధిత పీజీ కోర్సుల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి ప్రాథమిక విషయాలు నేర్చుకునేలా సిలబస్ ఉంది.
5. ● మార్కెట్‌లో వీటికి సంబంధించి అనేక ప్రామాణిక పుస్తకాలు లభిస్తున్నాయి. వాటిని చదవడం ద్వారా కచ్చితమైన సమాచారాన్ని తెలుసుకోవడం, నేర్చుకోవడానికి వీలుంటుంది.

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఓరియంటల్ ఇన్స్యూరెన్స్‌లో అసిస్టెంట్లు
ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 500 క్లాస్-III కేడర్- అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు: ఆంధ్రప్రదేశ్ (26).
అర్హత: డిగ్రీ, ఎస్ఎస్‌సీ/ హెచ్ఎస్‌సీ/ ఇంటర్మీడియట్/ డిగ్రీలో ఇంగ్లిష్ ఉండాలి. దరఖాస్తు చేసిన స్టేట్/యూనియన్ టెరిటరీ ప్రాంతీయ భాష చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలి.
వయసు: 31.07.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. (ఎస్సీ/ఎస్టీలకు 5 సంవత్సరాలు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది). **వేతనం:** నెలకు రూ.22,405 - రూ.62,265.
ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష (టైర్-I), మెయిన్స్ ఎగ్జామ్ (టైర్-II), రీజనల్ లాంగ్వేజ్ టెస్టులతో. **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు రూ.100. ఇతరులకు రూ.850.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.08.2025
ప్రిలిమినరీ పరీక్ష: 07.09.2025 **మెయిన్స్:** 28.10.2025
వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/careers

రైట్స్‌లో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్లు
గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-30 ఖాళీలు
అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా (సివిల్)తో పాటు పని అనుభవం.
టెక్నికల్ అసిస్టెంట్ - 19 పోస్టులు
అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమాతో పాటు పని అనుభవం.
ఈ రెండు రకాల పోస్టులకూ..
గరిష్ఠ వయసు: 23.08.2025 నాటికి 40 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.29,735.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీలకు రూ.300. ఈడబ్ల్యూఎస్ ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడలకు రూ.100. **ఎంపిక:** రాత పరీక్షతో.
వెబ్‌సైట్: https://www.rites.com/Career

ఐఐటీ హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్
ఐఐటీ హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన 3 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ఆపరేషన్స్ మేనేజర్: 01 ◗ ప్రాజెక్ట్ అసోసియేట్-2: 02
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ (ఎంటెక్/ఎంఈ/ఎంఎస్), ఎంబీఏ, బీటెక్, ఎమ్మెస్సీ, బీకామ్, సీఏతో పాటు పని అనుభవం.
వయసు: 14.08.2025 నాటికి 35 నుంచి 45 ఏళ్లు.
వేతనం: నెలకు ఆపరేషన్స్ మేనేజర్‌కు రూ.65,000 - రూ.85,000, ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.35,000 - రూ.45,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://iith.ac.in/careers/


ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియంలో
ఉత్తరాఖండ్‌లోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం 14 గ్రూప్ బీ, సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ టెక్నికల్ అసిస్టెంట్: 07 ◗ టెక్నీషియన్: 07
అర్హతలు: పోస్టును అనుసరించి టెన్త్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీతో పాటు ఉద్యోగానుభవం.
వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు.
వేతనం: టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.63,996, టెక్నీషియన్‌కు రూ.34,804.
ఎంపిక: ట్రేడ్/ స్కిల్ టెస్టులతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.08.2025.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26.08.2025.
వెబ్‌సైట్: https://www.iip.res.in/

ఐఏఆర్ఐలో ప్రాజెక్ట్ అసోసియేట్లు
న్యూదిల్లీలోని ఐకార్- ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. ఒప్పంద ప్రాతిపదికన జేఆర్ఎఫ్/ ప్రాజెక్ట్ అసోసియేట్, ఫీల్డ్ అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ జూనియర్ రిసెర్చ్ ఫెలో/ ప్రాజెక్ట్ అసోసియేట్: 02
◗ ఫీల్డ్ అటెండెంట్: 01
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ నెట్‌తో పాటు సంబంధిత పని అనుభవం. **వేతనం:** నెలకు ఫీల్డ్ అటెండెట్‌కు రూ.18,000.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా geneticsbmgf@gmail.com .
దరఖాస్తుకు చివరి తేదీ: 15.08.2025.
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

ఐఐటీఆర్‌లో సైంటిస్ట్ ఖాళీలు
లఖ్‌నవూలోని సీఎస్ఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రిసెర్చ్ (ఐఐటీఆర్) 18 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ సైంటిస్ట్: 16 ◗ సీనియర్ సైంటిస్ట్: 01 ◗ ప్రిన్సిపల్ సైంటిస్ట్: 01
అర్హత: పోస్టును అనుసరించి ఎంఈ/ఎంటెక్‌తో పాటు ఉద్యోగానుభవం.
వయసు: సైంటిస్ట్‌కు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: సైంటిస్ట్‌కు రూ.1,15,548; సీనియర్ సైంటిస్ట్‌కు 1,32,864; ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు రూ.2,01,972.
ఎంపిక: విద్యార్హతలు, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూలతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.08.2025.
వెబ్‌సైట్: https://www.csir.res.in/

ఐఐటీ దిల్లీలో రిసెర్చ్ అసోసియేట్లు
ఐఐటీ దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన 8 రిసెర్చ్ అసోసియేట్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ (ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్)తో పాటు ఉద్యోగ అనుభవం.
వేతనం: నెలకు.రిసెర్చ్ అసోసియేట్(ఏ)కు రూ.61,000. రిసెర్చ్ అసోసియేట్ (బీ)కు రూ.67,000. ప్రాజెక్ట్ అసిస్టెంట్ (అడ్మిన్)కు రూ.42,000. జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000. **దరఖాస్తు ప్రక్రియ:** ఈమెయిల్ ద్వారా. recprofsam@gmail.comకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 18.08.2025.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://ird.iitd.ac.in/

'భస్మాసుర హస్తం'.. రష్యా డెడ్ హ్యాండ్!



అమెరికా, రష్యాల మధ్య మాటల యుద్ధం ప్రచ్ఛన్న యుద్ధకాలాన్ని తలపిస్తోంది. రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ తమ దేశం వద్ద ఉన్న 'డెడ్ హ్యాండ్'ను ప్రస్తావించడం ద్వారా అమెరికాకు హెచ్చరిక చేశారు. స్పందనగా రష్యాకు దగ్గరగా అణు జలాంతర్గాముల మోహరింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. ఇంతలా అగ్నికి ఆజ్యంపోసిన డెడ్ హ్యాండ్ ఏమిటన్నది ఆసక్తికరం.

ఏమిటీ డెడ్ హ్యాండ్?

ఈ వ్యవస్థ అసలు పేరు పెరిమీటర్! ఇది సెమీ ఆటోమేటెడ్ అణ్వస్త్ర ప్రతిదాడి వ్యవస్థ. మానవ ప్రమేయం ఏమాత్రం లేకుండా అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు సోవియట్ యూనియన్ దీన్ని 1985లో అభివృద్ధి చేసింది.

- రష్యా తన అణ్వస్త్రాలన్నింటినీ ఈ వ్యవస్థతో అనుసంధానించింది. పశ్చిమ దేశాలు దీన్ని డెడ్ హ్యాండ్ అని పిలుస్తున్నాయి.

ఏం చేస్తుంది?

తమ దేశంపై అణ్వస్త్ర దాడి జరిగినప్పుడు రష్యా ప్రభుత్వ పెద్దలు లేదా అగ్రశ్రేణి సైనిక కమాండర్లు పెరిమీటర్‌ను క్రియాశీలం చేస్తారు. తమ సైనిక బలగాలు మొత్తం తుడిచిపెట్టుకుపోయినప్పటికీ.. ప్రత్యర్థి దేశ అంతం తప్పదన్న సంకేతాన్ని ఇవ్వడం, తద్వారా తమపై ఎవరూ దుస్సాహసానికి దిగకుండా నిలువరించడం దీని ఉద్దేశం.

ఎలా పనిచేస్తుంది?

- డెడ్ హ్యాండ్ వ్యవస్థలోని ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ.. సైనిక సంబంధ ఫ్రీక్వెన్సీల్లో కమ్యూనికేషన్లు, రేడియోధార్మిక స్థాయి, వాయుపీడనం, వేడి, భూప్రకంపనలను పరిశీలించడం ద్వారా దేశంపై అణ్వస్త్ర దాడిని గుర్తిస్తుంది. ఆ వెంటనే ఒక చర్యాక్రమాన్ని క్రియాశీలం చేస్తుంది.
- రష్యా ప్రభుత్వంలో అణ్వస్త్ర దాడులకు ఆదేశాలిచ్చే వ్యవస్థ పనిచేస్తోందా అన్నది తొలుత పరిశీలిస్తుంది. దేశ అగ్రనాయకత్వం నుంచి ఎలాంటి కమ్యూనికేషన్ లేదని గుర్తిస్తే ఆటోమేటిక్‌గా అణ్వస్త్రాల ప్రయోగానికి దిగుతుంది.
- ఇందుకోసం రేడియో వార్‌హెడ్ కలిగిన ఒక కమాండ్ రాకెట్ (15ఎ11)ను డెడ్ హ్యాండ్ ప్రయోగిస్తుంది. అది దేశమంతటినీ కవర్ చేసేలా నింగిలో పయనిస్తుంది. నేలమాళిగలోని అణ్వస్త్రాలకు ఎలక్ట్రానిక్ పద్ధతిలో 'లాంచ్ ఆదేశాలు' ఇస్తుంది. రేడియో సంకేతాలను ప్రత్యర్థి జామ్ చేసినా ఈ రాకెట్ వ్యవస్థ తన లక్ష్యాన్ని నెరవేరుస్తుంది.
- లాంచ్ ఆదేశాలు అందిన వెంటనే ఆ అణ్వస్త్రాలు.. తమకు గతంలోనే నిర్దేశించిన లక్ష్యాలపైకి దూసుకెళతాయి.
- పెరిమీటర్ వ్యవస్థను రష్యా చాలాకాలం గోప్యంగా ఉంచింది. 2011లో ఆ దేశ సైనిక ఉన్నతాధికారి జనరల్ సెర్గెయ్ కారాకేవ్.. దీని ఉనికిని తొలిసారిగా నిర్ధారించారు. 30 నిమిషాల్లోనే అది అమెరికాను సర్వనాశనం చేయగలదన్నారు.

మరి అమెరికా సంగతి?

భూ ప్రకంపన, రేడియేషన్ సెన్సర్ల సాయంతో అణ్వస్త్ర విస్ఫోటాలను గుర్తించే వ్యవస్థను అమెరికా సిద్ధం చేసింది. అయితే ఆటోమేటిగ్గా ప్రతీకార అణుదాడికి దిగే సామర్థ్యాన్ని దీనికి కల్పించలేదు. ప్రతీకార దాడులకు దిగే సామర్థ్యం, అధికారం కలిగిన అమెరికన్లు.. ప్రత్యర్థి తొలుత చేసే అణ్వస్త్ర దాడిని తట్టుకోగలిగేలా ఒక వ్యవస్థను సిద్ధం చేశారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ధూమపానంతో డిస్క్ జారిపోయే ప్రమాదం

- ఎన్ఈఐజీఆర్ఐహెచ్ఎంఎస్ వైద్యుల హెచ్చరిక



షిల్లాంగ్(మేఘాలయ): ధూమపానం వల్ల డిస్క్ జారిపోయే ప్రమాదం (లంబర్ డిస్క్ హనియేషన్) పెరుగుతుందని షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్టర్న్ ఇందిరా గాంధీ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ మెడికల్ సైన్సెస్ (ఎన్ఈఐజీఆర్ఐహెచ్ఎంఎస్) వైద్యులు హెచ్చరించారు. లంబర్ డిస్క్ హనియేషన్ పునరావృతమైన ఓ రోగికి విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన అనంతరం ఈ హెచ్చరిక జారీ చేశారు. ఎస్1 నరాల మూలంపై ఒత్తిడితో ఆసుపత్రిలో చేరిన రోగికి డాక్టర్ భాస్కర్ బోగోహెయిన్ నేతృత్వంలోని వైద్యుల బృందం ట్యూబులర్ మైక్రోడిసెక్టమీని విజయవంతంగా నిర్వహించింది. ధూమపానంలోని విషపూరిత హైడ్రోకార్బన్ల వల్ల డిస్క్ బయటి రింగ్‌లోని కొల్లాజెన్ ఫైబర్లు దెబ్బతిని డిస్క్ జారిపోవడానికి కారణమవుతాయని తెలిపారు. ధూమపానం వెన్నెముకను బలహీనపరిచి, హనియేషన్‌కు గురయ్యేలా చేస్తుందని పేర్కొన్నారు.

ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌వైపు దూసుకొచ్చిన విమానం

ఇంటర్నెట్‌డెస్క్: న్యూజెర్సీ బెడ్‌మినిస్టర్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గోల్ఫ్ రిసార్ట్ సమీపంలోని నిషేధిత గగనతలంలోకి ఓ ప్రయాణికుల విమానం ఆదివారం దూసుకురావడం కలకలం సృష్టించింది. దీంతో యుద్ధ విమానాలు రంగంలోకి దిగి.. ఆ విమానానికి హెచ్చరిక జారీ చేస్తూ.. ఆ ప్రాంతం నుంచి బయటకు పంపివేశాయి. ఆ సమయంలో అధ్యక్షుడు రిసార్ట్‌లోనే ఉన్నారని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ వెల్లడించింది.

చిన్నారిని సూట్‌కేసులో తీసుకెళ్తున్న మహిళ అరెస్టు

వెల్లింగ్టన్: రెండేళ్ల చిన్నారిని సూట్‌కేసులో పెట్టి బస్సులో తీసుకుని వెళ్తున్న ఓ మహిళను ఆదివారం పోలీసులు అరెస్టుచేశారు. ఈ ఘటన న్యూజిలాండ్‌లో వెలుగులోకి వచ్చింది. కైవాక ప్రాంతంలో ఓ ప్రయాణికుడు లగేజీ పెట్టేందుకుగాను లగేజీ కంపార్టుమెంటును తెరవగా అందులో ఓ సూట్‌కేసు కదులుతున్నట్లు కనిపించింది. అనుమానం వచ్చి దాన్ని తెరిచి చూడగా.. అందులో రెండేళ్ల చిన్నారి కనిపించడంతో ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని వైద్యులు నిర్ధారించారు. పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించిన కేసులో ఆ మహిళను అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు.

మద్యం మత్తులో 30 మందిని ఢీకొట్టిన సైనికాధికారి

ముంబయి: మద్యం మత్తులో ఓ సైనికాధికారి కారుతో దాదాపు 30 మందిని ఢీకొట్టిన ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో చోటుచేసుకుంది. 40 ఏళ్ల హర్షపాల్ మహదేవ్ అస్సాంలో సైనికాధికారిగా పని చేస్తున్నారు. సెలవుల్లో భాగంగా మహారాష్ట్రలోని తన స్వస్థలానికి వచ్చారు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు నాగర్దాన్‌లోని దుర్గాచౌక్ మీదుగా హమ్లాపురికి కారులో బయల్దేరారు. మద్యం మత్తులో ఉన్న అతడు కారుపై నియంత్రణ కోల్పోయారు. రోడ్డుపై వెళ్తున్న దాదాపు 30 మంది పాదచారులను ఢీకొట్టారు. అనంతరం కారు బోల్తా పడింది. సైనికాధికారి పక్కనున్న కాలువలో పడిపోయారు. స్థానికులు హర్షపాల్‌ను కాలువ నుంచి బయటకు తీసి నిర్లక్ష్యంగా కారు నడిపినందుకు చితకబాదారు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. గాయపడ్డ హర్షపాల్‌ను పోలీసులు అరెస్టు చేసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆపరేషన్ చేశారు.. బ్యాండేజ్ మరిచారు

బరేలీ: ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ గర్భాశయాన్ని తొలగించిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీలో చోటుచేసుకుంది. మృత శిశువుకు జన్మనిచ్చిన నూర్జహాన్ అనే మహిళకు ఇది గోరుచుట్టుపై రోకలిపోటు లాంటిది. దాడియా గ్రామానికి చెందిన నూర్జహాన్‌కు భోజిపురాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో షాబాజ్ అనే వైద్యుడు జూన్ 3న శస్త్రచికిత్స చేశారు. తర్వాత కొన్ని రోజులకు ఆమెకు కుట్ల నుంచి తీవ్ర రక్తస్రావమైంది. నూర్జహాన్ భర్త తాహిర్ ఆమెను గత నెల 28న మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షలు చేసిన అక్కడి వైద్యులు.. నూర్జహాన్ కడుపులో బ్యాండేజ్ ఉన్నట్లు నిర్ధారించారు. ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యులు బ్యాండేజ్‌తో పాటు నూర్జహాన్ గర్భాశయాన్ని కూడా తొలగించారు. దీంతో తాహిర్ దీని గురించి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విక్రమ్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని స్వీకరించిన విక్రమ్ ఈ విషయం నిరూపణ అయితే ఆసుపత్రి అనుమతులన్నీ రద్దు చేస్తామని తెలిపారు.

బిహార్‌పై లోక్‌సభలో నిరసనలు



లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళన

దిల్లీ: ఎన్నికలకు ముందు బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాల నిరసనలతో సోమవారం సయితం లోక్‌సభలో ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు. ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఇంతవరకు ఒక్క బిల్లు కూడా ఆమోదానికి నోచుకోలేదని సభాపతి గుర్తుచేశారు. అయినా విపక్షాలు నిరసనలు, నినాదాలు వీడలేదు. క్రీడల బిల్లుపై చర్చ చేపట్టకపోతే క్రీడాకారులకు న్యాయం చేయలేమని సభాపతి స్థానంలో ఉన్న జగదాంబికాపాల్‌తో పాటు మంత్రులు కిరణ్ రిజిజు, మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. సభను నడిపించాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా సభ్యులు అవాంతరం కల్పిస్తున్నారని ప్రశ్నోత్తరాల సమయానికి ముందు స్పీకర్ ఓంబిర్లా అన్నారు. రాజ్యసభ ఎలాంటి చర్చ లేకుండా వాయిదా పడింది. సభ్యుడు శిబూ సోరెన్ మృతికి సంతాప సూచికంగా డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఉభయసభలు మంగళవారానికి వాయిదాపడ్డాయి.

ఇలాగైతే చర్చ లేకుండానే బిల్లుల్ని ఆమోదించుకోవాల్సి వస్తుంది: రిజిజు

పార్లమెంటును విపక్షాలు అడ్డుకుంటుంటే చర్చ లేకుండానే బిల్లుల్ని ఆమోదించుకోవాల్సి వస్తుందని రిజిజు విలేకరులకు చెప్పారు. ప్రతిపాదిత చట్టాలు.. పాలనకు కీలకమైనందున జాతి ప్రయోజనాల దృష్ట్యా మంగళవారం నుంచి ప్రభుత్వం అలా ముందుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంటులో చర్చించడం కుదరదని స్పష్టంచేశారు. ఎన్నికల సంస్కరణలపైనైతే చర్చించవచ్చని, ఈసీ పనితీరుపై మాత్రం కాదని పేర్కొన్నారు.

గాజాలో జరుగుతోంది నరమేధం కాదు: ట్రంప్



ఇంటర్నెట్‌డెస్క్: గాజాలో జరుగుతున్నది నరమేధం అని తాను భావించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. 2023 అక్టోబరు 7న హమాస్ చేపట్టిన దుందుడుకు చర్యవల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని ఆయన విలేకరులడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. "గాజా ప్రజల కడుపు నింపాలనుకుంటున్నాం. అది అమెరికా వల్లే సాధ్యమవుతుంది. దీనికోసం ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయిస్తున్నాం" అని కూడా ట్రంప్ అన్నారు.

జీహెచ్ఎఫ్‌పై ఐరాస మండిపాటు

మరోవైపు గాజాలో ఆహార పంపిణీ శిబిరాలు నిర్వహిస్తున్న గాజా మానవతా నిధి (జీహెచ్ఎఫ్) తీరును ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఖండించింది. జీహెచ్ఎఫ్ చేపట్టిన సహాయక చర్యలు గాజా ప్రజలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని మండిపడింది. జీహెచ్ఎఫ్ ఆధ్వర్యంలోని ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ దళాలు జరిపిన కాల్పుల్లో మే నుంచి ఇప్పటి వరకు 1,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస పేర్కొంది. మరోవైపు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెలీ బందీలు ఆకలితో అలమటిస్తున్నారు. ఇటీవల అక్కడి బందీలకు సంబంధించిన పలు దృశ్యాలు, వీడియోలు బయటకు వచ్చాయి. బందీలు ఎముకల గూళ్లుగా మారిన శరీరాలతో దారుణస్థితిలో కనిపించడంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.

భారత్-పాక్ సహా ఐదు యుద్ధాలు ఆపింది నేనే!

భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణ సహా ఐదు యుద్ధాలను నిలువరించానని, వేల మంది ప్రాణాలను కాపాడానంటూ ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో ఘనంగా ప్రకటించారు. పాక్‌తో కాల్పుల విరమణలో విదేశీ ప్రమేయం లేదని భారత ప్రభుత్వం పదే పదే చెబుతున్నా ట్రంప్ వెనక్కి తగ్గకపోగా అదే మాటను పునరుద్ఘాటిస్తున్నారు. అదనంగా మరో నాలుగు యుద్ధాలను తాజాగా ప్రస్తావించారు. 'నేను ఐదు యుద్ధాలు ఆపాను. కాంగో-రువాండా మధ్య 31ఏళ్ల నుంచి కొనసాగుతున్న రక్తపాతాన్ని అడ్డుకున్నాను. ఇరాన్ అణు సామర్థ్యాన్ని నాశనం చేసి ఇజ్రాయెల్‌తో రణాన్ని నిలువరించాను. థాయ్‌లాండ్-కంబోడియా, సెర్బియా-కొసావో ఘర్షణలనూ ఆపివేయించాను. అణ్వాయుధాలు కలిగిన భారత్, పాకిస్థాన్‌లను వ్యాపార ఒప్పందం ఒత్తిడితోనే దారికి తెచ్చాను' అని వెల్లడించారు.

నెతన్యాహుపై ఒత్తిడి తెండి

గాజాలో యుద్ధం ఆపేలా నెతన్యాహు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని 600 మంది ఇజ్రాయెల్ మాజీ సైనికాధికారులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. హమాస్ నుంచి వ్యూహాత్మక ముప్పేదీ లేని కారణంగా ఇజ్రాయెల్‌ను కాల్పుల విరమణ దిశగా నడిపించాలని వారు అమెరికా అధ్యక్షుణ్ని కోరారు. లేఖపై సంతకం చేసిన వారిలో ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొస్సాద్, షిన్‌బెట్ సంస్థల మాజీ అధిపతులు కూడా ఉన్నారు.

ట్రంప్ వ్యాఖ్యల్ని అవమానంగా భావించాలి: శశిథరూర్



పుణె: భారత్‌ను మృత ఆర్థిక వ్యవస్థగా అభివర్ణిస్తూ గతవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన చేసిన వ్యాఖ్యల్ని అవమానంగా భావించాలని, వాటిని స్వీకరించకూడదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సూచించారు. అగ్రనేతల ప్రమేయంతో యుద్ధాలు జరుగుతున్నప్పుడు, ప్రపంచాన్ని కాపాడాల్సినవారే అశాంతిని ప్రోత్సహిస్తున్నప్పుడు తన జాతీయ ప్రయోజనాల గురించి భారత్ స్పష్టంగా ఉండాలన్నారు. పుణెలోని క్రాస్‌వర్డ్ సీఈవో ఆకాశ్‌గుప్తాతో ఆదివారం సంభాషణలో పాల్గొన్న థరూర్.. ఆయన ఇటీవల రచించిన 'ది లివింగ్ కాన్‌స్టిట్యూషన్'తో సహా పలు అంశాల గురించి చర్చించారు. "ట్రంప్ నిర్ణయాన్ని మనం తీవ్రంగా పరిగణించాలి. ఆయన నిర్ణయం విధానాలను ప్రభావితం చేస్తే, అది మనపై ప్రభావం చూపుతుంది. గత ఆరు నెలలుగా ట్రంప్ సుంకాల విధానాల ప్రభావం ప్రపంచాన్ని మళ్లీ వెనక్కి తీసుకువెళ్లింది. రెండు, మూడు రోజుల క్రితం భారత్ కూడా కాస్త కుదుపులకు గురైంది. భారత్‌కు ప్రజలు, వారి శ్రేయస్సే అత్యంత కీలకం. మన ఎదుగుదలకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా దృఢంగా తయారవాలి. మనం నియమాలను పాటించేలా కాదు, రూపొందించేలా ఉండాలి. భారత్ ప్రపంచం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఈ విషయాల్ని దృష్టిలో ఉంచుకుని మన విధానాలు ఉండాలి" అని థరూర్ పేర్కొన్నారు.

13న కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం దేశవ్యాప్త నిరసన

దిల్లీ: పది జాతీయ కార్మిక సంఘాలు(సీటీయూలు), సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) సంయుక్త వేదిక ఈనెల 13న దేశవ్యాప్త నిరసన చేపట్టనుంది. భారత్‌పై సుంకాలు వడ్డిస్తానంటూ బెదిరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుకు, భారత్ - బ్రిటన్ సమగ్ర వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్టు ప్రకటించింది. రైతులు, కార్మికులు, విద్యార్థులు, దేశభక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ఈనెల 13న నిర్వహించనున్న నిరసనలో పాల్గొనాలని వేదిక పేర్కొంది. భారత్ బ్రిటన్‌తో కుదుర్చుకున్న సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందాన్ని తక్షణం సవరించాలని డిమాండ్ చేసింది.

ఆహారం కోసం తొక్కిసలాటలో పలువురు పాలస్తీనీయుల మృతి

డెయిర్ అల్ బలా: ఆహార పంపిణీ కేంద్రాలవైపు, ఆకాశం నుంచి జారవిడిచిన ఆహార పొట్లాల వైపు ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులు పరుగులు తీస్తుండగా జరిగిన తొక్కిసలాటలో సోమవారం పలువురు పాలస్తీనీయులు మరణించారని ప్రత్యక్ష సాక్షులు, ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. గడచిన 22 నెలలుగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దిగ్బంధనం కారణంగా గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో సురక్షిత ఆహార పంపిణీ పెనుసవాలుగా మారింది. గాజాలో ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న జికిం క్రాసింగ్ ప్రాంతంలో అన్నార్తుల మధ్య ఆహారం కోసం సాగిన హోరాహోరీలో 16 మంది మరణించారని షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరణాలకు దారితీసిన కచ్చితమైన కారణాలేమిటన్నది వెంటనే తెలియలేదు. ఇజ్రాయెల్ గాజా ప్రాంతంలోకి తగినంత ఆహారం ప్రవేశించకుండా నిరోధిస్తోందని సహాయక సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ బలగాలు జరిపిన కాల్పుల్లో వందలాది మంది పాలస్తీనీయులు మరణించిన సంగతి తెలిసిందే.



గాజాలోని జవైదాలో పారాచూట్ ద్వారా కిందకి వదులుతున్న ఆహారం కోసం పరుగులు పెడుతున్న పాలస్తీనీయులు

అస్థిరత అంచుపై బంగ్లా ఊగిసలాట

- హసీనా పదవీచ్యుతురాలై ఏడాది పూర్తి

ఢాకా: బంగ్లాదేశ్‌లో వెల్లువెత్తిన విద్యార్థుల నిరసనల ధాటికి 15 ఏళ్ల షేక్ హసీనా పాలనకు నిరుడు ఆగస్టు 5న తెరపడింది. హసీనా దేశం విడచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఆమె నిష్క్రమించిన మూడు రోజులకు తాత్కాలిక ప్రభుత్వ నేతగా పగ్గాలు చేపట్టిన నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ బంగ్లాలో శాంతిభద్రతలను పునరుద్ధరిస్తాననీ, అవసరమైన సంస్కరణలు చేసి ఎన్నికలు జరిపిస్తానని వాగ్దానం చేశారు. అప్పటికీ ఇప్పటికీ ఏడాది గడచిపోయినా బంగ్లాదేశ్ ఇంకా హింసాయుత కల్లోల దశ నుంచి బయటపడలేదు. ఉదారవాద ప్రజాస్వామ్యం, రాజకీయ సంయమనం, సామాజిక, మత సామరస్యంతో కూడిన నవ బంగ్లాదేశ్‌ను నిర్మించడం ఇప్పటికీ సవాలుగానే ఉంది. షేక్ హసీనా పాలనను ఎదిరించిన వేల మంది ఉద్యమకారులకు ప్రజా హక్కులను గౌరవించే ప్రజాస్వామ్యం ఇప్పటికీ అందని కలగానే మిగిలిందని న్యూయార్క్‌కు చెందిన మానవహక్కుల సంస్థ హ్యూమన్ రైట్స్ వాచ్ ఆసియా విభాగ ఉప కార్యదర్శి మీనాక్షి గాంగులీ చెప్పారు. యూనస్ హయాంలో హసీనా పార్టీ అవామీ లీగ్‌ను నిషేధించారు. గడచిన సంవత్సర కాలంలో రెండు డజన్లమంది అవామీ నాయకులు, కార్యకర్తలు కస్టడీలో మరణించారు.

పహల్గాం దాడికి పాల్పడింది.. పాకిస్థాన్ ఉగ్రవాదులే!


శ్రీనగర్: పహల్గాంలో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందినవారని నిర్ధారించే ఖచ్చితమైన ఆధారాలను భద్రతా సంస్థలు సేకరించాయి. పాక్ ప్రభుత్వం జారీచేసిన కొన్ని ధ్రువపత్రాలు, బయోమెట్రిక్ డేటాను స్వాధీనం చేసుకున్నామని అధికారులు సోమవారం వెల్లడించారు. లష్కరే తయ్యిబాకు చెందిన సులేమాన్ అలియాస్ ఫైజల్ జట్, అబు హమ్జా అలియాస్ అఫ్ఘాన్, యాసిర్ అలియాస్ జిబ్రాన్ అనే ముగ్గురు ఉగ్రవాదులను గత నెల 28న 'ఆపరేషన్ మహదేవ్'లో భద్రతాదళాలు మట్టుబెట్టిన సంగతి తెలిసిందే. వీరంతా పీవోకే పరిధిలోని కసూర్ జిల్లా రావల్‌కోట్ సమీప కోయియాన్ గ్రామస్థులని అధికారులు పేర్కొన్నారు. దీన్ని బలపరిచే ఫోరెన్సిక్ ఆధారాలు లభ్యమయ్యాయని వారు తెలిపారు. సేకరించిన సమాచారం ఆధారంగా స్థానికులతో ఆ దాడికి సంబంధంలేదన్న విషయాన్ని అధికారులు స్పష్టంచేశారు. పాకిస్థాన్ నేషనల్ డేటాబేస్ అండ్ రిజిస్ట్రేషన్ అథారిటీ(ఎన్ఏడీఆర్ఏ) ఓటరు గుర్తింపు పత్రాలు, లాగ్‌లు, డిజిటల్ శాటిలైట్ ఫోన్ డేటా, జీపీఎస్ వేపాయింట్లతో సహా భద్రతా దళాలు సేకరించిన ఆధారాలు అన్నీ ఈ ముగ్గురు పాకిస్థాన్‌కి చెందినవారేనని నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిలో కుటుంబ వివరాలు, వేలిముద్రలు నిక్షిప్తమై ఉన్నాయని చెప్పారు.

పీఎంఎల్ఏ తీర్పుపై సమీక్ష..జడ్జీతో మాట్లాడతానన్న సీజేఐ

దిల్లీ: నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)కి సంబంధించిన వివిధ నిబంధనల్ని సమర్థిస్తూ 2022లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సమీక్షించాల్సిందిగా కోరుతూ దాఖలైన పిటిషన్లను.. ఈ అంశంపై తాజాగా దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి ఒకేసారి విచారణకు చేపట్టే విషయమై జస్టిస్ సూర్యకాంత్‌తో మాట్లాడతానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ సోమవారం తెలిపారు. తీర్పును సమీక్షించే విషయంపై ఒక నిర్ణయానికి వస్తే ఇతర అంశాలనూ పరిష్కరించవచ్చని అన్నారు. 2022లో విజయ్ మదన్‌లాల్ చౌదరీ కేసులో సుప్రీంకోర్టు- పీఎంఎల్ఏ చట్టంలోని వివిధ నిబంధనల్ని సమర్థిస్తూ తీర్పు వెలువరించింది. దానిని సవాలు చేస్తూ పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. తీర్పును సమీక్షించాల్సిందిగా కోరుతూ దాఖలైన పిటిషన్లను చేపట్టవచ్చా లేదా అన్న అంశంపై ముందు తాము వాదోపవాదాలు వింటామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. తీర్పును సమీక్షించాల్సిందిగా కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణను ఇతర వ్యాజ్యాలతో కలిపి చేపట్టబోమని, దీనిపై సీజేఐని సంప్రదించాలని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ధర్మాసనం కోరింది. దీనిపై ఒక ధర్మాసనం ఇప్పటికే పలు దఫాలు విచారణ జరిపిందని, 2023 నవంబరులో ఒక న్యాయమూర్తి రిటైరవడంతో ఆ ధర్మాసనం రద్దయిందని సిబల్ ప్రధాన న్యాయమూర్తికి తెలిపారు.

అమెరికా సుంకాల బెదిరింపులన్నీ ఆధిపత్య పరిరక్షణ కోసమే: రష్యా

మాస్కో: వివిధ దేశాలపై సుంకాలు, జరిమానాలతో విరుచుకుపడుతున్న అమెరికా తీరుపై రష్యా తీవ్రస్థాయిలో మండిపడింది. ఆధిపత్యాన్ని కాపాడుకోవడం కోసమే అమెరికా నయా వలస విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించింది. ముఖ్యంగా దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్ నేషన్స్)పై బెదిరింపులకు పాల్పడుతోందని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జహారవా విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న, ఆర్థికంగా వెనుకబడిన (దక్షిణార్ధ గోళ)దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడానికి, నిజమైన బహుళపక్ష వాదం, సమానత్వంతో కూడిన ప్రపంచ వ్యవస్థ సాకారానికి కృషి చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ వ్యవహారాలలో తనతో కలిసిరాని దేశాలను ఆర్థికపరమైన ఒత్తిళ్లకు అమెరికా గురిచేస్తోందని, ఆయా దేశాల అంతర్గత వ్యవహారాలు, సార్వభౌమ అధికారాల్లోనూ జోక్యం చేసుకుంటోందని ఆక్షేపించారు. అమెరికా ఏకపక్ష విధానాలను ఎదుర్కోవడానికి వివిధ దేశాలతో మరింత సమన్వయం ఏర్పరచుకోనున్నట్లు మారియా జహారవా తెలిపారు.



సోమాలియా రాజధాని మొగదిషు శివారులో ఉన్న ఓ ఫామ్ హౌస్‌లో ఒంటెను ముద్దాడుతున్న సంరక్షకుడు

500 కోట్ల 'స్టార్లు' రాలింది అందుకే..!

- ఎట్టకేలకు గుట్టువిప్పిన శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: ఉత్తర అమెరికా తీరం వెంబడి పసిఫిక్ మహాసముద్రంలో దశాబ్ద కాలం పాటు కొనసాగిన ఒక అంతుచిక్కని మహమ్మారి 500 కోట్లకు పైగా స్టార్ ఫిష్‌లను బలిగొంది. దీని గుట్టును శాస్త్రవేత్తలు ఇప్పుడు విప్పారు. స్టార్‌ఫిష్‌ను సీ స్టార్ అని కూడా పిలుస్తారు. రెక్కల్లాంటి ఐదు ఆకృతులతో ఇది సముద్రంలో ఈదుతుంది. కొన్ని జాతుల్లో 24 రెక్కలు ఉంటాయి. 2013 నుంచి మెక్సికో- అలాస్కా మధ్య స్టార్‌ఫిష్‌లు ఒక మహమ్మారి బారినపడ్డాయి. దాదాపు 20 స్టార్‌ఫిష్ జాతులను ఇది దెబ్బతీసింది. నేటికీ అది కొనసాగుతోంది. ప్రధానంగా సన్‌ఫ్లవర్ సీ స్టార్ జాతిపై ఎక్కువగా ప్రభావం పడింది. మహమ్మారి విజృంభణ మొదలైన ఐదేళ్లలోనే 90 శాతం వరకూ ఈ జాతి సాగరజీవులు మృత్యువాత పడ్డాయి. ఆరోగ్యకరంగా ఉన్న స్టార్‌ఫిష్‌ల రెక్కలు మెత్తగా ఉంటాయి. వ్యాధి కారణంగా వాటిపై గాయాలు తలెత్తి, చివరికి ఆ రెక్కలు ఊడిపోతున్నాయి. దీనికి కారణం విబ్రియో పెక్టెనిసిడా అనే బ్యాక్టీరియా అని గుర్తించారు. షెల్‌ఫిష్‌కూ ఇదే సూక్ష్మజీవితో ఇన్‌ఫెక్షన్ సోకినట్లు పరిశోధకులు తెలిపారు. వ్యాధి కారణం తెలిసిన నేపథ్యంలో స్టార్‌ఫిష్‌ల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు దృష్టిసారించారు.

తాగిన మైకంలో.. దొంగతనం చేసిన ఇంట్లోనే నిద్రించి..



ఇంటర్నెట్‌డెస్క్: ఓ దొంగ మద్యం మత్తులో చోరీ చేసిన ఇంట్లోనే నిద్రపోయాడు. తెల్లవారుజామున ఇంటి యజమానికి చిక్కి కటకటాలపాలయ్యాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని నజీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన ఆ దొంగ పూటుగా తాగి.. మర్యంపూర్ రైల్వే లైన్‌లోని పక్కపక్కనే ఉన్న ఇద్దరు అన్నదమ్ముల ఇళ్లలోకి అర్ధరాత్రి వేళ చొరబడ్డాడు. తొలుత వినోద్ కుమార్ ఇంటి కిటికీలను బద్దలు కొట్టి..లోపలికి వెళ్లాడు. లాకర్‌ని తెరిచి విలువైన వస్తువులను కాజేశాడు. అక్కడితో ఆగకుండా రెండిళ్లకూ మధ్యన ఉన్న తలుపును విరగ్గొట్టి.. అనిల్ కుమార్ ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువా తెరిచి.. బంగారు నగలను అపహరించాడు. అయితే, అప్పటికే మత్తు ఎక్కువ కావడంతో అక్కడే నిద్రపోయాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న అనిల్.. వేకువజామున ఇంటికి వచ్చి దొంగను చూసి షాకయ్యాడు. ఆ గందరగోళానికి అనిల్ భార్య బాబ్లీ కూడా మేల్కొని, తన నగలు చోరీకి గురైనట్లు గుర్తించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణిపుర్ ప్రభుత్వానికి సుప్రీం చీవాట్లు

దిల్లీ: మణిపుర్ అల్లర్ల వెనక మాజీ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ హస్తమున్నట్టు తెలియజేసే ఆడియో క్లిప్‌లు ప్రామాణికమైనవా కాదా అని తెలిపే ఫోరెన్సిక్ నివేదిక సమర్పించడంలో జాప్యంపై సుప్రీంకోర్టు నిలదీసింది. నివేదిక సమర్పించాలని ఆదేశించి మూడు నెలలైనా అది రాలేదని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక మనిషి స్వరాన్ని గుర్తించేందుకు ఎంతకాలం పడుతుందని సోమవారం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆడియో అంశాలు చాలా తీవ్రమైనవని, మైతేయ్‌లను లూటీ చేయనివ్వండని సీఎం స్పష్టంగా చెప్పినట్లు వినిపిస్తోందని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. కుకి జో తెగకు వ్యతిరేకంగా జరిగిన హింసాకాండ వెనక ప్రభుత్వ హస్తం ఉందని చెప్పారు.

కొత్త పార్లమెంటు భవనానికి గోమాత ఆశీస్సులు తీసుకోవాలి

- స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి డిమాండ్

ముంబయి: ఆవు బొమ్మ ముద్రించిన రాజదండం(సెంగోల్) చేతబట్టి కొత్త పార్లమెంటు భవనంలో ప్రవేశించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బొమ్మ బదులు నిజమైన గోమాతను తీసుకెళ్లాల్సిందని ఉత్తరాఖండ్ జ్యోతిర్మఠాధిపతి, శంకరాచార్యుడు స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి పేర్కొన్నారు. ప్రస్తుతం సెంగోల్ లోక్ సభలో ప్రతిష్ఠితమై ఉంది. ఇప్పటికైనా గోమాతను పార్లమెంటు భవనంలోకి తీసుకెళ్లి ఆశీస్సులు పొందాలనీ, ఈ విషయంలో ఆలస్యం చేస్తే దేశమంతటినుంచీ గోవులను పార్లమెంటులోకి తీసుకొస్తామని ఆయన హెచ్చరించారు.

కాళేశ్వరం బ్యారేజీల బిల్లుల చెల్లింపుపై దర్యాప్తు చేయండి!

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిఫార్సు
- అంచనాలు పెంచడం వెనుక గుత్తేదారులకు ప్రయోజనం
- కాళేశ్వరం కార్పొరేషన్ నిబంధనల ప్రకారం పనిచేయలేదు
- రుణాలిచ్చిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల తీరూ సరిగాలేదని తేల్చిన కమిషన్

ఈనాడు హైదరాబాద్: తెలంగాణలోని కాళేశ్వరం బ్యారేజీల బిల్లుల చెల్లింపుపై సమగ్రంగా దర్యాప్తు చేయించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిఫార్సు చేసింది. గుత్తేదారులు సమర్పించిన బిల్లుల పరిశీలన, ప్రాసెస్ చేసిన విధానంపై లోతుగా పరిశీలన చేయించాలని అభిప్రాయపడింది. బ్యారేజీల నిర్మాణానికి నాటి ప్రభుత్వం 'కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(కేఐపీసీఎల్) ద్వారా రుణాలను తీసుకొని బిల్లులను చెల్లించిందని, ఈ ప్రక్రియలో తుది ప్రయోజనదారుపై విచారణ చేయించాలని కమిషన్ పేర్కొంది.

✦ తొలిసారి, రెండోసారి బ్యారేజీల అంచనాలు సవరించడం వెనుక గుత్తేదారులకు అయాచిత ప్రయోజనం కల్పించాలన్న దురుద్దేశం ఉందని, ఇది ప్రజాధనాన్ని స్వాహా చేయడమేనని అభిప్రాయపడింది. కాంట్రాక్టు నిబంధనలను కూడా నిర్మాణ సంస్థలకు అనుకూలంగా మార్చేశారని పేర్కొంది.

✦ మేడిగడ్డతో సహా బ్యారేజీలలో రెండోసారి అంచనాలను భారీగా సవరించారని... పరిమాణాలు(క్వాంటిటీస్) పెరిగాయని, డిజైన్స్, డ్రాయింగ్స్‌తో చేయాల్సిన పని మారిందని పేర్కొనడంతో పాటు అదనపు పనులు చేర్చారంది.

✦ అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాల మార్పుపై నిర్ణయం 2016 అక్టోబరు 22న హైపవర్ కమిటీ తీసుకొందని, అయితే 2016 జులై/ఆగస్టులో కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకొన్న తర్వాత వాప్కోస్‌తో సంప్రదించకుండానే ఈ పని చేశారని నివేదించింది.

✦ మూడు బ్యారేజీల నిర్మాణానికి రూపకల్పన జరిగినప్పటి నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు... అనంతరం 2023లో బ్యారేజీలకు నష్టం(డిస్ట్రెస్) జరిగే వరకు ప్రణాళిక, టెండర్ ప్రక్రియ, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన తప్పులు, ఆర్థిక అవకతవకలు జరిగాయని కమిషన్ పేర్కొంది.

✦ కాళేశ్వరం కార్పొరేషన్ నిబంధనల ప్రకారం పని చేయకుండా... రుణాలు తేవడం, పే అండ్ ఎకౌంట్స్ నుంచి వచ్చే పాస్ ఆర్డర్ ప్రకారం చెక్కులను పంపిణీ చేయడానికే పరిమితమైందని, నీటిపారుదల, ఆర్థిక శాఖల అధికారులు బోర్డులో ఉండి కూడా ఇలా జరిగిందని వ్యాఖ్యానించింది.

✦ 2015 అక్టోబరు 6న స్పెషల్ పర్పస్ వెహికల్ కింద కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ఉద్దేశాలను పూర్తిగా, కన్వీనియంట్‌గా నీటిపారుదల, ఆర్థిక శాఖల అధికారులతోపాటు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి, నాటి ముఖ్యమంత్రి విస్మరించారని పేర్కొంది.

✦ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు వాటిల్లిన నష్టం గురించి ఇప్పటివరకు కార్పొరేషన్‌కు అవగాహన లేదని, ఆదాయం లేని నేపథ్యంలో రుణాలు ఎలా తిరిగి చెల్లించాలన్న ఆలోచనే లేదంటూ కాళేశ్వరం కార్పొరేషన్ పనితీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

✦ రుణాలిచ్చిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల తీరును కూడా కమిషన్ తప్పుపట్టింది. రుణాలు తీసుకొన్న, ప్రభుత్వాన్ని నిధులు ఇమ్మని కోరిన, ఏజెన్సీలకు చెక్కులు ఇచ్చిన సమయంలో బోర్డులో ఉన్న అధికారులంతా చర్యలకు అర్హులని పేర్కొంది.

గత ముఖ్యమంత్రి, నాటి మంత్రులపై నిర్ణయం ప్రభుత్వానిదే

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, దెబ్బతినడానికి కారణాలను విశ్లేషించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చర్యల విషయంలో రెండు రకాల సూచనలు చేసింది. అధికారులు, ఇంజినీర్లపై ఏయే అంశాల్లో చర్యలు తీసుకోవాలో స్పష్టం చేసిన కమిషన్... గత సీఎం, ముఖ్యమంత్రి, నాటి మంత్రుల విషయంలో మాత్రం ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, ఏమైనా చర్య తీసుకోవాలంటే చట్టప్రకారం ఉండాలని పేర్కొంది. నివేదికలో కమిషన్ పేర్కొన్న అంశాలిలా ఉన్నాయి. పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ ప్రభుత్వ విధానాలను రూపొందిస్తే, వాటిని అమలు చేసే బాధ్యత ఎగ్జిక్యూటివ్‌ది. అయితే కమిషన్ ఎదుట వచ్చిన వాస్తవాలు, రికార్డుల్లోని అంశాలు తదితరాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వేరేగా ఉంది. అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి అనేక ఆదేశాలు ఇస్తే, అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా చర్యలు తీసుకున్నారు. మూడు బ్యారేజీల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగిన అవకతవకలు, అక్రమాలకు అప్పటి ముఖ్యమంత్రిది బాధ్యత. అయితే వీరి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కమిషన్ పేర్కొంది.

గుత్తేదారుకు అనుకూలంగా అంచనాల సవరణ

మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి మొదట దాదాపు పని పూర్తయిందని, తర్వాత పని పూర్తయిందని సర్టిఫికెట్ ఇవ్వడం తప్పు, అక్రమం. బ్యాంకు గ్యారంటీలు విడుదల చేయడం కూడా. సవరించిన అంచనాలను కూడా గుత్తేదారుకు అనుకూలంగా ఉద్దేశపూర్వకంగా చేశారు. కాంట్రాక్టు నిబంధనలకు విరుద్ధంగా గడువు పొడిగించారు. ఇదంతా గుత్తేదారుతో కుమ్మక్కై వారికి అనుకూలంగా చేశారు. కేంద్ర జల సంఘం సూచనను పక్కనపెట్టి టర్న్‌కీ బదులు లంప్సమ్ కాంట్రాక్టు ఇచ్చేలా చేసిన, డీపీఆర్‌ను పరిశీలించకుండానే ఆమోదించి కేంద్ర జల సంఘానికి పంపిన అధికారులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. అనేక అంశాల్లో ఐఏఎస్ అధికారులు, ఇంజినీర్లపై చర్యకు సిఫార్సు చేసింది.

బాధ్యులు వీరే

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో లోపాలు.. జరిగిన ఆర్థిక నష్టాలకు బాధ్యులను కమిషన్ గుర్తించి చర్యలకు సిఫార్సు చేసింది. లోపాలకు రాజకీయ, కార్యనిర్వాహక బాధ్యులుగా కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పేర్కొనగా.. నాడు విధుల్లో ఉన్న పలువురు ఐఏఎస్ అధికారులు, ఇంజినీర్లు సైతం నిర్లక్ష్యం చూపారని పేర్కొంది. కొందరి ప్రమేయాన్ని పేర్లతో సహా చెప్పగా.. మరి కొందరిని పరోక్షంగా ప్రస్తావించింది.

✦ **ఎస్‌కే జోషి (ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీటిపారుదలశాఖ):** రీఇంజినీరింగ్, అనుమతుల్లో సరిగా వ్యవహరించలేదు. ఉపయోగకరంగా కాళేశ్వరం ప్రాజెక్టును మార్చడంలో విఫలమయ్యారు. ఆర్థిక, సాంకేతిక నిర్ణయాల్లో పాల్గొని, ప్రభుత్వ కార్యకలాపాల నిబంధనలను ఉల్లంఘించారు.

✦ **స్మితా సభర్వాల్ (సీఎం కార్యదర్శి):** మంత్రిమండలి ఆమోదాలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడంలో విఫలమయ్యారు. నిధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంతో వ్యవహరించారు.

✦ **సి.మురళీధర్ (ఈఎన్‌సీ):** సవరించిన అంచనాల కోసం దురుద్దేశంతో వ్యవహరించారు. ఏకమొత్త కాంట్రాక్టు విధానంలో పనులు చేపట్టారన్న విషయాన్ని సీడబ్ల్యూసీకి చెప్పకుండా దాచిపెట్టారు. సవరణ అంచనాలు ప్రతిపాదించడంలో అక్రమాలకు తావిచ్చారు.

✦ **ఎన్.వెంకటేశ్వర్లు (ఈఎన్‌సీ, కాళేశ్వరం):** ప్రాజెక్టును పరిశీలించకుండా అదనపు అంచనాలకు ఆమోదం తెలిపారు.

✦ **బి.హరిరాం(సీఈ, ఎస్ఈ కాళేశ్వరం):** మూడు బ్యారేజీల నిర్మాణంతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లను పరిశీలించాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీఓ)కు ఆయన లేఖ రాశారు. 2018 జూన్ 6న జరిగిన కేంద్ర జలసంఘం సాంకేతిక సలహా కమిటీ సమావేశానికీ హాజరయ్యారు. ఈ సమావేశంలోనే మూడు బ్యారేజీలకు తుది ఆమోదం లభించింది. కాళేశ్వరం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మూడు బ్యారేజీల ఏజెన్సీలకు చెక్కులు జారీ చేశారు.

✦ **నరేందర్‌రెడ్డి (చీఫ్ ఇంజినీర్):** 2016 అక్టోబరు 22న హైపవర్ కమిటీ సమావేశం జరిగే వరకు తనకుగానీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో)కు గానీ ప్రమేయం లేదని చెప్పారు. ఇది కూడా పూర్తిగా అబద్ధం.

✦ **టి.శ్రీనివాస్, కేఎస్ఎన్ చంద్రశేఖర్, బసవరాజు (డిజైన్ ఇంజినీర్లు (సీడీవో)) :** తప్పుడు డిజైన్లు, డ్రాయింగ్‌లు తయారు చేశారు. రాష్ట్రం వీరిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేశారు.

✦ **జె.శ్రీదేవి, జి.రమేశ్, జె.ఆశీర్వాదం (టీజీఈఆర్ఎల్) :** అన్ని సందర్భాల్లో బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం.

✦ **జి.అనిల్‌కుమార్ (ఈఎన్‌సీ (జనరల్)) :** గ్రౌటింగ్‌కు సంబంధించి సాంకేతికంగా తప్పు దోవపట్టించారు.

✦ **బి.నాగేందర్‌రావు (ఈఎన్‌సీ (ఓఅండ్ఎం)) :** 2021 జనవరి 1 నుంచి నిర్వహణ విధుల్లో విఫలమయ్యారు. బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. ఈ మూడు బ్యారేజీలకు నష్టం కలిగించారు. బ్యారేజీల నిర్వహణ, నాణ్యతలో వైఫల్యాలకు బాధ్యత వహించాల్సిందే.

✦ **టి.పద్మ (సీఈ, రాష్ట్ర డ్యాంసేఫ్టీ సంస్థ) :** డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం విధులు నిర్వహించలేదు.

✦ **శంకర్‌నాయక్ (సీఈ, హైడ్రాలజీ) :** బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యానికి బాధ్యులు.

✦ **బ్యారేజీల ఈఈ, ఎస్ఈలు :** తుది నిర్మాణాలు పూర్తిచేసినట్లు తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేశారు.

✦ **రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ సభ్యులు :** పనులన్నీ పూర్తయ్యాయని తప్పుగా పేర్కొంటూ సవరణ అంచనాలు ఆమోదించారు.

✦ **నీటిపారుదల, ఆర్థికశాఖ కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు :** మంత్రి మండలి ఆమోదం లేకుండా జీవో నం.231, 232, 233 (2016 మార్చి 1న)లను జారీచేశారు. ప్రభుత్వ కార్యకలాపాల నిబంధనలు ఉల్లంఘించారు.

✦ **ముఖ్యకార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీటిపారుదల శాఖ:** సవరణ అంచనాల ప్రతిపాదనలను యాంత్రికంగా ప్రాసెస్ చేశారు. ఇంజినీర్లకు అనుకూలంగా పనిచేశారు.

✦ **కాళేశ్వరం కార్పొరేషన్ బోర్డు సభ్యులు :** ప్రాజెక్టు నిబంధనలు ఉల్లంఘించి అప్పులు చేసి చెక్కులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాలను కనీసం పరిశీలించకుండా ఆమోదించారు.

✦ **హైపవర్ కమిటీ సభ్యులు :** సాంకేతిక అంశాలు పరిశీలించకుండా బ్యారేజీ స్థానాలను మార్చేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. సరిగా పరిశీలించకుండా సవరణ అంచనాలు ఆమోదించారు. వాప్కోస్ డీపీఆర్‌ను విస్మరించడంతో పాటు పెరిగిన ఖర్చులను సమర్థించారు.

✦ విచారణ కమిషన్ ఎదుట హాజరై తప్పుడు సమాచారం ఇచ్చారంటూ కొందరు అధికారుల పేర్లను కమిషన్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. వారు టి.శ్రీనివాస్ (సీఈ, సీడీవో), సర్దార్ ఓంకార్‌సింగ్ (ఈఈ, రామగుండం) బి.హరిరాం (సీఈ), నరేందర్‌రెడ్డి(సీఈ).

వ్యక్తిగత నిర్ణయాలు... ఆర్థిక అవకతవకలు

- డిజైన్లు, నిర్మాణం, నాణ్యత లోపాలతో బ్యారేజీలకు నష్టం
- అన్ని విషయాల్లో అప్పటి సీఎం కేసీఆర్ జోక్యం
- మంత్రివర్గం ముందు పెట్టకుండానే మేడిగడ్డకు పరిపాలనా అనుమతి
- కాళేశ్వరంపై సమర్పించిన నివేదికలో జస్టిస్ ఘోష్ కమిషన్
- ప్రజంటేషన్‌లో తెలంగాణ మంత్రి ఉత్తమ్

ఈనాడు, హైదరాబాద్: 'కాళేశ్వరం బ్యారేజీల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగాయి. అప్పటి సీఎం కేసీఆర్ ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చి మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి పూనుకొన్నారు. బ్యారేజీల రూపకల్పన నుంచి పరిపాలనా అనుమతులు, నిర్మాణం వరకు అన్నీ ప్రభుత్వ నిర్ణయాలుగా కాకుండా వ్యక్తిగత నిర్ణయాలుగా జరిగాయి' అని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికలో పేర్కొందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. 'మూడు బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన అన్ని విషయాల్లో అప్పటి సీఎం జోక్యం చేసుకోవడంతో పాటు సూచనలు ఇచ్చారని, ప్రభుత్వాధినేతగా కాకుండా అడ్మినిస్ట్రేటివ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారని తప్పుపట్టింది. బ్యారేజీల నిర్మాణంలో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు జరిగాయని, ప్రజాధనం దుర్వినియోగమైందంది. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేనందున బ్యారేజీ నిర్మాణాన్ని మేడిగడ్డ వద్దకు మార్చామనడం నిజాయతీ కలిగిన సమాధానంగా కనిపించడం లేదంటూ. .. 2015 మార్చి 13న అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి రాసిన లేఖలో 2014 అక్టోబరు 24న ప్రాణహిత-చేవెళ్లకు నీటి లభ్యత అనుమతి వచ్చినట్లు పేర్కొన్న అంశాన్ని జస్టిస్ ఘోష్ ఉదహరించారు' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రివర్గ సమావేశ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో కమిషన్ నివేదికలోని ముఖ్యాంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో వివరించారు.

✦ మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను అప్పటి సీఎం కేసీఆర్‌తోపాటు అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారు. విశ్రాంత ఇంజినీర్లతో ఏర్పాటు చేసిన కమిటీ.... తుమ్మిడిహెట్టి, మేడిగడ్డలపై అధ్యయనం చేసి మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం సరికాదని, ఆర్థికంగా కూడా సరైంది కాదని పేర్కొంది. ఈ కమిటీ నివేదికను ప్రభుత్వం పట్టించుకోలేదు. తాము గోదావరి, ప్రాణహితపై బ్యారేజీల గురించి 2015 ఏప్రిల్ 4న నీటిపారుదల శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లకు నివేదిక సమర్పించామని 2024 జూన్ 25న కమిషన్‌కు ఇచ్చిన నోట్‌లో నిపుణుల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని హరీశ్‌రావు కూడా నిరాకరించలేదని కమిషన్ పేర్కొంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదన, నిర్ణయం అప్పటి సీఎం, సాగునీటి ప్రాజెక్టుల మంత్రిదే.

✦ మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించాలన్న అప్పటి ముఖ్యమంత్రి, మంత్రి ఉద్దేశానికి తగ్గట్లుగా అధికారులు ఎస్.కె.జోషి, మురళీధర్, హరిరాంలు ఈ నివేదికను తొక్కిపెట్టారు.

✦ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి వాప్కోస్‌కు డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ ఇవ్వడం, దీనికి కొనసాగింపుగా పరిపాలనా అనుమతి ఇవ్వడం అంతా అప్పటి సీఎం, నీటిపారుదలశాఖ మంత్రుల వ్యక్తిగత నిర్ణయమే.

✦ రిజర్వాయర్లు/డ్యాంలలో నిల్వ చేసినట్లుగా ఏడాది మొత్తం నీటిని నిల్వ చేయడం బ్యారేజీలు దెబ్బతినడానికి కారణమైంది.

✦ మేడిగడ్డ బ్యారేజీకి 2016 మార్చి 1న రూ.2,591 కోట్లతో ఇచ్చిన పరిపాలనా అనుమతిని మంత్రివర్గం ముందు పెట్టకుండా అప్పటి సీఎం, నాటి మంత్రి సర్క్యులేషన్ ఆర్డర్‌తోనే ఇచ్చారు. ఇంత అత్యవసరంగా చేయాల్సి రావడానికి కమిషన్‌కు కారణమేమీ కనపడలేదు. దీన్ని తర్వాత క్యాబినెట్ కూడా ర్యాటిఫై చేయలేదు. దీనికి క్యాబినెట్ ఆమోదం పొందకపోవడం లేదా ర్యాటిఫై చేయకపోవడం ప్రభుత్వ బిజినెస్ రూల్స్‌కు విరుద్ధం. బిజినెస్ రూల్స్ ఉల్లంఘనకు అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి, సీఎంలను బాధ్యులుగా చేయాల్సి ఉంది. దీనిపై అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి కమిషన్ ఎదుట ఇచ్చిన సాక్ష్యం వాస్తవం కాదు.

✦ వాప్కోస్ 2016 మార్చి 27న సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేయగా, అంతకుముందే మార్చి 1న ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. వాప్కోస్ డీపీఆర్ అందజేయకముందే 2016 ఫిబ్రవరి 11న అప్పటి సీఎం... ప్రధానికి రాసిన లేఖలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.71,436 కోట్లుగా పేర్కొన్నారు.

✦ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ పనులను టర్న్‌కీ పద్ధతిలో ఇవ్వాలని కేంద్ర జలసంఘం సూచించినా, దీనికి భిన్నంగా లంప్సమ్ కాంట్రాక్టు పద్ధతిలో ఇచ్చారు. పెరిగిన బ్యారేజీల నిర్మాణ వ్యయం కూడా ఏమాత్రం సమర్థనీయంగా లేదు.

✦ సీఎం ఆదేశాలతో బ్యారేజీల్లో డ్యాంల మాదిరిగా నిరంతరం నీటిని నిల్వ చేయడంతో భారీ నష్టం వాటిల్లింది. నిర్మాణ సంస్థలతో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ ఒప్పందం జరగలేదు. ఇందులో ఎల్అండ్‌టీ, ఆఫ్కాన్స్, నవయుగ సంస్థల బాధ్యత కూడా ఉంది. పనులు పూర్తి కాకున్నా అయినట్లు తప్పుడు సర్టిఫికెట్ల జారీ, బ్యాంకు గ్యారంటీలు విడుదల చేయడం అక్రమం. ఓఅండ్ఎం విభాగం, రాష్ట్ర డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ విఫలమైంది.

✦ బ్యారేజీల్లో సీకెంట్ పైల్స్ నిర్మాణం నష్టానికి కారణమైంది. నిర్మాణాల్లో నాణ్యత లోపించింది. క్వాలిటీ కంట్రోల్ ప్రమాణాల ప్రకారం మేడిగడ్డ బ్యారేజీలో 37,228 నమూనా పరీక్షలు చేయాల్సి ఉండగా 7,498 మాత్రమే చేశారు. అన్నారం బ్యారేజీలో 0.9 మీటర్ల డిజైన్‌కు గాను 0.45 మీటర్లు మాత్రమే ప్లింత్ స్లాబ్ వేశారు. నేల పరీక్షలు చేయకుండానే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల స్థలాలను మార్చి నిర్మించారు.

✦ మేడిగడ్డ 20వ పియర్ ప్లింత్ స్లాబ్, జాయింట్ వద్ద నాణ్యత లేని నిర్మాణంతో లోపం ఏర్పడింది. గేట్లు తెరిచినప్పుడు దిగువకు విడుదలయ్యే నీరు, ప్రవాహ వేగంతో (షూటింగ్ వెలాసిటీ) అప్రాన్, సీసీ బ్లాకులు చెదిరిపోయాయి. ఇవి బ్యారేజీ దిగువన ఉండాల్సిన నీటిమట్టంపై ప్రభావం చూపాయి.

✦ బ్యారేజీలకు నష్టం వాటిల్లినా నిర్మాణ సంస్థలకు పెనాల్టీ విధించలేదు. పనుల గడువు ముగిసినా వాటి టర్మ్‌ను పొడిగించి నిర్మాణ సంస్థలకు కావాలని మేలు చేకూర్చారు. డీ-వాటరింగ్, కాఫర్ డ్యాంలకు (నిర్మాణ సంస్థ బాధ్యత అయినప్పటికీ) నిధులు చెల్లించేందుకు కాంట్రాక్టు నిబంధనల్లో మినహాయింపు ఇచ్చారు.

శిబూ సోరెన్ మృతి పట్ల చంద్రబాబు సంతాపం

ఈనాడు, అమరావతి: ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ మృతి పట్ల సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. గిరిజన, పేద, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించేందుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆయన మరణం తీరని లోటు: జగన్

ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ మరణం దేశానికి తీరని లోటు అని మాజీ సీఎం జగన్ ఎక్స్ వేదికగా తెలిపారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

'హర్ ఘర్ తిరంగా' నోడల్ అధికారిగా మల్లికార్జునరావు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆగస్టు 2 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి నోడల్ అధికారిగా భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర సాంస్కృతిక శాఖ పిలుపు మేరకు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 2022 నుంచి దేశవ్యాప్తంగా ఏటా హర్ ఘర్ తిరంగాను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇళ్లు, సంస్థలు, కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగరవేస్తారు.

అంత్యక్రియలకు డబ్బు లేక శిశువును చెరువులో పడేసిన తండ్రి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: పుట్టిన బిడ్డ చనిపోవడంతో అంత్యక్రియలు చేయడానికి డబ్బు లేక శిశువును చెరువులో పడేసిన హృదయవిదారక ఘటన హైదరాబాద్ అత్తాపూర్ ఠాణా పరిధిలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఎంఎంపహాడీకి చెందిన ఇస్మాయిల్, ఫర్జానాబేగం భార్యాభర్తలు. వారికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. మళ్లీ గర్భవతి అయిన ఫర్జానాకు శనివారం నెలలు నిండకుండానే మరో బాబు జన్మించాడు. పుట్టిన కాసేపటికి ఆ బాబు మృతి చెందాడు. కూలి పనిచేసుకొని కుటుంబాన్ని పోషించే ఇస్మాయిల్ దగ్గర చిల్లిగవ్వ లేకపోవడంతో... అంత్యక్రియలు చేయలేనని భావించి ఆరోజే ఆ శిశువును మీరాలం చెరువులో పడేశాడు. అయితే సోమవారం ఉదయం చెరువులో శిశువు తేలడంతో ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు విచారణ చేపట్టగా..ఇస్మాయిల్ కుమారుడని తెలిసింది. ఆయన జరిగిన విషయం చెప్పడంతో ఇన్‌స్పెక్టర్ ముందుకు వచ్చి ముస్లిం సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిపించారు.

పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌లు.. భద్రతకు ఒప్పందాలు

- కోర్సులు, సిలబస్ రూపకల్పనకు నోడల్ సెంటర్లుగా వర్సిటీలు



మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.మోహనరావు. చిత్రంలో పలువురు అధికారులు

ఈనాడు, అమరావతి: పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు కల్పించడానికి, వాటి భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయాల నుంచి సాంకేతిక సహకారం తీసుకునేందుకు ఫ్యాక్టరీస్ విభాగం సోమవారం శ్రీవేంకటేశ్వర, జేఎన్‌టీయూ-అనంతపురం విశ్వవిద్యాలయాలు, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్‌తో ఒప్పందాలు కుదుర్చుకుంది. విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో వీరు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రతిపాదనను ఆ శాఖ కార్యదర్శి శేషగిరిబాబు తీసుకొచ్చారు. ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి విశ్వవిద్యాలయాలు సాంకేతిక మద్దతునిస్తాయి. రాష్ట్రంలోని 200 ప్రమాదకర పరిశ్రమల్లో ప్రస్తుత పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై థర్డ్ పార్టీ ఇచ్చే నివేదికను వర్సిటీలు పరిశీలిస్తాయి.

- ఫ్యాక్టరీల్లో భద్రత అధికారులను నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఇందుకోసం వర్సిటీలు పీజీ డిప్లొమా కోర్సులు తీసుకురావడం లేదంటే కోర్సుల్లోనే అదనంగా సబ్జెక్టును చేర్చడం లేదా కొన్ని చాప్టర్లు ప్రవేశపెట్టడం లాంటివి చేస్తాయి.
- ఐటీఐ, డిప్లొమా, బీటెక్‌లో సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు వర్సిటీలు నోడల్ సెంటర్లుగా పని చేస్తాయి. భద్రతపై ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులు, సాంకేతికతలపై ఫ్యాక్టరీస్ విభాగంలోని సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాయి.
- ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే దానికి గల కారణాలను విశ్లేషించడం, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను వర్సిటీల బృందాలు సూచిస్తాయి.

అల్పాహారం తిని 33 మంది విద్యార్థినులకు అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థినులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

కల్లూరు, మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణలోని ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతిగృహంలో అల్పాహారం తిని 33 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం ఉదయం అల్పాహారంగా కిచిడీని తిని పాఠశాలకు వెళ్లారు. కొద్దిసేపటికే పలువురు విద్యార్థినులు వాంతులు, కడుపు నొప్పితో బాధపడ్డారు. దీంతో వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు నవ్యకాంత్ తొలుత వైద్యశాలకు వచ్చిన తొమ్మిది మందికి వైద్యం అందిస్తుండగానే.. విడతల వారీగా మొత్తం 33 మంది విద్యార్థినులు వచ్చారు. సమాచారం తెలుసుకున్న సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తహసీల్దార్ పులి సాంబశివుడు అక్కడికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆసుపత్రికి వచ్చి విద్యార్థినులను స్వయంగా పరీక్షించి ధైర్యం చెప్పారు. అనంతరం వసతిగృహాన్ని, ఆహార పదార్థాలను, పాఠశాలను పరిశీలించి గిరిజన సంక్షేమ జిల్లా అధికారిణి విజయలక్ష్మితో మాట్లాడారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు పెరుగు వేయకుండా మజ్జిగ పోస్తున్నారని, మెనూ ప్రకారం ఆహారాన్ని అందించడం లేదని మండిపడ్డారు. కాగా, సాయంత్రానికి విద్యార్థినులు కోలుకోవడంతో వారి తల్లిదండ్రులు ఇంటి తీసుకెళ్లారు.

భూపాలపల్లి జిల్లాలో 27 మందికి..

విద్యార్థినులు అల్పాహారం తిని అస్వస్థతకు గురైన ఘటన తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. పాఠశాలలో 246 మంది విద్యార్థినులుండగా, 27 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో 16 మందికి సాయంత్రం వరకు వాంతులు తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం చిట్యాల ప్రాంతీయ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగతా విద్యార్థులకు పాఠశాలలోనే చికిత్స అందిస్తున్నామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాణి తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు 24% హెచ్ఆర్ఏ కొనసాగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయంలోని అన్ని శాఖల ఉద్యోగులకు మూలవేతనంలో 24% ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్ఆర్ఏ)ను మరో ఏడాది పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. దాంతో ఉద్యోగులకు గరిష్ఠంగా రూ.25 వేల వరకు లభించనుంది.

80 డిగ్రీ కళాశాలలకు ఫీజుల ఖరారు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 80 డిగ్రీ కళాశాలలకు ఫీజులను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీఎస్సీ, బీకాం, బీఏ, బీబీఏ, బీసీఏ, బీవొకేషన్, బీహెచ్ఎంసీటీ కోర్సులకు ఫీజులను ఖరారు చేసింది. గతంలో ఈ కళాశాలలు సకాలంలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించకపోవడం, డాటాను సమర్పించకపోవడంతో ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఫీజులను నిర్ణయించలేదు. దీంతో కళాశాలలు కోర్టును ఆశ్రయించాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు 2023-24 నుంచి 2025-26 విద్యా సంవత్సరాలకు ఫీజులను నిర్ణయించింది. బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, తదితర కోర్సులకు గరిష్ఠంగా రూ.30 వేలు, బీఎస్సీ ఫోరెన్సిక్ కోర్సుకు రూ.15 వేలు, బీకాంకు గరిష్ఠంగా రూ.24,600, బీఏకు రూ.11 వేలు, బీఎస్సీకి రూ.19,600గా ప్రకటించింది.

12 జిల్లా పరిషత్తుల బడ్జెట్‌కు ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 12 జిల్లా పరిషత్తులకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలకు, 2024-25 సవరణ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. వాటిని ఆమోదిస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోలను ఆదేశిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

టెక్కలిలో ఐఎంఎల్ డిపో ఏర్పాటు చేయొద్దు: సీపీఎం

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళంలోని ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త ప్రైవేటు డిపో ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు.

ప్రజారోగ్యంతో వ్యాపారం చేసిన జగన్

బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యాన్ని ఏరులై పారించి వేల మంది ప్రాణాలతో మాజీ సీఎం జగన్ చెలగాటం ఆడారని, ప్రజారోగ్యంతో వ్యాపారం చేశారని బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం లభిస్తోందని వెల్లడించారు. దీని వల్ల ఏపీ సరిహద్దుల్లోని తమ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు తగ్గినట్లు కర్ణాటక సహా వివిధ రాష్ట్రాలు తెలిపాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ మద్యం పాలసీతో ప్రజారోగ్యం మెరుగైందని వెల్లడించారు.

పీసీ-పీఎన్‌డీటీ చట్టం సమర్థ అమలుకు కమిటీ

ఈనాడు, అమరావతి: భ్రూణ హత్యల నిరోధానికి నిర్దేశించిన పీసీ-పీఎన్‌డీటీ చట్టం- 1994 సమర్థ అమలుకు రాష్ట్ర స్థాయి బహుళ సభ్యుల అధికారిక సంస్థ (స్టేట్ లెవెల్ మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ-ఎస్ఎల్ఎంఎంఏఏ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి అధ్యక్షులుగా వైద్య,ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, సభ్యులుగా న్యాయశాఖ లేదా రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ వ్యవహారాలు చూసే సంయుక్త కార్యదర్శి/ ఉప కార్యదర్శితో పాటు విజయవాడకు చెందిన వాసవ్య మహిళా మండలి కార్యదర్శి జి.రష్మి వ్యవహరిస్తారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై వాదనలు వాయిదా

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులు మిథున్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సిట్ అధికారులు సోమవారం కౌంటర్లు దాఖలు చేశారు. విచారణ కీలక దశలో ఉందని, ఈ పరిస్థితుల్లో నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని అందులో పేర్కొన్నారు. కృష్ణమోహన్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ ఈ నెల 6వ తేదీకి, ధనుంజయరెడ్డి, గోవిందప్ప బాలాజీ, మిథున్‌రెడ్డి పిటిషన్లపై తదుపరి విచారణ 5వ తేదీకి వాయిదా పడ్డాయి. నిందితులు చాణక్య, దిలీప్ బెయిల్ పిటిషన్లు కూడా ఏసీబీ కోర్టులో సోమవారం విచారణకు వచ్చాయి. చాణక్య పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు పూర్తయ్యాయి. తుది ఉత్తర్వుల నిమిత్తం ఈ నెల 7కు వాయిదా వేశారు. దిలీప్ పిటిషన్‌పై ఈ నెల 7న వాదనలు జరగనున్నాయి.

కుమారుడి జాడ కనిపెట్టండి

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీసులు మార్చిలో తన కుమారుడిని తీసుకెళ్లారని, అప్పటి నుంచి అతడి జాడ తెలియడం లేదని ప్రకాశం జిల్లా కంభం మండలం కందులాపురానికి చెందిన తొండమల్లి రంగయ్య వాపోయారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని కబ్జా చేసిన వైకాపా మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, ఆయన తమ్ముడిపై చర్యలు తీసుకోవాలని నంద్యాలకు చెందిన కక్కయ్య ఫిర్యాదు చేశారు.